
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 16 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా. 1.53 తదుపరి దశమి; నక్షత్రం: ధనిష్ఠ రా. 1.49 తదుపరి శతభిషం; వర్జ్యం: ఉ. 6.57-8.27; దుర్ముహూర్తం: ఉ. 10.05-10.56, మ. 3.09-4.00; అమృతఘడియలు: సా. 4.00-5.31; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



2.10 లక్షల కోట్లు

జీఎస్‌టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

- తొలిసారిగా రూ.2 లక్షల కోట్ల మైలురాయికి..
- ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,850 కోట్లు

తెలంగాణలో రూ.6,236 కోట్ల వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఆదాయంలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో జీఎస్‌టీ స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదిక 12.4 శాతం వృద్ధితో జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.2.10 లక్షల కోట్లకు పెరిగాయి. 2017 జూలైలో జీఎస్‌టీ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. ఆర్థిక వ్యవస్థ మరింత బలం పుంజుకోవడంతో దేశీయంగా ఆర్థిక లావాదేవీలు, దిగుమతులు పెరగడం ఇందుకు దోహదపడిందని ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో జీఎస్‌టీ ఆదాయం రూ.1.78 లక్షల కోట్లుగా, 2023 ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా, గత నెలలో తెలంగాణ జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో రూ.6,236 కోట్లకు, ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం వృద్ధితో రూ.4,850 కోట్లకు పెరిగాయి.

ఆర్థికం జోరు, సమర్థవంతమైన పన్ను వసూళ్లతో ఈ రికార్డు సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ రికార్డు సాధనలో పన్ను అధికారుల కృషిని ఆమె కొనియాడారు. కాగా, ఆర్థిక వ్యవస్థలో చురుకుగా సాగుతున్న వ్యాపార కార్యకలాపాలు, పన్ను వసూళ్లు పెంచేందుకు అధికారులు చేపడుతున్న చర్యలతోపాటు పన్ను చెల్లింపుల విషయంలో వ్యాపారుల నిబద్ధతకు ఇది సంకేతమని పన్ను నిపుణులు పేర్కొన్నారు. పెరిగిన పన్ను వసూళ్లు భవిష్యత్ జీఎస్‌టీ సంస్కరణలపై అంచనాలను పెంచనున్నాయని వారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం పన్ను రేట్లను హేతుబద్ధీకరించడంతోపాటు విమాన ఇంధనం (ఏటీఎఫ్), సహజ వాయువు వంటి వాటిని జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయని వారు అభిప్రాయపడ్డారు.

ఆర్థిక శాఖ బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గతనెల మొత్తం జీఎస్‌టీ ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.43,846 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ వసూళ్లు రూ.53,538 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రాబడి రూ.99,623 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.13,260 కోట్లు వసూలైంది. సాధారణ సెటిల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఐజీఎస్‌టీ రాబడిలో రూ.50,307 కోట్లను సెంట్రల్ జీఎస్‌టీలో, మరో రూ.41,600 కోట్లను స్టేట్ జీఎస్‌టీలో జమ చేసింది. తదనంతరం, సెంట్రల్ జీఎస్‌టీ రూ.94,153 కోట్లకు, స్టేట్ జీఎస్‌టీ రూ.95,138 కోట్లకు చేరుకుంది. రాష్ట్రాలకు ఐజీఎస్‌టీ బకాయిలేమీ పెండింగ్‌లో లేవని సీతారామన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రిఫండ్లను మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర వసూళ్లు రూ.1.92 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 15.5 శాతం అధికం. ప్రస్తుతం జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో 1.45 కోట్ల మంది రిజిస్టర్డ్ పన్ను చెల్లింపుదారులున్నారు.

ఫెడ్ రేట్లు యథాతథం

న్యూయార్క్: అమెరికన్ సెంట్రల్ బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా కొనసాగించింది. ద్రవ్యోల్బణాన్ని 2 శాతానికి తగ్గించే లక్ష్యంలో పురోగతి లేకపోవడంతో 5.25-5.50 శాతంగా ఉన్న వడ్డీరేట్ల శ్రేణిని అలాగే కొనసాగించాలని నిర్ణయించినట్లు బుధవారం విడుదల చేసిన ద్రవ్యపరపతి విధాన సమీక్ష ప్రకటనలో ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఎంఓసీ) పేర్కొంది. ద్రవ్యోల్బణం క్రమంగా 2 శాతానికి తగ్గుతూ వస్తోందన్న విశ్వాసం బలపడే వరకు వడ్డీరేట్లను తగ్గించడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. గత ఏడాది జూలై నుంచి వడ్డీరేట్లు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. కమిటీ ప్రస్తుత వ్యాఖ్యలను బట్టి చూస్తే, వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియ అంచనాల కంటే జాప్యం కావచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆధార్ హౌసింగ్ నుంచి రూ.3,000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్ పెట్టుబడి పెట్టిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ రూ.3,000 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 8న ఐపీఓకు వస్తోంది. ఇందులో రూ.1,000 కోట్లు కొత్తగా జారీ చేసే షేర్ల ద్వారా, మరో రూ.2,000 కోట్లు బ్లాక్‌స్టోన్ అనుబంధ సంస్థ బీసీపీ టాప్కో షేర్ల విక్రయం ద్వారా సమీకరిస్తారు. ఈ నెల 10న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. కొత్తగా జారీ చేసే షేర్ల ద్వారా సమీకరించే రూ.1,000 కోట్లలో రూ.750 కోట్లను కంపెనీ రుణ వితరణ కోసం వినియోగించనుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది.

అంబుజా సిమెంట్స్ లాభం రూ.1,055.16 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లోని అంబుజా సిమెంట్స్ మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికానికి అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి అనుబంధ కంపెనీలతో కలిసి కంపెనీ రూ.1,525.78 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.763.30 కోట్లతో పోలిస్తే ఇది రూ.762.48 కోట్లు ఎక్కువ. ఇదే కాలంలో కంపెనీ నిర్వహణ ఆదాయం రూ.7,965.98 కోట్ల నుంచి రూ.8,893.99 కోట్లకు, స్థూల ఆదాయం రూ.9,127.45 కోట్లకు చేరాయి. గత ఏడాది ఆఖరి త్రైమాసికంలో కొనుగోలు చేసిన సంఘీ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాలతో కలిసి మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విడుదల చేసినట్టు అంబుజా సిమెంట్ తెలిపింది. ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్‌ను తీసివేస్తే అంబుజా సిమెంట్ నికర లాభం మార్చి త్రైమాసికంలో రూ.502.40 కోట్ల నుంచి రూ.532.29 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ స్టాండ్ అలోన్ నిర్వహణ ఆదాయం రూ.4,780.32 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు బాగుండడంతో రూ.2 ముఖ విలువ గత ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.2 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

నాలుగేళ్లలో వేదాంతా రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడి

ముంబై: మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంతా గ్రూప్ భారీ పెట్టుబడి ప్రణాళికను ప్రకటించింది. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లోని గ్రూప్‌నకు చెందిన అన్ని వ్యాపారాల్లో 2,000 కోట్ల డాలర్ల (రూ.1.66 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు అగర్వాల్ తెలిపారు. ప్రధానంగా టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, గ్లాస్ వ్యాపారంతోపాటు గ్రూప్‌నకు చెందిన ఇతర కార్యకలాపాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే, స్టీల్ వ్యాపారాన్ని సరైన ధర లభిస్తేనే విక్రయిస్తామని, లేని పక్షంలోనూ ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తామని అన్నారు.

రెండేళ్లలో రూ.5400 కోట్ల పెట్టుబడి : జేఎస్ఎల్

న్యూఢిల్లీ: సామర్థ్యాల విస్తరణతో పాటు వృద్ధికి దోహదపడే కంపెనీల కొనుగోళ్లపై రెండేళ్లలో రూ.5400 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ పెట్టుబడుల్లో సుమారు 90 శాతం అంతర్గత వనరుల ద్వారానే సమీకరించుకుంటామని కంపెనీ ఎండీ అభ్యుదయ్ జిందాల్ ప్రకటించారు. బుధవారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమలో ప్రపంచ ఆధిపత్యం సాధించడం లక్ష్యంగా ఈ పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఒడిశాలోని జాజ్‌పూర్, హర్యానాలోని హిసార్‌లలో ఏడాదికి 30 లక్షల టన్నుల ఉమ్మడి సామర్థ్యం గల రెండు ప్లాంట్లు తమ చేతిలో ఉన్నాయని ఆయన తెలిపారు. వీటి మెల్టింగ్ సామర్థ్యాన్ని 42 లక్షల టన్నులకు పెంచాలన్నది తమ లక్ష్యమని, దానిపై రూ.700 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. ఇది కాకుండా గుజరాత్‌లోని ముంద్రాలో పని చేస్తున్న 6 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యం గల చెరోమెని స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 54 శాతం వాటాలను తాము కొనుగోలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. దీనిపై రూ.1340 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	400	విజయవాడ	385
వరంగల్	402	గోదావరి	385
చిత్తూరు	478	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.48

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	135
వరంగల్	129	విజయవాడ	135
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	127
విశాఖపట్నం	127		

అదానీ విల్మర్ లాభం రూ.156.75 కోట్లు

న్యూఢిల్లీ : అదానీ విల్మర్ కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.156.75 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 67 శాతం ఎక్కువ. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.14,185.68 కోట్ల నుంచి రూ.13,342.26 కోట్లకు పడిపోయింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ ఆదాయం, నికర లాభం పడిపోయాయి. నికర లాభం రూ.582.12 కోట్ల నుంచి రూ.147.99 కోట్లకు, ఆదాయం రూ.59,148.32 కోట్ల నుంచి రూ.51,555.24 కోట్లకు పడిపోయాయి.

తగ్గిన అదానీ ఎనర్జీ లాభం

నాలుగో త్రైమాసికంలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.381.29 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోస్తే ఇది 13.26 శాతం తక్కువ. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.3,494.84 కోట్ల నుంచి రూ.4,855.18 కోట్లకు పెరిగింది. అయినా ఖర్చులు పెరగడంతో కంపెనీ లాభాలకు గండి పడింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ నికర లాభం రూ.1,280.60 కోట్ల నుంచి రూ.1,195.61 కోట్లకు పడిపోయింది. ఇదే సమంలో ఆదాయం మాత్రం రూ.13,840.46 కోట్ల నుంచి రూ.17,218.31 కోట్లకు చేరింది.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లాభం రూ.6.42 కోట్లు

హైదరాబాద్: మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ మార్చి త్రైమాసికంలో రూ.42.24 కోట్ల ఆదాయంపై రూ.6.42 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే సమయంలో కంపెనీ రూ.43.27 కోట్ల ఆదాయంపై రూ.10.11 కోట్ల నికర లాభం ఆర్జించింది. వార్షిక ప్రాతిపదికన చూసినా కంపెనీలాభాలు తగ్గాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.29.26 కోట్లుగా ఉన్న నికరలాభం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.27.84 కోట్లకు తగ్గింది.

వాహన రంగం నీరసం

విక్రయాల్లో వృద్ధి అంతంతే

న్యూఢిల్లీ: దేశంలో వాహన విక్రయాలు ఏప్రిల్ నెలలో స్తబ్దంగా ఉన్నాయి. ఆటోమొబైల్ రంగంలోకి కంపెనీలన్నీ కలిసి 3,38,341 లక్షల వాహనాలను విక్రయించాయి. గత ఏడాది ఇదే నెలలో అధిక సంఖ్యలో వాహనాలు అమ్ముడైన ప్రభావం (బేస్ ఎఫెక్ట్), ప్రస్తుత ఎన్నికల సీజన్ కారణంగా ఏప్రిల్‌లో ఆటో అమ్మకాలు నిస్తేజంగా సాగాయని అంటున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో 3,32,468 వాహనాలు అమ్ముడుపోయాయి. దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ 1.77 శాతం వృద్ధితో 1,37,952 కార్లు మాత్రమే విక్రయించగలిగింది. ప్రయాణికుల కార్లలో ద్వితీయ స్థానంలో ఉన్న హ్యుండై మోటార్స్ ఒక శాతం వృద్ధితో 50,201 కార్లు మాత్రమే విక్రయించింది. గత ఏడాది ఏప్రిల్‌లో మారుతి 1,37,320 వాహనాలు విక్రయించగా హ్యుండై 49,701 కార్లు విక్రయించింది. సాధారణంగా ఎన్నికల సీజన్‌లో మార్కెట్లు నిస్తేజంగానే ఉంటాయని, ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే మళ్లీ జోరందుకుంటాయని మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. జూన్ వరకు మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉండవచ్చునని ఆయన తెలిపారు. సరఫరాల వ్యవస్థ మెరుగుపడిన కారణంగా పరిశ్రమలో ఆర్డర్ల సంఖ్య కూడా తగ్గిందని హ్యుండై మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ అన్నారు. రుతుపవనాలు ప్రోత్సాహకరంగా ఉంటే గ్రామీణ అమ్మకాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

- టాటా మోటార్స్ 47,883 వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఏప్రిల్‌లో విక్రయించిన 47,007 యూనిట్లతో పోల్చితే అమ్మకాలు 2 శాతం పెరిగాయి.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాలు 32 శాతం పెరిగి 15,510 యూనిట్ల నుంచి 20,494 యూనిట్లకు చేరాయి.
- ఎంజీ మోటార్ ఇండియా రిటైల్ అమ్మకాలు 1.45 శాతం తగ్గి 4,485కి పడిపోయాయి. గత ఏడాది ఏప్రిల్ అమ్మకాలు 4,551 యూనిట్లు.

టూవీలర్ అమ్మకాలు: టీవీఎస్ మోటార్ 29 శాతం వృద్ధితో 3,01,449 వాహనాలు విక్రయించింది. రాయల్ ఎన్ ఫీల్డ్ అమ్మకాల్లో 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొత్తం 75,038 వాహనాలు విక్రయించింది.



2026 నాటికి చిన్న కార్ల పునరుజ్జీవం

దేశీయ మార్కెట్లో 2026 చివరికి లేదా 2027 ప్రారంభ సమయానికి చిన్న కార్లకు తిరిగి డిమాండు ఏర్పడవచ్చునని మారుతి సుజుకీ భావిస్తోంది. ఒకప్పుడు భారత ఆటోమొబైల్ మార్కెట్‌ను ఏలిన చిన్న కార్ల విభాగం వాటా ఇప్పుడు 30 శాతం కన్నా దిగువకు పడిపోయింది. 2018-19 నుంచి తిరోగమనంలో ఉన్న ద్విచక్ర వాహనాల మార్కెట్ ఇప్పుడు పుంజుకున్నదని, అది చిన్న కార్ల మార్కెట్‌పై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని పార్థో బెనర్జీ అభిప్రాయపడ్డారు.

స్పోర్ట్స్

పాండ్యా సహా ముంబై జట్టుకు జరిమానా



లఖ్‌నవూ: పరాజయ పరంపరలో కొట్టుమిట్టాడుతున్న ముంబై ఇండియన్స్‌కు మరో షాక్. మంగళవారం లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకుగాను ఆ జట్టు సారథి హార్దిక్ పాండ్యాకు రూ. 24 లక్షలు, అలాగే జట్టులోని ప్రతి ఆటగాడికి రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. నిర్ణీత సమయానికి ఓవర్ల కోటా పూర్తి చేయకపోవడం ముంబైకిది రెండోసారి. అందుకే కెప్టెన్ హార్దిక్‌కు భారీ జరిమానా విధించినట్టు ఐపీఎల్ నిర్వాహకులు వెల్లడించారు.

స్మిత్, ఫ్రేజర్‌కు మొండిచేయి

మార్ష్‌కు కెప్టెన్సీ ● ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్ టీమ్

మెల్‌బోర్న్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ వ్యవహరించనున్నాడు. 15 మంది సభ్యుల జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బుధవారం ప్రకటించింది. అయితే, స్టీవ్ స్మిత్‌తోపాటు ఐపీఎల్‌లో అదరగొడుతున్న జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు టీమ్‌లో చోటు దక్కలేదు.

ఆస్ట్రేలియా జట్టు: మార్ష్ (కెప్టెన్), అగర్, కమిన్స్, టిమ్ డేవిడ్, ఎలిస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టార్క్, స్టొయినిస్, వేడ్, వార్నర్, జంపా.

అఫ్ఘాన్ వరల్డ్ కప్ జట్టులో 8 మంది ఐపీఎల్ ఆటగాళ్లు

కాబూల్: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల అఫ్ఘానిస్థాన్ జట్టును ప్రకటించారు. రషీద్‌ఖాన్ సారథ్యంలోని ఈ జట్టులో ఏకంగా ఆరుగురు ఆల్‌రౌండర్లున్నారు. ఇక ఈ సీజన్ ఐపీఎల్‌లో ఆడుతున్న 8 మంది అఫ్ఘాన్ ఆటగాళ్లను మెగా టోర్నీ జట్టుకు ఎంపిక చేశారు.

అఫ్ఘానిస్థాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మనుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, నజీబుల్లా జద్రాన్, ఇషాక్, మహ్మద్ నబి, గుల్బదిన్ నైబ్, కరీమ్ జనత్, ఖరోతి, ముజీబుర్, నూర్ అహ్మద్, నవీనుల్ హక్, ఫరూఖి, ఫరీద్ అహ్మద్ మాలిక్.

చెన్నైపై పంజా

- అదరగొట్టిన రొసో, బెయిర్‌స్టో
- తిప్పేసిన బ్రార్, చాహర్
- 7 వికెట్లతో పంజాబ్ గెలుపు

చెన్నై: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు చెక్ పెట్టింది. రిలీ రొసో (23 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులతో 43), బెయిర్‌స్టో (30 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 46) బ్యాట్‌తో రాణించగా.. స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్ (2/17), రాహుల్ చాహర్ (2/16) ఒక్క బౌండ్రీ కూడా ఇవ్వకుండా కట్టడి చేయడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్ల తేడాతో చెన్నైను ఓడించింది. తొలుత చెన్నై 20 ఓవర్లలో 162/7 స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (62), రహానె (29) పోరాటం వృథా అయింది. మిచెల్ (1 నాటౌట్) స్థానంలో వన్‌డౌన్‌లో శివమ్ దూబేను బరిలోకి దించిన వ్యూహం బెడిసికొట్టగా.. ధోనీ (14) ఈ సీజన్‌లో తొలిసారి అవుటయ్యాడు. ఛేదనలో పంజాబ్ 17.5 ఓవర్లలో 163/3 స్కోరు చేసి నెగ్గింది. కర్రాన్ (26 నాటౌట్), శశాంక్ సింగ్ (25 నాటౌట్) రాణించారు. కేవలం 2 బంతులే బౌల్ చేసిన దీపక్ చాహర్ నొప్పితో మైదానం వీడడం కూడా చెన్నైను బలహీన పరిచింది. బ్రార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది.

ఒత్తిడి లేకుండా..: బెయిర్‌స్టో, రొసో దూకుడైన బ్యాటింగ్‌తో పంజాబ్ సునాయాసంగా గెలిచింది. ఛేదనలో తొలి ఓవర్‌లోనే 6,4 బాదిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (13) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయాడు. కానీ, మరో ఓపెనర్ బెయిర్‌స్టో, రొసో అటాకింగ్ గేమ్‌తో.. పవర్‌ప్లేలో పంజాబ్ 52/1తో నిలిచింది. 7వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు బాదిన బెయిర్‌స్టో.. అలీ వేసిన ఆ తర్వాతి ఓవర్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించాడు. స్పిన్నర్లు ప్రభావం చూపలేక పోవడంతో.. పేసర్ దూబేకు బంతిని అప్పగించడం ఫలితాన్నిచ్చింది. దూకుడుగా ఆడుతున్న బెయిర్‌స్టోను దూబే క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, రొసో.. శశాంక్ సహకారంతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. 12వ ఓవర్‌లో శార్దూల్ బౌలింగ్‌లో రొసో 6,4తో 14 పరుగులు రాబట్టినా.. అదే ఓవర్‌లో బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో జాగ్రత్తగా ఆడిన శశాంక్, కెప్టెన్ కర్రాన్.. నాలుగో వికెట్‌కు అజేయంగా 50 పరుగులు జోడించడంతో పంజాబ్ మరో 13 బంతులు మిగిలుండగానే గెలుపు గీత దాటింది.

ఆదుకొన్న రుతురాజ్: పంజాబ్ స్పిన్నర్లు హర్‌ప్రీత్, చాహర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అర్ధ శతకంతో చెన్నై పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు ఓపెనర్లు రహానె, రుతురాజ్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. అర్ష్‌దీప్ తొలి రెండు ఓవర్లలో గైక్వాడ్ నాలుగు బౌండ్రీలు బాదగా.. కర్రాన్ బౌలింగ్‌లో రహానె హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. దీంతో పవర్‌ప్లేను చెన్నై 55/0తో మెరుగ్గా ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్ మాయాజాలానికి చెన్నై విలవిల్లాడింది. 8వ ఓవర్‌లో రహానెతోపాటు శివమ్ దూబే (0)ను అవుట్ చేసిన బ్రార్ ప్రత్యర్థికి షాకిచ్చాడు. జడేజా (2)ను చాహర్ ఎల్బీగా వెనక్కి పంపాడు. కేవలం 6 పరుగుల తేడాతో 3 కీలక వికెట్లు కోల్పోయిన సీఎస్‌కే 70/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో రిజ్వీ (21), గైక్వాడ్ నాలుగో వికెట్‌కు 37 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. క్రీజులో ఉన్నంతసేపు తడబడిన రిజ్వీని రబాడ వెనక్కి పంపాడు. దాదాపు 11 ఓవర్లపాటు ఒక్క బౌండ్రీ కూడా కొట్టని రుతురాజ్.. 17వ ఓవర్‌లో కర్రాన్ బౌలింగ్‌లో 4,6తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మొయిన్ అలీ (15)తో కలసి 5వ వికెట్‌కు 38 పరుగులు జోడించిన గైక్వాడ్‌ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేశాడు. అలీని చాహర్ వెనక్కిపంపినా.. ఆఖరి ఓవర్‌లో ధోనీ 4,6తో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు. అయితే, చివరి బంతికి రన్ తీసే క్రమంలో మహీ అవుటయ్యాడు.



స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) రొసో (బి) హర్‌ప్రీత్ 29, రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 62, శివమ్ దూబే (ఎల్బీ) హర్‌ప్రీత్ 0, జడేజా (ఎల్బీ) రాహుల్ చాహర్ 2, సమీర్ రిజ్వీ (సి) హర్షల్ (బి) రబాడ 21, మొయిన్ (బి) రాహుల్ చాహర్ 15, ధోనీ (రనౌట్) 14, మిచెల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 162/7; వికెట్లపతనం:** 1-64, 2-65, 3-70, 4-107, 5-145, 6-147, 7-162; **బౌలింగ్:** రబాడ 4-0-23-1, అర్ష్‌దీప్ 4-0-52-1, కర్రాన్ 3-0-37-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-17-2, రాహుల్ చాహర్ 4-0-16-2, హర్షల్ పటేల్ 1-0-12-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (సి) రుతురాజ్ (బి) గ్లీసన్ 13, బెయిర్ స్టో (సి) ధోనీ (బి) దూబే 46, రొసో (బి) శార్దూల్ 43, శశాంక్ (నాటౌట్) 25, కర్రాన్ (నాటౌట్) 26, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 17.5 ఓవర్లలో 163/3; వికెట్లపతనం:** 1-19, 2-83, 3-113; **బౌలింగ్:** దీపక్ చాహర్ 0.2-0-4-0, శార్దూల్ 3.4-0-48-1, గ్లీసన్ 3.5-0-30-1, ముస్తాఫిజుర్ 4-1-22-0, జడేజా 3-0-22-0, మొయిన్ 2-0-22-0, శివమ్ దూబే 1-0-14-1.

5
చెన్నైతో గత ఐదు మ్యాచ్‌ల ముఖాముఖిలో 5-0తో పంజాబ్‌దే పైచేయి.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X రాజస్థాన్



హోరాహోరీకి ఉప్పల్ సిద్ధం

సన్‌రైజర్స్‌తో రాజస్థాన్ పోరు నేడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ సీజన్ ఐపీఎల్ టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)ను సొంతగడ్డపై ఢీకొట్టేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) సన్నద్ధమైంది. గురువారం ఈ రెండు జట్ల మధ్య ఉప్పల్ స్టేడియం వేదికగా హోరాహోరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన ఎస్ఆర్‌హెచ్, వరుస విజయాలతో జోష్‌లో ఉన్న రాయల్స్ జోరుకు బ్రేకులు వేసి, తిరిగి గెలుపుబాట పట్టాలని వ్యూహాలు పన్నుతోంది. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉండి కూడా గత రెండు మ్యాచ్‌ల్లో ఛేదనలో విఫలమైన ఎస్ఆర్‌హెచ్, ఆ లోపాన్ని అధిగమించేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ బలంగా ఉన్న రాజస్థాన్ ఈ మ్యాచ్‌లో రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే ఆలోచనలో ఉన్నట్టు కోచ్ కుమార సంగక్కర తెలిపాడు. ఇక, పిచ్ ఛేదన జట్టుకు అనుకూలించే అవకాశాలున్నాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
చెన్నై	10	5	5	0	10	0.627
హైదరాబాద్	9	5	4	0	10	0.075
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఇండో-పాక్ మ్యాచ్ కోసం మొబైల్ పిచ్‌లు వచ్చేశాయ్!

నసా స్టేడియం దాదాపు రెడీ



దుబాయ్: టీ20 వరల్డ్‌కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనున్న న్యూయార్క్‌లోని నసా కౌంటీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం దాదాపు సిద్ధమైంది. నిర్మాణంలో ఉన్న ఈ మైదానంలో జరిగే 8 మ్యాచ్‌ల కోసం అత్యంత కీలకమైన డ్రాప్ డౌన్ (మొబైల్) పిచ్‌ల అమరిక ఆరంభమైందని ఐసీసీ బుధవారం తెలిపింది. అడిలైడ్ ఓవల్ హెడ్ క్యూరేటర్ డామియన్ హాగ్ పర్యవేక్షణలో ఫ్లోరిడాలో తయారు చేసిన పది పిచ్‌లను భారీ ట్రక్కుల ద్వారా స్టేడియానికి తరలించారు. వీటిల్లో నాలిగింటిని మ్యాచ్‌ల కోసం, మిగతా ఆరు పిచ్‌లను ప్రాక్టీస్ కోసం ఉపయోగించనున్నారు.

మావాడి హృదయం ముక్కలైంది

క్రికెటర్ రింకూ తండ్రి నిరాశ



న్యూఢిల్లీ: డ్యాషింగ్ బ్యాటర్ రింకూసింగ్ టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపికపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కానీ మంగళవారం ప్రకటించిన తుది 15 మంది జట్టులో అతడికి చోటు దక్కలేదు. వరల్డ్‌కప్ జట్టులో స్థానం దక్కలేదని తెలిసి తన కుమారుడి గుండె పగిలిందని రింకూ తండ్రి ఖన్‌చంద్ర సింగ్ వెల్లడించాడు. తాము కూడా ఎంతో ఆశతో ఉన్నామని, కుమారుడి ఎంపికను సెలబ్రేట్ చేసుకొనేందుకు మిఠాయిలతోపాటు బాణసంచాను కూడా తెచ్చి ఉంచామని ఖన్‌చంద్ర తెలిపాడు. కాగా చెన్నై ఆల్‌రౌండర్ శివమ్ దూబే తాజా ఐపీఎల్‌లో అద్భుతంగా ఆడుతుండడం కూడా రింకూసింగ్ అవకాశాలను దెబ్బ తీసింది. మరోవైపు రింకూ సింగ్‌ను బలిపశువుని చేశారని టీమిండియా మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ధ్వజమెత్తాడు. 'యశస్వీ జైస్వాల్‌నో, లేక ఇంకెవరినైనా తప్పించి రింకూను తీసుకోవాల్సింది' అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

భారత్‌కు రెండో స్థానం

థామస్ కప్ క్వార్టర్స్‌లో చైనాతో ఢీ నేడు

చెంగ్డూ (చైనా): థామస్ కప్‌లో భారత పురుషుల జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానం సాధించడంలో విఫలమైంది. గ్రూప్-సిలో భాగంగా బుధవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ భారత్ 1-4తో ఇండోనేసియా చేతిలో ఓటమి పాలైంది. ఈ రెండు జట్లు ఇప్పటికే క్వార్టర్స్‌కు అర్హత సాధించినా, తాజా పోరుతో గ్రూప్-సి నుంచి ఇండోనేసియా టాపర్‌గా నిలవగా, భారత్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఇక, ఇండోనేసియాతో పోరులో సింగిల్స్ స్టార్ ప్రణయ్ మినహా, మిగతా భారత షట్లర్లంతా ఓటమిపాలయ్యారు. కాగా భారత పురుషుల జట్టు చైనాతో, మహిళల జట్టు జపాన్‌తో గురువారం క్వార్టర్స్‌లో తలపడనున్నాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జగన్ అనే నేను..
పదవీ ప్రమాణానికి తూట్లు పొడిచేస్తా
ఏ మేనిఫెస్టోలో ఏముంది?
కొల్లేటి కోట ఎవరిదో?
విజయన'గరం..గరం'!
కీలక నియోజక వర్గాలపై రివ్యూ
'కంసమామ' పాలనలో దళితులకు నరకం
అమరావతి బహుజన జేఏసీ నేత బాలకోటయ్య ఇంటర్వ్యూ



10 11
సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

గురువారం | 2-5-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Vishakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**


బుర్రలేని సర్కార్.. డేటా చోర్!



ప్రజల వ్యక్తిగత సమాచారం మొత్తం సేకరణ

- ప్రభుత్వ వెబ్‌సైట్లలో అందరికీ అందుబాటులో
- ఒక్క క్లిక్‌తో కీలక సమాచారమంతా లభ్యం
- ఇంటి అడ్రస్ నుంచి బ్యాంకు ఖాతా వరకు..
- పెళ్లి ఫొటోల నుంచి పాస్‌పోర్టు, పాన్ వరకు..
- ఆధార్, రేషన్ కార్డులు, ఫోన్ నంబర్లు అన్నీ ఓపెన్
- ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. ఎలాగైనా వాడొచ్చు
- ఐదేళ్లుగా ఇదే తంతు.. పట్టించుకున్న వాళ్లు ఉంటే ఒట్టు
- 'క్రిటికల్ రివర్' కంపెనీకి రిజిస్ట్రేషన్ వివరాలు, వేలిముద్రలు
- ఇతర సమాచారమూ ఆ సంస్థకే వెళుతోందా?

సైబర్ నేరగాళ్లకు ఏపీ సర్కారు 'సమాచార విందు'



ఒక వివాహ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలివి! ఇందులో వధూవరుల టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులను అప్‌లోడ్ చేసేశారు. ఒక్క క్లిక్‌తో వీటిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

రాజ్యాంగంలోని 21వ అధికరణ పౌరులకు 'గోప్యత హక్కు'ను ప్రసాదిస్తోంది. దీని ప్రకారం.. ప్రజల నుంచి వారి వ్యక్తిగత, రహస్య సమాచారం సేకరిస్తే.. ఏ అవసరం కోసం తీసుకుంటే ఆ అవసరానికి మాత్రమే వాడాలి. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని అత్యంత భద్రంగా ఉంచాలి.

కానీ, జగన్ సర్కార్ అంగట్లో ఉచిత సరుకులాగా అందుబాటులో ఉంచింది.

కేవలం ఒక ఫోన్ నంబర్ తెలుసుకుని బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న రోజులివి! కానీ.. ఫోన్ నంబరు, మెయిల్ ఐడీ, ఆధార్, పాస్‌పోర్టు, పాన్ వంటి సమగ్ర సమాచారాన్ని వెబ్‌సైట్లలో పెడితే పరిస్థితి ఏమిటి?

సైబర్ చోరులు పండగ చేసుకోరా?

అనంతపురం అరవింద్‌నగర్‌కు చెందిన యువకుడు.. సికింద్రాబాద్ సైనిక్‌పురికి చెందిన యువతిని అనంతపురంలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి చేసుకున్నాడు. వారిద్దరి ఫోన్ నంబర్లు ఇవే! ఆధార్ నంబర్లూ రెడీ! టెన్త్ మార్క్స్ లిస్టు కాపీ కావాలంటే చూడండి! మెయిల్ ఐడీలూ చూసుకోండి! పాస్‌పోర్టులు కూడా చూసుకోవచ్చు. వాళ్ల అమ్మా నాన్నల ఫోన్ నంబర్లు, పెళ్లి రిజిస్ట్రేషన్‌కు సాక్షి సంతకాలు చేసేందుకు వచ్చిన వారి ఫోన్ నంబర్లూ కూడా ఉన్నాయి! కావాలంటే చూసుకోవచ్చు!

..ఏమిటిదంతా అనుకుంటున్నారా? ఇవన్నీ మాకెలా తెలుసునని అనుకుంటున్నారా? మీరూ, మేమే కాదు! ఇంటర్నెట్ ఉన్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చు! ప్రతి ఒక్కరి వివరాలూ తెలుసుకోవచ్చు! వాళ్ల ఆధార్, టెన్త్ మార్క్‌లిస్టుల వంటి డాక్యుమెంట్లూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు! దేనికోసమైనా వాడుకోవచ్చు! ఇది.. జగన్ సర్కారు నిర్వాకం.

సమగ్ర కథనం 9లో

గత ఎన్నికల సమయంలో 'డేటా చోరీ' అంటూ నానా బీభత్సం సృష్టించిన జగన్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల డేటాను గుప్పిట పట్టేశారు. 'చోరుల' చేతిలోనూ పెట్టేశారు!

భూరక్షణ కాదు.. భక్షణే!

జగన్ సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తలో మిషన్ బిల్డ్ పేరిట అత్యంత విలువైన ప్రభుత్వ భూములను అమ్మాలని విశ్వప్రయత్నాలు చేసింది. కేంద్ర సంస్థ ఎన్‌బీసీసీ ద్వారా వేలంపాటలో అమ్మకానికి పెట్టించి, వాటిని వైసీపీ నేతలే సొంతం చేసుకునేలా ప్రభుత్వ పెద్దలు పెద్ద స్కెచ్ వేశారు. చివరికి ఈ ప్రయత్నాలకు హైకోర్టు బ్రేక్‌వేసింది. ఆ తర్వాత అవే భూములను బ్యాంకులకు తాకట్టుపెట్టుకొని రుణాలు తెచ్చుకున్నారు. ఇప్పుడు ల్యాండ్ అథారిటీ అనే సంస్థకు కార్పొరేట్ ముసుగు తొడిగి రైతుల భూములను భారీ ఎత్తున తెగనమ్మేందుకు జగన్ సర్కారు సిద్ధమైంది. ఇది వట్టి ఆరోపణ కాదనేందుకు.. భూముల అమ్మకాన్ని చట్టబద్ధం చేసిన టైటిల్ చట్టంలోని ఐదో చాప్టరే సాక్ష్యం. అసలు... మన రాష్ట్రంలోని రైతుల భూములకు సంబంధించి బయట రాష్ట్రాల్లో ఆఫీసులు తెరుస్తామనే ప్రస్తావన చట్టంలో ఎందుకు?



'టైటిల్' యాక్ట్ ప్రజా కంటకమే

నిరూపించేందుకు 'ఆంధ్రజ్యోతి' సిద్ధం
ఐదు నిమిషాలు సమయమివ్వగలరా?



- చట్టంలోని తప్పులను మీముందే ఉంచుతాం
- మీరే ఆ చట్టం తెచ్చారని నిరూపిస్తాం
- రైతులకు 'న్యాయాన్ని' దూరం చేసే చట్టం
- అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే
- రైతుల భూములపై 'కంపెనీ' తరహా అథారిటీయా?
- బయటి రాష్ట్రాల్లోనూ ఆఫీసులు పెట్టడమేమిటి?
- జనం ఆస్తులతో వ్యాపారం చేసే ఆలోచనేనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ చట్టం... రైతుల భూ వివాదాలను పరిష్కరించి, శాశ్వత భూహక్కును వారికి కల్పిస్తుందట! రైతులకు మంచి చేస్తుందట! జగన్ భూములు ఇచ్చే వాడే కానీ తీసుకునే వాడు కాదట! ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై 'ఆంధ్రజ్యోతి' అసత్య ప్రచారం చేస్తోందట! ఇవన్నీ... ముఖ్యమంత్రి జగన్ బుధవారం విశాఖ జిల్లాలో చెప్పిన మాటలు! 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావన తెచ్చినందుకు... ఈ చట్టం సృష్టికర్త జగన్‌కు సూటిగా ఒక మాట! విలేకరుల సమావేశం పెట్టి, దానికి 'ఆంధ్రజ్యోతి'ని ఆహ్వానించగలరా? గంటలకొద్దీ సమయం అక్కర్లేదు... కేవలం ఐదు నిమిషాలు కేటాయించగలరా? ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రజా కంటకమని... ఆ చట్టంలోని అంశాల ఆధారంగానే నిరూపిస్తాం! టైటిల్ చట్టం, భూముల సమగ్రసర్వే గురించి సీఎం సహా సర్కారు పెద్దలు మీరు చెప్పేవి అవాస్తవాలని రుజువు చేస్తాం. 'ఇది రైతుల కోసమే... భూముల రక్షణ కోసమే' అంటున్న జగన్ ఆ చట్టాన్ని సమగ్రంగా చదివారో లేదో తెలియదు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌లోని

మిగతా 9వ పేజీలో...

భూములు కాజేసే ఉద్దేశమే తనకు లేదని, భూములు ఇచ్చేవాడినే తప్ప తీసుకునేవాడిని కాదని జగన్ పాయకరావు పేట సభలో చెప్పారు. మీ ఉద్దేశం మంచిదే అయితే, రైతులకు ఇచ్చే పాసుపుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో జగన్ బొమ్మలెందుకు? భూమి రైతుదా? జగన్మోహన్ రెడ్డిదా? అనే సందేహం వచ్చేలా వాటిని ఎందుకు డిజైన్ చేయించారు? ఆర్ఓఆర్ చట్టం-1971 ప్రకారం... పాస్‌పుస్తకంపై అసలు యజమాని ఫొటోనే ఉండాలి! అలా కాదని... రైతు ఫొటో చిన్నగా, జగన్ ఫొటో పెద్దగా ముద్రించడం చట్ట విరుద్ధం కాదా?

మీ బొమ్మలెందుకు?

'గాజుగ్లాసు'పై గందరగోళం!



- జనసేన పోటీచేసే స్థానాల వరకే ఈసీ ఊరట
- విచారణ మూసివేసిన హైకోర్టు
- ఈసీ నిర్ణయంపై తక్షణమే కోర్టుకు టీడీపీ
- జనసేన, బీజేపీతో కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాం
- స్వతంత్రులకు ఆ గుర్తు కేటాయించడం సరికాదు
- మాపై ప్రతికూల ప్రభావం.. ఈసీ ఉత్తర్వులతో ఓటర్లలో మరింత అయోమయం
- గాజుగ్లాసును జనసేనకే రిజర్వు చేయాలి.. ఈసీని అలా ఆదేశించాలని అభ్యర్థన
- నేడు హైకోర్టులో విచారణ.. మళ్లీ కోర్టుకెళ్లాలని జనసేన కూడా యోచన

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): జనసేనకు చెందిన గాజుగ్లాసు గుర్తుపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) తాజా ఉత్తర్వులు ప్రతిపక్ష టీడీపీ కూటమితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లందరినీ గందరగోళంలో పడేశాయి. జనసేన పోటీచేసే రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే ఇతరులకు గాజుగ్లాసు గుర్తును కేటాయించబోమని.. ఆ పార్టీ బరిలోకి దిగిన 21 అసెంబ్లీ స్థానాలున్న లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థులెవరికీ ఈ గుర్తు ఇవ్వొద్దని రిటర్నింగ్ అధికారు(ఆర్వో)లకు ఆదేశాలిచ్చామని ఈసీ బుధవారం హైకోర్టుకు నివేదించింది. కోర్టు దీనిపై విచారణను కూడా మూసివేసింది. అయితే ఈసీ నిర్ణయం తమ కూటమిపై తీవ్ర

మిగతా 7వ పేజీలో...



కేసీఆర్‌పై 48 గంటల నిషేధం

9

- ప్రచారం వద్దు.. ఈసీ ఉత్తర్వులు.. కాంగ్రెస్ ఫిర్యాదుపై చర్యలు
- గత నెల సిరిసిల్లలో ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసిన కేసీఆర్

వివేకా హత్యకు 40 కోట్ల సుపారీ

12

- హత్య చేసినవారికే మళ్లీ టికెట్ ఇచ్చారు.. అవినాశ్‌ను ఐదేళ్లుగా కాపాడుతున్నారు
- హంతకులు చట్టసభలకు వెళ్లకూడదనే కడప స్థానానికి ఎంపీగా పోటీ చేస్తున్నా
- గెలిస్తే కేంద్ర మంత్రినవుతా.. హోదా సాధించుకొస్తా: షర్మిల



నవ సందేహాలకు జగన్ జవాబివ్వాలి

నవరత్నాలు ఒట్టి హంబక్.. నా ప్రశ్నలకు సమాధానం చెప్పాకే ఎస్సీ,ఎస్టీలను ఓట్లడగండి.. షర్మిల బహిరంగ లేఖ



గుంటూరులో బుధవారం రాత్రి జరిగిన చంద్రబాబు రోడ్‌షోలో ప్రజా స్పందన

గ్రాబింగ్ చట్టం రద్దుపైనే.. నా రెండో సంతకం!

రికార్డులు మార్చి భూముల స్వాహాకే ల్యాండ్ టైటిల్ చట్టం: చంద్రబాబు

- బందిపోట్లను మించిన దోపిడీ.. వ్యవస్థలన్నీ నాశనం
- డ్రైవింగ్ తెలియని వ్యక్తికి డ్రైవర్ బాధ్యతలిస్తే ఇంతే
- 13 లక్షల కోట్ల అప్పుతెచ్చి ఊబిలో పడేశాడు
- బీసీలకు ఏటా 30 వేల కోట్ల బడ్జెట్
- ప్రతి చేనేత కుటుంబానికీ ఏటా 24 వేలు
- 'పవర్‌లూం'కు 500 యూనిట్ల ఉచిత కరెంట్
- మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు
- ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్

మళ్లీ ఉచితంగా ఇసుక.. 50 ఏళ్లకే ముస్లింలకు పింఛన్.. ఇమాంలకు గౌరవ వేతనం 10 వేలు

గుంటూరు/బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): 'నిన్న మొన్నటి వరకు ఆస్తులు బలవంతంగా బెదిరించి లాక్కున్నారు. ఇప్పుడా అవసరం లేకుండా ఏకంగా రికార్డులు మార్చి భూములు స్వాహా చేయడానికి జగన్ ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చారు. మేం అధికారంలోకి రాగానే నా మొదటి సంతకం మెగా డీఎస్సీపైన అయితే.. రెండో సంతకం జగన్ ల్యాండ్ గ్రాబింగ్ చట్టం రద్దుపైనే' అని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో

మిగతా 12వ పేజీలో...

ఈ నెలా పింఛన్ కష్టాలు

9

- బ్యాంకుకు వచ్చి వడదెబ్బతో వృద్ధుడి మృతి
- కొందరు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు కట్
- మైనస్ ఖాతాల్లో జమ చేయడంతో కోత

పోలీసు వాహనాల్లో డబ్బుల చేరవేత!

7

- రాత్రి వేళ కరెంటు తీసేసి పంపిణీ
- అధికార పక్షానికి పోలీసు అధికారుల ఊడిగం
- విద్యుత్ సిబ్బంది కూడా.. విశాఖలో కోడ్ ఉల్లంఘన

అది.. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్

- ప్రజల ఆస్తి పత్రాలన్నీ జగన్ ఇంట్లో,
- హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో
- 3 కబ్జాలు, 6 సెటిల్‌మెంట్లుగా పాలన
- ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాలు కబ్జా చేసిన సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి
- ఒక్క చాన్స్ అన్నారు, మీరిచ్చారు.. చాలు
- వైసీపీకి ప్రతిపక్ష అర్హత కూడా ఇవ్వొద్దు
- జగన్‌కు పొలిటికల్ హాలిడే ప్రకటించాలి
- జనసేన ఒక గుర్తింపు ఉన్న పార్టీ కావాలి
- తర్వాతే ముఖ్యమంత్రి పదవిపై ఆలోచిద్దాం
- ప్రచార సభల్లో జనసేనాని పవన్ కల్యాణ్

12



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో పవన్ సభకు హాజరైన జనం

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

విద్యార్థుల గర్జన

గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికాలోని వివిధ యూనివర్సిటీల్లో విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనలమీద పోలీసు దాడులు తీవ్రమవుతున్నాయి. ఆపాదమస్తకం రక్షణకవచాలు ధరించి, ఆయుధాలు, లాఠీలు చేబూనిన పోలీసులు యూనివర్సిటీ క్యాంపస్‌లలోకి చొరబడి విద్యార్థులను వెంటాడివేటాడి అరెస్టు చేస్తున్న దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రపంచమంతా చూస్తున్నది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మారుపేరుగా చెప్పుకొనే అమెరికాలో ఆ స్థాయిలో అణచివేత ఉన్నందుకు ఆశ్చర్యపోతున్నది. నిరసన హక్కుకూ, భావప్రకటనా స్వేచ్ఛకూ దక్కుతున్న గౌరవాన్ని చూసి విస్తుపోతున్నది.

ఒక భయంకరమైన, అమానవీయమైన యుద్ధానికి వ్యతిరేకంగా యువత నోరువిప్పుతున్నందుకు, అపమని అడుగుతున్నందుకు అమెరికా ప్రభుత్వం, అక్కడి వ్యవస్థలు ఇంత వణికిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉగ్రవాదులను అంతం చేస్తానంటూ గాజాలోకి ఇజ్రాయెల్ చొరబడినప్పుడు విద్యార్థులు ఇంతగా ఆగ్రహించలేదు. కానీ, ఈ ఆర్నెల్లకాలంలో అక్కడ జరిగింది మానవహననమే. నలభైవేలమందిని చంపేసి, లక్షలాదిమందిని నిరాశ్రయులను చేసి, ఆస్పత్రులను స్మశానాలుగా మార్చేసి, మిగిలినవారికి అన్నం నీరు దక్కకుండా చేసినా కూడా నెతన్యాహూ కసి ఇంకా చల్లారడం లేదు. వందలాదిమంది రోగులను కాల్చిచంపడమో, సజీవంగా పాతిపెట్టడమో జరిగిందని ఇటీవల ఇజ్రాయెల్ సేనలు వదిలిపెట్టిన రెండు ప్రధాన ఆస్పత్రుల పరిసరాల్లో చేపట్టిన తవ్వకాల్లో స్పష్టమైంది. గాజాలో ఇజ్రాయెల్ హమాస్‌ను అంతం చేయడం పేరిట జాతిహననానికి పాల్పడుతున్నది. ఇప్పటివరకూ సాగించిన ఘాతుకాలు చాలవన్నట్టుగా ఇప్పుడు రఫా నగరంలోకి ప్రవేశించి, అక్కడ తలదాచుకుంటున్న పదిలక్షలమందిని హతమార్చడానికి సిద్ధపడుతున్నది. ఇజ్రాయెల్ పాపాలు ఇలా పతాకస్థాయికి చేరిన తరువాతే అమెరికాలో విశ్వవిద్యాలయాలు వేడెక్కాయి. ఇజ్రాయెల్ దమనకాండనీ, దానికి అండదండలు దండీగా అందిస్తున్న అమెరికా సహా ఇతర అగ్రదేశాలను ప్రశ్నించడానికి మిగతా ప్రపంచం వణికిపోతున్న తరుణంలో, యుద్ధానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. అమెరికా విద్యాసంస్థలు యుద్ధంలో భాగస్వాములు కాకూడదని కోరుతున్నారు. అమెరికన్ యూనివర్సిటీలు వందలకోట్ల డాలర్లు ఆయుధ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి, వచ్చిన లాభాలనూ వడ్డీనీ తన అవసరాలకు వాడుకుంటున్నందున, యుద్ధంతో లాభపడుతున్న ఆయా కంపెనీలనుంచి డబ్బు వెనక్కుతీసుకోవాలనీ, ఆ పాపపు సొమ్ము తమకు వద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇజ్రాయెల్‌తో అకడమిక్ సంబంధాలను తెగదెంపులు చేసుకోవాలని కోరుతున్నారు. గతంలో దక్షిణాఫ్రికాలో జాత్యహంకార పాలకులతో సంబంధాలున్న సంస్థలనుంచి పెట్టుబడులను ఉపసంహరించుకొని, సంబంధాలు సైతం తెంచుకున్న చరిత్ర ఈ యూనివర్సిటీలకు లేకపోలేదు. కానీ, ఇప్పుడు ఈ విద్యార్థి నిరసనలమీద దుష్ప్రచారం అధికంగా చేస్తూ, దానిని యూదువ్యతిరేక ఆందోళనగానూ, మతోన్మాదుల, ఉగ్రవాదుల దుశ్చర్యగానూ చిత్రీకరించే ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్నాయి. బయటివారు వచ్చి తమ విద్యార్థుల మనసుల్లో విషం నింపుతున్నారనీ, యూదులకు వ్యతిరేకంగా వారిని రెచ్చగొడుతున్నారని ప్రకటించడం ద్వారా కొన్ని యూనివర్సిటీలు పోలీసు చర్యకు మార్గాన్ని సుగమం చేస్తున్నాయి. నిరసనలను దీర్ఘకాలం వదిలివేస్తే, అవి ప్రశాంతంగా సాగినా కూడా ప్రమాదమేనని శ్వేతసౌధం భయపడుతోంది. ఇప్పటికే నిరసనలు యూరప్‌కు విస్తరించాయి, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో జోరందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, సాధ్యమైనంత వేగంగా, తీవ్రంగా అణచివేత ఉండాలని, లేని పక్షంలో అది తనకూ తన మిత్రదేశాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని అమెరికా భావిస్తున్నట్టు ఉంది. 'నువ్వు యుద్ధం చేస్తున్నది మా దేశాన్ని రక్షించడానికి కాదు, బందీలుగా చిక్కిన నా బంధువులను కాపాడటానికీ కాదు, నీ అధికారదాహానికి ఓ నమస్కారం, ఇక దిగిపో' అని నెతన్యాహూకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో వేలాదిమంది నిరసనలు వ్యక్తంచేస్తున్నారు. కానీ, అమెరికాలో మాత్రం ఇజ్రాయెల్ దురాగతాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులకు శిక్ష తప్పడం లేదు.

సామాన్య జనం గెలిచేదెప్పుడు?

ప్రజలు తమను తాము రాజకీయ చైతన్యం ఉన్న వారిగా అభివర్ణించుకుంటారు. ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా ఏమిటో చూపిస్తామని బీరాలు పలుకుతారు. ఎన్నికల ముందు రాజకీయ నాయకులు నిర్వహించే సభలు, సమావేశాల సమయంలోనూ తెలివిగలవారిగా ప్రవర్తిస్తున్నామని భ్రమపడుతుంటారు. పోలింగ్‌కు కొద్ది గంటల ముందు నిఘా నేత్రాలకు దూరంగా, చాటు మాటు పంపిణీల వ్యవహారం ప్రారంభమయ్యే వరకూ వారిలో ఇదే ధోరణి కొనసాగుతుంది. ఇక ఆ తరువాత నాయకుల తరఫున రంగంలోకి దిగిన కొన్ని శక్తిమంతమైన మూకలు నేరుగా ముఖాలపై చిమ్మే హైపవర్ విద్యుత్ వెలుగులకు కళ్లు బైర్లు కమ్మి ఎన్నికలు ముగిసే వరకూ కళ్లెదుట ఏం జరుగుతుందో తెలుసుకోలేని కృత్రిమ అంధత్వంలో మునిగిపోతారు. ఎప్పటిలాగే చేయి పట్టి నడిపించే ఏదో అజ్ఞాత శక్తికి తమ తెలివిని, అప్పటి దాకా చెప్పుకున్న రాజకీయ చైతన్యాన్ని తాకట్టు పెట్టి అచేతనంగా, అనాలోచితంగా ఓటు హక్కు వినియోగించుకుంటారు. బలమూ బలగమున్న పార్టీలు ఎప్పటిలాగే గెలిచి, అధికార పీఠం అందుకుంటాయి. నాయకుల పుణ్యమా అని రాజకీయాల మత్తుకి అలవాటైన ప్రజలు ఎన్నికల అధ్యాయం ముగిసిన తరువాత చర్చోపచర్చలకు, విశ్లేషణలకు తెర తీస్తారు. గెలుపోటములపై పోస్ట్‌మార్టం ప్రారంభిస్తారు. ఫలానా పార్టీ గెలిచిందని, ఫలానా పార్టీ ఓడిందని, మరో పార్టీకి పాపం డిపాజిట్లు కూడా దక్కలేదని అమాయకంగా మాట్లాడుకుంటారు. ఈ తతంగమంతా దశాబ్దాల నుంచి సాగుతున్నదే. ఈ ప్రక్రియలో ఎటువంటి మార్పు కనిపించదు. అధికార పీఠాన్ని అందుకోవాల్సిన పార్టీలు ప్రజల మానసిక స్థితికి, సామర్థ్యానికి తగ్గట్టుగా పథక రచన చేస్తుంటాయి. పీఠాన్ని అందుకుంటాయి. అలాగే, పరాజయం పాలయిన పార్టీలు మళ్లీ అవకాశం రాకపోతుందా అని ఐదేళ్లపాటు నిరీక్షిస్తూనే ఉంటాయి.

అయితే, పీఠమెక్కే పార్టీలు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా, కలలు సాకారం కాక, ఆశలు నెరవేరక ఓట్లేసే ప్రజలు మాత్రం ప్రతిసారీ ఓడిపోతూనే ఉన్నారు. ఒకసారి, రెండుసార్లు కాదు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఈ ఓటమిని ఎదుర్కొంటూనే ఉన్నారు. అదెలా అంటే.. ఉపాధితో ఊరటనిస్తామని ఆశపెడుతున్న జాబ్ క్యాలెండర్లు ఎండమావిలా మారిపోతుండడంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఓడిపోతున్నారు. ఇక త్వరలోనే మెగా డీయస్సీ అన్న ప్రభుత్వ ప్రకటనలు నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా అమలు కాకపోవడంతో రేపటి గురువులు నిరాశకు గురై, చివరికి సర్కారు ఎత్తుగడల ముందు ఓడిపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలకు, తమకు మధ్య అనుకోకుండా వచ్చి చేరుతున్న దళారీల నుంచి ఈసారైనా తప్పించుకోగలమని, తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతుందా అని తమకు తామే ధైర్యాన్ని నూరిపోసుకుంటున్న రైతన్నలు ప్రతి యేటా యథావిధిగా ఓడిపోతూనే ఉన్నారు. దేశంలో సుమారు డెబ్బై శాతం మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకుంటున్న వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు దశాబ్దాలు గడుస్తున్నా ప్రతిపాదన దశ దాటక వ్యవసాయానికి మదుపులు పెట్టలేని రైతులు ఖరీఫ్‌లోను, రబీలోను ఓడిపోతూనే ఉన్నారు.

విద్యుత్‌లో రాయితీలు ఇస్తే పరిశ్రమల మనుగడ సుసాధ్యమవుతుందని, తమ బతుకులు బాగుపడతాయని ఎదురు చూస్తున్న కార్మికులు రాయితీలు, విద్యుత్‌లో ప్రత్యేక టారిఫ్‌లు వర్తించక ఓడిపోతూనే ఉన్నారు. సంవత్సరాల తరబడి ఓపీఎస్ అమలు కోసం ఎదురుచూస్తూ పోరాటం సాగిస్తున్న సీపీఎస్ బాధిత ఉద్యోగులు ఓడిపోతూనే ఉన్నారు. అరాచకశక్తుల అండతో బహిరంగంగా నడి రోడ్లపై సంచరించే నరరూప రాక్షసుల నుంచి తమను రక్షించడానికి, దిశ, పోక్సో వంటి కొత్త చట్టాలున్నాయని, ఈసారైనా అవి మరింత బలంగా అమలవుతాయని, తాము ధైర్యంగా బయట తిరగగలమన్న ఆడపిల్లలు, చట్టాలను అమలు చేసే ధైర్యం లేని కొంతమంది చేతకాని బ్యూరోక్రాట్ల సాక్షిగా నిత్యం ఓడిపోతూనే ఉన్నారు. ప్రతి నెలా చేతికందే వేతనానికి తగ్గట్టుగా బడ్జెట్ తయారు చేసుకొంటూ ఉప్పు, పప్పులూ వంటి నిత్యావసరాల ధరలు ఇకనైనా అందుబాటులోకి వస్తాయని ఆశపడుతున్న సగటు వేతన జీవి, సంచి పట్టుకొని మార్కెట్‌కి వెళ్లిన ప్రతిసారి ఓడిపోతూనే ఉన్నాడు.

ఇలా అడుగడుగునా ఓటమి తప్ప గెలుపు రుచి చూడని సామాన్య జనం చివరికి ఓటమిని అలవాటుగా మార్చేసుకుంటున్నారు తప్ప, మాట తప్పుతున్న నాయకుణ్ణి ఇంటి ముఖం పట్టించడానికి ఇష్టపడడంలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడతామని, చేతిలో చెయ్యేసి, ఓట్లేయించుకుంటున్న నాయకులు ఎప్పుడు మారతారు? సామాన్య జనాన్ని ఎప్పుడు గెలిపిస్తారు?

– డొంకాడ గోపాల్

ఇప్పుడు వీస్తున్న గాలి

రేపటి ప్రపంచం కోసం
వాడు మాటల విత్తనాలు నాటుతుంటాడు
మాటలు మాటలుగా మాత్రమే కాక
దృశ్యాలుగా మారాక
మొన్నటి, నిన్నటి, నేటి మాటలన్నీ
కలగాపులగంగా నిన్ను గందరగోళ
పరుస్తుంటాయి ఆశల విత్తనాల్లోంచి
మొలిచే మొక్కలు
పిచ్చి మొక్కలై చిట్టడవిని తలపిస్తుంటాయి
ఏ తిప్పతీగ నీకు ఉరితాడవుతుందో
తెలియక భయం భయంగా దిక్కులు
చూస్తుంటావు

దినుసులన్నీ కలిపి చేసిన వంటకంలో
ఎక్కడో కొంచెం
రక్తం పాలు ఎక్కువవుతుంది
తనివి తీరని శవదాహం
వాడిని రాజాధిరాజును చేస్తుంది

రంగస్థలం మీది నాటకంలో
పాత్రలన్నీ కంగాళిగా కీచులాడుతుంటాయి
అమ్మ, నాన్న, అన్న, చెల్లి, కొడుకు, భార్య
ఇంకా ఎవరెవరో
సొంత ముఖాల్ని దాచేసుకుని
పరాయి ముఖాలతో
ప్రదర్శన రక్తి కట్టిస్తుంటారు
కాలిన పేగుల కంటిన
దృశ్యాల మీద చల్లిన
రంగులు వెలిసిపోతుంటాయి
పాత ముఖాల స్థానంలో
మాట్లేసిన కొత్త ముఖాలు
వేదికలనలంకరిస్తుంటాయి

శవాల మీద నాటిన
శంకుస్థాపన రాళ్ల చుట్టూ
చెదల పుట్టలు నిలువెత్తున లేస్తాయి

పుళ్లుపడ్డ రోడ్లు / ఎవరైనా వచ్చి
మాసిన గుడ్డలతో కట్టు కట్టకపోతారా
అని ఎదురు చూస్తుంటాయి

సమూహాల మధ్య
వాడంటించిన అగ్నిని
గోడలకు వేలాడే తెరలు ఎగదోస్తుంటాయి
గోడలే కాదు
చేతులూ అబద్ధాల ప్రచారంలో
తమను తాము
పునీతం చేసుకుంటుంటాయి

ఏనుగు అంబారీ మీద ఎక్కిన
బలిష్ఠుడైన వాడెవడో
ఆకాశంలోకి మణిమాణిక్యాలు
విసురుతుంటాడు దొరుకుతుందో లేదో
తెలియని దానికోసం
చుట్టూ నిరంతరం ఓ తొక్కిసలాట

నిన్నటి ఇంట్లోంచి బయటకు వచ్చినవాడు
ఆ ఇంటిపై అశుద్ధాన్ని విసురుతుంటాడు
మనుషులు ఓట్ల వస్తువులుగా
మారిపోయాక ధరవరలు
ఎప్పటికప్పుడు సవరించబడతాయి
తనను తాను అమ్ముకున్న ఓటు
మీట నొక్కిన మరుక్షణమే వ్యర్థమైపోతుంది.

– బండ్ల మాధవరావు

చిచ్చుమాటల వెనుక చర్చనీయాంశాలు!





■ కె. శ్రీనివాస్

సందర్భం

ప్రచారం అన్న మాట వినడానికి ఎంతో పవిత్రంగా, అమాయకంగా కనిపిస్తుంది. ఇప్పుడు వ్యాపిస్తున్న మాటల కాలుష్యాన్ని ఎన్నికల ప్రచారం అనడం చాలా అన్యాయం. ఒకరిని లేదా ఒక విషయాన్ని పైకెత్తడానికి గానీ, కిందికి తోసేయడానికి కానీ, నిజాలను కానీ, వదంతులనుకానీ, అబద్ధాలని కానీ ప్రచారంచేయడాన్ని ఇంగ్లీషులో ప్రాపగాండా అంటారు. ఊదరగొట్టడం అంటే దగ్గరగా ఉంటుంది. ఈ కళలో ఆరితేరిన, పేరుమోసిన వారు చరిత్రలోను, వర్తమానంలోనూ అనేకులున్నారు. అటువంటి ఒక ఘనాపాటి ప్రకారం, బాగా ప్రభావం వేసే వాదనలను పదే పదే వినిపించడమే ఈ ఊదరకళకు ఊపిరి. అట్లాగని, మెత్తగా, గంభీరంగా ఉండే మాటలు మాట్లాడితే ఉపయోగం లేదు. మనం మాట్లాడేది మేధావుల కోసం కాదు. మేధావులను మనం మార్చలేం, మార్చక్కరలేదు కూడా, కాస్త నోరు పెంచామంటే వాళ్లే లొంగిపోతారు. మనం గురిపెట్టాల్సింది రోడ్లమీద కనిపించే అతి సామాన్యుడిని. మన వాదనలు బాగా మొరటుగా ఉండాలి, సులువుగా అర్థం కావాలి, చాలా పదునుగా ఉండాలి. వాడి బుర్రకి కాదు, మనసుకి, ఆవేశాలకి, సహజాతాలకి తాకేటట్టు మాట్లాడాలి. సత్యం మాట్లాడాలని పట్టింపు అక్కరలేదు. మన ఎత్తుగడలకు, మానసిక తంత్రానికి ఉపయోగపడకపోతే, నిజాలతో మనకు పనిలేదు. నమ్మదగినట్టుగా అబద్ధాలు మాట్లాడాలి. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న ఏమన్నాడంటే, చిన్నా చితకా అబద్ధాల వల్ల ఉపయోగం లేదు. అటువంటివి అందరూ మాట్లాడతారు. పెద్ద, అతి పెద్ద, భారీ అబద్ధం ఆడాలి, దాన్ని పదే పదే వల్లె వేయాలి. అబద్ధం మీద ఆధారపడే పాలనలో, సత్యమే రాజ్యానికి అతి బద్ధశత్రువు. ఈ ఊదర అసత్యవాదం ఎన్నికల సమయంలోనే వ్యాపించి ఉంటుందనుకుంటే పొరపాటు. ప్రచారం లేకుండా ప్రభుత్వాలే ఉండవు. ప్రజలకెప్పుడూ ఏదో నూరిపోయకుండా పాలకులకు గడవదు.

లాక్కుని పంచేస్తారు, వాళ్లది తీసుకుని వీళ్లకు ఇచ్చేస్తారు, మంగళసూత్రాలు ఎత్తుకుపోతారు, వంటి ప్రచారానికి చప్పట్లు ఎక్కువ పడుతున్నాయో, అంతకు మించి మరో కొత్తమంత్రం దొరకలేదో ప్రధానమంత్రి, ఆయన సహచరులు రెండో దశ పోలింగ్ తరువాత కూడా అదే హోరును మరింత జోరుతో సాగిస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు కూడా ఏమీ తక్కువ తినలేదు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు దగ్గర మొదలైన హెచ్చరిక, రిజర్వేషన్లు అన్నీ రద్దు చేస్తారు దాకా విస్తరించింది. సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధికారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడుతున్నారు. ప్రత్యర్థుల బూచీకరణ ఈ సారి ఎన్నికలలో ఒక విశేషం. ఉభయపక్షాలు, పరస్పరం చేసుకుంటున్న నిందారోపణల ప్రాతిపదిక మీదనే ఈ భయప్రచారం సాగుతున్నది. ప్రజల సంపదనంతా తీసుకుని, పునఃపంపిణీ చేస్తుందని, ప్రధానంగా ముస్లిములకు బట్వాడా చేస్తుందని మోదీ చేస్తున్న ప్రచారం ఆశ్చర్యకరమైనది, బలహీనమైన ఆధారాలకు విచిత్రమైన అన్వయాలను ఇవ్వడం ద్వారా నిర్మించిన వాదన అది. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి అట్లా మాట్లాడడం ఇప్పటికీ మింగుడుపడని వారున్నారు. కానీ మొరటు మాటలను పదే పదే వల్లించడంలో కలిగే సదుపాయం వేరు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చేస్తారని, ప్రజాస్వామ్యం పూర్తిగా బలహీనపడుతుందని, ఇకపైన ఎన్నికలే ఉండవని కాంగ్రెస్ చాలా కాలంగా అంటున్నది. బీజేపీ రెండుదఫాల పాలన ఆధారంగా, ఆ పార్టీ సామాజిక విశ్వాసాల ఆధారంగా చేస్తున్న భవిష్యత్ అంచనా అది. రాజకీయసైద్ధాంతిక అంచనా. రోడ్డుమీది సామాన్యుడికి కూడా అందడానికి వీలుగా, మొత్తంగా రిజర్వేషన్లే రద్దు అవుతాయని ఆ వాదనను మెరుగుపరిచి, కాంగ్రెస్ ప్రచారంలో పెట్టింది.

అధికారం కోల్పోతామేమోనన్న భయమో, అధికారం దక్కించుకోవాలన్న ప్రయత్నమో, పార్టీల చేత ఉద్వేగపూరితమైన అధమస్థాయి ప్రచారానికి ప్రేరేపిస్తూ ఉండవచ్చు. ప్రజలు ఇంతకంటె మెరుగైన అంశాలను, తమ మనుగడకు సంబంధించిన సామాజికార్థిక అంశాలను ఎన్నికల సందర్భంలో చర్చించాలని ఆశిస్తారన్నది నిజమే. అట్లాగని రిజర్వేషన్ల అంశం, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలకు సంబంధించని అంశాలేమీ కాదు. కానీ, ముస్లిమ్ రిజర్వేషన్ల అంశం ఆవేశకావేశాలు రగిలించే రీతిలో ఇంత ప్రాధాన్యం ఇవ్వవలసిన అంశమా? ప్రాధాన్యం ఇస్తే, సచార్ కమిషన్ సిఫారసుల ప్రకారం న్యాయమైన సానుకూల చర్యలను పార్టీలు ప్రతిపాదించాలి. కానీ జరుగుతున్నదేమిటి? ముస్లిములందరికీ రిజర్వేషన్లు కల్పించే కర్ణాటక నమూనాను విమర్శించడంలో ఒక వాదన ఉన్నది. మొత్తంగా ఒక మతవర్గానికి రిజర్వేషన్లు కల్పించడం మతప్రాతిపదిక రిజర్వేషన్లు అవుతాయి. మరి తెలంగాణలో కూడా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని అంటున్నారు. తెలంగాణలో ముస్లిములలోని కొన్ని వెనుకబడిన శ్రేణులకు వెనుకబడిన తరగతులలో భాగంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. మరి అవి మతప్రాతిపదిక రిజర్వేషన్లు కావే? మరి ప్రధానమంత్రి వాదన మతప్రాతిపదిక రిజర్వేషన్లకు వ్యతిరేకంగానా? ముస్లిములకు వ్యతిరేకంగానా? ఈ చర్చ అంతా ఒక విభజన వాతావరణానికి ఆస్కారం ఇచ్చి, ఉద్వేగాల మీదికి దారిమళ్లిస్తుంది. దేశవనరుల మీద మొదటి హక్కు అట్టడుగు వర్గాలకు ఉంటుందన్నది అందరూ అంగీకరించవలసిన అంశం. మన్మోహన్ సింగ్ అన్నమాటలను ఇవాళ తప్పుపడుతున్నది కానీ, ఇరవయ్యేళ్ల నుంచి బీజేపీ సిద్ధాంతంగాను, పదేళ్లుగా ప్రభుత్వ విధానాల్లో ఒకటిగాను ఉన్న 'అంత్యోదయ' అర్థం ఏమిటి? చిట్టచివరన ఉన్నవారికి కూడా అభివృద్ధిఫలాలు అందడమే కదా? ఆ అట్టడుగు వర్గాలలో ముస్లిములు ఉండకూడదంటే, వారిలో వెనుకబాటు లేదని శాస్త్రీయంగా నిరూపించాలి.

నిజానికి, సంపద పునఃపంపిణీ వాదవివాదాల సరుకు కాకుండా, మంచి ప్రయోజనాత్మకచర్చకు, నిర్మాణాత్మక ఫలితాలకు పనికివచ్చే అంశం. ఇంతకూ భారతీయ జనతా పార్టీ పేదరికం నిర్మూలన గురించి, ఆర్థిక అంతరాల తగ్గింపు గురించి ఏం మాట్లాడుతుంది? కాంగ్రెస్ గురించి మనకు తెలుసు. సోషలిస్టు భావాలను ప్రకటించడం, గరీబీ హటావో నినాదాలు ఇవ్వడం, ప్రణాళికా అభివృద్ధి విధానం వంటి చరిత్ర ఉన్నది. మరి బీజేపీకి? నియంత్రిత ఆర్థిక వ్యవస్థను వారు ఇష్టపడలేదు. ప్రైవేటు రంగానికి ఎక్కువ అవకాశాలు కోరుకున్నారు. స్వేచ్ఛామార్కెట్‌కు అనుకూలురు. స్వదేశీ విధానాన్ని మొదట్లో ప్రచారం చేసేవారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తగా ప్రసిద్ధులయిన ఎం.ఎస్. గోల్వాల్కర్ ఆలోచనల గుచ్ఛం 'పాంచజన్యం'లో దేశంలో పేదరికం నిర్మూలనకు, కులనిర్మూలనకు ప్రాధాన్యం లేదు. పెట్టుబడిదారీ విధానాన్ని, సోషలిజాన్ని రెంటిని వ్యతిరేకించినవారు గోల్వాల్కర్. శ్రమకు తగ్గ గౌరవం ఇస్తే, పేదరికం సమస్యే కాదన్నట్టు ఆయన రాశారు. పశ్చిమదేశాల్లోని జాతీయవాదాన్ని, ప్రాదేశిక జాతీయవాదాన్ని కూడా ఆయన నిరాకరించారు. బీజేపీ అధికార విధానాల్లో కనిపించే సాంస్కృతిక జాతీయవాదం మూలాలు తొలినాటి ఆర్ఎస్ఎస్ సిద్ధాంత సంపుటులలో ఉన్నాయి. నెహ్రూ, ఇందిర ఆర్థికరంగంలో చేసిన హడావిడి వల్ల, తమకూ ఒక ఆర్థిక విధానం కావాలనుకుని, 1980లో భారతీయ జనతాపార్టీగా అవతరించినప్పుడు, గాంధేయ సోషలిజాన్ని ఆర్భాటంగా స్వీకరించారు. కానీ, 1984 ఎన్నికల్లో నిరాశ తరువాత, అద్వానీ ప్రాచుర్యం పెరిగాక ఆ నినాదం క్రమంగా తెరమరుగైంది. కానీ, 2005లో కూడా గాంధేయ సోషలిజం గురించి వాజపేయి సానుకూలంగా మాట్లాడారు. ఇప్పుడు గాంధీ గురించి సానుకూలంగా మాట్లాడేవారే ఆ పార్టీలో తగ్గిపోయారు. గాంధీజీ ప్రకారం, సంపన్నులు తాము ప్రజల ఆస్తికి ధర్మకర్తలుగా వ్యవహరించాలి, తమ గౌరవప్రదజీవనానికి సరిపడా తప్ప, తక్కిన ధనం మీద తమకు హక్కులేదని, అది అందరి యోగక్షేమాల కోసం ఖర్చుచేయాలి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు తప్పుపట్టిన ఈ భావనను, ఆర్ఎస్ఎస్ కూడా ఆనాడు తప్పుపట్టింది. వినోబాభావే భూదాన ఉద్యమాన్ని కూడా గోల్వాల్కర్ విమర్శించారు. రాజభరణాల రద్దును, భూసంస్కరణలను ఆనాటి జనసంఘం వ్యతిరేకించింది. సంపద పునః పంపిణీ భావన ఏ రూపంలో ఉన్నా సిద్ధాంత స్థాయిలో బీజేపీ, దాని పరివారం వ్యతిరేకిస్తూ వచ్చాయి.

అట్లాగని, ప్రభుత్వాలు పునఃపంపిణీని ఏ రూపంలోనూ అమలు చేయడం లేదా? పేదల నుంచి భూములు లాక్కుని నీటి ప్రాజెక్టులు, రహదారులు కట్టడం లేదా? వారి వ్యక్తిగత ఇచ్ఛతో నిమిత్తం లేకుండా, సమష్టి ప్రయోజనం కోసమని వనరులను స్వాధీనంచేసుకోవడం లేదా? అడవుల మీద ఆదివాసులను తొలగించి, కార్పొరేట్లకు స్వాగతం చెప్పడం లేదా? తాము అవసరం అనుకున్న సందర్భాలలో, ప్రజలనుంచి లాక్కుని, ఇతరులకు అప్పగించడం జరుగుతూనే ఉన్నది. ఆస్తి హక్కు రక్షణ అన్ని వర్గాలకు సమానం కాదు. స్విస్ బ్యాంక్‌లో నల్లధనాన్ని రప్పించి ప్రజలకు పంచుతానన్న నరేంద్రమోదీ, మాటవరసకైనా, చేయాలనుకున్నది పునః పంపిణీయే కదా? ప్రభుత్వాలు చెప్పుకునేదాని ప్రకారం, వ్యాపారాలమీద, ఆర్జనల మీద వేసే పన్నులన్నీ సమాజంలో ఆర్థిక సమతూకం దెబ్బతినకుండా ఉంచడం కోసమే. ఎవరిదగ్గర నుంచో లాక్కుని తమకు ఇవ్వమని ప్రజలు అడగరు. అట్లా అడిగితే, ఎంత లాక్కున్నా తరగని సంపదలున్నవారి నుంచి తీసుకుని ఇవ్వమని చెబుతారు. ప్రజల దృష్టి అటువంటి ఆర్థిక దిగ్గజాల వైపు పడకుండా, ప్రజలలో ఒక వర్గం పేదల నుంచి మరో పేదల వర్గం అపహరించడం గురించి నాయకులు మాట్లాడతారు.

సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధికారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడుతున్నారు.

నరేంద్రమోదీ మంగళవారం నాడు తెలంగాణలో మాట్లాడుతూ, రాజ్యాంగం అంటే తనకు గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ఉద్వేగపూరితంగా అన్నారు. తాను జీవించి ఉండగా, ముస్లిములకు రిజర్వేషన్లు దక్కనివ్వనని ఎంత నిశ్చయంతో చెప్పారో, రాజ్యాంగాన్ని కాపాడతానని కూడా అంతే బలంగా చెప్పారు. ఆచరణలో ఏమి జరిగినా, జరగకపోయినా, నాయకులు ఎక్కడో ఒకచోట మాట ఇవ్వవలసిరావడం వాంఛనీయం. ప్రజలు ఈ ఊదరవాదనలను వింటూ, పాలూనీరూ వేరుచేసి, ఎవరు ఏ ఉద్దేశ్యంతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహిస్తున్నారనే భావించాలి. కృత్రిమంగా రాజేస్తున్న అగ్గిమంటలను ఖాతరు చేయకుండా, దేశరాజకీయ వాతావరణం గుంభనంగా కనిపిస్తున్నది, మరి!

ఈ చర్చ అంతటి వల్ల ఉపయోగం కూడా ఉంటుంది. నరేంద్రమోదీ మంగళవారం నాడు తెలంగాణలో మాట్లాడుతూ, రాజ్యాంగం అంటే తనకు గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ఉద్వేగపూరితంగా అన్నారు. తాను జీవించి ఉండగా, ముస్లిములకు రిజర్వేషన్లు దక్కనివ్వనని ఎంత నిశ్చయంతో చెప్పారో, రాజ్యాంగాన్ని కాపాడతానని కూడా అంతే బలంగా చెప్పారు. ఆచరణలో ఏమి జరిగినా, జరగకపోయినా, నాయకులు ఎక్కడో ఒకచోట మాట ఇవ్వవలసి రావడం వాంఛనీయం. ప్రజలు ఈ ఊదరవాదనలను వింటూ, పాలూనీరూ వేరుచేసి, ఎవరు ఏ ఉద్దేశ్యంతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహిస్తున్నారనే భావించాలి. కృత్రిమంగా రాజేస్తున్న అగ్గిమంటలను ఖాతరు చేయకుండా, దేశరాజకీయ వాతావరణం గుంభనంగా కనిపిస్తున్నది, మరి!

నేర చరితులను ఓడిద్దాం

నేటి మన రాజకీయ నాయకులను చూస్తుంటే ముఖ్యంగా వారి మనస్తత్వాలు ఎంతగా కలుషితమయ్యాయో అర్థమవుతుంది. ఇంగిత జ్ఞానం కొరవడి సభ్యతాసంస్కారాలు మరచి ఒకరి మీద ఒకరు నిరాధార ఆరోపణలు చేసుకోవడం, బురద జల్లుకోవడం, మతం పేరిట, కులం పేరిట రాజకీయాలు చేయడం, ఆవేశకావేశాలు రగిలించడం అనవాయితీగా మారిపోయింది. ఇటువంటి వారి భరతం పట్టాలంటే రెండే రెండు మార్గాలు. ఒకటి– కఠినమైన చట్టాలు రూపొందించి అమలుచేయడం. రెండు– ఓటుతో వేటు వేయడం. అవినీతి, హత్యలు, దోపిడీలు, ఉగ్రవాద కేసుల్లో నిందితులైనవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకొనే కఠిన చట్టాలు రాకపోవడమే ప్రధాన కారణం. నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు ఎన్నికల్లో పోటీచేసే వీలు లేకుండా చూడాలి. ఒకవేళ చట్టం ఆ పని చేయకపోతే ఓటర్లే తమ ఓటుతో అభ్యర్థిని సాగనంపాలి. అలాగే తమ పార్టీ ప్రణాళికల్లో భాగంగా ఎన్నికలవేళ ఇచ్చిన హామీలను తీరా గెలిచాక అమలుచేయని పార్టీలను నాయకులను నమ్మకద్రోహం, మోసం కింద శిక్షించేలా చట్టాలు తీసుకురావాలి. అలాగే ఒక పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థి, తర్వాత వేరే పార్టీలోకి ఫిరాయిస్తే సదరు అభ్యర్థి ఓటర్లను మోసం చేసినట్టే. అటువంటి అభ్యర్థిని శిక్షించాలి. చట్టసభల్లో నేరచరితులు పూర్తిగా కనుమరుగైనప్పుడే ఈ దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడిన త్యాగమూర్తుల ఉదాత్త ఆశయాలు నెరవేరేది. సమయం రానే వచ్చింది. అందరం కలిసికట్టుగా మంచి నాయకులను ఎన్నుకొనే దిశలో నేరచరితులను ఓడిద్దాం.

– తూలుగు రమణారావు
శ్రీకాకుళం

వ్యవస్థల్ని ధ్వంసం చేసిన జగన్ పాలన

'హౌ డెమొక్రసీస్ డై: వాట్ హిస్టరీ రివీల్స్ అబౌట్ అవర్ ఫ్యూచర్' అనే గ్రంథంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన స్టీవెన్ లెవెస్కీ అనే సామాజిక శాస్త్రవేత్త ప్రపంచంలో ప్రజాస్వామ్యం ఏ విధంగా మరణశయ్యపై ఉందో విస్పష్టంగా వివరించారు. ప్రజల ఓట్లతో ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన నాయకులే ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా తయారవుతున్నారని పరిశోధనాత్మకంగా నిరూపించారు. రాజ్యాంగబద్ధ పదవులను అనుభవిస్తూ వ్యవస్థలను ఏ విధంగా ఖూనీ చేస్తున్నారో, ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వాలు ఏ విధంగా నిరంకుశపాలన సాగిస్తాయో కూడా వివరించారు. లెవెస్కీ బయటపెట్టిన విస్మయం గొలిపే వాస్తవాలు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి సాగించిన ఐదేళ్ల పాలన పరిశీలిస్తే సరిగ్గా సరిపోలుతాయి. జగన్‌రెడ్డి పాలన ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేసింది. ప్రతిపక్షాల మనుగడే ఉండకూడదన్న నిరంకుశ పాలనను తెలుగు ప్రజలు తొలిసారి చూశారు.

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు జగన్‌రెడ్డి నియంత పాలన చేశారు. అధికార పార్టీ పేరుతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు సామాన్య ప్రజలపై దమనకాండ కొనసాగించారు. అరాచక శక్తులు పేట్రేగిపోయాయి. అక్రమ నిర్బంధాలను అరికట్టాల్సిన పోలీసులే అక్రమంగా అర్ధరాత్రుళ్లు పౌరులను అపహరించుకుపోయిన ఘటనలు కోకొల్లలు. గతంలో ఎన్నడూ లేనంతగా తమ వారి ఆచూకీ తెలపాలంటూ ఈ ఐదేళ్లలో వేలాది హెబియస్ కార్పస్ పిటిషన్లు కోర్టుల్లో నమోదయ్యాయి. ప్రజా సమస్యలపై పోరాడేందుకు రాష్ట్రం నడిబొడ్డున విజయవాడలోని ధర్నా చౌక్‌ను రద్దు చేశారు. దళితులపై 11 వేలు, బీసీలపై 6500, గిరిజనులపై 1725 దాడులకు పాల్పడ్డారు. 30 వేల మందికి పైగా మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారు. సామూహిక ఆత్మహత్యల్లో 2020లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అబ్దుల్ సలాం లాంటి 46 కుటుంబాలు 2020లో జగన్‌రెడ్డి దాష్టీకానికి బలైపోయాయి. జగన్‌రెడ్డి ప్రభుత్వ టెర్రరిజానికి ఇది పచ్చి సాక్ష్యం.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంలో రైతులకు–ప్రభుత్వానికి జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించారు. ప్రభుత్వం అమరావతి రైతుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించింది. ఆరు వేల మందికి పైగా రైతులపై అక్రమ కేసులు నమోదు చేసింది. పోలీసు వ్యవస్థ అధికార పార్టీ ప్రైవేటు సైన్యంగా తయారైంది. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు, ఆ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు.

ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలను, అసంబద్ధ ఉత్తర్వులను రద్దు చేశారన్న అక్కసుతో న్యాయవ్యవస్థపై సోషల్ మీడియా వేదికగా వైసీపీ ప్రభుత్వ పెద్దలు దాడికి దిగారు. న్యాయమూర్తులను దుర్భాషలాడారు. ఎంపీలు, మంత్రులు సైతం న్యాయవ్యవస్థ గురించి నోటికొచ్చినట్టు మాట్లాడారు. ఒక ఎమ్మెల్సీ న్యాయస్థానాలు జగన్ వెంట్రుక కూడా పీకలేవని దూషించారు. ఒక కేబినెట్ మినిస్టర్ 'న్యాయమూర్తుల కాల్ డేటా' బయటపెట్టాలన్నారు. సాక్షాత్తూ సీఎం జగన్.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై నిరాధార ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వంపై 12 వేలకు పైగా కోర్టు ధిక్కరణ కేసులు ఉన్నాయంటే ఎంతలా చట్టవ్యతిరేక పాలన సాగించారో అర్థం చేసుకోవచ్చు.

కొవిడ్ మహమ్మారి కారణంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ 2020 మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసిన సందర్భంలో

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు జగన్‌రెడ్డి నియంత పాలన చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు సామాన్య ప్రజలపై దమనకాండ కొనసాగించారు. అరాచకశక్తులు పేట్రేగిపోయాయి. అక్రమ నిర్బంధాలను అరికట్టాల్సిన పోలీసులే అక్రమంగా అర్ధరాత్రుళ్లు పౌరులను అపహరించుకుపోయిన ఘటనలు కోకొల్లలు. గతంలో ఎన్నడూ లేనంతగా తమ వారి ఆచూకీ తెలపాలంటూ ఈ ఐదేళ్లలో పెద్ద సంఖ్యలో హెబియస్ కార్పస్ పిటిషన్లు కోర్టుల్లో నమోదయ్యాయి.



అధికార పార్టీ నేతలు ఎన్నికల కమిషనర్‌ను దుర్భాషలాడారు. తనకు అనుకూల నిర్ణయం తీసుకోలేదని ముఖ్యమంత్రి స్వయంగా ఎస్ఈసీపై తీవ్రంగా దాడి చేశారు. శాసనసభ స్పీకర్, వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎస్ఈసీపై అవమానకర వ్యాఖ్యలు చేశారు. పాలక వైసీపీ ప్రభుత్వం నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని ఎస్ఈసీ కేంద్ర హోం కార్యదర్శికి, రాష్ట్ర గవర్నర్‌కు లేఖ రాసుకోవాల్సి వచ్చింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–కె కింద ఏర్పడ్డ రాజ్యాంగ సంస్థ ఎస్ఈసీ అస్తిత్వంపైనే దెబ్బకొట్టాలని చూశారు.

పత్రికలు, టీవీ ఛానెళ్లపై ఉక్కుపాదం మోపేందుకు 2007లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో నెం.938 తీసుకొచ్చారు. తండ్రి వారసత్వం కొనసాగింపుగా జగన్‌రెడ్డి 2019లో జీవో నెం. 2430 తీసుకొచ్చారు. ఈ రెండు జీవోల ప్రధాన ఉద్దేశం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. ఏబీఎన్, టీవీ–5, ఈ–టీవీ లాంటి ఛానళ్లపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ఆ ఛానళ్ల ప్రసారాలు నిలిపేయాలంటూ ఎంఎస్‌ఓలపై ఒత్తిడి తెచ్చారు. కేవలం జగన్‌రెడ్డి కుటుంబ టీవీ ఛానల్స్, పత్రిక, ఆయనను సమర్థించే టీవీలను మాత్రమే ప్రజల చూడాలి, వినాలి, చదవాలనే దుర్బుద్ధితో ఇతర మీడియాలపై కుట్రలు చేస్తూనే ఉన్నారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం ఫ్రీ ఛానళ్లను నిలిపివేసే అధికారం ఎవ్వరికీ లేదు. అయినా జగన్‌రెడ్డి ప్రభుత్వం మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేసింది. ప్రసారాలను పునరుద్ధరించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ డిమాండ్ చేసినా ప్రభుత్వం మొండి వైఖరిని వీడలేదు. ప్రశ్నిస్తున్న మీడియాపై అణచివేత చర్యలకు పాల్పడుతూ కేసులు పెట్టి, దాడులు చేస్తూనే ఉన్నారు. రాజ్యాంగంలోని 19(1)(ఎ) ఆర్టికల్ ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛపై వైసీపీ ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

తన బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో వాస్తవాలను వెలికితీస్తున్న సీబీఐ అధికారులపై జగన్‌రెడ్డి రాష్ట్ర పోలీసులతో కేసులు పెట్టించారు. విచారణను తప్పుదోవ పట్టించి నిందితులను ఒకవైపు కాపాడుతూ, మరోవైపు సొంత పత్రికలో సీబీఐపైనా, బాధిత కుటుంబంపైనా విషప్రచారం చేస్తూనే ఉన్నారు. న్యాయస్థానాల పర్యవేక్షణలో జరుగుతున్న సీబీఐ విచారణను సైతం జగన్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకుంటోంది.

కేవలం రుణాలు సమీకరించుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేయడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ) ఏర్పాటు రాజ్యాంగంలోని 293(3)కు విరుద్ధం. ఈ ఆర్టికల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏదేని రుణం సమీకరిస్తే శాసనసభకు చెప్పాలి. ఆర్టికల్ 266(1) ప్రకారం దాన్ని సంచితనిధికి జమ చేసి ఖర్చు చేయాలి. రుణాల సమీకరణకు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకున్నారు. తీసుకున్న రూ.25 వేల కోట్లు అప్పులను బడ్జెట్ పుస్తకాల్లో చూపలేదు. దీనికి మద్యం ద్వారా వచ్చే అదనపు సుంకాన్ని ఎస్క్రో చేస్తూ బ్యాంకు రుణాల చెల్లింపులకు వర్తించేలా ఒప్పందాలు చేసుకున్నారు. భవిష్యత్తు ఆదాయాలను సైతం ప్రస్తుత ప్రభుత్వం తాకట్టు పెట్టడం దేశంలోనే మొదటిసారి. ఇది రాజ్యాంగంలో పేర్కొన్న రుణ నిబంధనలకు విరుద్ధం.

జగన్‌రెడ్డి ప్రభుత్వం 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలను నిరుపయోగం చేసింది. పంచాయతీరాజ్ వ్యవస్థకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. ఎన్నికల ద్వారా ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్న సభ్యులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. కేంద్రం నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 వేల కోట్లు స్థానిక సంస్థలకు తెలియకుండా దారి మళ్లించింది.

మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో కష్టపడి నిర్మించిన ప్రజాస్వామ్య విలువల పట్ల జగన్‌రెడ్డికి కనీస గౌరవం లేదన్న విషయం స్పష్టమౌతూనే ఉంది. పౌరుల ప్రాథమిక హక్కులను యథేచ్ఛగా ఉల్లంఘించడం, చట్టబద్ధ పాలనకు తూట్లు పొడవటం, రాజ్యాంగ ఉల్లంఘనలతోనే ఐదేళ్ల పాలన ముగిసింది. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యాన్ని ఊహించలేం. పౌర స్వేచ్ఛకు విలువ ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. అధికార గణం గానీ, పోలీసు యంత్రాంగం గానీ ప్రభుత్వాల ఆదేశాలను స్వతంత్రంగా అమలు చేయాలి. అంతేగానీ ప్రభుత్వ పెద్దలకు వత్తాసు పలికేలా వ్యవస్థలు పనిచేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో చట్టబద్ధ పాలన నేడు ఆందోళన కలిగించే రీతిలో ఉన్నది. ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే ఓటు తప్ప మరో మార్గం లేదు. రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించకపోతే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవడం ఖాయం.

■ డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్
రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి Click here



లోక్‌సభ ఎన్నికల కవరేజీ కోసం క్లిక్ చేయండి Click here



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి Click here



కూటమికి సంఘీభావం తెలుపుతున్న మాదిగ కుల సంఘాల ప్రతినిధులు

చంద్రబాబుతోనే మాదిగలకు న్యాయం

నమ్మించి మోసం చేసిన జగన్‌ను ఓడించాలి: మంద కృష్ణ మాదిగ

క్రోసూరు, మే 1: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయితేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ అన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరులో బుధవారం టీడీపీ కూటమి ఆధ్వర్యంలో జరిగిన మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సీఎంగా, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉంటేనే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమై మాదిగలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. అనేక సందర్భాల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ విస్మరించారని, మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీలో మాదిగ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా జగన్ మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసి మాల, మాదిగలను చీల్చాడని చంద్రబాబును జగన్ విమర్శించారన్నారు. 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేశారని తెలిపారు. దీంతో 22 వేల మందికి ఉద్యోగాలు, కొన్ని వేల మందికి ఉన్నత విద్యావకాశాలు, విదేశీ అవకాశాలు వచ్చాయన్నారు. మాదిగలకు 14 అసెంబ్లీ సీట్లు ఇచ్చిన చంద్రబాబు మరో ఇద్దరికి రాజ్యసభ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. టికెట్ల పంపిణీలో కూడా జగన్ మాదిగలను మోసం చేశాడన్నారు. కార్యక్రమంలో కృష్ణమాదిగను నరసరావుపేట లోక్‌సభ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సత్కరించారు.

కూటమికే మాదిగల మద్దతు: ఎమ్మార్పీఎస్

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), మే 1: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమికే మాదిగలు, మాదిగ ఉపకులాలు మద్దతు ఇస్తున్నట్టు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఆర్.జె.ప్రకాష్ మాదిగ తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 35సంఘాల సమన్వయంతో చేపడుతున్న రాష్ట్ర పర్యటనలో భాగంగా తాము విశాఖకు వచ్చినట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధిలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్పొరేషన్లనూ నిర్వీర్యం చేసిందని, సబ్‌ప్లాన్ నిధుల్లో రూ25 వేల కోట్లు వేరే పథకాలకు మళ్లించిందని మండిపడ్డారు.

ఫొటోలు, వీడియోల మార్ఫింగ్‌తో వ్యక్తిత్వహననం

వైసీపీ సోషల్ మీడియాపై సీఈవోకు టీడీపీ మహిళా నేతల ఫిర్యాదు

అమరావతి, మే1 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తుంటే తమ ఫొటోలు, వీడియోలను వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు మార్ఫింగ్ చేసి, మానసికంగా వేధిస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని టీడీపీ మహిళా నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. వైసీపీ వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయట్లేదని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఈవోను ఐటీడీపీ అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష, టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సందిరెడ్డి గాయత్రి, తెనాలి తెలుగు మహిళ అధ్యక్షురాలు పరుచూరి రమ్య కలిసి, గోడు వినిపించారు. తమ ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా చిత్రీకరించి, వైసీపీ సోషల్ మీడియాలో పోస్టింగ్ చేసిన ఫొటోలు, వీడియోల క్లిప్పింగ్‌లను సీఈవోకు అందజేశారు.

జగన్ గెలిస్తే.. జనం బతకలేరు: బీసీవై పార్టీ

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): జగన్ మళ్లీ గెలిస్తే.. రాష్ట్రంలో ప్రజలు బతకలేరని బీసీవై పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు చాముండేశ్వరిదేవి వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలోకి వస్తే.. మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి, పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలపై ఫిర్యాదు చేశారు. పుంగనూరులో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌పై దాడి చేసిన మంత్రి పెద్దిరెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల పొట్టగొట్టిన జగన్ ఇంటికే: యామినీ శర్మ

వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని 2047నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ చేసేందుకు 24/7 కష్టపడుతున్న ప్రధాన శ్రామికుడు నరేంద్ర మోదీని ఎన్నికల్లో ఓట్లేసి ప్రతి శ్రామికుడూ ఆశీర్వదించాలని, రాష్ట్ర ప్రగతి కోసం ఏపీలో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నాయకురాలు సాదినేని యామినీ శర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మే డే సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి దాంట్లోనూ దోపిడీకి తెరతీసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను రాజకీయ చిత్రంలో కనబడకుండా చేయాలి: రఘురామ

ఆకివీడు, మే 1: 'జగన్‌కు మళ్లీ అధికారం అప్పగిస్తే ప్రజల ఆస్తులు స్వాహా చేస్తారు. అటువంటి జగన్‌ను రాజకీయ చిత్రపటం నుంచి కనపడకుండా చేయాలి' అని నరసాపురం ఎంపీ, ఉండి టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలంలో ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. 'జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రకారం, భూసమస్య ఎదురైతే మూడు నెలల్లోపు సంబంధిత జిల్లా రెవెన్యూ అధికారిని సంప్రదించకపోతే తమ ఆస్తి నష్టపోవాల్సిందే. కూటమి అధికారం చేపట్టిన తర్వాత ఈ తల తిక్క చట్టాన్ని రద్దు చేస్తుంది' అని రఘురామ అన్నారు.

300 కేసుల మద్యం పట్టివేత

తడ, మే 1: పుదుచ్చేరి రాష్ట్రం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మద్యాన్ని సెబ్ అధికారులు పట్టుకున్నారు. తిరుపతి జిల్లా తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద బుధవారం ఉదయం లారీలో తరలిస్తున్న 300 కేసుల (14,400 క్వార్టర్ బాటిళ్లు) మద్యాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మద్యాన్ని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు తీసుకువెళ్తున్నట్లు డ్రైవర్ మహ్మద్ ఫిరోజ్ విచారణలో చెప్పినట్లు సమాచారం.

రూ.5.5 కోట్ల విలువైన ద్రవ రూప గంజాయి స్వాధీనం

చింతపల్లి, మే 1: పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన రూ.5.5 కోట్ల విలువైన ద్రవరూప గంజాయిని, మిషనరీని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామని అల్లూరి జిల్లా చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జి.మాడుగుల మండలం లువ్వసింగి పంచాయతీ అలగం గ్రామానికి చెందిన ఊలంగి ప్రకాశరావు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ ఇసుకబంధ గ్రామంలో రైతుల నుంచి గంజాయి సేకరించి అత్యాధునిక పరికరాలతో ద్రవరూపంలోకి మార్చి కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాడు. బుధవారం చింతపల్లి మండలం బలపం పంచాయతీ ఎర్రగుప్ప గ్రామంలో ద్రవరూప గంజాయి సిద్ధం చేశాడనే సమాచారంతో సీఐ కె.రమేశ్, అన్నవరం ఎస్ఐ రాజారావు సిబ్బందితో దాడులు నిర్వహించినట్టు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా 54.2 కిలోల ద్రవరూప గంజాయి, తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.


కూటమి మేనిఫెస్టో హిట్!!

వివిధ వర్గాల్లో సానుకూల స్పందన

- రేసులో వైసీపీ ఎన్నికల ప్రణాళిక వెనక్కి
- కూటమి నేతల్లో ఆనందోత్సాహాలు
- మహిళల్లో స్పందన అధికంగా ఉందంటున్న సర్వే ఏజెన్సీలు
- ఆకట్టుకుంటున్న 3 ఉచిత సిలిండర్ల హామీ
- బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా
- ప్రతి నెలా 1,500పైనా ఆసక్తి
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లలోనూ సానుకూలత
- ప్రజల్లోకి కూటమి నేతలు
- చిన్నచిన్న కరపత్రాల రూపంలో ఇంటింటి ప్రచారానికి రెడీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మేనిఫెస్టో రేసులో అధికార పార్టీని ప్రతిపక్ష టీడీపీ కూటమి వెనక్కి నెట్టేసింది. వైసీపీ మేనిఫెస్టోతో పోలిస్తే కూటమి ఎన్నికల ప్రణాళిక బాగుందని.. అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యంగా ఉందన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 'వైసీపీ కేవలం తాను అమలు చేసిన పథకాలపై ఆధారపడి ఈసారి ఎన్నికల పోరాటం నడిపిస్తోంది. అంతకు మించి పేద వర్గాలకు మరింత సాయం ఇవ్వగలమన్న సందేశాన్ని ఈ మేనిఫెస్టో ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. దీంతో వైసీపీ వెనుకబడిపోయిన వాతావరణం క్షేత్ర స్థాయిలో కనిపిస్తోంది' అని టీడీపీకి చెందిన మాజీ మంత్రి ఒకరు బుధవారం మీడియా ప్రతినిధుల వద్ద వ్యాఖ్యానించారు.



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి కూటమి మేనిఫెస్టోను మంగళవారం ఇక్కడ విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. దీనికి నాలుగు రోజుల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎన్నికల సమరం తీవ్రంగా ఉండడంతో.. వైసీపీ మేనిఫెస్టోలో పెట్టబోతున్నారంటూ కొన్ని హామీలను ఆ పార్టీకి అనుకూలంగా ఉండే సామాజిక మాధ్యమాల బాధ్యులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కానీ జగన్ విడుదల చేశాక చూస్తే అవేమీ కనిపించలేదు. సాదాసీదాగా ఉంది. పాత పథకాలనే కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రస్తావించిన కొత్త అంశాలు పరిమితంగా కనిపించాయి.

పేద మహిళల్లో చర్చ..

తమ మేనిఫెస్టోలోని వరాలపై పేద మహిళల్లో బాగా చర్చ నడుస్తున్నట్లు టీడీపీలోని కింది స్థాయి నేతలు చెబుతున్నారు. 'మేం గ్రామాల్లో వారి ఇళ్లకు వెళ్లి మేనిఫెస్టో గురించి ప్రస్తావించినప్పుడు మహిళలు తమకు తాముగా అందులో అంశాల గురించి చెబుతున్నారు. ఆ వరాలపై ఆసక్తిగా ఉండడం వల్లే అంత త్వరగా వారు స్పందిస్తున్నారు. వైసీపీ మేనిఫెస్టో విడుదలైనప్పుడు ఇటువంటి స్పందన మేం చూడలేదు' అని నంద్యాల జిల్లాలో ఒక మండల స్థాయి టీడీపీ నాయకుడు చెప్పారు. కూటమి మేనిఫెస్టో విడుదలయ్యాక కొన్ని సర్వే ఏజెన్సీలు దానిపై అప్పటికప్పుడు కొన్ని సర్వేలు చేశాయి. పేద మహిళలను కదిలించినప్పుడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతి నెలా 1,500 వరాలను ఎక్కువ మంది ప్రస్తావించారని ఒక ఏజెన్సీ ప్రతినిధి చెప్పారు. కూటమి మేనిఫెస్టో హిట్టయిందనడానికి ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం, తాడిపత్రి నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి ఇద్దరు సమీప బంధువులు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి పోటీ చేస్తున్నారు. కొందరు ధర్మవరం వైసీపీ కార్యకర్తలు తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామాల్లో పెద్దిరెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. గ్రామాల్లో రైతులకు ఏటా రూ.20 వేలిస్తామన్న టీడీపీ కూటమి వాగ్దానం ఆకర్షణీయంగా కనిపిస్తోందని, తాడిపత్రి నియోజకవర్గంలో కొందరు తమతోనే ఆ విషయం నేరుగా చెప్పారని ప్రచారంలో పాల్గొంటున్న ఒక వైసీపీ నేత చెప్పారు. వివిధ వర్గాల నుంచి సానుకూల స్పందన ఎక్కువగా వస్తుండడంతో.. దీనిని మరింతగా ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కూటమి నేతలు నిర్ణయించారు. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మేనిఫెస్టోలోని వరాలను చిన్న చిన్న కరపత్రాలుగా ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు..

వైసీపీ మేనిఫెస్టోతో పోలిస్తే కూటమి తన మేనిఫెస్టోలో పేద వర్గాలకు మరింత మెరుగైన సాయాన్ని ఇస్తామని హామీ ఇచ్చింది. ఇందులో ఆరు హామీలను టీడీపీ శ్రేణులు రాజమహేంద్రవరం మహానాడు నుంచీ ప్రచారం చేస్తున్నాయి. వాటికి తాజా మేనిఫెస్టోలో మరి కొన్ని అదనంగా జోడించారు. కేవలం పేద వర్గాలనే కాకుండా సమాజంలోని భిన్న వర్గాల ఆకాంక్షలను స్పృశిస్తూ దీనిని రూపొందించడంతో వ్యాప్తి పెరిగింది. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల గ్రూపుల్లో మంగళ, బుధవారాల్లో ఈ మేనిఫెస్టోలో తమ గురించి పేర్కొన్న అంశాలపై సానుకూల పోస్టింగులు విపరీతంగా కనిపించాయి. దీనిని సంఘాల నేతలు కూడా ధ్రువీకరిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, బ్రాహ్మణ సామాజిక వర్గానికి సంబంధించిన సామాజిక మాధ్యమ వేదికల్లో కూడా సానుకూల వ్యాఖ్యలు భారీగా దర్శనమిస్తున్నాయి.

గాజుగ్లాసు గుర్తుపై హైకోర్టు ఆదేశాలను ఈసీ తప్పుగా అర్థం చేసుకుంది

అందుకే మళ్లీ కోర్టుకు: టీడీపీ నేత వర్ల

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అర్థం చేసుకుని జనసేన పార్టీ పోటీ చేయని స్థానాల్లో, ఆ పార్టీకి కేటాయించిన గాజు గ్లాసు గుర్తును ఇంకెవ్వరికీ కేటాయించవద్దని, గాజు గ్లాసు గుర్తును ఫ్రీజ్ చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ గాజుగ్లాసు గుర్తుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్నికల సంఘం తప్పుగా అర్థం చేసుకుందన్నారు. ఎక్కడైతే జనసేన పార్టీ పార్లమెంటుకు పోటీ చేస్తుందో ఆ పార్లమెంటు పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులెవ్వరికీ గాజుగ్లాసు గుర్తు కేటాయించకూడదని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఒక పార్లమెంటు పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క స్థానంలోనైనా జనసేన పోటీ చేస్తున్నట్లయితే మిగిలిన 6 స్థానాలతోపాటు పార్లమెంటుకు పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులకు కూడా గాజు గ్లాసు గుర్తు కేటాయించకూడదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కానీ ఎన్నికల సంఘం మాత్రం కోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకుని జనసేన పోటీ చేయని ఏ స్థానంలోనైనా గాజు గ్లాసు గుర్తును ఎవరైనా కోరితే ఇస్తామని ప్రకటించిందన్నారు. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం తమకు డైరెక్షన్ ఇచ్చిందని సీఈవో చెబుతున్నారన్నారు. దీంతో తాము మళ్లీ కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. కూటమి విజయాన్ని ఆపాలని కొందరు ప్రయత్నిస్తున్నారని వర్ల ఆరోపించారు.

వైసీపీకి తొత్తులుగా అధికారులు

ఎమ్మెల్యేకు బంధువవడంతో వైసీపీకి ఓటు వేయండని అనంతపురంలో పనిచేస్తున్న డీఎస్పీ వీర రాఘవరెడ్డి బహిరంగంగా ప్రచారాలు చేస్తున్నారని, కనుక ఆయన్ను తక్షణమే ఎన్నికల విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారాలు చేస్తున్న విశాఖపట్నం వైసీపీ ఎంపీ సత్యనారాయణపై కూడా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఎవరైనా టీడీపీకి ఓటు వేస్తే ఊరినించి బహిష్కరిస్తామని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కూటమి మేనిఫెస్టోను అన్ని వర్గాలు అభినందించారని, వైసీపీ మేనిఫెస్టోను ఎవ్వరూ నమ్మడం లేదని, కనీసం పట్టించుకోవడం లేదని వర్ల అన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే కూటమికి మద్దతు: కేసన

భట్టిప్రోలు, మే 1: రాష్ట్ర ప్రజల భవిష్యత్, భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేసన శంకరరావు తెలిపారు. బుధవారం బాపట్ల జిల్లా భట్టిప్రోలులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో కూటమికి మద్దతుగా ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు చెప్పారు.

16 నుంచి ఈఏపీసెట్

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్-2024 పరీక్షలు ఈ నెల 16న ప్రారంభం కానున్నాయి. హాల్‌టికెట్లను ఈ నెల 7 నుంచి ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మండలి ఓ ప్రకటనలో తెలిపింది.

అభ్యర్థుల నేరచరిత్ర పత్రికల్లో ప్రచురించాలి

- ఆస్తుల వివరాలు కూడా...: హైకోర్టు ఆదేశం
- సంబంధిత పార్టీ వెబ్‌సైట్‌లోనూ ఉంచాలి
- సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేయాల్సిందే
- ఈసీ, రాజకీయ పార్టీలకు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సంబంధిత రాజకీయ పార్టీల అధికారిక వెబ్‌సైట్లలోనూ వివరాలు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలకు తేల్చిచెప్పింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ.... ఏపీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వివరాలను పత్రికల్లో ప్రచురించారా, లేదా అనే వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించి అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్(ఫాం-26)ను తెలుగులో అందుబాటులో ఉంచేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన ఎస్. రమేశ్‌బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత తన నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికల్లో ప్రచురించి, ఓటరుకు తెలియపర్చాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

పోలీసు వాహనాల్లో డబ్బుల చేరవేత!!

రాత్రి వేళ కరెంటు తీసేసి పంపిణీ

- అధికార పక్షానికి పోలీసు అధికారుల ఊడిగం
- విద్యుత్ శాఖ సిబ్బంది కూడా..
- విశాఖలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
- భారీవ్యయంపై కేంద్ర మంత్రి ఆరా
- మద్యం సొమ్ము వాడుతున్నారని కేంద్రానికీ సమాచారం!
- మరి అడ్డుకునే చర్యలేవీ?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోలీసులను జగన్ ప్రభుత్వం ఏ విధంగా వాడుకుంటోందో గత ఐదేళ్లుగా అందరికీ సుపరిచితమే. ఇప్పుడు ఎన్నికల వేళ.. ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో కూడా వారు అధికార పార్టీ కోసం పనిచేస్తున్నారు. ముఖ్యంగా విశాఖ నగరంలో వైసీపీ అభ్యర్థులకు, ఇతరులకు నిధులను పోలీసు వాహనాల్లోనే తరలిస్తుండడం కలకలం రేపుతోంది. ఈ సమాచారం కేంద్రానికి కూడా ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడం గమనార్హం. ఇక విశాఖ నగరంలో వైసీపీ అభ్యర్థులు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు సగటున రోజుకు రూ.20 లక్షలకుపైగా వెచ్చిస్తున్నారని సమాచారం. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కొందరికి ఆ పార్టీ నాయకత్వం తొలి విడతగా రూ.20 కోట్లు చొప్పున అందజేసిందనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధుల పంపిణీ బాధ్యతను ఒక సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు పెద్దలకు అప్పగించారు. వారిలో ఒక్కరు కూడా ప్రత్యక్ష రాజకీయాల్లో లేరు. ఒకరు ప్రముఖ ప్రభుత్వ విద్యా సంస్థలో ఉన్నత స్థానంలో ఉండగా.. మరొకరు పేరొందిన వస్త్ర వ్యాపారి. ఇంకొకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి. ప్రభుత్వ సంస్థకు సదరు వ్యక్తిని రెండోసారి ప్రభుత్వం ఛైర్మన్‌గా నియమించింది. విశాఖ జిల్లాలో ఇద్దరు అభ్యర్థులకు పార్టీ నిధులు ఇవ్వలేదు. వారిద్దరూ సొంత డబ్బే ఖర్చు చేస్తున్నారు. ఒకరేమో పది లక్షలు ఖర్చు చేసి రూ.50 లక్షలు పెట్టామని ప్రచారం చేసుకుంటుండగా.. మరొకరు రూ.50 లక్షలు వెచ్చించినా రూ.10 లక్షలు కూడా అవ్వలేదని చెబుతున్నారు. వీరి సంగతి పక్కన పెడితే.. అధిష్ఠానం పంపిన డబ్బులను అభ్యర్థులకు, ఇతరులకు చేరవేయడానికి వీరు ఏకంగా పోలీసు వాహనాలనే ఉపయోగిస్తున్నారు. అధికారపార్టీతో అంటకాగి మంచి పోస్టులు పొందిన పోలీసు అధికారుల ద్వారా పోలీసుల వాహనాల్లోనే నగరంలో ఎక్కడకు కావాలంటే అక్కడకు వీరు డబ్బులు సరఫరా చేస్తున్నారు. పోలీసుల వాహనాలను ఎన్నికల టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేయకపోవడం వల్ల వీరు సులువుగా డబ్బును పంపిణీ చేసుకోగలుగుతున్నారు. గత శుక్రవారం రాత్రి అత్యవసరంగా వన్‌టౌన్ ఏరియాకు డబ్బు తరలించాల్సి రావడంతో ఊహించని విధంగా సుమారుగా గంట సేపు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరీ పని పూర్తి చేసుకున్నారు. విద్యుత్ శాఖలో కూడా వైసీపీ నాయకులకు సహకరించేవారు ఉన్నారని దీనిని బట్టి అర్థమవుతోంది. ఈ విషయాలన్నీ ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుసుకున్న ఓ పోలీసు ఉన్నతాధికారి.. తమ శాఖ వాహనాలను కూడా ఎన్నికల విధుల్లో భాగంగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను కోరడం గమనార్హం.

ఓ అధికారి ద్వారా క్రైస్తవ ఓట్లకు గేలం!

విశాఖలో 150కి పైగా క్రైస్తవ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని ఒక పెద్ద పాస్టర్‌ను తీసుకొచ్చి ఓ విద్యా సంస్థలో కీలక పదవిలో కూర్చోబెట్టారు. అదే సంస్థలో కీలక స్థానంలో ఉన్నతాధికారి విశాఖ జిల్లాలో క్రైస్తవుల ఓట్లన్నీ అధికార పార్టీకీ వచ్చేలా మేనేజ్ చేసేందుకు ఆ పెద్ద పాస్టర్‌ను ఉపయోగిస్తున్నారు. ఆయన ద్వారా చర్చిలు, ఫాదర్లకు నిధులు పంపిణీ చేయిస్తున్నారు. వీరి వాహనాలు తనిఖీ చేసినా నిధులు దొరుకుతాయనేది విశ్వసనీయ సమాచారం.

కేంద్ర మంత్రి ఆరా

రెండ్రోజుల క్రితం కేంద్ర మంత్రి ఒకరు నగరానికి వచ్చారు. భారత్ వికసిత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు బీజేపీ నాయకులు కలిశారు. వైసీపీ నాయకులు భారీగా ఖర్చు చేస్తున్నారని ఆమె దృష్టికి కొందరు తీసుకువెళ్లగా, ఆ నిధులన్నీ అమరావతి నుంచే వచ్చాయనే మరికొందరు వివరించారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన నగదునే ఇలా ఉపయోగించుకుంటున్నారని, కేంద్రం వద్ద పూర్తి సమాచారం ఉందని ఆ మంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

వైసీపీ నేత గోదాంలో తాయిలాలు

107 చీరలు, 87 షర్ట్‌ప్యాంట్ బిట్‌లు పట్టివేత



ముక్తినూతలపాడులో ఉన్న వైసీపీ నేత గోదాములో తనిఖీలు చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

ఒంగోలు(క్రైం), మే 1: ఒంగోలు నగర పరిధిలోని వైసీపీ నాయకుడు రాయిపాటి అంకయ్యకు చెందిన గోదాంలో నిల్వ ఉంచిన 107 చీరలు, 87 జతల ఫ్యాంట్, షర్ట్ బిట్‌లను సీజ్ చేశారు. పక్కాగా అందిన సమాచారం మేరకు బుధవారం ముక్తినూతలపాడులోని వైసీపీ నేతకు చెందిన గోదాంలో నిల్వలపై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు చేసింది. వారి తనిఖీలలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు మూడు బాక్సులలో దాచి ఉంచిన చీరలు, ఫ్యాంట్, షర్ట్ బిట్‌లు దొరికాయి. ఆ చీరల పెట్టెలు, కవర్లపై సీఎం జగన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలు ఉన్నాయి. బాలినేని శ్రీనివాసరెడ్డి పేరుతో ఉన్న సంచులు కూడా భారీగా ఉన్నాయి. వాటిని సీజ్ చేసిన అధికారులు తాలూకా పోలీసులకు అప్పగించారు. కాగా వైసీపీ నేత అంకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు.

మేలోనూ మంటలే!

సాధారణం కంటే అధికంగానే పగటి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎల్‌నినో బలహీనపడినా దాని ప్రభావంతో దేశంలోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం అగ్నిగుండంలా మారాయి. ఏప్రిల్‌లో మాదిరిగానే ఎండ తీవ్రత, వడగాడ్పులు మే నెలలో కొనసాగనున్నాయి. మే నెలకు సంబంధించి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు, వర్షపాతంపై బుధవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం.. కోస్తాంధ్రలో ఎక్కువ ప్రాంతాలు, దానిని ఆనుకుని ఉన్న తెలంగాణలో సాధారణం, అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఏపీ, ఉత్తర తెలంగాణల్లో సగటున రెండు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీయనున్నాయి.

వర్షాలు లేకపోవడంతో ఏప్రిల్‌లో ఎండలు

మార్చి నుంచి మే నెలాఖరు వరకు దేశంలో రుతుపవన ముందస్తు వర్షాలు కురవడం సాధారణ విషయం. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దక్షిణ భారతంలో రుతుపవన ముందస్తు వర్షాలు లేకపోవడంతో ఎండలు తీవ్రంగా ఉండడంతోపాటు, వడగాడ్పులు వీచాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర పేర్కొన్నారు. ఇంకా అధిక పీడనం కొనసాగడంతో గాలుల వేగం మందగించి రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించారు. మే నెలలో రాయలసీమలో అనేక ప్రాంతాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కానున్నాయి. అయితే దక్షిణ కోస్తాలో ప్రకాశం జిల్లా తప్ప మిగిలిన ప్రాంతాల్లో తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పెరిగిన సెగ, ఉక్కపోత.. జంగమహేశ్వరపురంలో 46.2 డిగ్రీలు

అమరావతి, విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత, వడగాడ్పులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పగలు సెగ, రాత్రి వేళ ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో అనేక ప్రాంతాలు బుధవారం ఎండతో మండిపోయాయి. రాయలసీమ, కోస్తాల్లోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురం, పల్నాడు జిల్లా కొప్పునూరులో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 46, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో 45.8, నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా మర్రిపాడులో 45.7,చిత్తూరు జిల్లా కొత్తపల్లిలో 45.6, ప్రకాశం జిల్లా ఎండ్రపల్లిలో 45.5, కడప జిల్లా సింహాద్రిపురంలో 44.9, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 44.6, అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 44.5, కర్నూలు జిల్లా పంచలింగాలలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులు, దక్షిణ కోస్తా, ఉత్తరకోస్తాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

'గాజుగ్లాసు'పై గందరగోళం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ టీడీపీ హైకోర్టును ఆశ్రయించింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున.. గాజుగ్లాసు గుర్తును ఇతర స్వతంత్ర అభ్యర్థులెవరికీ కేటాయించకుండా జనసేనకే రిజర్వ్ చేసేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య బుధవారమే అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు గానీ, స్వతంత్ర అభ్యర్థులకు గానీ ఈ గుర్తును కేటాయించకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై కోర్టు గురువారం విచారణ జరుపనుంది. 'జనసేనకు కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసును ఎన్నికల గుర్తుగా కేటాయించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా పోటీ చేస్తున్నాయి. పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా టీడీపీ 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాలకు.. జనసేన 21 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలకు.. బీజేపీ 10 అసెంబ్లీ, 6 ఎంపీ స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ప్రచారం కూడా చేస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోను సైతం విడుదల చేశాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈసీ కేటాయించిన గుర్తులను అభ్యర్థులు ఓటర్ల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల గుర్తుది కీలక పాత్ర. అభ్యర్థుల పేర్లను చదవలేని నిరక్షరాస్యులైన ఓటర్లు.. ఎన్నికల గుర్తును ఆధారంగా చేసుకుని తమ ఓటుహక్కు వినియోగించుకుంటారు. నిబంధనలను అనుసరించి ఈసీ జనసేనకు గాజుగ్లాసు గుర్తు కేటాయించింది. ఫ్రీ సింబల్ జాబితాలో ఉన్న ఈ గుర్తును ఆ జాబితా నుంచి తొలగించి తమకు రిజర్వ్ చేయాలని ఆ పార్టీ ఈసీకి విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ ఆ గుర్తును స్వతంత్ర అభ్యర్థులు, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులకు కేటాయించారు. ఈ నేపథ్యంలో జనసేన హైకోర్టును ఆశ్రయించగా.. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాలు ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు, జనసేన పోటీలో ఉన్న రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఇతర స్వతంత్ర, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలకు గాజుగ్లాసు సింబల్ కేటాయించి ఉంటే సవరించాలని ఆర్వోలను ఆదేశించినట్లు ఈసీ హైకోర్టుకు నివేదించింది. కమిషన్ ఉత్తర్వులు ఓటర్లను మరింత గందరగోళంలోకి నెడుతున్నాయి. 62 అసెంబ్లీ, 5 పార్లమెంటు నియోజకవర్గాలకు ఈసీ ఉత్తర్వులు వర్తించడం లేదు. జనసేనకు సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించాలని కమిషన్ తీసుకున్న నిర్ణయం కూటమి అభ్యర్థుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. ఈసీ నిర్ణయం ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసే పార్టీలు, అభ్యర్థుల సమానావకాశాలను దెబ్బతీస్తుంది. ప్రతికూల పరిస్థితులు కల్పిస్తుంది. పోటీ చేసే అభ్యర్థులు, ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల గుర్తుల కేటాయింపు.. నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుంది. మా హక్కులకు భంగం కలుగుతున్న నేపథ్యంలో వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపండి' అని పిటిషన్‌లో రామయ్య కోరారు.

'గాజుగ్లాసు'పై ఆర్వోలకు ఆదేశాలిచ్చాం: ఈసీ

జనసేన పోటీ చేసే 21 అసెంబ్లీ స్థానాలు ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపులేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలకు గాజుగ్లాసు గుర్తు కేటాయించవద్దని ఆర్వోలను ఆదేశించినట్లు ఈసీ అంతకుముందు హైకోర్టుకు తెలిపింది. అలాగే జనసేన పోటీ చేస్తున్న రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న స్వతంత్ర, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలకు ఈ సింబల్ కేటాయించవద్దని, ఒకవేళ కేటాయించి ఉంటే సవరించాలని వారిని నిర్దేశించినట్లు నివేదించింది. ఈ నిర్ణయంతో ఈ పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపింది. ఈసీ నిర్ణయంపై జనసేన ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు తరఫు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేయడంతో న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ వ్యాజ్యంపై విచారణను మూసివేశారు. అయితే ఈసీ నిర్ణయం కూటమిలోని ఇతర భాగస్వాములను అయోమయంలో పడేసిందని టీడీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ ఇబ్బందులను జనసేన కూడా గుర్తించింది. మరోసారి కోర్టును ఆశ్రయించే ఆలోచనలో ఉంది.

లోక్‌సభ ఎన్నికలతో 9 లక్షల మందికి ఉద్యోగాలు!

ముంబయి, మే 1: సార్వత్రిక ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించడంతోపాటు పెద్ద ఎత్తున తాత్కాలిక ఉద్యోగావకాశాలనూ కల్పిస్తున్నాయి. 7 దశల్లో నిర్వహిస్తున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా 9 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ స్థాయిల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల సామగ్రిని తరలించే సిబ్బంది వంటివారిని తాత్కాలికంగా నియమిస్తుంటారు. వీరితో పాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియమించుకునే సిబ్బంది, సర్వేలు నిర్వహించేవారు ఇలా అందరినీ లెక్కేస్తే దాదాపు 9 లక్షల మందికి తాత్కాలిక ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

బీజేపీ ఉన్నంత వరకూ రిజర్వేషన్లు ఉంటాయి

» మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ రాతపూర్వక హామీ ఇవ్వగలదా?: మోదీ



బనస్కంత, కోర్బా, న్యూఢిల్లీ, మే 1: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలనేదే కాంగ్రెస్ ఉద్దేశం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఒకవేళ మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ చెప్పదలచుకుంటే.. ఆ విషయాన్ని ఆ పార్టీ, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు రాతపూర్వకంగా ఇవ్వగలవా? అని ప్రశ్నించారు. మతం పేరిట రిజర్వేషన్లను దుర్వినియోగపరచబోమంటూ కాంగ్రెస్ రాకుమారుడు చెప్పగలరా? అని రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా మోదీ నిలదీశారు. గుజరాత్‌లోని బనస్కంత జిల్లాలోని దీసా పట్టణంలో బుధవారం ఓ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. తాను, బీజేపీ ఉన్నంత వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రకటించారు. కాగా, రిజర్వేషన్లను తాము తొలగించబోమని, ఆ పనికి సిద్ధమైతే కాంగ్రెస్‌నూ అడ్డుకుంటామని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాలోని కట్గోరా పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో షా మాట్లాడారు. అబద్ధాలను బహిరంగంగా, బిగ్గరగా, పదే పదే చెప్పడం కాంగ్రెస్ నైజం అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఒక కుటుంబం కోసం అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, చివరికి ఎన్నికల్లో ఓటమికి ఆయన్నే బాధ్యులను చేస్తారని పేర్కొన్నారు.

మోదీ హటావో.. దేశ్ బచావో: ఖర్గే

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): 'మోదీ హటావో.. దేశ్ బచావో' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓటర్లకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం యాదగిరిలో బుధవారం నిర్వహించిన ప్రచారసభలో ఖర్గే ప్రసంగించారు. ప్రధాని మోదీని గద్దె దించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన ఓటర్లను కోరారు. ఈనెల 7న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. యాదగిరి ప్రాంతం ఒకప్పుడు హైదరాబాద్ నిజాంల పాలనలో ఉండేదని, హిందూ ముస్లింల మధ్య విభేదాలు ఉండేవి కావని తెలిపారు. అయితే ప్రధాని మోదీ ఇక్కడ చిచ్చు రేపుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. కేవలం ఓట్ల కోసమే శ్రీరాముడు, అయోధ్య వంటి అంశాలను మోదీ ప్రస్తావిస్తున్నారని ఆక్షేపించారు. పేదలు ఇంతవరకు పేదలుగానే ఉండగా ధనవంతులు శ్రీమంతులయ్యారన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఇద్దరు నేతల రాజీనామా

న్యూఢిల్లీ, మే 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. ఢిల్లీలోని రెండు లోక్‌సభ స్థానాలకు చెందిన ఆ పార్టీ పరిశీలకులు నీరజ్ బసోయా, నసీబ్ సింగ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యేలయిన నీరజ్ బసోయాను పశ్చిమ ఢిల్లీకి, నసీబ్ సింగ్‌ను నార్త్‌వెస్ట్ ఢిల్లీ లోక్‌సభ స్థానాలకు పరిశీలకులుగా కాంగ్రెస్ పార్టీ ఇటీవలే నియమించింది. అయితే బుధవారం వారు ఇరువురూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వేర్వేరుగా లేఖలను రాశారు. ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్లే తాము పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పొత్తుతో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి రోజూ అవమానాల పాలవుతున్నారని నీరజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర నాయకత్వంతో విభేదాల కారణంగా కాంగ్రెస్ సీనియర్ నేత అరవిందర్ సింగ్ లవ్లీ పార్టీ ఢిల్లీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

తొలి విడత 66.14%
రెండో విడతలో 66.71%

» పోలింగ్ తుది వివరాలు వెల్లడించిన ఈసీ
» పోలింగ్ శాతం పెరగడంపై మమత డౌట్
» ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానం

న్యూఢిల్లీ, ఫరక్కా (పశ్చిమ బెంగాల్), మే1: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన మొదటి, రెండో విడత పోలింగ్ తుది వివరాలను ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. మొదటి విడతలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ పేర్కొంది. తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 19న జరగ్గా పోలింగ్‌కు సంబంధించిన తుది వివరాలను 11 రోజుల తర్వాత ఈసీ అధికారికంగా మంగళవారం వెల్లడించింది. ఈ విడతలో 66.22% మంది పురుషులు, 66.07% మంది మహిళలు, 31.32% మంది థర్డ్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన మొదటి విడతలో పోలింగ్ 69.43 శాతంగా నమోదైంది. ఇక రెండో విడత విషయానికి వస్తే.. ఈ విడత పోలింగ్ ఏప్రిల్ 26న జరిగింది. ఇందులో 66.99% మంది పురుషులు, 66.42% మంది మహిళలు, 23.86% మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఓటు వేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండో విడతలో పోలింగ్ 69.64 శాతంగా నమోదైంది. కాగా మొదటి విడతలో బిహార్‌లో తక్కువ (49.26 శాతం), రెండో విడతలో ఉత్తర ప్రదేశ్‌లో తక్కువ (55.19 శాతం) పోలింగ్ జరిగింది. మొదటి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగ్గా.. 11చోట్ల మహిళల ఓటింగే ఎక్కువగా ఉందని ఈసీ వెల్లడించింది. వీటిలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్మూకశ్మీర్, తమిళనాడు, లక్షద్వీప్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. రెండో విడతలో 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరిగింది. వీటిలో ఆరు చోట్ల మహిళల ఓటింగ్ అధికంగా ఉంది. వీటిలో అస్సాం, బిహార్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, కేరళ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తర్వాత పోలింగ్ తుది వివరాలు అందుబాటులో ఉంటాయని ఈసీ స్పష్టం చేసింది.



మాల్దా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో మమత

ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన తొలి, రెండో విడత పోలింగ్ తుది వివరాల వెల్లడిలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేసిన జాప్యం పట్ల పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఈ రెండు విడతల్లో ఒక్కసారిగా పోలింగ్ శాతాలు పెరగడంపై బుధవారం ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన దానికంటే పోలింగ్ తుది వివరాల్లో దాదాపు 5.75% పెరుగుదల ఆందోళన కలిగిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. చాలా కాలంగా ఈవీఎంలు కనపడకుండా పోయినందు వల్ల బీజేపీ ఫలితాలను తారుమారు చేస్తుందనే ఆందోళనలున్నాయన్నారు. పోలింగ్ శాతం పెరుగుదల ఆందోళనకలిగించడమేకాకుండా ఈవీఎంల విశ్వసనీయతపై తీవ్ర భయాందోళనలు కలిగిస్తోందని చెప్పారు. ముషీదాబాద్ జిల్లాలోని ఫరక్కాలో నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసీ వెల్లడించిన ఓటింగ్ వివరాల పట్ల కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇంతకు ముందు మాదిరిగా పోలింగ్ వివరాలు వెల్లడించడంలో ఈసీ విఫలమవడం అందరినీ నిరాశపరుస్తోందని తెలిపారు. ఆ వివరాలతో రాజకీయ ఆటలు ఆడకూడదని ఆశిస్తున్నామన్నారు.

డీప్‌ఫేక్ వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో 'పిల్'

న్యూఢిల్లీ, మే 1(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో 'డీప్‌ఫేక్' వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. డీప్‌ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఈసీ స్పందించలేదన్నారు. ఎన్నికల వేళ చక్కర్లు కొడుతున్న డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ సక్రమంగా ఉంటే గురువారం విచారణ చేపడతామని తెలిపింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	45.6	29.0
గుంటూరు	45.0	30.0
కర్నూలు	44.5	31.1
అనంతపురం	43.0	30.0
విజయవాడ	42.3	28.3

ప్రజ్వల్‌ను దేశానికి రప్పించండి

» ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం లేఖ

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి):మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టును రద్దు చేయాలని, ఆయనను స్వదేశానికి రప్పించాలని కోరుతూ ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్‌ను ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దింపడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. అతనిపై భయంకరమైన ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వివాదంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వెంటనే ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేసేలా కేంద్ర హోం, విదేశాంగశాఖలకు సూచించాలని లేఖలో కోరారు. అతన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు సిట్ అవిశ్రాంతంగా పనిచేస్తోందని సిద్దరామయ్య ఆ లేఖలో తెలియజేశారు. కాగా, ఈ వ్యవహారంలో 24 గంటల్లోగా విచారణకు హాజరు కావాలని ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే రేవణ్ణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మంగళవారం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ప్రజ్వల్ రేవణ్ణ బుధవారం స్పందించారు. ప్రస్తుతం తాను బెంగళూరులో అందుబాటులో లేనని, జర్మనీలో ఉన్నానని పేర్కొన్నారు. విచారణకు హాజరయ్యేందుకు ఏడు రోజుల గడువు కావాలని కోరారు. ప్రజ్వల్ తరఫు న్యాయవాది అరుణ్ ఈ మేరకు సిట్ అధికారులకు లేఖ పంపారు. మరోవైపు ప్రజ్వల్ లైంగిక వేధింపుల వీడియోల పెన్‌డ్రైవ్‌ల విడుదల వెనుక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తం ఉందని జేడీఎస్ నేత కుమారస్వామి చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ తిప్పికొట్టారు. అసలు పెన్‌డ్రైవ్‌లు బయటకు రావడానికి కుమారస్వామి కారణమై ఉంటారన్నారు. ప్రజ్వల్ విదేశాలకు పారిపోడానికి రాష్ట్ర ప్రభుత్వమే సహకరించిందని బీజేపీ చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య తిప్పికొట్టారు. 'విదేశాలకు వెళ్లడానికి పాస్‌పోర్టు, వీసా ఎవరిచ్చారు? కేంద్రమే ఇచ్చింది. కేంద్రానికి తెలియకుండా అతను వెళ్లగలడా?' అని సిద్దరామయ్య ఆరోపించారు. కాగా, మోదీ తన రాజకీయ కుటుంబంలోని నేరస్థులను కాపాడే గ్యారెంటీలో ఇది కూడా భాగమేనా? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. 'కర్ణాటకలో మహిళలపై దారుణమైన నేరాలు జరిగితే, నరేంద్ర మోదీ సిగ్గులేకుండా ఎప్పటిలాగే మౌనంగా ఉన్నారు. ప్రధాన మంత్రి జవాబు చెప్పాల్సిందే. అన్నీ తెలిసినప్పటికీ, వందలాదిమంది కుమార్తెలను లైంగికంగా వేధించిన రాక్షసుడి కోసం ఆయన ఎందుకు ప్రచారం చేశారు? కేవలం ఓట్ల కోసమే! ఇలాంటి కేసులో అంత పెద్ద నేరస్థుడు దేశం నుంచి ఎలా పారిపోగలడు? అత్యాచారాలకు పాల్పడిన నేరస్థులకు ప్రధాని మౌనమద్దతు దేశవ్యాప్తంగా ఉన్న నేరస్థుల్లో ధైర్యం నింపుతోంది' అని రాహుల్ ఓ సోషల్ మీడియా పోస్టులో ఆక్షేపించారు.

స్కూళ్లలో బాంబుల అలజడి!

130 పాఠశాలలకు అజ్ఞాత ఈ మెయిళ్లు .. ఢిల్లీలో కలకలం.. వణికిపోయిన విద్యార్థులు, తల్లిదండ్రులు

» స్కూళ్ల వద్ద గందరగోళ పరిస్థితులు
» తనిఖీలు జరిపి ఏమీ లేదని తేల్చిన బాంబు స్క్వాడ్ బృందాలు
» రష్యా నుంచి ఈమెయిళ్లు..ఐఎస్ హస్తం?



ఢిల్లీలో ఓ పాఠశాల ఆవరణలో పిల్లలు

న్యూఢిల్లీ, మే 1: పాఠశాలల్లో బాంబులు పెట్టామనే బెదిరింపు ఈమెయిళ్లతో ఢిల్లీలో బుధవారం కలకలం చెలరేగింది. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై తీవ్ర ఆందోళనతో స్కూళ్లకు పరుగులు తీశారు. యాజమాన్యాలు స్కూళ్లను మూసివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించాయి. పోలీసు, భద్రతా దళాలు పాఠశాలల్లో తనిఖీలు జరిపి బాంబులు ఏమీ లేవని, బెదిరింపు ఈ మెయిళ్లు ఒట్టివేనని తేల్చారు. ఈ మెయిళ్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది అధికారికంగా వెల్లడి కాకపోయినా.. రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, అవన్నీ ఒకే విధంగా ఉన్నాయని ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీతో పాటు నగర పరిసరాల్లోని నోయిడా, గ్రేటర్ నోయిడాల్లో ఉన్న దాదాపు 130 స్కూళ్లకు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. దీంతో స్కూళ్ల సిబ్బంది ఓవైపు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూనే మరోవైపు పోలీసులకు, అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. పిల్లల్ని స్కూళ్లో దించి గంట కూడా కాకముందే.. 'ఎమర్జెన్సీ పరిస్థితి కారణంగా స్కూల్‌ను మూసేస్తున్నాం.. మీ పిల్లల్ని తీసుకెళ్లండి' అని పాఠశాలల నుంచి ఫోన్ రావటంతో తల్లిదండ్రులు ఆదరాబాదరగా తరలివెళ్లారు. దీంతో అన్ని స్కూళ్ల వద్ద తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఆకస్మిక పరిణామంతో విద్యార్థులు వణికిపోయారు. బెదిరింపు ఈమెయిళ్లు వచ్చిన అన్ని స్కూళ్లలో బాంబు తనిఖీ దళాలు క్షుణ్ణంగా సోదాలు జరిపాయి. ఎక్కడా ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని తేల్చారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ స్పందిస్తూ.. బాంబు బెదిరింపు ఒట్టిదేనని.. పోలీసులు, భద్రతా సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలెవరూ భయాందోళనలకు గురి కావద్దని ఒక ప్రకటన విడుదల చేసింది. పుకార్లను వ్యాపింపజేయటం కోసమే బెదిరింపు ఈమెయిళ్లను పంపించి ఉంటారని ఢిల్లీ అదనపు పోలీసు కమిషనర్ సీపీ మీనా పేర్కొన్నారు. కాగా, బెదిరింపు ఈ మెయిళ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను గుర్తించాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈమెయిళ్లు రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని ఢిల్లీ పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. సావరిమ్ అనే అరబిక్ పదంతో కూడిన ఈమెయిల్ ఐడీ నుంచి మెయిళ్లు వచ్చాయని, సదరు మెయిల్ ఐడీని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదసంస్థ ఉపయోగిస్తుందని ఓ పోలీసు అధికారి తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్

బిహార్ రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

బిహార్‌లోనూ బాంబు బెదిరింపు కలకలం రేపింది. రాజ్‌భవన్‌లో బాంబు అమర్చినట్లు మంగళవారం రాజ్‌భవన్ అధికారులకు, బిహార్ పోలీసులకు ఈ మెయిల్ వచ్చింది. వారు వెంటనే అప్రమత్తమై భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో రాజ్‌భవన్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని, అనుమానాస్పదంగా ఏమి కనిపించలేదని బుధవారం సీనియర్ పోలీసు అధికారి రాజీవ్ మిశ్రా తెలిపారు. దాన్ని ఆకతాయి చర్యగా తేల్చారు.

ఉక్రెయిన్‌లో హ్యారీ పోటర్ కోట ధ్వంసం



» క్షిపణులతో రష్యా దాడి.. ఐదుగురి మృతి

కీవ్, మే 1: ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంలో నల్లసముద్ర తీరం వెంబడి ఉన్న ఓ అందమైన కట్టడం, స్థానికంగా హ్యారీపోటర్ కోటగా ప్రసిద్ధికెక్కిన భవనాన్ని రష్యా క్షిపణిదాడులు జరిపి ధ్వంసం చేసింది. ఈ దాడిలో భవనంలో ఉన్న ఐదుగురు చనిపోయారు. 32మంది గాయపడ్డారు. ప్రైవేటు న్యాయసేవా సంస్థ తమ కార్యకలాపాల కోసం ఈ భవనాన్ని ఉపయోగించుకుంటోందని, అదొక విద్యాసంస్థ అని పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. బుధవారం రష్యా ఒడెసా నగరంపై క్షిపణులతో విరుచుకుపడింది. దాడిలో 20కి పైగా భవనాలు ధ్వంసం అయ్యాయి. ఈ దాడుల్లో రష్యా ఇస్కాండర్ బాలిస్టిక్ మిసైల్, క్లస్టర్ బాంబులను వాడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, క్రిమియాలోని తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఉక్రెయిన్ క్షిపణులను కూల్చిందని రష్యా ప్రకటించింది.

కాలిఫోర్నియా వర్సిటీలో 'జై శ్రీరామ్' నినాదాలు

న్యూయార్క్, మే 1: అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ నుంచి పాలస్తీనాకు అనుకూలంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. మరోవైపు లాస్ ఏంజెలిస్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల, వ్యతిరేక విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. ముష్టిఘాతాలు, కుర్చీలు, కర్రలతో కొట్టుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఘర్షణ సందర్భంగా ఇజ్రాయిల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన వీడియో వైరల్‌గా మారింది. పాలస్తీనా అనుకూల విద్యార్థి ఒకరు భారత వ్యతిరేక నినాదాలు చేయడంతో, దానికి కౌంటర్‌గా ఇజ్రాయిల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ జెండాను కప్పుకొన్న ఆ విద్యార్థి పేరు శయన్ ఆలి కృష్ణ. పాకిస్థాన్‌లో జన్మించారు. కాగా, అమెరికా వ్యాప్తంగా ఇతర యూనివర్సిటీల్లో బుధవారం కూడా పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టయిన విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది.

పెళ్లంటే పాటలు, డ్యాన్స్‌లు కాదు

» రిజిస్ట్రేషన్ రుజువు మాత్రమే.. చట్టబద్ధం కాదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మే 1: హిందూ వివాహం చెల్లుబాటు కావాలంటే సముచిత ఆచార వ్యవహారాల మధ్య వివాహ క్రతువు నిర్వహించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహాన్ని పవిత్ర మతపరమైన తంతుగా అభివర్ణించింది. సప్తపది (పవిత్ర అగ్నిగుండం చుట్టూ 7 అడుగులు) ప్రాధాన్యాన్ని ప్రస్తావించింది. భవిష్యత్తులో వచ్చే వివాదాల సమయంలో ఇటువంటివి రుజువుగానూ ఉంటాయని పేర్కొంది. అంతేకానీ ఆటపాటలు.. విందు భోజనాల కోసం నిర్వహించే కార్యక్రమం పెళ్లి కాదని జస్టిస్ బీవీ నాగరత్నం నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోని ఓ యువ జంట.. విడాకుల కోసం ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 'హిందూ వివాహం ఓ సంస్కారం.. పవిత్రమైన మతకర్మ. భారతీయ సమాజంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వివాహమంటే ఆటపాటలు, విందువినోదాలు, కట్నకానుకలు ఇచ్చిపుచ్చుకునే సందర్భమో.. వాణిజ్యపరమైన లావాదేవీనో అస్సలు కాదు. ఇది కుటుంబ వ్యవస్థకు ఓ గంభీరమైన పునాది కార్యక్రమం' అని వ్యాఖ్యానించింది. 'హిందూ వివాహ చట్టం-1952లోని సెక్షన్ 8 ప్రకారం వివాహాన్ని నమోదు చేయడం వల్ల రుజువు లభిస్తుంది. అయితే సెక్షన్ 7 మేరకు ఆచార సంప్రదాయాలతో వివాహం నిర్వహించకపోతే చట్టబద్ధత లభించదు' అని కోర్టు స్పష్టం చేసింది.

కొవిషీల్డ్‌పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ టీకా వల్ల అరుదైన కేసుల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందంటూ.. దాన్ని తయారుచేసిన ఆస్ట్రాజెనెకా సంస్థే ఇటీవల ఒప్పుకొన్న నేపథ్యంలో.. సీనియర్ న్యాయవాది విశాల్ తివారీ బుధవారం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై వైద్య నిపుణుల బృందాన్ని నియమించేలా.. ఆ టీకా తీసుకున్న తర్వాత చనిపోయిన, వైకల్యానికి గురైనవారి కుటుంబాలకు నష్టపరిహారం అందించేందుకు వ్యాక్సిన్ డ్యామేజ్ పేమెంట్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని ఆ పిటిషన్‌లో ఆయన అభ్యర్థించారు. "దేశంలో 175 కోట్లకు పైగా డోసుల కొవిషీల్డ్ టీకాలు ప్రజలకు వేశారు. ఇటీవల యువకులు కూడా గుండెపోటుతో మరణిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి" అని విశాల్ తివారీ తన పిటిషన్‌లో గుర్తు చేశారు.

సల్మాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటనలో.. కస్టడీలోని నిందితుడి ఆత్మహత్య

ముంబై, మే 1: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద ఇటీవలే కాల్పులకు పాల్పడిన ఘటనలో పలువురిని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు అనూజ్ తపన్(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టాయిలెట్‌లోని కిటికీకి బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముంబైలోని సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద గత నెల 14న కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులకు ఆయుధాలను సరఫరా చేసిన కారణంగా తపన్‌ను అరెస్టు చేశారు.



అయోధ్యలో కొలువుదీరిన బాలరాముడిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆమె అయోధ్యలోనే హనుమాన్ గఢీ ఆలయంలో హనుమంతున్ని దర్శించుకొని పూజలు చేశారు.

ఉగ్రవాది గోల్డీ బ్రార్ హత్య


» కాలిఫోర్నియాలో కాల్చి చంపిన దుండగులు



వాషింగ్టన్, మే 1: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకేసులో కీలక నిందితుడు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్రవాది గోల్డీ బ్రార్(30) అమెరికాలో హత్యకు గురయ్యాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం కాలిఫోర్నియాలోని ఫెయిర్ మాంట్‌లో ఉన్న హోల్ట్ అవెన్యూలో ఓ ఇంటి ముందు తన స్నేహితుడితో కలిసి నిలబడ్డ గోల్డీ బ్రార్‌పై గుర్తుతెలియని దుండగులు తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన గోల్డీ బ్రార్, అతని స్నేహితుడిని సమీప ఆస్పత్రికి తరలించారు. గోల్డీ బ్రార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. గోల్డీ బ్రార్ హత్యకు తమదే బాధ్యత అని ఆయన ప్రత్యర్థులు ఆర్ష్ దల్లా, లఖ్బీర్ ప్రకటించారు. గోల్డీబ్రార్ స్వస్థలం పంజాబ్‌లోని శ్రీముక్త్‌సర్ సాహిబ్. 1994లో జన్మించారు. తన సోదరుడు గురులాల్ బ్రార్‌ను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువజన కాంగ్రెస్ నేత గురులాల్ పహిల్వాన్‌ను 2021 ఫిబ్రవరి 8న హతమార్చాడు. ఆ తర్వాత విద్యార్థి వీసాపై కెనెడాకు పారిపోయాడు. 2021 ఆగస్టులో మొహాలీలో గోల్డీ మరో సోదరుడు విక్కీ మిద్దూఖేరా(గ్యాంగ్‌స్టర్) హత్యకు గురయ్యాడు. ఆ కేసులో గాయకుడు సిద్ధూ మూసేవాలా మేనేజర్ షాగన్ ప్రీత్‌సింగ్ ప్రధాన నిందితుడు. దీంతో గోల్డీ బ్రార్ కెనడా నుంచి మూసేవాలా హత్యకు స్కెచ్ వేశాడు. 2022 మే 29న మూసేవాలాను హతమార్చాడు.

'అబూజ్‌మడ్' మృతుల్లో ముగ్గురు తెలుగువారు

చర్ల, మే 1: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మంది మావోయిస్టుల్లో 8 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో ముగ్గురు తెలుగువారు ఉన్నారు. 10 మంది మావోయిస్టులపై మొత్తం రివార్డు విలువ రూ.63 లక్షలుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కరీంనగర్ జిల్లా రామగుండానికి చెందిన జోగయ్య అలియాస్ చీమల నర్సయ్య(66) ఉన్నారు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. మిగతా మృతుల్లో.. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన డీవీసీఎం సభ్యుడు వినయ్ అలియాస్ రవి(55), వరంగల్ జిల్లాకు చెందిన సుస్మిత అలియాస్ చైతే ఉన్నట్లు వివరించారు. వినయ్‌పై రూ.8లక్షలు, సుస్మితపై రూ.2 లక్షల మేర రివార్డు ఉన్నట్లు తెలిపారు.



మూడేళ్లుగా సాగునీరు లేదు..



వైసీపీ ప్రభుత్వం మూడేళ్లుగా రబీ సీజన్‌లో సాగునీటిని విడుదల చేయలేదు. ఖరీఫ్‌లో పంటలు చేతికొచ్చే సమయంలో రెండేళ్లుగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో పంట నీటమునిగి దెబ్బతింది. రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. రైతులకు ధాన్యం బిల్లులు సకాలంలో ఇవ్వలేదు. రెండో పంటగా వరి సాగుచేస్తే రైతులకు కొంతమేర ఆర్థిక వెసులుబాటు ఉండేది. వైసీపీ ప్రభుత్వం రెండో పంటకు సాగునీటిని విడుదల చేయకపోవడంతో తీర ప్రాంతంలోని రైతులు, కూలీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

- గోపు సత్యనారాయణ, కానూరు, బందరు మండలం

పంటకాల్వలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేయలేదు..



ఐదేళ్లుగా పంట కాల్వలు, డ్రెయిన్లకు కనీస మరమ్మతులు చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లోనూ సాగునీరు సక్రమంగా రాక ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడుకుని రైతులు పంటను బతికించుకోవాల్సి వచ్చింది. డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంటను కోల్పోయాం. నష్టపరిహారం ఇంతవరకు విడుదల చేయలేదు. డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తీసి ఉంటే మురుగునీరు బయటకుపోయి పంటనష్టం కొంతమేరైనా తగ్గేది. రైతుల ఇబ్బందులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

- కొక్కు రామాంజనేయులు, బుద్దాలపాలెం, బందరు మండలం

సాయం లేని సాగు..!

అంతన్నారు.. ఇంతన్నారు.. అధికారంలోకి వస్తే కృష్ణాడెల్టా ఆధునికీకరణ అని నమ్మించారు. కాల్వలకు కొత్తరూపు తెచ్చి, కౌలు రైతుల కష్టాలు తీర్చి వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు.. ఏనాడూ రైతులకు ఉపయోగపడే ఒక్క పనికి కూడా వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది లేదు. పంట నష్టపరిహారం నుంచి ధాన్యం బిల్లులు, మద్దతు ధర వరకూ, యంత్రాల నుంచి రుణాల వరకూ అన్నింటా అష్టకష్టాలకు గురిచేశారు. అతివృష్టి, అనావృష్టి సమయాల్లోనూ రైతులను గాలికొదిలేశారు. ఫలితంగా బంగారు పంటలకు నిలయమైన కృష్ణాతీరంలో సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఉమ్మడి కృష్ణాలో భారంగా వ్యవసాయం



- మూడేళ్లుగా రెండో పంటకు నీరు లేదు
- డెల్టా ఆధునికీకరణ ఊసే మరిచారు..!
- పంటబీమా, నష్టపరిహారం చెల్లింపుల్లేవ్..
- మూడు నెలలకోసారి ధాన్యం బిల్లులు

సబ్సిడీపై యంత్ర పరికరాలు తూచ్..

ఆంధ్రజ్యోతి- మచిలీ పట్నం : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3,23,131 హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోంది. ఇందులో వరి 2.32 లక్షల హెక్టార్లు, పత్తి 50 వేల హెక్టార్లు, మిరప 10 వేల హెక్టార్లు, చెరకు 13 వేల హెక్టార్లు, పసుపు 2 వేల హెక్టార్లతో పాటు 15 వేల హెక్టార్లలో మొక్కజొన్నతో పాటు వేరుశెనగ, కంద, పెసర సాగవుతోంది. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు, పూలతోటలు 10 వేల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 1.40 హెక్టార్లలో మినుము, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2021 రబీ సీజన్‌లో మాత్రమే రెండో పంటకు సాగునీరు విడుదల చేశారు. 2022 నుంచి విడుదల చేయలేదు. దీంతో రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. పనుల్లేక రైతు కూలీలు ఇబ్బందులపాలయ్యారు.

డెల్టా ఆధునికీకరణ పరిహాసం

హామీ : టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో రూ.2,180 కోట్ల డెల్టా ఆధునికీకరణ పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చి కొంతమేర చేశారు. వైసీపీ వచ్చాక ఈ పనులు పూర్తి చేస్తామని గొప్పలు చెప్పింది.

వాస్తవం : జిల్లాలో బందరు, రైవస్, కేఈబీ తదితర ప్రధాన కాల్వలకు ఈ ఐదేళ్లలో కనీసం మట్టి, మరమ్మతు పనులు కూడా చేయలేదు. దీంతో కాల్వలో తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోవడంతో పాటు గట్లు బలహీనంగా మారి నీటి విడుదలకు అడ్డుగా మారాయి. అవనిగడ్డ నియోజకవర్గంలో ఏడు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.3,044 కోట్ల అంచనాతో రూపొందించిన పనులు పరిపాలనా ఆమోదం కూడా పొందలేదు. కృత్తివెన్ను మండలం నిడమర్రు వద్ద పెదలంక డ్రెయిన్‌పై రూ.40 కోట్లతో నిర్మించే అవుట్‌ఫాల్ స్లూయిస్ పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని గూడూరు, పెడన, బంటుమిల్లి తదితర మండలాల నుంచి మురుగు నీటిని సముద్రంలో కలిపే లజ్జబండ డ్రెయిన్‌లో పూడికతీత పనులకు రూ.7 కోట్లతో అంచనాలు రూపొందించినా ఐదేళ్లుగా ఏమాత్రం ముందుకు కదల్లేదు. రెండేళ్లుగా పంటకాల్వలు, డ్రెయిన్లలో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) పనులకు నామమాత్రంగా నిధులు కేటాయించారు. 2022-23 సంవత్సరంలో ఈ పనులకు రూ.57 కోట్లు కేటాయించగా, 2023-24 సంవత్సరంలో రూ.29 కోట్లకు కుదించారు. ఈ పనులు సక్రమంగా చేయకపోవడంతో గత డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా డ్రెయిన్ల నుంచి నీరు త్వరితగతిన బయటకు పోలేదు. రోజుల తరబడి పంట నీటిలో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ధాన్యం బిల్లులు ఆలస్యం

హామీ : రైతులు ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో బిల్లులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది.

వాస్తవం : నాలుగేళ్లుగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా జాప్యం చేసింది. మూడు నెలలకు కూడా బిల్లులు అందని దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులకు సాగులో మిగిలే లాభం.. అప్పులకు వడ్డీల రూపంలో చెల్లించడానికే సరిపోయింది. ఈ ఏడాది జనవరిలో కొన్న రూ.355.40 కోట్ల మేర ధాన్యం బిల్లులు మార్చి నెలాఖరు వరకు చెల్లించకుండా జాప్యం చేశారు. 2021లో అయితే రూ.600 కోట్ల బిల్లులను మూడు నెలల తరువాత చెల్లించారు.

కౌలు రైతులకు కష్టం



హామీ : జిల్లాలో కౌలు రైతులు 1.65 లక్షల మందికిపైగా ఉన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో పంటలు కోల్పోతే వారికి పంట నష్టపరిహారం, పంటబీమా, రైతు భరోసా వంటివి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. ఏడాదికి 50 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చినట్లు చెప్పింది. గత డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు రూ.99 కోట్ల వరకు పంట నష్టపరిహారం ఇస్తామని కూడా భారీగా ప్రకటనలు గుప్పించారు.

వాస్తవం : కౌలు రైతులకు పంట రుణాలు సక్రమంగా ఇవ్వని దుస్థితి ఏర్పడింది. కౌలు రైతులు పంటలు కోల్పోతే నష్టపరిహారంగా ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి జమకాలేదు. రికార్డుల్లో మాత్రం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చామని చెప్పడమే తప్ప ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పంట నష్టపరిహారం వంటివేవీ అందలేదు. గత డిసెంబరులో కురిసిన వర్షాలకు ఇస్తామన్న రూ.99 కోట్ల పంట నష్టపరిహారం. ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కినా ఇంతవరకు జమకాలేదు. పంటబీమా అంశంపై అధికారులు, ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడంలేదు. సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వాల్సి ఉండగా, నిధులు విడుదల చేయలేదు.

అప్పు రూ.5 కోట్లు

శ్రీజ ఆసుపత్రి ఏర్పాటుకు రూ.3 కోట్ల రుణం

- మరో రూ.2 కోట్ల అదనపు అప్పు
- ఇవికాక ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితి
- మానసిక ఒత్తిడితో సతమతమైన డాక్టర్ శ్రీనివాస నాయక్
- ఐదుగురి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- శ్రీజ ఆసుపత్రిలో పోలీసుల విచారణ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : శ్రీజ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి ఎస్‌బీఐ నుంచి తీసుకున్న రుణం రూ.3 కోట్లు. ఇదికాకుండా ఇతర అప్పులు కలిపి మొత్తం రూ.5 కోట్ల అప్పు. పటమటలోని ఫన్‌టైమ్స్ క్లబ్ వెనుక భార్య, తల్లి, పిల్లలను హత్య చేసి, ఆత్మహత్య చేసుకున్న ఆర్థోపెడిక్ డాక్టర్ దారావత్ శ్రీనివాస నాయక్ కేసులో తేలిన అంశాలివి. ఘటన జరిగిన తర్వాత పోలీసులు శ్రీనివాస నాయక్ స్నేహితులు, కుటుంబ సభ్యులను విచారించినప్పుడు ఈ లెక్కలు తేలాయి. డోర్నకల్ రోడ్డులో శ్రీజ ఆసుపత్రిని ఏడాది క్రితం 15 పడకలతో ఏర్పాటు చేశారు. దీనికి పెట్టుబడి పెరుగుతున్నా రాబడి లేదు. అప్పులకు తోడు కుటుంబంలో పిల్లలిద్దరి పరిస్థితిపై ఆయన నిత్యం మానసిక ఒత్తిడితో ఉండేవాడని తెలిసింది. ఆర్థిక, ఆసుపత్రి వ్యవహారాలతో పాటు కుటుంబ పరిస్థితుల గురించి పోలీసులు ఆరా తీశారు. కూతురు శైలజకు ఆటిజం, కొడుకు శ్రీహాన్ హైపర్ యాక్టివ్. వీరికోసం ఉషారాణి తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేశారు.

అన్నయ్యకు ఐదు సందేశాలు

భార్య ఉషారాణి, తల్లి రమణమ్మ, పిల్లలు శైలజ, శ్రీహాన్‌ను హత్య చేయడానికి ముందు శ్రీనివాస నాయక్ ఐదు వాయిస్ సందేశాలను వాట్సాప్ ద్వారా పంపినట్టు తెలిసింది. కారులో ఒక బ్యాగ్ పెట్టానని, అందులో బంగారం, డబ్బు ఉంచానని, వాటితో ఇంటి అప్పులు తీర్చాలని ఒక సందేశం, తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నానని, తాను ఏమైనా చేసుకుంటే తనను ఇష్టపడేవారు ఇబ్బందిపడతారనే ఈ పని చేస్తున్నానని మరో సందేశం, తాను ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ చేయలేకపోయానని, ఈ పని చేసినందుకు సారీ అని చెప్పి మరో సందేశం పెట్టారు. అయితే, ఈ మెసేజ్‌లు మాత్రం అన్నయ్య దుర్గాప్రసాద్‌కు చేరలేదు. డాక్టర్ ఫోన్‌ను ఫ్లైట్‌మోడ్‌లో పెట్టుకుని పంపడంతో ఈ సందేశాలు ఆయనకు చేరలేదు. కాగా, నాయక్ కుటుంబ సభ్యులకు విజయవాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో బుధవారం పోస్టుమార్టం పూర్తిచేశారు. శ్రీనివాస నాయక్, తల్లి రమణమ్మ మృతదేహాలను అన్నయ్య దుర్గాప్రసాద్‌కు అప్పగించారు. భార్య ఉషారాణి, పిల్లలు శైలజ, శ్రీహాన్ మృతదేహాలను ఆమె తండ్రి రామాంజీకి అప్పగించారు.

శ్రీజ పత్రాల పరిశీలన

డోర్నకల్ రోడ్డులోని శ్రీజ ఆసుపత్రిలో పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిని ముగ్గురు వైద్యులు తీసుకున్నారు. బ్యాంక్ రుణం రూ.3 కోట్లు, ఆసుపత్రి నిర్వహణను వారు తీసుకుని, పదిశాతం వాటాను నాయక్‌కు ఇచ్చినట్టు అగ్రిమెంట్ రాసుకున్నారని స్నేహితులు తెలిపారు. పత్రాలను పోలీసులు పరిశీలించారు. అప్పులు తీర్చడానికి ఆస్తులు విక్రయించాలని చూసినా, రాబడి లేని ఆసుపత్రి కోసం వద్దని మావయ్య రామాంజీ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

వేగస్ కోయడం వల్లే..

నాయక్ ముందుగా భార్య, తల్లి, పిల్లలను మెడ వద్ద కోసి హత్య చేశారు. భార్య, కుమార్తెకు కుడివైపున, తల్లి, కుమారుడికి ఎడమ వైపున మెడపై ఉన్న నరం కోశారు. వైద్య పరిభాషలో ఈ నరాన్ని వేగస్ అని వ్యవహరిస్తారు. దీనిద్వారా మెదడుకు రక్త సరఫరా అవుతుంది. ఈ నరాన్ని కోసేస్తే మొత్తం రక్త సరఫరా ఆగిపోతుంది. మూడు, నాలుగు నిమిషాలకే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతారు. వైద్యుడిగా ఉన్న నాయక్ దీనిపై పూర్తి అవగాహన ఉండడంతోనే ఇలా చేశాడని అతడి స్నేహితులు చెబుతున్నారు.

నిగూఢాచారులు

పార్టీలు మారుతున్న రాజకీయ కోవర్టులు

ప్రతిపక్ష పార్టీల్లోకి చేరి.. రహస్యాలు తెలుసుకుని..

- అసలు పార్టీకి వివరాలు చేరవేసి..
- వరుస వలసలపై అభ్యర్థుల్లో ఆందోళన

ఏం చేయాలో తెలియక సతమతం



అప్పటి వరకు ఒక ప్రధాన పార్టీ జెండా పట్టుకుని వీధుల్లో ప్రచారం నిర్వహించిన ఓ వ్యక్తి కొద్దిరోజుల క్రితం రివర్స్ గేర్ వేశాడు. మరో పార్టీ అభ్యర్థి వద్దకు కొంతమందిని తీసుకుని వెళ్లాడు. తామంతా పార్టీలో చేరతామని, విజయానికి కృషి చేస్తామని చెప్పాడు. దీనికి ఆ అభ్యర్థి సరేనన్నాడు. వాళ్లంతా పార్టీలో చేరాక గానీ, అభ్యర్థికి అనుమానం రాలేదు. వారంతా నిజంగా తనకే పనిచేస్తారా, లేకపోతే తన వ్యూహాలను అవతలి పార్టీ అభ్యర్థికి చేరవేస్తారా అనే అనుమానం కలిగింది. దాదాపు చాలాచోట్ల ఇదే నిజమవుతోంది కూడా..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కొద్దిరోజుల క్రితం ఓ ప్రధాన పార్టీ అభ్యర్థిని ఒక యువజన నాయ కుడు కలిశాడు. కొంతమంది అనుచరులతో ఆ పార్టీలో చేరాడు. స్థానిక నేతలతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రచారం చేయాలని సదరు అభ్యర్థి ఆ యువ నాయకుడికి పని పురమాయించారు. మర్నాటి నుంచి ఆ యువ నాయకుడు నిత్యం సదరు అభ్యర్థి కార్యాలయంలోనే కనిపిస్తున్నాడు. స్థానిక డివిజన్‌లో ప్రచారం చేయాలని సూచించినా కార్యాలయం నుంచి కదలకపోవడంతో అభ్యర్థి అనుచరులకు అనుమానం వచ్చింది. ఇది కోవర్టు రాజకీయమని గ్రహించారు. అధికార పార్టీ అభ్యర్థులను ఓడించాలని కూటమి అభ్యర్థులు వ్యూహాలు రచిస్తుంటే, కూటమి అభ్యర్థులను ఓడించాలని అధికార పార్టీ అభ్యర్థులు ఇలాంటి పన్నాగాలు పన్నుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిప్పుడు ఎవరి కొంప ముంచుతుందోనని అభ్యర్థులు భయపడిపోతున్నారు.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు..

పార్టీలు మారి, కండువాలను తీసేయడం వంటి సంస్కృతి ఎన్నికల సమయంలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. యువకులు, కుటుంబాలు వందల సంఖ్యలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలస వెళ్తుంటారు. ఎన్నికల సమయంలో ఎవరినీ నొప్పించకూడదన్న భావనతో ఉన్న అభ్యర్థులు చేరికలకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పరు. ఇలా చేరిన వారి వ్యవహారశైలి మాత్రం అభ్యర్థులకు అనుమానాలు తెప్పిస్తోంది. చేరిన వారిలో తమ వారెవరో, కోవర్టులెవరో తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

రహస్యాలు తెలుసుకునేందుకా..

ప్రస్తుతం జరుగుతున్న ప్రచారమంతా ఒక ఎత్తు. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అమలుచేసే వ్యూహాలు, ప్రణాళికలు మరో ఎత్తు. వీటిని అభ్యర్థులు చాలా రహస్యంగా ఉంచుతారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పార్టీ కార్యాలయంలో అంతరంగికులతో భేటీ అయినా బహిరంగంగా ఎలాంటి విషయాలను చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వెళ్లిన నేతలు గానీ, కార్యకర్తలు గానీ అభ్యర్థుల కార్యాలయాల్లోనే మకాం వేస్తున్నారు. అక్కడ నిర్వహించే సమావేశాల్లో పాలుపంచుకుని సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇలా వచ్చిన వారంతా మేలు చేస్తారా, కీడు చేస్తారా అనే అను మానం అభ్యర్థులను, వారి అంతరంగికులను వెంటాడుతోంది. జిల్లాలో ఉన్న అభ్యర్థులందరినీ కోవర్టుల భయం వెంటాడుతోంది. చేరికల ద్వారా వస్తున్న వారిని దూరం చేసుకోలేక, అలా అని దరి చేర్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వలసల ద్వారా వచ్చిన వారిలో ఎవరు కోవర్టులో గుర్తించడానికి ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఓ అభ్యర్థి వ్యాఖ్యానించడం గమనార్హం.



స్థానికుల ఫిర్యాదుతో హడావిడిగా మళ్లీ చెరువు తవ్వకం

చెరువు.. చెరవీడి

నాగవరప్పాడువాసుల సెంటిమెంట్ చెరువు కబ్జా

వందేళ్ల కిందటి మాట.. అది గుడివాడలోని నాగవరప్పాడు గ్రామం. పచ్చగా కళకళలాడే ఆ గ్రామాన్ని కలరా వ్యాపించి ఎంతోమందిని పొట్టన పెట్టుకుంది. వరుస మరణాలతో తల్లడిల్లిపోయిన గ్రామ పెద్దలు సమస్యకు ఓ పరిష్కారం కావాలని నిర్ణయించుకున్నారు. నాటి ఆచార సంప్రదాయాలను అనుసరించి గ్రామానికి ఈశాన్యంలో చెరువు ఉంటే మంచిదనుకున్నారు. గ్రామస్థులందరి కృషితో 90 సెంట్ల విస్తీర్ణంలో చెరువు తవ్వుకున్నారు. నాటి గ్రామస్థుల నమ్మకమో, మరే ఇతర కారణమో తెలియదు కానీ చెరువు తవ్విన నాటి నుంచి గ్రామంలో మరణాలు తగ్గడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ప్రస్తుత పరిస్థితి.. కాలక్రమంలో ఆ చెరువు స్థానికులు బట్టలు ఉతుక్కునేందుకు, శ్మశానంలో నిర్వహించే కర్మకాండలకు, పశువుల తాగునీటికి అనుకూలంగా మారింది. గతనెల 15వ తేదీన వైసీపీ అధినేత జగన్ 'మేమంతా సిద్ధం' సభ కోసం ఈ చెరువును పూడ్చేశారు. సభ జరిగి 15 రోజులవుతున్నా పూడ్చిన మట్టిని తొలగించలేదు. ఈ క్రమంలో గ్రామంలో మళ్లీ మరణాలు మొదలయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి ఊతమిస్తూ ఎలాంటి అనారోగ్య కారణాలు లేని ఐదుగురు మృతిచెందడం ఇప్పుడు స్థానికుల్లో కలవరానికి కారణమైంది.

- సీఎం సిద్ధం సభ కోసం పూడ్చేసిన కొడాలి గ్యాంగ్
- వందేళ్ల కిందట గ్రామంలో వరుస మరణాలు
- పెద్దల ఆలోచనతో ఈశాన్యంలో చెరువు తవ్వకం
- ఆ తర్వాత తగ్గిన మరణాలతో ఉపశమనం
- 'సిద్ధం' సభ తరువాత మళ్లీ వరుస మరణాలు
- స్థానికుల ఫిర్యాదుతో దిగొచ్చిన ఎమ్మెల్యే కొడాలి నాని
- చెరువు పూడ్చి యథాస్థానానికి..

గుడివాడ : నాగవరప్పాడు గ్రామంలోని చెరువు వెనుక పక్కన ఉన్న 12 ఎకరాలను రెండేళ్ల కిందట అసలు యజమానిని బెదిరించి స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని గ్యాంగ్ వశం చేసుకుంది. కొడాలి నాని తమ్ముడు నాగేశ్వరరావు (చిన్ని) పేరున కొంత, మరో వ్యక్తి పేరున కొంత భూమిని రిజిస్టర్ చేయించారు. ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్ కూడా వేశారు.
ప్లాట్లు వేసి విక్రయించేందుకు అణువుగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ వంతెన నిర్మించారు. పశుపోషకులు అభ్యంతరాలు తెలిపినా ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. కాగా, గతనెల 15వ తేదీన వైసీపీ అధినేత జగన్ 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించారు. సభకు రాకపోకలు సాగించేందుకు చెరువు, కాల్వను పూడ్చేశారు. సభ జరిగిన 15 రోజులవుతున్నా పూడ్చిన మట్టిని తొలగించకపోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది.

సెంటిమెంట్ చెరువు

సిద్ధం సభ అనంతరం స్థానికులు ఐదుగురు ఆకస్మికంగా మృతి చెందటంతో అలజడి మొదలైంది. అనాదిగా ఈ చెరువు నాగవరప్పాడువాసులకు సెంటిమెంట్‌గా ఉంది. చెరువును పూడ్చివేయడంతోనే వీరు మృతిచెందారని పెద్దలు ఆరోపిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో చెరువును తిరిగి యథాస్థానానికి తీసుకురావాలని తీర్మానించుకున్నారు. పలుమార్లు ఎమ్మెల్యే నానీని కోరారు. పట్టించుకోకపోవడంతో పెద్దలు లోయ శివాజీ, వసంతవాడ దుర్గారావు, కొలుసు రాజా, సూర్యచంద్రరావుతో పాటు పలువురు ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల వేళ స్థానికుల నుంచి వచ్చిన ప్రతిఘటన నానీని ఆలోచనలో పడేసింది. దీంతో బుధవారం పూడ్చిన చెరువును తిరిగి చెరువుగా మార్చారు.

పూర్తిగా అందని పింఛన్లు

- మైనస్ బ్యాలెన్స్ ఉన్న ఖాతాల్లో మనీ కట్
- పూర్తిస్థాయి పెన్షన్ అందక లబ్ధిదారుల లబోదిబో

హనుమాన్ జంక్షన్, మే 1 : సామాజిక పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలో కొత్త సమస్య ఎదురైంది. బాపులపాడు మండలంలోని పలువురు లబ్ధిదారుల ఖాతాల్లో బుధవారం పెన్షన్ జమ కాగా, మైనస్ బ్యాలెన్స్ ఉన్నవారికి అదనపు చార్జీలు కట్ అయ్యాయి. మైనస్ బ్యాలెన్స్ ఉన్న ఖాతాలు, ఎన్‌పీఏ ఖాతాలను పరిశీలించకుండా నేరుగా అధికారులు జమ చేయడంతో పింఛన్ సొమ్ము అందకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2,662 చేతికందాయి.. :
తోట సాంబయ్య, మల్లవల్లి
వినియోగం లేని ఖాతాలో పెన్షన్ వేసి పూర్తి మొత్తం అందకుండా చేశారని మల్లవల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు తోట సాంబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రూ.3 వేలు వచ్చే పెన్షన్.. బ్యాంక్ చార్జీల కింద రూ.338 కట్ చేసి ఇచ్చారని, తనలా చాలామంది ఉన్నారని, వారందరికీ పింఛన్ సొమ్ము మొత్తం అందని పరిస్థితి ఉందన్నారు. ఖాతాలు పరిశీలించి డబ్బు జమ చేయాలని ఆయన అధికారులను కోరారు.

గుడివాడలో టీడీపీ జెండా ఎగరాలి

▸ నందమూరి రామకృష్ణ ప్రచారం

నందివాడ (జనార్ధనపురం)/పామర్రు, మే 1 : తమ కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైన గుడివాడలో తెలుగుదేశం జెండా ఎగరాలని నందమూరి రామకృష్ణ అన్నారు. బుధవారం నందివాడ మండలంలో కూటమి అభ్యర్థులు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, నందమూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడ గడ్డపై ప్రచారం చేయటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ కుటుంబసభ్యులతో సమానమన్నారు. వైసీపీ ప్రభుత్వ దోపిడీతో నష్టపోతున్న ప్రజల కోసమే ప్రచారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రజల కోసం ఏదో చేస్తున్నామని చెప్పుకుంటున్న సీఎం జగన్ ప్రతిదానిపై పన్ను విధిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ సంక్షేమానికి మరో అర్థం టీడీపీ అనేలా ఎన్టీఆర్, చంద్రబాబు పాలన సాగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనలో రాష్ట్రం పూర్తిగా అప్పులపాలైందన్నారు. ప్రతీ ఒక్కరూ వైసీపీ అరాచకాలను గమనించి మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం బాలశౌరి మాట్లాడుతూ, వైసీపీ పాలన అంతా దొంగల మయం, అది నచ్చకే జనసేనలోకి వచ్చానని తెలిపారు. పార్లమెంట్‌కు నా వంతు కృషి, మేలు చేసే విధంగా అవకాశం కల్పించినందుకు ప్రజలకు ధన్యవాదాలు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇంటింటికి కుళాయి, మారుమూల గ్రామాలకు రోడ్లు వేయించే బాధ్యత తనదన్నారు. ప్రజలందరూ మొదటి ఓటు గాజు గ్లాసుపై, రెండో ఓటు సైకిల్‌పై వేయాలన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ, 20 ఏళ్లుగా చెప్పిందే చెబుతున్నాడు.. తప్ప ప్రజలకు సక్రమంగా తాగునీరు కూడా అందించలేదని స్థితిలో కొడాలి నాని ఉన్నారని ఎద్దేవా చేశారు.


ప్రచార వాహనంలో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము, నందమూరి రామకృష్ణ, బాలశౌరి తదితరులు

ఇప్పుడు చివరి అవకాశం అంటూ ప్రజలకు మాయమాటలు చెప్పటం తప్ప గ్రామాల్లో అభివృద్ధి ఏమీ చేయలేదన్నరు. అధికారమే తప్ప గ్రామాల అభివృద్ధి ఆయనకు కానరాదన్నారు. ఇప్పటికైనా గ్రామాల ప్రజలు మాయమాటలు నమ్మకుండా రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనార్ధనపురం, పుట్టగుంట, చినలింగాల, పెదలింగాల, నందివాడ, తుమ్మలపల్లి, కుదరవల్లి గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని బాబ్జీ, బూరగడ్డ శ్రీకాంత్, దానేటి సన్యాసిరావు, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

నిమ్మకూరులో రామకృష్ణ పూజాదికాలు

గుడివాడలో ఎన్నికల ప్రచారానికి ముందు స్వగ్రామైన నిమ్మకూరుకు నందమూరి రామకృష్ణ విచ్చేశారు. తొలుత తల్లిదండ్రుల విగ్రహాలకు పూలతో నివాళులర్పించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజాదికాలు నిర్వహించారు. ప్రజసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలుపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. అనంతరం గుడివాడ ఎన్నికల ప్రచారానికి బయలుదేరి వెళ్లారు. టీడీపీ నేతలు నందమూరి శివరామకృష్ణ, వీరంకి గురుమూర్తి, కాకరాల హరిబాబు, వల్లూరి కిరణ్ పాల్గొన్నారు.

పశ్చిమను అభివృద్ధి చేసి చూపుతా

▸ సుజనా చౌదరి హామీ

విద్యాధరపురం, మే 1: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరి హామీ ఇచ్చారు. బుధవారం టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణతో కలిసి 39వ డివిజన్ విద్యాధరపురంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనపై విసుగెత్తిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని సుజనా అన్నారు. వైసీపీ పాలనలో కూల్చివేతలు, అరాచకాలు, అభద్రత, అశాంతి మినహా అభివృద్ధి, సంక్షేమం లేవన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టే సమయం ఎన్నికల రూపంలో వచ్చిందని విధ్వంస పాలనకు చరమగీతం పాడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ఎస్ బేగ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.


విద్యాధరపురంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి

మహిళా సాధికారతే లక్ష్యం

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తానని సుజనా చౌదరి హామీ ఇచ్చారు. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై నిర్వహించిన సెమినార్‌లో సుజనా మాట్లాడారు. మహిళా హక్కులను జగన్ ప్రభుత్వం కాలరాసిందన్నారు. సుజనా ట్రస్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పదివేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో పశ్చిమ నియోజకవర్గంలో వృత్తి శిక్షణ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్, రోటరీ మాజీ గవర్నర్ రామారావు, శ్రామిక విద్యాపీఠం డైరెక్టర్ విద్యాకన్నా, ఆర్కే ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీలకు రక్షణ

మచిలీపట్నం టౌన్, మే 1: వైసీపీ ఐదేళ్ల పాలనలో బడుగు బలహీన వర్గాలపై దాడులు ఎక్కువగా జరిగాయని, మళ్లీ అధికారంలోకి వస్తే దళితులపై దాడులు తప్పవని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీలకు రక్షణ ఉంటుందని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. బుధవారం బలరామునిపేటలో కూటమి అభ్యర్థులు కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధికి నోచుకోలేదని జవహర్ అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో నిలిపివేసిన సబ్ ప్లాన్ నిధులను పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం ముదావహమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్సరాలకే పింఛను ఇస్తానని మేనిఫెస్టోలో చంద్రబాబు చెప్పారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలు కూటమి వెంటే ఉండేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు.


బలరామునిపేటలో పర్యటిస్తున్న మాజీ మంత్రి జవహర్

జగన్‌ది సైతాన్ మేనిఫెస్టో : జవహర్

గుడివాడ : చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రకటించిన మేనిఫెస్టో నిజమైన బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమని, జగన్ ప్రకటించింది సైతాన్ మేనిఫెస్టో అని కొత్తపల్లి జవహర్ ఆరోపించారు. బుధవారం గుడివాడ ప్రజావేదికలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇక్కడి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, వెనిగండ్ల విజయంతో మానవ భాష మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న గుడివాడ బూతులు, కేసినోలు, గంజాయి, జూదక్రీడలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి మేనిఫెస్టో ప్రజా మేనిఫెస్టో అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వెనిగండ్ల విజ యం తథ్యమని జవహర్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, నాయకులు వాసే మురళీ, కొడాలి రామరాజు, కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం..

సైకిల్ గుర్తుకు ఓటు వేయాలి

▸ యనమల రామకృష్ణుడు

రెడ్డిగూడె, మే 1 : ప్రతి ఒక్కరి భవిష్యత్ కోసం సైకిల్ గుర్తుకు ఓటు వేసి నారా చంద్రబాబు నాయుడ్ని ముఖ్యమంత్రి చేయాలని మాజీమంత్రి యనమల రామకృష్ణుడు ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం రాత్రి రెడ్డిగూడెంలో మహిళలు, నాయకులు కూటమి మైలవరం అభ్యర్థి వసంతతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇరిగేషన్ అభివృద్ధి చెందకపోతే రైతుల ఆర్థిక స్థితి బాగుపడదన్నారు. ప్రభుత్వంలోకి రాగానే మొట్టమొదట పూర్తి చేసేది చింతలపూడి ఎత్తిపోతల పథకమే అన్నారు. పిల్లల భవిష్యత్, ప్రజలకు మెరుగైన వసతులు, ప్రాంతాల అభివృద్ధి, రైతు భవిష్యత్ బాగుండాలన్నా జగన్ను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ పాలనలో వ్యాపారాలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వైసీపీ పాలనలో రౌడీ రాజ్యం ఏలుతోందన్నారు. ఎక్కడ చూసినా దోపిడీ తప్ప మరొకటి లేదన్నారు. దోపిడీ విధానం పోవాలన్నా, రాక్షసరాజ్యం పోవాలన్నా విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌ను గెలిపించాలన్నారు. ఎప్పుడు జగన్ దిగిపోతాడా అనే ఆలోచనలో ప్రతి ఒక్కరూ ఉన్నారన్నారు. సీఐటీయు మండల అధ్యక్షుడు కొండపల్లి పరమేశ్వరరావుతో పాటు పలువురు వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. కె.విజయబాబు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, జానలపాటి వేణు గోపాల్ రెడ్డి, బొమ్మని కోటేశ్వరరావు, కొండపల్లి బాబు, చాట్ల చందా, అక్కల రామ్మోహన్‌రావు, చాపలమడుగు కాంతారావు, పాములపాటి సుందర్రామిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెంలో మాట్లాడుతున్న యనమల, పక్కన వసంత కృష్ణప్రసాద్


16వ డివిజన్‌లో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేశినేని చిన్ని, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, గద్దె రామ్మోహన్


వైసీపీ తుడిచి పెట్టుకుపోవడం ఖాయం: గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, మే 1: కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని, రాష్ట్రంలో వైసీపీ తుడిచి పెట్టుకుపోవడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గంలోని 16వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో కలిసి బుధవారం ఆయన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్నికల ప్రచారం చేశారు. పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన అందిస్తామని గద్దె తెలిపారు. దివ్యాంగులను జగన్ విస్మరించారని, చంద్రబాబు దివ్యాంగులకు నెలకు రూ.6వేలు పింఛన్ ఇస్తామని ప్రకటించారన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, కేశినేని చిన్నిని ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. పవన్ కల్యాణ్ అభిమానులు ఉత్సాహంగా పనిచేస్తున్నారని, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళుతున్నారని కేశినేని చిన్ని అన్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, శంకర్ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా రాజధాని అమరావతి ఇక్కడే : వసంత

గొల్లపూడి/మైలవరం/ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, మే 1 : ప్రజా రాజధాని అమరావతి ఇక్కడే ఉంటుందని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి సాగునీటి సమస్యలు తీరుస్తామని, పేదలందరికీ ఉచిత ఇసుక అందిస్తామని టీడీపీ, బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి, షాబాద, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వసంతకు మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. నేతలు, కార్యకర్తల కేరింతల మధ్య వసంత ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. జగన్ మరల అధికారంలోకి వస్తే మన రాజధానిని వైజాగ్‌కు మార్చుతాడని వసంత అన్నారు. ప్రజా రాజధాని అమరావతి ఇక్కడే ఉండాలన్నా, అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభం కావాలన్నా, నాసిరకం మద్యం అరికట్టాలన్నా, ఉచిత ఇసుక కావాలన్నా, పేద ప్రజలకు అనేక మేళ్లు జరగాలన్నా ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. వైసీపీ నుంచి బయటకు వచ్చానని కక్ష గట్టి నన్ను ఓడించేందుకు కోట్లు వెదజల్లుతూ మైలవరంలో ముగ్గురు పరిశీలకులను జగన్ పెట్టాడన్నారు. రాయనపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పెయ్యల కృష్ణ మోహన్, పగడాల శ్యామ్, వివరం సాంబ శివరావు, రాంబాబు, బాలాజీ, కొలుసు సాంబశివరావుతో పాటు మరో 40 మందిని వసంత టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.





ఆర్వోలు, ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, జనరల్ అబ్జర్వర్లు మంజూరాజ్ సింగ్, నరేందర్ సింగ్ బాలి

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, మే 1: అత్యంత పారదర్శకంగా ఎన్టీఆర్ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ మంజూరాజ్‌పాల్, నరేందర్‌సింగ్ బాలి సమక్షంలో ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులతో పాటు ఎలక్షన్ ఏజెంట్లు, అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులు హాజరయ్యారు. తొలి ర్యాండ మైజేషన్ ద్వారా ఈవీఎంలను నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. బుధవారం రెండో ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ స్టేషన్‌లకు అనుసంధానించినట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గానికి 280 బ్యాలెట్ యూనిట్లు(బీయూలు), 280 కంట్రోల్ యూనిట్లు(సీయూలు), 304 వీవీ ప్యాట్లు, విజయవాడ పశ్చిమకు 303 బీయూలు, 303 సీయూలు, 328 వీవీ ప్యాట్లు, సెంట్రల్‌కు 642 బీయూలు, 321 సీయూలు, 346 వీవీ ప్యాట్లు, తూర్పుకు 357 బీయూలు, 357 సీయూలు, 387 వీవీ ప్యాట్లు కేటాయించినట్లు వివరించారు. మైలవరానికి 354 బీయూలు, 354 సీయూలు, 383 వీవీప్యాట్లు, నందిగామకు 266 బీయూలు, 266 సీయూలు, 288 వీవీ ప్యాట్లు, జగ్గయ్యపేటకు 266 బీయూలు, 266 సీయూలు, 288 వీవీ ప్యాట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.

రోజూ మధ్యాహ్నం 2 గంటలు అందుబాటులో ఉంటాం: అబ్జర్వర్లు

తాము రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విజయవాడ లబ్బీపేట బృందావన కాలనీలోని మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదులు, విజ్ఞాపనలను నేరుగా కలిసి సమర్పించవచ్చని జనరల్ అబ్జర్వర్లు మంజూరాజ్‌పాల్, నరేందర్ సింగ్‌బాలిలు తెలిపారు. మీడియా ద్వారా వెల్లడించిన ఫోన్ నెంబర్ల ద్వారానూ సంప్రదించవచ్చన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు, సీ-విజిల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, ఈసీఐ డిజిటల్ వేదికలపై జనరల్ అబ్జర్వర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, ఆర్వోలు పాల్గొన్నారు.

4 నుంచి పోస్టల్ బ్యాలెట్ సమరం

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 13,901 మంది ఉద్యోగుల దరఖాస్తు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి 13,901 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహించనున్నారు. నందిగామ నియోజకవర్గానికి చెందిన 2,690 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి ఫాం-12లను అందించారు. మైలవరం నుంచి 2,102 మంది, తిరువూరు నుంచి 2,008 మంది, విజయవాడ తూర్పు నుంచి 1,905, జగ్గయ్యపేట నుంచి 1,622, విజయవాడ పశ్చిమ నుంచి 1,174, సెంట్రల్ నియోజకవర్గం నుంచి 1,028 మంది ఉద్యోగులు ఫాం-12లను అందించారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 1,372 మంది తమ నియోజకవర్గాల పరిధిలో ఎన్టీఆర్ జిల్లా నుంచే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి ఫాం-12లను సమర్పించారు. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో తొంభై శాతానికి పైగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్ ఆఫీసర్లు (పీవో), సహాయ పోలింగ్ ఆఫీసర్లు(ఏపీవో) 9,204 మంది ఓటు హక్కు వినియోగించుకోవటానికి ఫాం-12లను అందించారు. పోలింగ్‌లో పాలు పంచుకునే ఇతర అధికారులు సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్వోలు, డ్రైవర్లు 1,575 మంది, మైక్రో అబ్జర్వర్లుగా నియమించిన వారిలో 243 మంది ఫాం- 12లను సమర్పించారు. 2,362 మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్ విభాగాలకు చెందిన వారు 517 మంది ఫాం-12 సమర్పించారు.

ఏవీఈఎస్ పోస్టల్ బ్యాలెట్‌కు 1,011 దరఖాస్తులు

ఆబ్సెంటీ ఓటర్స్ ఆన్ ఎసెన్షియల్ సర్వీసెస్(ఏవీఈఎస్) కింద 1,011 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్, బీఎస్ఎన్ఎల్, ఆలిండియా రేడియో, రైల్వే, తపాలా, టెలిగ్రామ్, దూరదర్శన్, వైద్యారోగ్యశాఖ, విమానయానశాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మీడియా, అంబులెన్స్ సర్వీసెస్ అందించే వారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేస్తారు.

7, 9 తేదీల్లో హోమ్ ఓటింగ్

ఈనెల 7, 9వ తేదీల్లో హోమ్ ఓటింగ్‌ను నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 1,047 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వృద్ధుల్లో 85 ఏళ్లకు పైబడినవారు, 40 శాతం మించి అంగవైకల్యం కలిగిన వారు హోమ్ ఓటింగ్ కోసం జిల్లా ఎన్నికల యంత్రాంగానికి ఫాం-12 డీలను సమర్పించారు. ఓటర్ల ఇంటికే వెళ్లి హోమ్ ఓటింగ్‌ను నిర్వహించనున్నారు. ఇది కూడా రహస్య విధానంలో పోస్టల్ బ్యాలెట్‌గానే నిర్వహించనున్నారు. పోలీసు బందోబస్తు, ఎన్నికల సిబ్బంది పర్యవేక్షణలోనే జరుగుతుంది.

హద్దు దాటి గుట్టుగా మట్టుబెట్టారు

▸ బ్లాక్ కాంగ్రెస్ నేత అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ
▸ ప్రధాన నిందితుడు, మాజీ నక్సలైట్ అరెస్టు
▸ రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో వివాదం
▸ చంపుతానని బెదిరించినందుకు చంపేశాడు
▸ భార్యాభర్తల వివాదం సెటిల్‌మెంట్‌తో ట్రాప్
▸ ఎల్లయ్య భౌతికకాయం దొరక్కుండా వైజాగ్‌కు

జగ్గయ్యపేట, మే 1 : తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మాజీ నక్సలైట్ తాడోజు శ్రీకాంతాచారి (46)ను జగ్గయ్యపేట పోలీసులు అరెస్టు చేసి స్థానిక కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం ముదిరి హత్యకు దారితీసినట్టు పోలీసుల విచారణలో తేలింది. పథకం ప్రకారం ఎలాంటి ఆధారం కూడా లభించకుండా, మృతదేహం కూడా దొరకని విధంగా హత్యకు ప్రణాళిక రచించటం పోలీసులను విస్మయానికి గురిచేసింది. సురక్షితంగా బయటపడాలంటే ఆంధ్ర ప్రాంతమే సరైనదని జగ్గయ్యపేటను ఎంచుకున్నట్టు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి భూ వివాదాల్లో కాంగ్రెస్ నేత ఎల్లయ్యకు, శ్రీకాంతాచారికి వివాదం తలెత్తగా ఇద్దరు తీవ్రస్థాయిలో హెచ్చరించుకున్నట్టు తెలిసింది. భార్యాభర్తల సెటిల్‌మెంట్ లో ముందుండే ఎల్లయ్యను ఆ కోణంలోనే హతమార్చటం సులువని ప్రణాళిక సిద్ధం చేశారు. హైదరాబాద్‌లో పండ్ల వ్యాపారం చేసుకునే ఎల్లయ్య సమీప బధువు వెంకన్న ద్వారా అపర్ణ అనే మహిళ, తన భర్త శ్రీనివాస్ అలియాస్ ఉపేంద్రకి మధ్య గొడవలున్నాయని, అతని నుంచి రావాల్సిన రూ.20 లక్షలు ఇప్పించాలని ఎల్లయ్య వద్ద పంచాయతీ పెట్టింది. ఆ మేరకు ఏప్రిల్ 18న హైదరాబాద్ నుంచి అపర్ణ, సూర్యాపేట వచ్చి అక్కడి నుంచి జగ్గయ్యపేట బయల్దేరారు. మార్గమధ్యలో ఎల్లయ్య తన పాత స్నేహితుడు అంజయ్యను కారులో తోడుగా తెచ్చుకున్నాడు. అంతకు రెండురోజుల ముందు జగ్గయ్యపేట వచ్చిన శ్రీకాంతాచారి, శ్రీను అతడి మిత్రులను సిద్ధం చేశారు. జగ్గయ్యపేట రాగానే డబ్బులిస్తానని నమ్మకంగా కారులో శ్రీనివాస్ ఒంటరిగా ఎల్లయ్యను తీసుకెళ్లాడు. అంజయ్య, అపర్ణలు ఆర్టీసీ బస్టాండు వద్దకు రాగా.. అపర్ణ వాష్‌రూంకు వెళ్తున్నానని చెప్పి అదృశ్యమవటం, శ్రీను, ఎల్లయ్యల ఫోన్లు స్విచ్ఛాఫ్ రావటం, అపర్ణ ఫోన్ అందుబాటులో లేకపోవటంతో అంజయ్య విషయాన్ని ఎల్లయ్య కుటుంబసభ్యులకు తెలియజేశాడు. అనంతరం ఎల్లయ్య సోదరుడు సతీష్ సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.


వడ్డే ఎల్లయ్య (ఫైల్‌ఫొటో)



ఎల్లయ్య జగ్గయ్యపేట వేసుకు వచ్చిన కారు

శ్రీకాంతాచారి, శ్రీను మరి కొంత మంది కలిసి ఎల్లయ్యను పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఒక చోట హత మార్చినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఎల్లయ్య మృతదేహాన్ని చేపలు పార్సిల్ చేసే బాక్సులో వేసి జాతీయ రహదారిపై కాకుండా వేరే మార్గంలో విశాఖ తరలించి సముద్రంలో పడవేసినట్టు ప్రధాన నిందితుడు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ఎల్లయ్య సూర్యాపేటలో తన మిత్రుడైన కలప వ్యాపారి కారును జాతీయ రహదారిపై నవాబుపేట వద్ద వదిలేశారు. ఈ వ్యవహారంలో వినియోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్‌లను ధ్వంసం చేసి ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో ఐదుగురికి పైగా పాల్గొన్నట్టు తెలుస్తున్నది. పోలీసులు ప్రధాన నిందితుడు శ్రీకాంతాచారిని అరెస్టు చేసి విగిలిన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. తెలంగాణలో అధికార పార్టీ నేత కావటంతో ఎల్లయ్య అదృశ్యం సంచలనం కలిగించింది. సూర్యాపేట, ఆంధ్రా పోలీసులు తొమ్మిది ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. ఎల్లయ్య మృతదేహం ఆచూకీ కోసం జగ్గయ్యపేట అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో గాలించారు. మొబైల్ టవర్ సిగ్నల్స్, కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేశారు. ఎల్లయ్య సూర్యాపేట నుంచి తెచ్చిన కారును ఏప్రిల్ 24న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంతాచారిపై ఆంధ్రా, తెలంగాణాల్లో 34కి పైగా కేసులు ఉన్నట్టు తెలిసింది. జగ్గయ్యపేట సీఐ జానకిరాం మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడిని కోర్టుకు హాజరుపరిచామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

మచిలీపట్నం, పామర్రు నియోజకవర్గాల్లో

గాజుగ్లాసు మార్పు

మచిలీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి చింతపల్లి మనోహర్‌కు గతంలో కేటాయించిన గాజుగ్లాసు గుర్తుకు బదులుగా విజిల్ గుర్తును కేటాయిస్తూ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.వాణి బుధవారం నిర్ణయం తీసుకున్నారు. పామర్రు అసెంబ్లీ నియోజకవర్గం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) అభ్యర్థి ఎం.రాజమనోహర్‌కు గతంలో కేటాయించిన గాజుగ్లాసు గుర్తు స్థానంలో బక్కెట్ గుర్తును కేటాయిస్తూ పామర్రు నియోజకవర్గ ఆర్వో బి.శ్రీదేవి నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ స్థానాల్లో జనసేనపార్టీ అభ్యర్థులు పోటీలో లేకుంటే గాజుగ్లాసు గుర్తును వేరే అభ్యర్థులకు గత నెల 29వ తేదీన ఆర్వోలు కేటాయించారు. జనసేన పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పోటీలో ఉండగా ఆయనకు గాజుగ్లాసు గుర్తును కేటాయించారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేనపార్టీ అభ్యర్థి పోటీలో లేకపోవడంతో గాజుగ్లాసు గుర్తుకోసం ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడ్డారు. లాటరీపద్ధతిలో చింతపల్లి మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తు కేటాయించారు. కేంద్ర ఎన్నికలసంఘం 10(5)నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు మచిలీపట్నం, పామర్రు నియోజకవర్గాల ఆర్వోలు తెలిపారు.



సరైన పత్రాలు చూపని రూ. 14 లక్షలు స్వాధీనం

కంకిపాడు, మే 1 : సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా మచిలీపట్నంకు చెందిన పచ్చిగొల్ల నరేంద్ర బాబు సరైన పత్రాలు లేకుండా రూ. 14.24 లక్షలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కంకిపాడు ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా అప్రైజర్ల నూతన కమిటీ ఎన్నిక

చిట్టినగర్, మే 1 : ఉమ్మడి కృష్ణా జిల్లాల సహకార కేంద్ర బ్యాంక్ అప్రైజర్ల నూతన కమిటీ సమావేశం బుధవారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జరిగింది. సమావేశంలో అప్రైజర్ల ఉద్యోగ సమస్యలు, వృత్తిపరమైన నైపుణ్యాలు, ఉద్యోగ భద్రత వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఉమ్మడి కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అప్రైంజర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా భవిరి సుధాకర్, తాటికొండ వరప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా రాణా బెనర్జీ, కోశాధికారి తలశిల శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.


ఉమ్మడి కృష్ణా జిల్లాల అప్రైజర్లు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.85

42వ డివిజన్‌లో నవీన్ ఎన్నికల ప్రచారం



విద్యాధరపురం, మే1: పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్‌లో పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సోదరుడి తనయుడు యలమంచిలి నవీన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను భారీ మెజారిటీలతో గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి పథకాలను వివరించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్, బీజేపీ అధ్యక్షుడు పి.కృష్ణ, జనసేన పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ తిరుపతి సురేష్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో హక్కుల పరిరక్షణ

నగరంలో ఘనంగా మేడే

గవర్నర్‌పేట, మే 1: సీపీఎం, సీఐటీయూ, పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగర వ్యాప్తంగా మేడే ఘనంగా నిర్వహించారు. బీసెంట్‌రోడ్డులో ముఠా కార్మికులు, వీధి వ్యాపారులు, మహంతి చేపల మార్కెట్ చిరు వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మేడేలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబూరావు ముఖ్య అతిథిగా హాజరై మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల దోపిడీ నుంచి ఐక్య ఉద్యమాల ద్వారా శ్రామికులు తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం నేతలు డి. కాశీనాథ్, బి. రమణారావు, సిహెచ్ శ్రీనివాస్, వై. సుబ్బారావు, సోమేశ్వరరావు, నిజాముద్దీన్, కార్మిక నేతలు లక్ష్మణ, మాదాల బ్రహ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్ : టీఎన్‌టీయూసీ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్నా ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవి కళ్యాణ మండపంలో బుధవారం మేడే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు ముందుగా కేక్ కట్ చేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు.



ముఠా కార్మికుల రిక్షా తొక్కుతున్న బాబూరావు

పాత రాజరాజేశ్వరిపేట 34వ డివిజన్ కేదారేశ్వరపేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం మే డే ఘనంగా జరిగింది. సీపీఐ నేత బుట్టి రాయప్ప పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నేతలు కాళ్ల చిన్నప్ప, దొడ్డా కుమార్, కాళ్ల విజయ్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం : మేడే స్ఫూర్తితో కార్మికులంతా తమ హక్కుల సాధనకు ఏకమై పోరాటాలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి, ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యాధరపురం 44వ డివిజన్ చెరువు సెంటర్‌లోని ఉప్పలపాటి సుబ్బరాజు భవన్ వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరుణ పతాకాన్ని జి. కోటేశ్వరావు ఆవిష్కరించి మాట్లాడారు. నక్కా వీరభద్రరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, శివప్రసాద్‌రాజు, కార్మికులు పాల్గొన్నారు.

పటమట : పటమట ఈ సేవాకేంద్రం ప్రాంతంలో సీపీఎం శ్రేణులు మేడే ఘనంగా నిర్వహించాయి. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.కృష్ణ , సీఐటీయూ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు, వీబీ రాజ్. ఎం.కోటబాబు, బి.బెనర్జీ, యల్లారావు, గురుమూర్తి, డి. రవీంద్ర పాల్గొన్నారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో బుధవారం మేడే జరిగింది. ఈ సందర్భంగా జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా, డైరెక్టర్ పూర్ణిమ మేడే విశిష్టతను తెలిపారు. సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

భారతీనగర్: గురునానక్ కాలనీలోని చిప్పింగ్ సెంటర్లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా మేడే బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ స్థానిక నాయకులు ఎ. సత్యం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు సీఐటీయూ సిటి అధ్యక్షుడు వి.బి రాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, పి.అప్పలస్వామి, యు.సీతమ్మనాయుడు, పి.మురళి నాని, ఉమా సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊర్మిళానగర్‌లో కేశినేని వెంకట్ ప్రచారం



భవానీపురం, మే 1 : ఎన్డీయే కూటమి బలపర్చిన పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనా చౌదరీ, ఎంపీగా కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ కేశినేన శివనాథ్ తనయుడు వెంకట్ బుధవారం ఊర్మిళానగర్, పోలేరమ్మగుడి, పార్కు సెంటర్, ఏకలవ్యనగర్‌ల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, పోలింగ్ తేదీ కరపత్రాలను పంచుతూ ప్రతీ ఒక్కర్ని ఆప్యాయంగా పలకరిస్తూ వెంకట్ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ, డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య, బి. కోటేశ్వరావు, పూజల శ్రీనివాస్, మల్లెబోయిన కొండ, సీనియర్ మహిళా నాయకురాలు వల్లభనేని ప్రసన్నలక్ష్మిలు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

అజిత్‌సింగ్‌నగర్, మే 1 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. బొండా ఉమా సోదరుడు బొండా శ్రీను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నేతలు దాసరి కనకారావు, పిరియా సోమేశ్వరరావు, గార్లపాటి విజయ్‌కుమార్, బెజవాడ తిరుపతి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం మాదిగల ప్రచారం

పాయకాపురం, మే 1 : ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపు మాదిగల గెలుపు అని ఎమ్మార్పీఎస్ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకపోగు ఏసు అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పాయకాపురం 62వ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ నేతలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నేతలు లింగాల నరసింహులు, వెంకటేశ్వరరావు, చప్పిడి కాశీ, కత్తుల దుర్గారావు, పాల్గొన్నారు.

- 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దాసరి జయరాజు, వేల్పుల రాజేష్; రాజు, వినయ్, దాసు, దుర్గారావు, నక్కా వెంకటేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు సినిమా 50 ఏళ్ల వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న ఫ్యాన్స్



గవర్నర్‌పేట, మే 1: సూపర్ స్టార్ కృష్ణ కథానాయకుడిగా విప్లవ నాయకుడు అల్లూరి జీవితాన్ని ఆధారం చేసుకుని నిర్మించిన బయోపిక్ విడుదలై నేటికి 50 సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డీ నాగసాయిబాబా మందిరం ప్రాంగణంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను సుధాస్వామి కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాస్వామి సూపర్‌స్టార్ కృష్ణ ఈ లోకం విడిచి వెళ్లినా ఆయన జ్ఞాపకాలు స్థిరస్థాయిగా నిలిచేలా అల్లూరి సీతారామరాజు చిత్రం సజీవంగా ఉంటుందని అన్నారు.

బీజేపీలో చేరికలు

విద్యాధరపురం, మే1: భవానీపురం బీజేపీ కార్యాలయంలో బుధవారం పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో కాంగ్రెస్, వైసీపీ నాయకులు, జాతీయ బీజేపీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జ్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మేనిఫెస్టో ప్రకటనతో కూటమి వైపు ప్రజల మొగ్గు

గద్దె రామ్మోహన్

పటమట, మే 1 : చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు, జగన్ మేనిఫెస్టోకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 14వ డివిజన్‌లో ఎన్టీఆర్ సర్కిల్ గంగానమ్మగుడి ఏరియాలో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ మేనిఫెస్టోల ప్రకటనతో ప్రజలు పూర్తిస్థాయిలో కూటమి వైపు మొగ్గు చూపుతున్నారని, ఫలితంగా వైసీపీ అభ్యర్థులు ఎటూ తేల్చుకోలేక చేతులెత్తేశారని విమర్శించారు. అమరావతి నిర్మాణాలే చంద్రబాబు విజనరీకి తార్కాణమని, అభివృద్ధికి ఆనవాళ్లు టీడీపీ అని తెలిపారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ తూర్పులో గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా, ఎంపీగా కేశినేని చిన్నిలు గెలుస్తారన్నారు. బీజేపీ నాయకులు పోతంశెట్టి నాగేశ్వరరావు, నర్రా కిషోర్, ముమ్మనేని ప్రసాద్, యడ్లపల్లి నాగరాజు, గరికపాటి శ్రీనివాస్, వీరంకి డాంగే కుమారి, యల్లబాబు, కర్రా కోటేశ్వరరావు, చెరుకూరి సాంబయ్యలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గద్దె రామ్మోహన్‌ను ఆశీర్వదిస్తున్న మహిళ

12 రోజుల్లో రాక్షస పాలన అంతం

కృష్ణలంక: గత ఐదేళ్ల నుంచి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, 12 రోజుల్లో రాక్షస పాలన అంతం కాబోతుందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం 21వ డివిజన్ కృష్ణలంక పాతపోలీస్ స్టేషన్‌రోడ్డు, రణదీవెనగర్ కట్ట ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ విజయాన్ని కాంక్షిస్తూ అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కుంటుపడిన అభివృద్ధిని కొనసాగించుకొనేందుకు రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను, ఎంపీగా కేశినేని చిన్నిలను గెలిపించాలని అనురాధ కోరారు.

రెండో డివిజ్లో గద్దె రాజేష్ ప్రచారం

గుణదల: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి నీటి కుళాయి ఉచితంగా అందజేస్తామని యువ నాయకుడు గద్దె రాజేష్ తెలిపారు. రెండో డివిజన్లోని జమిందార్ వీధిలో బుధవారం గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే గద్దె రామ్మోహన్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, గూటాల జేమ్స్, ఎలికల సురేష్‌బాబు, దేవరపల్లి శ్రీహరి, నాగుల్ మీరా, దుర్గాప్రసాద్, నాళం నరేంద్ర, పి.రత్నశ్రీ పాల్గొన్నారు.

మాచవరం: 6వ డివిజన్ మారుతినగర్, చైతన్య టెక్నో స్కూల్, మేయర్ వీధి, కోకోకోలా స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో టీడీపీ నేతలు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దె క్రాంతి ఇంటింటికి వెళ్లి టీడీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్నిలను గెలిపించాలని కోరారు. పడాల గంగాధర్, కనకశివ, పురషోత్తం పాల్గొన్నారు.

జనతా గ్యారేజ్‌లా ఉపయోగపడాలి

సుజనా, కొనకళ్ల

భవానీపురం, మే 1 : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి జనతా గ్యారేజ్‌లా ఈ కార్యాలయం ఉపయోగపడాలని ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఆకాంక్షించారు. 41వ డివిజన్‌లోని పీఆర్‌కే బిల్డింగ్స్ ప్రాంతంలో వెనిగళ్ల వారి వీధిలో పశ్చిమ ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణలు బుధవారం ఘనంగా ప్రారంభించారు. జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ ఎన్నికల కన్వీనర్ బాడిత శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ పశ్చిమలో జనసేన, టీడీపీ, బిజేపీ శ్రేణులు ఐక్యంగా కలిసి పనిచేసి సుజనా, ఎంపీగా కేశినేని శివనాథ్‌ల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. సెంట్రల్ ఆంధ్రా జనసేన జోనల్ కన్వీనర్ బాడిత శంకర్ మాట్లాడుతూ కూటమి అమలు చేసే మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఒక వరమని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజనీ పోతిన మహేష్ అనే చీడ పురుగు జనసేన నుంచి బయటకు వెళ్లిపోవడం జిల్లాకు పట్టిన దరిద్రం పోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్.బేగ్, కృష్ణాజిల్లా రాష్ట్ర లీగల్ సెల్ మెంబర్ గంజి పవన్‌కుమార్, జనసేన నేతలు మూర్తి శనివారపు శివ, సమ్మెట రాజానాయుడు, నామన కార్తీక్, రాజేష్, ఏలూరి సాయి శరత్‌లు పాల్గొన్నారు.

సుజనా పూజలు

చిట్టినగర్: శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని చిట్టినగర్‌లో ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామవారిని బుధవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి దర్శించుకొని పూజలు చేశారు. ఆయనకు కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.



పశ్చిమ ఎన్డీఏ కార్యాలయ ప్రారంభోత్సవంలో సుజనా చౌదరి, కొనకళ్ల, బాడిత శంకర్

రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగులే నిజమైన హీరోలు



మహిళా ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ వర్షాపాటిల్

రైల్వేస్టేషన్, మే 1: రైల్వేలో నిజమైన హీరోలు తెరవెనుక పనిచేసే గ్రూప్ డి ఉద్యోగులేనని సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ వర్షా పాటిల్ అన్నారు. మేడే సందర్భంగా ఈ వరల్డ్ సెంటర్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో 12 మంది గ్రూప్ డి మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రైల్వే ప్రతిష్ఠను ఇనుమడింప చేయడంలో గ్రూప్ డి సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. జాయింట్ సెక్రటరీ మంచెం వసంతిక, జాకండ్ జిల్ సెక్రటరీ శ్రీ రమ్య చంద్రవతి, డివిజనల్ పీఆర్వో చంద్రత్ ఎం మంద్రూష్కర్ పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన

గవర్నర్‌పేట, మే 1: జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 23వ డివిజన్‌లోని ఏలూరు రోడ్డు, రామమందిరం వీధి, శేషాద్రి వీధి, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, పెద్దిబోట్ల వారి వీధి, బీసెంట్ రోడ్డు ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి నేతృత్వంలో బొండా ఉమా తనయుడు బొండా రవితేజ ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు.

విద్యాధరపురం: 40వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పథకాల గురించి, భవిష్యత్తు గ్యారెంటీ గురించి ఇంటింటికి వివరించారు. 27, 29 బూత్ కన్వీనర్‌లతో గాంధీ బొమ్మ రోడ్డులో సుమారు 75కు పైగా నివాసాల్లోని ఓటర్లకు ఎంపీ అభ్యర్థిగా సైకిల్ గుర్తుపై, పశ్చిమ బీజేపీ అభ్యర్థిగా కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. పెండ్యాల వెంకటాద్రి, మన్నం నారాయణరావు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, చంద్రనారాయణ, దేవినేని మహేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

కేశినేని శ్రీదేవి ఇంటింటి ప్రచారం



శ్రీదేవిని సత్కరించిన బుద్దా వెంకన్న కుటుంబసభ్యులు

వన్‌టౌన్, మే1: మల్లికార్జున పేట 38వ డివిజన్‌లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు కేశినేని శివ నాథ్ (చిన్ని) సోదరి శ్రీదేవి బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివనాథ్, సుజనా చౌదరిలను గెలిపించాలని కోరారు. హెడ్ వాటర్ వర్క్స్, అండిమాని బ్రహ్మయ్య వీధి, కృష్ణా కరకట్ట, కుమ్మరిపాలెం సెంటర్, లోటస్ అపార్ట్‌మెంట్‌లు, పున్నమి హోటల్ తదితర ప్రాంతాలలో ఆమె ప్రచారం నిర్వహించారు. షేక్ ఆశా, చెన్నుపాటి ఉషారాణి, పితాని పద్మ, ఈశ్వర్, బూత్ కన్వీనర్లు చీదెళ్ల సతీష్, ఏ.చంటి, మహేశ్వరరావు, వెంపటి జయకిరణ్ పాల్గొన్నారు.

చిట్టినగర్: బీజేపీ, జనసేన బలపర్చిన టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సోదరి కేశినేని శ్రీదేవి బుధవారం 50వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

చిన్ని సోదరి శ్రీదేవికి సత్కారం

వన్‌టౌన్: 38వ డివిజన్ మల్లిఖార్జున పేటలో నివాసముంటున్న మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఇంటికి బుధవారం విజయవాడ ఎంపీ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సోదరి శ్రీదేవి వెళ్లారు. శివనాథ్ గెలుపు కోసం సైకిల్ గుర్తుకు, సుజనా చౌదరి గెలుపు కోసం కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న, కుటుంబ సభ్యులు ఆమెకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి దుశ్శాలువా కప్పి చిరుసత్కారం చేశారు.

ఆర్‌యూబీ పరిశీలన

మధురానగర్, మే 1 : రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఆర్‌యూబీని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు పరిశీలించారు. ఆర్‌యుబిలోపల నడుస్తూ పనులు ఇంకా ఏమేమి చేయాలో చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సర్వీస్ రోడ్లు, వర్షం నీరు నిల్వ ఉండకుండా దారి మళ్లించాడానికి వీలుగా భారీ మోటార్లు, సంపు పనులుకూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

వైసీపీని వెంటాడుతున్న జోగి రమేష్ అవినీతి మరకలు

పెడనలో గెలుపెవరిదో..!

● సానుభూతితో టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ● తొలిసారిగా ఎన్నికల బరిలో వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము



జిల్లా కేంద్రం మచిలీపట్నానికి అత్యంత సమీపంలోని పెడన అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు వి చిత్రంగా ఉంటాయి. కలంకారీ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన ఈ నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అధికం. 40వేల మందికిపైగా కాపు ఓటర్లు ఉన్నారు. తరువాత గౌడ, నేత కార్మికులు, యాదవులు, ముస్లింలు, దళితుల ఓటింగ్ ఎక్కువ. ఇక్కడ టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఇరువురూ గౌడ సామాజికవర్గానికి చెందినవారే. దీంతో ఈసారి జరిగే ఎన్నికలో పోటీ రసవత్తరంగా మారింది. మైలవరం నుంచి పెడనకు వలస వచ్చిన జోగి రమేష్‌ను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. ప్రస్తుతం ఆయన మంత్రిగా ఉన్నారు. ఈసారి స్థానికుల మధ్యనే పోటీ జరుగుతోంది. పెడన నియోజకవర్గం ప్రజలు ఎవరిని అందల మెక్కిస్తారు? ఎవరిని ఇంటిబాట పట్టిస్తారు? అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

కృష్ణప్రసాద్‌కు సానుభూతి కలిసొస్తుందా?



పెడన నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న కాగిత కృష్ణప్రసాద్.. టీడీపీ సీనియర్ నేత, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దివంగత కాగిత వెంకట్రావు కుమారుడు. వెంకట్రావు అనారోగ్యం బారిన పడటంతో 2019 ఎన్నికల్లో ఆయన కుమారుడు కాగిత కృష్ణప్రసాద్‌కు పెడన నియోజకవర్గం టీడీపీ టిక్కెట్టును కేటాయించారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ తరఫున ప్రజలపక్షాన పోరాటాలు చేస్తూ వచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు పెడన టిక్కెట్టును ఆయనకే ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు కుమారుడిగానే కాకుండా, స్వతహాగా ఈ ఐదేళ్లలో తన దైన శైలిలో నియోజకవర్గంలో పట్టును పెంచుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోని అందరు నాయకులను కలుపుకుని పోతున్నారు.

జోగి రమేష్ అవినీతికి అంతేలేదు



జోగి రమేష్ 2009లో పెడన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచారు. 2014లో ఆయన మైలవరం నియోజకవర్గానికి మారారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా పెడన నుంచి పోటీ చేసిన జోగి రమేష్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి తన అవినీతి సామ్రాజ్యాన్ని వి స్తరించాడు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని మడ అడవులుగా ఉన్న భూములు, సాల్ట్ భూములను వేలాది ఎకరాలు ఆక్రమించుకుని రొయ్యలు, చేపల చెరువులుగా మార్చేశారు.

● నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తన బంధువులను, స్నేహితులను ఏజెంట్లుగా పెట్టుకుని పెద్దఎత్తున మట్టిదందా కొనసాగించారు. ప్రతి వేసవిలో మట్టితవ్వకాల నిమిత్తం వేలంపాటలు పెట్టి మరీ మండలానికి కోటి రూపాయల చొప్పున ధరగా నిర్ణయించి తన అనునయులకు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చేశారు.

మల్లేశ్వరం నుంచి పెడనలోకి...

● పెడన నియోజకవర్గం 1955 నుంచి 2009 వరకు మల్లేశ్వరం నియోజకవర్గంగా ఉంది. 2009లో పెడన నియోకవర్గం ఏర్పడింది. గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 1,67,564 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 83,008 మంది. మహిళా ఓటర్లు 84,556 మంది.

నియోజకవర్గంలో ప్రధాన సమస్యలివీ..

● పెడనలో డిగ్రీ కళాశాల లేదు. ● శివారు ప్రాంతంలో ఉన్న ఈ నియోజకవర్గంలో సాగునీటి కొరత తీవ్రంగా ఉంది. కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు మండలాల్లో తాగునీటి సమస్య ఉంది. ● చినపాండ్రాకలో ప్రారంభం కాని వంద పడకల ఆసుపత్రి ● బంటుమిల్లిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య ఉంది.

పెడన నియోజకవర్గంలో విజేతలు వీరే...

ఏడాది	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
2009	జోగి రమేష్	కాంగ్రెస్	కాగిత వెంకట్రావు	టీడీపీ
2014	కాగిత వెంకట్రావు	టీడీపీ	బూరగడ్డ వేదవ్యాస్	వైసీపీ
2019	జోగి రమేష్	వైసీపీ	కాగిత కృష్ణప్రసాద్	టీడీపీ
మల్లేశ్వరం నియోజకవర్గంలో				
1955	పిన్నింటి పమిడేశ్వరరావు	కాంగ్రెస్	గుండాబత్తుల ఆంజనేయులు	సీపీఐ
1962	పిన్నింటి పమిడేశ్వరరావు	కాంగ్రెస్	యర్రంశెట్టి కృష్ణమూర్తి	స్వతంత్ర
1967	బూరగడ్డ నిరంజనరావు	స్వతంత్ర	పిన్నింటి పమిడేశ్వరరావు	కాంగ్రెస్
1972	పిన్నింటిపమిడేశ్వరరావు	కాంగ్రెస్	బూరగడ్డ నిరంజనరావు	స్వతంత్ర
1978	బూరగడ్డ నిరంజనరావు	జనతాపార్టీ	యాళ్ల బలరామమూర్తి	కాంగ్రెస్
1983	అంకెం ప్రభాకరరావు	టీడీపీ	బూరగడ్డ నిరంజనరావు	కాంగ్రెస్
1985	కాగిత వెంకట్రావు	టీడీపీ	బూరగడ్డ నిరంజనరావు	కాంగ్రెస్
1989	బూరగడ్డ వేదవ్యాస్	కాంగ్రెస్	కాగిత వెంకట్రావు	టీడీపీ
1994	కాగిత వెంకట్రావు	టీడీపీ	బూరగడ్డ వేదవ్యాస్	కాంగ్రెస్
1999	కాగిత వెంకట్రావు	టీడీపీ	బూరగడ్డ వేదవ్యాస్	కాంగ్రెస్
2004	బూరగడ్డ వేదవ్యాస్	కాంగ్రెస్	కాగిత వెంకట్రావు	టీడీపీ

వివాదాస్పదుడిగా.. ఉప్పాల రాము



పెడన నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రమేష్ (రాము) పోటీలో ఉన్నారు. రాము తండ్రి ఉప్పాల రామ్‌ప్రసాద్ 35 సంవత్సరాలుగా నియోజకవర్గంలో క్రియాశీలక రాజకీయాలు నడిపారు. గతంలో టీడీపీలోనే ఉప్పాల కుటుంబం ఉండగా వివిధ కారణాలతో వైసీపీలో చేరారు. పెడన వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఉప్పాల రాము భార్య ఉప్పాల హారిక జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. జెడ్పీలో పెత్తనమంతా ఆమె భర్త రాము కనుసన్నల్లోనే నడుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని మండలాల నుంచి వివిధ పనులపై వచ్చేవారు రామును కలిస్తేనే పనులు జరుగాయని ప్రచారం. పరిపాలనా పరమైన అంశాలతోపాటు, ఉద్యోగుల బదిలీల్లోనూ రాము జోక్యం చేసుకుని తనదైన శైలిలో వ్యవహరిస్తుంటారు. జెడ్పీ సీఈవోగా తనకు అనుకూలమైన అధికారి వీర్ల జ్యోతి బసుకు పోస్టింగ్ ఇప్పించుకుని జెడ్పీపాలనలో తనదైన చక్రం తిప్పారు. తన సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులపట్ల ఒకరకంగా, తనకు అనుకూలంగా లేని ఉద్యోగుల పట్ల మరోరకంగా వ్యవహరిస్తుంటారు. కొందరు ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలలో భాగంగా జిల్లాలోని దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. జెడ్పీకి చెందిన కార్లను అనధికారికంగా వినియోగిస్తుంటారు. జెడ్పీకి చెందిన కార్లలో తెలంగాణా నుంచి మద్యం తీసుకువచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. మచిలీపట్నం జెడ్పీ ప్రాంగణంలోని అతిథి గృహానికి పరిపాలనా అనుమతులు లేకుండానే తన మనుషులతో పనులు చేయించి లక్షలాది రూపాయల బిల్లులు గుట్టుచప్పుడు కాకుండా చేసుకున్నారని ఆపరోపణలున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు క్లర్క్ (సీసీ) ద్వారా ఆర్థికపరమైన వ్యవహారాలు గుట్టు చప్పుడు కాకుండా నడిపారు. రాము నోటి దురుసుతో జెడ్పీ ఉద్యోగులపై విరుచుకుపడటంతో కొంతకాలంగా ఉద్యోగులు తాము ఇక్కడ పనిచేయలేమని చెప్పడం గమనార్హం.

ఆ వైద్యుడు... పోరాట యోధుడు!



ఆయన మూరుమూల గ్రామంలో పుట్టి పెరిగి.. వైద్య వి ద్య అభ్యసిస్తూనే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు జరిపిన ఆదర్శమూర్తి. ఆయనే ఉమ్మడి కృష్ణాజిల్లా కంకిపాడు మండలం తెన్నేరు గ్రామానికి చెందిన డాక్టర్ తెన్నేటి వెంకట శేషాచలపతిరావు అలియాస్ టీవీఎస్ చలపతిరావు. రామచంద్రరావు, దుర్గమ్మ దంపతులకు 1911 అక్టోబర్ 15న ఐదో సంతానంగా జన్మించిన ఆయన తన రెండో అన్నయ్య వద్ద ఇసుక మీద అక్షరాలు దిద్దుతూ అక్షరాభ్యాసం చేశారు. 1929లో రాయపురం మెడికల్ స్కూల్‌లో విదేశీ వస్త్ర బహిష్కరణ పోరాటంలో పాల్గొన్నారు. బ్రిటీష్‌వారు అరెస్టు చేసి రూపాయన్నర జరిమానా వి ధించినా లెక్కచేయలేదు. టంగుటూరి ప్రకాశం పంతులుగారి స్ఫూర్తితో.. ఆయన భావజాలంతో స్వాతంత్ర్య పోరాటంలోకి ప్రవేశించారు. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగాలను బహిష్కరించడంలో భాగంగా బోర్న్‌ఫైర్ అనే కార్యక్రమంలో నూలు వడకటం కోసం రాట్నాలు పంచారు. 1937లో మద్రాసు ప్రెసిడెన్సీలోని విజయవాడలో స్థానికసంస్థకు కౌన్సిలర్‌గా మొట్టమొదటిసారిగా ఎన్నికయ్యారు. 1942లో కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్టుకు నిరసనగా కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ అనే రహస్య పత్రికను నడపడానికి, రాష్ట్రంలో పంచడానికి సహాయపడ్డారు. ఆ సమయంలో ముంబయి నుంచి వచ్చే రహస్య పత్రికలను పంచడానికి ఏర్పడిన ఆర్థిక కమిటీకి బాధ్యత వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో నాటు బాంబులను, డైనమైట్‌లను కాంగ్రెస్ వర్కర్లకు అందించేవారు. 1947లో విజయవాడ కౌన్సిల్‌కు పోటీచేసి అప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న జస్టిస్ పార్టీ అభ్యర్థిని ఓడించారు. చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండుసార్లు చైర్మన్‌గా పనిచేశారు. ఇప్పుడు మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న పూల మార్కెట్ స్థలంలో అప్పట్లో పవర్ హౌస్ ఉండేది. దీని ద్వారా విజయవాడ మున్సిపాలిటీ నగరానికి విద్యుత్ సరఫరా అయ్యేది. ఇదే ఆదాయ వనరుగా ఉండేది. కౌన్సిల్ నుంచి పవర్ హౌస్‌ను లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయగా దానిని అడ్డుకున్నారు. ఈ వ్యవహారంలో హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసు గెలిచారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో 1952లో ప్రజా సోషలిస్టు పార్టీ తరుపున విజయవాడ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందారు. అయ్యదేవర కాళేశ్వరరావు రెండోసారి ఎన్నికల్లో పోటీచేసి ఫలితాలకు ఒకరోజు ముందు మరణించారు. ఆ ఉప ఎన్నికల్లో పోటీచేసి శాసనసభ్యుడిగా గెలిచారు. డాక్టర్‌గా సేవలు కొనసాగిస్తూ ఇంత పోరాటకాలంలో కూడా ఆయన తన వృత్తి ధర్మాన్ని వదల్లేదు. నిరుపేదలకు వైద్యం చేసేవారు. రోగ నిర్ధారణ చేసే మెడికల్ లేబొరేటరీ కోస్తా ప్రాంతంలో మొట్టమొదట తన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ముందుచూపు ఉన్న వైద్యుడు. పోరాటాలతోపాటు అనేక సేవాకార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందారు. పది మందికీ ఆదర్శంగా నిలిచారు. - మొగల్రాజపురం

అవనిగడ్డలో హ్యాట్రిక్ వీరులు

అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి వారిరువురూ హ్యాట్రిక్ వీరులయ్యారు. 1973, 78, 83లలో వరుసగా జరిగిన ఎన్నికల్లో మండలి వెంకట కృష్ణారావు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో నాడు సింహాద్రి సత్యనారాయణరావు ఎన్నికయ్యారు. ఆ తదుపరి దివంగత వంగవీటి మోహన రంగా దారుణ హత్య అనంతరం జరిగిన ఎన్నికల్లో సైతం సింహాద్రి సత్యనారాయణరావు విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా రంగా హత్య ప్రభావం చూపినా ఈ నియోజకవర్గంలో సత్యనారాయణ గెలుపొందారు. 1994లో జరిగిన ఎన్నికల్లో మరోమారు విజయం సాధించి సింహాద్రి సత్యనారాయణ దేవదాయశాఖతోపాటు వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా కూడా పని చేశారు. ఈ నియోజకవర్గంలో ఇద్దరు వ్యక్తులు హ్యాట్రిక్ సాధించటం, ఇద్దరూ మంత్రులు కావడం విశేషం.



ఎం.వెంకట కృష్ణారావు (ఫైల్)



సింహాద్రి సత్యనారాయణ (ఫైల్)

- అవనిగడ్డ రూరల్

విద్యాసంస్థల్లో ఎన్నికలు జరగాలి

● విద్యార్థి సంఘాలు బలహీనపడటమే వారిలో చైతన్యం కొరవడటానికి కారణం
● సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి వెంకటేశ్వరరావు



మొగల్రాజపురం : మంచి ప్రభుత్వాలు రావాలంటే ఓటర్లలో చైతన్యం రావాలని, ఇందుకు విద్యార్థి దశలోనే విద్యా సంస్థల్లో ఎన్నికలు జరగాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయాలు - వి ద్యార్థుల పాత్ర అనే అంశంపై ఆంధ్రజ్యోతి ఆయనను కదిలించగా తన మనోగతాన్ని వెల్లడించారు. "ఓటర్లలో చైతన్యం రావాలంటే విద్యార్థి దశ అత్యంత ముఖ్యమైంది. విద్యార్థి దశలోనే సమాజం పట్ల బాధ్యత, సమస్యల పట్ల అవగాహన, పరిష్కార మార్గం... తెలియాలంటే విద్యార్థి సంఘాలు బలంగా ఉండాలి. విద్యార్థి దశలో బలమైన పోరాటలు చేసి రాజకీయాల్లోకి వచ్చి నాయకులైనవారు.. ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లోకి వెళ్లి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసినవారు ఒకప్పుడు ఎక్కువ మంది ఉండేవారు. ప్రస్తుతం విద్యా విధానం మారింది. తల్లిదండ్రుల ఆలోచనలు మారాయి. ర్యాంకులు, ఉపాధి, ఉద్యోగంవైపు పరుగులు పెట్టే వి ధానమే కనిపిస్తోంది తప్ప సమాజం పట్ల, రాజకీయాల పట్ల అవగాహనతో ముందుకొచ్చే విద్యార్థులు అతి స్వల్పం. ప్రస్తుత పత్రికా రంగంలో ఉన్నవారిలో అత్యధికులు వివిధ విద్యార్థి సంఘాల నుంచి వచ్చినవారే. వారికి సమాజం పట్ల బాధ్యత, సమస్యల పట్ల అవగాహన ఉంటుంది. ఒకప్పుడు కళాశాలల్లో ఎన్నికలు జరిగేవి. దీనివల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరిగేవి. విషయ పరిజ్ఞానం ఉండేది. రాజకీయాల పట్ల, చట్టాల పట్ల అవగాహన ఉండేది. ప్రశ్నించేతత్వం ప్రస్ఫుటించేది. పోరాడే ధైర్యం, తెగింపు ఉండేవి. ప్రస్తుతం విద్యార్థి సంఘాలున్నా కొన్నిచోట్ల కొన్ని సంఘాలే పని చేస్తున్నాయి. అవి రాజకీయ నాయకులకు, పార్టీలకు అనుబంధంగా పనిచేస్తున్నాయి. కొన్ని విద్యార్థి సంఘాలు పార్టీలకు అనుబంధంగా వారి సిద్ధాంతాలను బట్టి నడుచుకుంటున్నాయి. రానురానూ విద్యార్థుల నుంచి నాయకులు రావడం తగ్గిపోతోంది. విద్యార్థి సంఘాలు బలపడితేనే విద్యార్థులు మరింత చైతన్యవంతులు కాగలరు. కళాశాలల్లో విద్యార్థులకు ఎన్నికలు పెట్టే విధానం రావాలి. అది వ్యక్తి చైతన్యాన్ని పెంచుతుంది. ఆ తరువాత రాజకీయ చైతన్యం వస్తుంది. రాజకీయ చైతన్యం ఉన్నవారికి సమాజం పట్ల బాధ్యత ఉంటుంది. అటువంటివారు మంచి పాలన అందించగలుగుతారు" అని ఆయన వి వరించారు.

ఎన్‌డీబీ రోడ్లపై ప్రతిష్టంభన

ఆర్ అండ్ బీ రోడ్ల విస్తరణ పనులు అయోమయం

● ఎన్‌డీబీ నిధులు సొంతానికి వాడిన ప్రభుత్వం
● ఉమ్మడి కృష్ణాజిల్లాలో 13 ఆర్ అండ్ బీ రోడ్లను రెండు వరుసలుగా వి స్తరించేందుకు శ్రీకారం
● రూ.234 కోట్ల వ్యయంతో టెండర్లు
● టెండర్లను దక్కించుకున్న వృద్ధి కన్‌స్ట్రక్షన్స్
● నిధుల దారిమళ్లింపుతో నిలిచిన రోడ్ల పనులు

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో తలపెట్టిన ఆర్ అండ్ బీ రోడ్ల విస్తరణ పనులు వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల నిలిచిపోయాయి. ఈ నిధులను కూడా ప్రభుత్వం వాడేసుకుంది. ఎన్‌డీబీ మలివిడత రుణాన్ని నిలుపుదల చేసింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో అత్యంత ప్రధానమైన 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్లుగా వి స్తరించేందుకు రూ.234 కోట్ల వ్యయంతో పిలిచిన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు ఎన్‌డీబీ రుణంతో ఆర్ అండ్ బీ రోడ్ల విస్తరణ పనులకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటికే రెండేళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధిని వదిలేసిన వైసీపీ ప్రభుత్వం అనూహ్యంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ప్రభుత్వ అంతర్గత ఆలోచన ఎవరికీ అర్థం కాలేదు. ఎన్‌డీబీ ద్వారా అప్పుగా తీసుకున్న మొత్తాన్ని రోడ్లకు కాకుండా ప్రభుత్వమే వాడేసుకోవాలని భావించే ఈ పనులకు శ్రీకారం చుట్టిందన్నది ఇప్పుడు అర్థమవుతోంది. ఎన్‌డీబీ నిధులకు సంబంధించి ప్రభుత్వాలు వాడుకోవటానికి వీలులేకుండా ఉంటాయి. దీని కోసం ఒక ప్రత్యేకమైన ఎస్క్రో ఖాతాను తెరవాల్సి ఉంటుంది. ఆ ఖాతాకు డబ్బులు మళ్లించిన తర్వాతే.. ఎన్‌డీబీ నిర్దేశించిన నిబంధనల ప్రకారం.. దశలవారీగా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా ఎన్‌డీబీ రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవటంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి.

● **గంపగుత్తగా అయినవారికి కాంట్రాక్టులు**

ఎన్‌డీబీ నిధులతో చేపట్టే ఈ పనులు ఎక్కడా బ్రేక్ పడకుండా ఉండటం కోసం జాతీయ రహదారుల పనులు చేపట్టే స్థాయి కలిగిన కాంట్రాక్టర్లనే టెండర్లు వేయటానికి అనుమతించాలని నిబంధనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి ఎన్‌డీబీ గ్రాంట్స్ ద్వారా జరిగే పనులను గంపగుత్తగా 'వృద్ధి కన్‌స్ట్రక్షన్స్' అనే సంస్థ పనులన్నింటినీ దక్కించుకుంది. ఈ సంస్థ అధికార వైసీపీకి కావాల్సిన సంస్థగా కూడా ప్రచారం జరిగింది. అన్ని రోడ్లను దక్కించుకున్న ఈ సంస్థ చివరికి వాటిని సబ్‌కాంట్రాక్టర్లకు ఇచ్చింది. మొత్తం 13 రోడ్లకు సంబంధించిన పనులను సబ్ కాంట్రాక్టులకు ఇచ్చేసింది. నాలుగు సబ్ కాంట్రాక్టు సంస్థలు మాత్రమే జంగిల్ క్లియరెన్స్, మార్జిన్స్ మట్టి చదును పనులు ప్రారంభించాయి. ఆ తర్వాత మిగిలిన సబ్ కాంట్రాక్టు సంస్థలు ఎన్‌డీబీ నిధులను కూడా ప్రభుత్వం మింగేస్తుందేమోనని భయపడ్డాయి. అప్పటికి వివిధ శాఖల్లో అనేక ఇంజనీరింగ్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు ఎగ్గొట్టింది. ఈ కారణంతో ఎన్‌డీబీ పనులకు కూడా బిల్లులు రావేమోనన్న భయంతో సబ్‌కాంట్రాక్టు సంస్థలు రోడ్ల పనులు ఆపివేశాయి. ఏడాది క్రితం వర్షాకాలం ముందు పనులు ఆగిపోయాయి. అధికారులను అడిగితే వర్షాకాలం కదా అందుకే ఆగాయని, వానలు పడటం ఆగిపోగానే ప్రారంభం అవుతాయని అన్నారు. వర్షాకాలం పోయి శీతాకాలం వచ్చింది. ప్రస్తుతం నడి వేసవిలో కూడా పనులు జరగటం లేదు.



ఎన్‌డీబీ రుణంతో చేపట్టే ప్రధాన రోడ్లు ఇవీ..



జిల్లాలో మొత్తం 13 ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎన్‌డీబీ గ్రాంట్ కింద పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. వీటిలో మచిలీపట్నం - నూజివీడు - కల్లూరు రోడ్డు, చెవిటికల్లు - వత్సవాయి రోడ్డు, నూజివీడు - ఏలూరు రోడ్డు, గన్నవరం - పుట్టగుంట రోడ్డు, మధిర - కంచికచర్ల రోడ్డు, నూజివీడు - గన్నవరం రోడ్డు, కందులపాడు - గంగినేనివారి పాలెం రోడ్డు , నందిగామ - పొక్కునూరు రోడ్డు, కౌతవరం - నిడుమోలు - ఐలూరు రోడ్డు, తేలప్రోలు -వుయ్యూరు - వల్లూరు రోడ్డు , నడుపూరు - వాడవల్లి - కోరుకల్లు రోడడ్డు, మంటాడ - లంకపల్లి రోడ్డు, మచిలీపట్నం - కమ్మవారి చెరువు వయా చిన్నాపురం రోడ్లకు టెండర్లు పిలిచారు.



ఆగిపోయిన రోడ్డు పనులు ఇవీ..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పిలిచిన 13 రోడ్లకు వాస్తవానికి కేవలం నాలుగు రోడ్ల పనులు మాత్రమే అప్పట్లో మొదలయ్యాయి. వీటిలో నూజివీడు - వి జయవాడ రోడ్డు పనులు మాత్రమే పూర్తిస్థాయిలో వి స్తరణ జరిగింది. మరో మూడు రోడ్లు పూర్తి కాలేదు. వి ఎగిలిన 9 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. వీటిలో ఒకటి, రెండు రోడ్లకు సంబంధించి జంగిల్ క్లియరెన్స్, మార్జిన్ లెవల్స్ మాత్రమే జరిగాయి తప్ప అసలు పనులు మొదలే కాలేదు. మొత్తం 9 రోడ్ల పనులు అసలు మొదలే కాలేదన్నమాట.

బుర్రలేని సర్కార్.. డేటా చోర్!

ప్రజల వ్యక్తిగత సమాచారం మొత్తం సేకరణ

సైబర్ నేరగాళ్లకు ఏపీ సర్కారు 'సమాచార విందు'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"వ్యక్తిగత సమాచారానికి రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉంది. ప్రభుత్వం కూడా దాన్ని తీసుకోవడానికి లేదు".. ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా? వైఎస్ జగన్మోహన్ రెడ్డి! ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన, 2019 ఎన్నికల ముందు విపక్ష నేతగా 'డేటా చోరీ' పేరుతో నానా రచ్చ చేశారు. 'అమ్మో.. మీ ఆధార్ నంబర్లు చంద్రబాబు దగ్గరున్నాయి. అయ్యో.. మీ బ్యాంకు ఖాతా వివరాలు చంద్రబాబు దగ్గరున్నాయి ' అంటూ ఊరూరా ఊదరగొట్టారు! అప్పట్లో తెలంగాణలో ఉన్న అనుకూల సర్కారు ద్వారా హైదరాబాద్ కేంద్రంగా హైడ్రామా నడిపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల పేర్లతో వలంటీర్ల ద్వారా ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించేశారు. దానిని ఒక ప్రైవేటు కన్సల్టెన్సీకి అప్పగించి... రాజకీయ అవసరాల కోసమూ వాడుకుంటున్నారు. అదంతా ఒక ఎత్తు! ప్రజలకు సంబంధించి అవసరమున్న, అవసరం లేని కీలక సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లలో పెట్టేయడం మరొక ఎత్తు! కుటుంబ సభ్యులకు, బంధువులకు, చివరికి భార్యకు కూడా తెలియని/చెప్పని వివరాలూ జగన్ గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వం స్వయంగా కోట్ల రూపాయలు వెచ్చించి డెవలప్ చేయించుకున్న వెబ్‌సైట్లలో ఈ సమగ్ర సమాచారం పెట్టేశారు. ఆ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిని ఎవరైనా చూడొచ్చు. ఎలాగైనా వాడుకోవచ్చు.

ఇప్పుడైనా చూడొచ్చు..

ఏదైనా దరఖాస్తు చేసుకుంటే, దాని సంగతి ఎక్కడిదాకా వచ్చిందో తెలుసుకోవాలంటే... అప్లికేషన్ నంబరు, ఫోన్ నంబర్ టైప్ చేస్తాం. ఓటీపీ లేదా ఇతర సెక్యూరిటీ దాటిన తర్వాతే ఆ వివరాలు తెలుస్తాయి. మనకు సంబంధించిన సమాచారం మనం మాత్రమే చూసుకునే ఏర్పాటిది. జగన్ సర్కారుకు ఇదేం పట్టలేదు. 'సెర్చ్' అనే బటన్ నొక్కితే చాలు! అందరి సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఉదాహరణకు... మునిసిపల్ శాఖకు సంబంధించిన సీడీఎంఏ వెబ్‌సైటులోకి వెళ్లి... 'ఆన్‌లైన్ సర్వీసెస్' అనే ఆప్షన్ మీద మౌస్ కర్సర్ పెడితే ఒక పాపప్ వస్తుంది. అందులో... మొట్టమొదట 'ప్రాపర్టీ ట్యాక్స్' కనిపిస్తుంది. దానిమీద కర్సర్ పెట్టగానే... సబ్ పాపప్‌లో చివర్లో 'నో యువర్ అప్లికేషన్ స్టేటస్' మీద క్లిక్ చేస్తే... జిల్లా, ఆ జిల్లాలోని పట్టణాల వివరాలు సెలెక్ట్ చేసుకుంటే చాలు! ఆ తర్వాత... పెళ్లి రిజిస్ట్రేషన్లు, ప్రాపర్టీ నమోదులు, ట్రేడ్ లైసెన్సులు, వాటర్ చార్జెస్, అడ్వర్టైజ్‌మెంట్ ట్యాక్స్ వంటివి డిస్‌ప్లే అవుతాయి. అందులో పెళ్లి రిజిస్ట్రేషన్ చెక్ చేసుకుని... 'సెర్చ్' కొడితే చాలు. ఆ జిల్లాలో, సదరు పట్టణంలో రిజిస్టర్ అయిన అన్ని వివాహాలకు సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఇది



అంతటితో ఆగదు! వధూవరుల ఫొటోలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీ, ఆధార్ కార్డులు, టెన్త్ క్లాస్ మార్కుల లిస్టులు మొత్తం కనిపిస్తాయి. ఆయా డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు. అప్లికేషన్ నంబర్ టైప్ చేయాల్సిన అవసరంలేదు. ఓటీపీ కోసం ఫోన్ నంబరు ఇవ్వక్కర్లేదు. పాస్ వర్డు లేదు. కేవలం... మనకు కావాల్సిన సమాచారాన్ని ఎంచుకుని 'సెర్చ్' కొడితే చాలు. మొత్తం సమాచారం తెరపైన ప్రత్యక్షం!

ఏ ఒక్కరూ భద్రంగా లేరు

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 5 కోట్ల 10 లక్షల మంది. రేషన్ కార్డులు కోటి 40లక్షలు. ఒక్కో కార్డులో సగటున ముగ్గురు కుటుంబ సభ్యులు ఉంటారనుకున్నా 4 కోట్ల 20 లక్షల మంది. మిగిలిన 90 లక్షల మందిలో 10 లక్షల కుటుంబాలు ప్రభుత్వ ఉద్యోగులవి. సగటున ముగ్గురు కుటుంబ సభ్యులు ఉంటారనుకుంటే 30 లక్షల మంది. మిగిలిన 60 లక్షల మంది ట్యాక్స్ పేయర్స్. వీరికి రేషన్ కార్డులు లేకపోయినా వీరందరి వివరాలు, వీరి కార్డులన్నీ ఫొటోలతో సహా మునిసిపల్ కార్యాలయాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఈ సమాచారం దుర్వినియోగమైతే ఎవరు బాధ్యత వహిస్తారు? ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందనుకుంటున్నారేమో! కానే కాదు! తెలంగాణలోనూ ఇలా లేదు. ఆ రాష్ట్ర వెబ్‌సైట్ల నుంచి ప్రజల డేటా సేకరించడం కుదరదు. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజల డేటా భద్రంగానే ఉంది. ఏపీలో మాత్రమే తలుపులు తెరిచేశారు. సాధారణంగా ఒక ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచో, ఈ-మెయిల్ నుంచో డేటా బయటకు పోయిందంటే హ్యాకింగ్ చేసి తీసుకున్నారని చెబుతారు. కానీ, ఏపీలో హ్యాకింగ్‌లాంటి పెద్ద పనుల అవసరం కూడా లేదు. సింపుల్‌గా ప్రభుత్వ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రజలందరి పాన్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్సులు, పెళ్లిఫోటోలు, ఎవరి పేరుతో ఎన్ని ఇళ్లున్నాయి, అన్ని వివరాలు డాక్యుమెంట్లతో సహా తీసుకోవచ్చు.

> ప్రభుత్వంతో ఎలాంటి లావాదేవీ జరిపినా, ఎలాంటి దరఖాస్తు సమర్పించినా... అంటే ఉపాధి హామీ పథకంలో కూలి నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ కట్టడం వరకు వాటికి సంబంధించిన వివరాలు, జత చేసిన పత్రాలన్నీ వెబ్‌సైట్లలో పెట్టేశారు. అంటే... రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు ఐడీ కార్డులు, వారికున్న వ్యాధులు, బ్లడ్ గ్రూపులు, సాధారణ ఫొటోలు, పెళ్లి ఫొటోలు, మొబైల్ నంబర్లు, ఇంటి అడ్రస్‌లు, ఇంట్లో కరెంటు మీటర్ నంబర్లు, పదో తరగతి సర్టిఫికెట్, సంతకాలు, వేలిముద్రలు... ఇలాంటివన్నీ ఓపెన్ చేసేశారు.

> సైన్యంలో, రక్షణ రంగంలో పనిచేసే అటెండరు నుంచి అధికారుల వరకు అందరి సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి. కానీ... ఏపీలో మాత్రం వారికీ 'ప్రైవసీ' లేకుండా పోయింది.
>
> రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజల ఆస్తులకు సంబంధించిన వివరాలను, వేలిముద్రలను డిజిటల్ రూపంలో 'క్రిటికల్ రివర్' అనే ప్రైవేటు కంపెనీ చేతిలో పెట్టారు. అలాగే, ఇతర సమాచారాన్ని కూడా ఆ ప్రైవేటు కంపెనీకే మళ్లిస్తున్నారా? వేర్వేరు కంపెనీల్లో భద్రపరుస్తున్నారా... అనేది ప్రభుత్వమే చెప్పాలి.

జగన్‌కు, ప్రభుత్వానికీ తెలిసే..

ఐదేళ్ల నుంచి రాష్ట్ర ప్రజల అడ్రస్ ప్రూఫ్‌లు, ఆధార్, పాన్, పాస్‌పోర్టు, బ్యాంకు ఖాతాలు, ఫొటోలు చోరీకి గురవుతున్నా ఏ ఒక్క ఐఏఎస్ గుర్తించలేకపోయారా? ప్రభుత్వంలోని ఇన్ని వ్యవస్థల్లో ఏ ఒక్క వ్యవస్థ కూడా కనిపెట్టలేకపోయిందా? ఏ ఒక్కరూ కూడా దీన్ని గుర్తించలేదా? గత ఏడాది జూన్‌లో పవన్ కల్యాణ్ తన సభల్లో వలంటీర్ల ముసుగులో జగన్ ప్రభుత్వం ప్రజల డేటా చోరీ చేస్తోందని విమర్శించారు. అప్పుడు ప్రభుత్వం డేటా లీకేజీ లేదని.. అదంతా పవన్, చంద్రబాబు కుట్ర అని తప్పించుకుంది. కానీ, డేటా లీకేజీపై ప్రభుత్వానికి, అంటే నేరుగా జగన్‌కే రాతపూర్వకంగా ఫిర్యాదులు అందాయి. కొందరు మేధావులు నేరుగా జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయానికే వెళ్లి సీఎం సన్నిహితులకు సీల్డ్ కవర్లో ఈ వివరాలన్నీ అందజేశారు. స్పందన ద్వారా ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా వారు తీసుకోలేదు. దాదాపు ఏడాది నుంచి ఈ భారీ డేటా చోరీపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నా స్పందనే లేదు. ఆ తర్వాతే పవన్ డేటా చోరీ అంటూ విమర్శలు చేశారు. అప్పటి నుంచి ఈ రోజు వరకు ఈ డేటా చోరీపై ప్రభుత్వం విచారణ చేపట్టలేదంటే అర్థమేమిటి?

మచ్చుకొన్ని ఉదాహరణలు...

- వైఎస్సార్ చేయూత పథకం వెబ్‌సైట్‌లో 26 జిల్లాల్లో కలిపి 15.83 లక్షల మంది లబ్ధిదారులున్నారు. వీరందరి వివరాలు, వారి ఆధార్, రేషన్, ఫొటోలు, ఫోన్ నంబర్లను ఇట్టే తెలుసుకోవచ్చు. ఆ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ప్రభుత్వ వెబ్‌సైట్ లెక్కల ప్రకారం, వైఎస్సార్ బీమా అనే పథకం కింద వెబ్‌సైటులో ఒక కోటి 20 లక్షల మంది లబ్ధిదారులున్నాయి. వీరందరి బ్యాంకు ఖాతాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లతో సహా ఆ వెబ్‌సైట్ నుంచే నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ వివరాల కోసం హ్యాకింగ్‌కు పాల్పడాల్సిన అవసరం లేకుండా దొంగలకు ద్వారాలు తెరిచిపెట్టారు.
- గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల వివరాలు వారి సెక్రటేరియట్ కోడ్, క్లస్టర్ ఐడీతో పాటు మొబైల్ నంబర్లు, ఉద్యోగులకు జీతభత్యాలందే సీఎఫ్ఎంఎస్ ఐడీ సహా అన్ని వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ సైట్ల నుంచి సమాచారం తీసి కొందరు ప్రైవేటు వెబ్‌సైట్లలో ఉంచుతున్నారు. సచివాలయం.ఇన్ అనే వెబ్‌సైటులో సచివాలయ ఉద్యోగుల పర్సనల్ వివరాలు మొత్తం ఉన్నాయి. గత ఏడాది వలంటీర్లను అడ్డం పెట్టుకుని జగన్ డేటా చోరీ చేస్తున్నాడంటూ పవన్ కల్యాణ్ విమర్శించిన తర్వాత ఈ వెబ్‌సైటు నిర్వాహకులు ఆ ఉద్యోగుల ఫోన్ నెంబర్ల స్థానంలో కొన్ని అంకెలు ఉంచి, మరికొన్ని అంకెలు కనపడకుండా స్టార్లు పెట్టారు.

భూరక్షణ కాదు.. భక్షణే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా వ్యతిరేక అంశాలు మచ్చుకు కొన్ని ప్రస్తావిస్తున్నాం. అవి చట్టంలో లేవని జగన్ చెప్పగలరా?

చాప్టర్ 5లో ఏముంది?

ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ చట్టాన్ని చదివిన వారికి ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అదేమంటే, సర్కారు పెద్ద ఎత్తున భూములను సేకరించి అమ్మాలనుకుంటోంది. ఇందుకోసం ఓ 'కంపెనీ'ని ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఏపీతోపాటు, రాష్ట్రం బయట కూడా ఆఫీసులు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. టైటిల్ చట్టంలోని చాప్టర్ 5లో ఉన్న ల్యాండ్ అథారిటీ కింద ఏం రాశారంటే... "ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అథారిటీ అనేది ఓ కార్పొరేట్ సంస్థలా ఉంటుంది. అది భూములు సేకరించడం, కలిగి ఉండటం, అమ్మడం (స్థిర, చరాస్తులు) వంటివి చేస్తుంది. దాని ప్రధాన కార్యాలయం ఎక్కడో ప్రభుత్వమే నోటిఫై చేస్తుంది. ఇక, దాని ఆఫీసులను రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ బయటకూడా ఏర్పాటు చేయవచ్చు" అని ఉంది. రైతుల భూములకు శాశ్వత హక్కులు కల్పించేందుకు ఏర్పాటుచేసే ల్యాండ్ అథారిటీ... కార్పొరేట్ కంపెనీలాగా ఉండటం ఏమిటి? అంటే, ఇది కూడా ఏపీఐఐసీ తరహాలో పనిచేయనుందా? టైటిల్ చట్టాన్ని చరాస్తులకు ఎలా వర్తింపచేస్తారు? భూములు సేకరించడం, అమ్మడం చేసే పనులు ఈ సంస్థ చేపడుతుందంటే అర్థం ఏమిటి? ల్యాండ్ అథారిటీ అనేది భక్షవ్యాపారం చేయనుందనే కదా!

చాప్టర్ 4లో ఏం రాశారు?

ల్యాండ్ టైటిల్ యాక్ట్ చాప్టర్ 4లోని 5వ పాయింట్ ప్రకారం... ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించకపోతే, కోర్టులు ఇచ్చే ఆదేశాలను కూడా అమలు చేయడం జరగదు. రైతు తన భూమి విస్తీర్ణం, లేదా ఆస్తిపై టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి తీసుకునే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సివిల్ కోర్టులకు వెళ్లడానికి వీలు లేదు. ఒకవేళ వెళితే, సంబంధిత కోర్టు నుంచి ఓ సర్టిఫికెట్ తీసుకొచ్చి టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారికి పదిహేను రోజుల్లో సమర్పించాలి. అలా గడువులోగా ఆ రైతు సర్టిఫికెట్ సమర్పించకపోతే, ఒక వేళ ఆ భూమి విషయంలో కోర్టు ఏదైనా ఆదేశం ఇచ్చినా అమలు చేయబోమని చట్టంలో చాలా స్పష్టంగా ఉంది. ఇది అన్యాయమైన క్లాజు కాదా? రైతులకు న్యాయాన్ని నిరాకరించడం కాదా? ఒకవేళ గడువు తీరిన తర్వాత కోర్టు సర్టిఫికెట్‌ను తీసుకోవాలంటే టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి సంతృప్తి చెందాలట. ఇదెక్కడి విధానం? అధికారి దయాదాక్షిణ్యాలపైనే 'న్యాయం' ఆధారపడి ఉంటుందా? ఇది రైతు కంఠకమైన క్లాజుకాదా? దీన్ని ఎలా సమర్థిస్తారు?

కోర్టుల ప్రమేయం లేకుండా చేస్తారా?

రైతులు భూ వివాదాల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ డబ్బులు ఇచ్చుకుంటున్నారని జగన్ బాధపడిపోయారు. ఆయన మాటలకు, చేతలకు పొంతనలేదు. ఎందుకంటే... టైటిల్ చట్టంలో రెవెన్యూ అధికారులదే సూపర్ పవర్. రెవెన్యూ అధికారులు...రైతుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపిస్తూనే, టైటిల్ చట్టంలో వారినే సూపర్‌హీరోలను చేశారు. అంటే, సీఎం మనోగతం ప్రకారం టైటిల్ చట్టం అధికారుల అవినీతిని మరింత పెంచిపోషించేలా ఉన్నట్లు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, టైటిల్ చట్టం అమలులో కోర్టుల ప్రమేయం లేకుండా నిషేధించారు. కానీ... చట్టాల అమలు, న్యాయంపై ఆశలు ఉన్నవారె వ్వరూ ఇలాంటి పనులు చేయరు. ఆంధ్రప్రదేశ్ ఎస్టేట్‌ల రద్దు చట్టం-1948లో వచ్చింది. ఎస్టేట్‌లు రద్దయి, ఆ భూములపై రైత్వారీ పట్టాలు ఇచ్చేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుంది. చట్టం వచ్చి 76 ఏళ్లవుతున్నా ఎస్టేట్ కేసుల విచారణ సాగుతోంది. న్యాయం చేయలేమంటూ ప్రభుత్వాలు తలుపులు మూసెయ్యలేదు. వివిధ స్థాయిల్లో కేసుల పరిష్కారం సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఇనామ్ అబాలిషన్ చట్టం-1956లో వచ్చింది. ఇప్పటికీ ఈ కేసుల విచారణ సాగుతోంది. ప్రతీ జిల్లాకు ఓ ఇనామ్ టీడీని ఏర్పాటు చేసి కేసుల విచారణ చేయిస్తూ రైతులకు న్యాయం చేస్తున్నారు. ఇప్పటికీ సెటిల్‌మెంట్ కేసుల విచారణా వ్యవస్థను ప్రభుత్వం కొనసాగిస్తోంది. అంతే తప్ప కాలం తీరిపోయిందని వాటిని ఎత్తివేయలేదు. కానీ, రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారనే నెపంతో టైటిల్ చట్టం అమలులో సివిల్ కోర్టులో ప్రమేయాన్ని నిషేధించడం జగన్ సర్కారుకే చెల్లింది.

ఈ నెలా పింఛన్ కష్టాలు

రాయచోటి (ఆంధ్రజ్యోతి), హనుమాన్‌జంక్షన్, రుద్రవరం, మే 1: పెన్షన్ కోసం మే నెలలోనూ వృద్ధులకు కష్టాలు తప్పలేదు. బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో డబ్బులు తీసుకునేందుకు చాలా చోట్ల ఇబ్బంది పడ్డారు. కడప జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం కాకుళారం గ్రామం పిచ్చిగుంట్లపల్లెకు చెందిన ముద్రగడ్డ సుబ్బన్న వృద్ధాప్య పెన్షన్ వచ్చిందో లేదో తెలుసుకునేందుకు రాయచోటి కెనరా బ్యాంకు వద్దకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చారు. మేడే కారణంగా బుధవారం బ్యాంకుకు సెలవన్న విషయం తెలియక వచ్చారు. ఎండలో ఉండటంతో కాసేపటికి అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో పలువురు లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాల్లో పింఛను సొమ్ము జమ కాగానే డబ్బులు కట్ అయ్యాయి. మైనస్ బ్యాలెన్స్ ఉన్న ఖాతాల్లో పింఛను జమ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. చేతికి వస్తుందనుకున్న సొమ్ములో కొంత భాగం బ్యాంక్ చార్జీల రూపంలో కట్ కావడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మండలంలోని తోట సాంబయ్య అనే వృద్ధుడికి మూడు వేల రూపాయలకు బదులు 2662 రూపాయలు చేతికొచ్చాయి. 338 రూపాయలు కట్ చేశారని బాధితుడు వాపోయారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని కొండమాయపల్లె గ్రామానికి చెందిన ఇమాంబీ తాను నడవలేని పరిస్థితిలో ఉన్నానని, బ్యాంకు ఎక్కడో ఉందని, ఎట్లా వెళ్లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ కోసం గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఉన్న సిబ్బంది.. 'నీకు పింఛన్ ఇక్కడ ఇవ్వడం లేదు. బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు..' అని చెప్పారు.

'మేనిఫెస్టో' పాఠం మారదా?

- తన హామీలు వదిలేసి కూటమి మేనిఫెస్టోపైనే విసుర్లు
- 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన వాగ్దానాలెన్నో గాలికి..
- కానీ, 2014 ఎన్డీయే కూటమి హామీలపై వక్రభాష్యం
- బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరులో ప్రచార సభలు



జగన్ సభ ఉందని షాపులను మూయించిన అధికారులు, బస్సు నుంచి జగన్ అభివాదం

అనకాపల్లి/పాయకరావుపేట, విజయనగరం, ఏలూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార సభల్లో తన మేనిఫెస్టోను పరిచయం చేసుకోవాల్సిన జగన్, అది వదిలేసి 2014 టీడీపీ కూటమి మేనిఫెస్టోను పట్టుకుని ఊరూరా తిరుగుతున్నారు. వైసీపీ హామీల్లో కొత్తదనం లేకపోవడమే దీనికి కారణమని బుధవారం బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరుల్లో ఆయన సభలకు హాజరైన జనం మాట్లాడుకోవడం కనిపించింది. అయితే, పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా, అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా తాను ఇచ్చిన వాగ్దానాల్లో చాలావాటిని నెరవేర్చని విషయాన్ని కావాలనే జగన్ మర్చిపోయినట్లు కనిపిస్తున్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి మోసగించారు. ఉద్యోగులకు సకాలం జీతాలు చెల్లించలేకపోతున్నారు. మద్యపాన నిషేధంపై మాట తప్పారు. పోలవరం, తోటపల్లి, రామతీర్థసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులను పడకేయించారు. పైగా... 'కేజీ బంగారం ఇస్తారట, బెంజి కారు ఇస్తారట' అంటూ కూటమి ప్రకటించని హామీలపై జగన్ విసుర్లు విసిరారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న బాబు ఏ ఒక్క హామీనైనా నేరవేర్చారా అని ఏలూరు సభలో ప్రశ్నించారు. జనాల నుంచి స్పందన లేకపోవడంతో, 'నన్ను నమ్ముకుంటే యథావిధిగా పథకాలన్నీ అమలవుతాయి' అంటూ మరోసారి ఆత్మస్తుతి చేసుకున్నారు. తన హయాంలో కోట్లాది రూపాయలు జమ చేశానని, ఇవన్నీ కొనసాగాలంటే మళ్లీ తన ప్రభుత్వమే రావాలని పిలుపు ఇచ్చినా ప్రజలు పట్టించుకోలేదు. సమస్యలు గాలికి వదిలేసి, పోలవరం ప్రాజెక్టు ఊసే ఎత్తకుండా, పరనిందలతోనే అరగంట ఊకదంపుడుగా ప్రసంగించారు.

నరకం చూపించారు

- ఎండ తాళలేక పలువురికి అస్వస్థత
- అరగంట జగన్ ప్రసంగం కోసం ఆరు గంటలపాటు తిప్పలు

విజయనగరం జిల్లా బొబ్బిలి సూర్యమహల్ జంక్షన్‌లో జగన్ షెడ్యూల్ ప్రకారం ఉదయం 10గంటలకు రావాలి. కానీ మధ్యాహ్నం 12 గంటలకు వచ్చారు. 12.13కి ప్రసంగం మొదలెట్టారు. 12.40వరకు మాట్లాడారు. ఈ మాత్రం ప్రసంగం కోసం ఉదయం నుంచీ 42డిగ్రీల తీవ్రమైన ఎండతో జనాలు అల్లాడిపోవాల్సి వచ్చింది. ఎండతోపాటు వేడిగాలికి తట్టుకోలేకపోక చాలామంది సొమ్మసిల్లిపోయారు. అస్వస్థతకు గురైన వారిని 108లో ఆసుపత్రికి తరలించారు. కాగా, జనాన్ని తరలించేందుకు ఆటోలు, వ్యాన్లు, ప్రైవేట్ బస్సులు, స్కూల్ బస్సులను పెద్ద ఎత్తున వాడుకున్నారు. భారీగా జనసమీకరణ చేసేందుకు విచ్చలవిడిగా మద్యం, డబ్బులు పంచిపెట్టారు. ఎండను తట్టుకోలేక జగన్ ప్రసంగిస్తుండగానే చాలామంది వెనుదిరిగి వెళ్లిపోవటం కన్పించింది. జగన్ సభను పాయకరావుపేటలోని బలిజిపేట వెళ్లే ప్రధాన రోడ్డులోనే ఏర్పాటు చేశారు. దీంతో బస్సులను దారి మళ్లించారు. ట్రాఫిక్‌ను నియంత్రించారు. రోడ్డు దిగ్బంధం చేశారు. ఫలితంగా జనాలు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు.

కేసీఆర్‌పై 48 గంటల నిషేధం

- ప్రచారం చేయవద్దు.. ఈసీ ఉత్తర్వులు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఎన్నికల సంఘం (ఈసీ) చర్యలు చేపట్టింది. ఆయన ఎన్నికల ప్రచారంపై 48 గంటల పాటు నిషేధం విధించింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ఈ నిషేధం అమలులో ఉండనుంది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు.. మహబూబాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కేసీఆర్‌కు బుధవారం అందజేశారు. ఏప్రిల్ 5వ తేదీన సిరిసిల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో తమ పార్టీపై, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేత నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఏప్రిల్ 17న ఈసీ కేసీఆర్‌కు నోటీసులు పంపింది. ఆయన సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈసీ తాజాగా ఆయన ప్రచారంపై 48 గంటల నిషేధాన్ని విధించింది. దీంతో, షెడ్యూల్ ప్రకారం గురువారం జమ్మికుంటలో నిర్వహించాల్సిన రోడ్‌షోను కేసీఆర్ రద్దు చేసుకున్నారు. మహబూబాబాద్‌లో ప్రచారం అనంతరం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. కేసీఆర్‌పై ఈసీ నిషేధాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. 'తెలంగాణ ఆవాజ్ అయిన కేసీఆర్ గొంతుపై నిషేధమా? ఇదెక్కడి అరాచకం? మోదీ విద్వేష వ్యాఖ్యలు ఈసీకి వినిపించలేదా?' అని ఎక్స్‌లో ప్రశ్నించారు.



కర్నూలులో జగ్గూభాయ్ తిరస్కార పత్రం విడుదల చేస్తున్న సిబ్లీ, తదితరులు

బాబు వంటి విజనరీ లీడర్ అవసరం

- ఆయన్ను సీఎం చేయాలని 17 ముస్లిం సంఘాల ఏకాభిప్రాయం
- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారుక్ సిబ్లీ
- 'జగ్గూభాయ్ తిరస్కార ప్రతం' విడుదల

కర్నూలు(అర్బన్), మే 1: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం సంక్షోభంలో పడేసిన దుర్మార్గుడు సీఎం జగన్ అని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఫారుక్ సిబ్లీ అన్నారు. సీఏఏ అమలుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డే మద్దతు తెలిపాడని ఆరోపించారు. తామంతా బాగుపడాలంటే రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటు కావాలని ముస్లిం పౌరసమాజం కోరుకుంటోందని తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని ఓ హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి చేసిన ద్రోహాన్ని పొందుపరుస్తూ రూపొందించిన 2019-24 జగ్గూభాయ్ తిరస్కార పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 17 ముస్లిం మైనార్టీకి చెందిన ప్రజా సంఘాలు కలిసి ఏకాభిప్రాయానికి వచ్చి కోటి మంది మద్దతుతో చంద్రబాబును గెలిపించుకోవాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. విజనరీ లీడర్ రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందన్నారు. 4 శాతం రిజర్వేషన్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టులో ఉందని తెలిపారు. అయినా ఈ అంశంపై మాట్లాడేందుకు వైసీపీకి ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. తాము బీజేపీని ఓడించబోమన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలను కలిపే రాజధాని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐపీఎస్‌గా పని చేస్తూ లక్షలాది ముస్లింలకు న్యాయం చేసే అవకాశం ఉంటుందని, కానీ ప్రస్తుత కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న ఇంతియాజ్ ఎవరిని ఉద్ధరించడానికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. దుల్హన్ పథకం అమలుకు 10వ తరగతి సర్టిఫికెట్ ఉండాలని వైసీపీ నిబంధన పెట్టినా, ఐఏఎస్ అధికారి హోదాలో కూడా కనీసం దానిని ఎందుకు తొలగించలేకపోయారని ప్రశ్నించారు.

ఒవైసీ.. మా జీవితాలతో ఆడుకోవద్దు..

హైదరాబాద్‌లో కూర్చొని అసదుద్దీన్ ఒవైసీ వైసీపీకి మద్దతు ఇవ్వాలంటే ఇక్కడ కుదరదని ఎం.ఫారుక్ సిబ్లీ అన్నారు. రాష్ట్రంలోని 6 జిల్లాల్లో ఎంఐఎం ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఆయా జిల్లాల అధ్యక్షులంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు పలుకుతున్నారని స్పష్టం చేశారు. ఏపీలో ముస్లిం మైనార్టీ జీవితాలతో ఆడుకోవద్దని, ఏ అంశంలోనూ జోక్యం చేసుకోవద్దని తాను ఒవైసీని కోరానన్నారు. ఆయన హైదరాబాద్‌లో గెలవాలని కోరుకుంటున్నాం... అయితే ఏపీలో మాత్రం ఆయన పెత్తనం సాగించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రిజర్వేషన్లు తీసేస్తారన్న తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. నారా లోకేశ్ సెక్యులర్ కాదని దుష్ప్రచారం చేస్తే ముస్లింలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. ముస్లిం మైనార్టీలపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్యతో కోర్టులో కేసులు వేయించింది వాస్తవం కాదా? అని సిబ్లీ ప్రశ్నించారు.

కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

తాడిపత్రి టౌన్, మే 1: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి.. మన అభివృద్ధికి మనమే బాటలు వేసుకుందామని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫరూక్ సిబ్లి ముస్లింలకు పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో బుధవారం జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. నూర్‌బాషాల సంఘం అభివృద్ధికి మేనిఫెస్టోలో రూ.100 కోట్లు కేటాయించడం చంద్రబాబుకు మైనార్టీ సోదరుల అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ మహమ్మద్ షరీఫ్, టీడీపీ కూటమి అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థి అస్మిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న రుణం తీర్చుకునే సమయమిది..!

- అమెరికా నుంచి గుంటూరు వచ్చిన ముస్లిం యువతి
- విదేశీ విద్యా పథకంతో ఉన్నత చదువు, ఉద్యోగం




మహ్మద్ పర్వీన్

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యా పథకం ద్వారా లబ్ధి పొంది అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించి అక్కడే ఉద్యోగం కూడా సంపాదించిన ఓ ముస్లిం యువతి ఆ రుణం తీర్చుకునేందుకు స్వదేశానికి తిరిగొచ్చారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీకి ఓటు వేయాలనే సంకల్పంతో రెండురోజుల క్రితం స్వస్థలమైన గుంటూరు చేరుకున్నారు. నగరానికి చెందిన చిరుద్యోగి చాంద్‌బాషా కుమార్తె మహ్మద్ పర్వీన్ 2019లో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్నారు. కానీ అంత ఆర్థిక స్తోమత లేదు. ఈ క్రమంలో చంద్రబాబు అమలు చేస్తున్న విదేశీ విద్యా పథకం గురించి తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన టీడీపీ ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఆమె అమెరికాలోని నార్త్ వెస్ట్ మిస్సోరి వర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించి ప్రస్తుతం అక్కడే ఉద్యోగం కూడా చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకొని తానీ స్థాయికి రావడానికి కారకులైన చంద్రబాబు రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆమె గుంటూరుకు వచ్చారు. ఈ విషయాన్ని ఆమె మంగళవారం గుంటూరు పశ్చిమ టీడీపీ అభ్యర్థి మాధవికి తెలియజేశారు. "నా లాంటి పేద విద్యార్థుల బాగు కోసం సైకిల్ గుర్తుకే ఓటు వేసి చంద్రన్నను గెలిపించుకుంటాం' అని చెప్పారు. విషయం తెలుసుకొన్న చంద్రబాబు బుధవారం గుంటూరు పర్యటనలో ఆమెను పిలిపించుకొని ప్రశంసించారు.

ఆంధ్రజ్యోతి

జన కేతనం



ప్రజా అజెండా



కౌంట్ డౌన్ 11 రోజులు

గురువారం ◇ 2-5-2024

కూటమి X వైసీపీ

ఏ మేనిఫెస్టోలో ఏముంది?

అంశం	టీడీపీ	వైసీపీ
మహిళలకు	19-59 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ నెలకు రూ.1500. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.18 వేలు.	45-60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ఇంటికి ఒకరికి ఏడాదికి రూ. 18,750 సాయం.
పాఠశాల విద్యార్థులకు	స్కూలుకు వెళ్లే విద్యార్థులు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ ఏడాదికి రూ.15 వేలు	స్కూలు విద్యార్థులు ఇంటికి ఒక్కరికే ఏడాదికి రూ.15 వేలు
పేదల పింఛన్లు	నెలకు రూ.4 వేలు మంజూరు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఏభై ఏళ్లకే పింఛన్లు. దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలకు పెంపు. వంద శాతం వైకల్యం ఉన్నవారి పింఛన్లు రూ.15 వేలకు పెంపు. కిడ్నీ, తలసీమియా రోగులకు నెలకు రూ.10 వేల పింఛను	ఇప్పుడు ఉన్న రూ.మూడు వేలకు 2028లో రూ.250, 2029లో మరో రూ.250 పెంపు. దివ్యాంగులకు పెంపు ప్రస్తావనే లేదు. కిడ్నీ, తలసీమియా రోగుల గురించి అసలు లేదు
రైతులకు	ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు	ప్రతి రైతుకూ ఏటా రూ.16 వేలు
ఉచిత వంట గ్యాస్	ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు	లేదు
ఉచిత ప్రయాణం	మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం	లేదు
వైద్య సంక్షేమం	దేశంలో మొట్ట మొదటిసారి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా. పేద కుటుంబాలకు బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందుల పంపిణీ	ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం
ఉద్యోగులు, పెన్షనర్లు	ముందు ఐఆర్ ఇస్తాం. తర్వాత మెరుగైన పీఆర్సీ ఇస్తాం. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పింఛన్లు చెల్లిస్తాం. బకాయిల చెల్లింపునకు చర్యలు. తక్కువ జీతాలు పొందే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ పథకాల అమలు. వలంటీర్ల వేతనం రూ.పది వేలకు పెంపు. ఉద్యోగులను గౌరవంగా చూసుకొంటాం	ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లల విదేశీ విద్యకు తీసుకొనే రుణంలో రూ.పది లక్షలు లేదా కోర్సు పూర్తయ్యేవరకూ పూర్తి వడ్డీని భరిస్తాం. రూ.పాతిక వేల లోపు వేతనం పొందే తాత్కాలిక ఉద్యోగులకు ప్రభుత్వ పథకాల వర్తింపు. ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి స్థలం ఖర్చులో అరవై శాతం భరిస్తాం
పన్నులు, చార్జీలు	చెత్త పన్ను రద్దు. ఇంటి పన్నుపై సమీక్ష. విద్యుత్ చార్జీలను నియంత్రిస్తాం. సౌర విద్యుత్‌తో అనుసంధానం చేసి విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం	లేదు
ఫీజు రీయింబర్స్‌మెంట్	ఎయిడెడ్ కళాశాలలు, పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తాం. గతంలో మాదిరిగా అందరికీ ఫీజుల పథకం వర్తింపజేస్తాం. కాలేజీలకు ఫీజులు అందేలా చేసి విద్యార్థులకు సర్టిఫికెట్ల చిక్కులు లేకుండా చేస్తాం	విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన కొనసాగిస్తాం
ఎస్సీ, ఎస్టీ సంక్షేమం	జిల్లాలవారీగా వర్గీకరణ. 50 ఏళ్లకే పింఛను. రద్దయిన సంక్షేమ పథకాల పునరుద్ధరణ. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ. ఎస్సీ, ఎస్టీల హత్యలకు కారకులైన వారికి కఠిన శిక్షలు. ఏజెన్సీలో ఆదివాసీ ఉపాధ్యాయుల నియామకం	ఇప్పటివరకూ ఉన్నవి కొనసాగింపు. దళితుల సంఖ్య ఐదు వందలకు పైగా ఉండి 50 శాతం జనాభా వారిదే ఉంటే ఆ నివాస ప్రాంతాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తింపు
యువతకు సాయం	నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన	నిరుద్యోగ భృతి లేదు. నైపుణ్య శిక్షణ తప్ప ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తారో లేదు
డ్వాక్రా సంఘాలు	రూ.పది లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు	రూ.మూడు లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు
డ్రైవర్లు, వాహన యజమానులు	వాహన యజమానులకు కాకుండా బ్యాడ్జి కలిగిన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ ఉన్న టిప్పర్, లారీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల సాయం. డ్రైవర్లు సొంత వాహనం కొనుక్కొంటే రూ.నాలుగు లక్షల వరకూ సబ్సిడీ. గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు. జీవో 21 రద్దు చేసి జరిమానాల భారం తగ్గింపు	సొంత ఆటో, ట్యాక్సీ, టిప్పర్, లారీ ఉన్నవారికి ఏడాదికి రూ.పది వేల సాయం. రూ. పది లక్షలకు ప్రమాద బీమా. వాహనాల కొనుగోలుకు రుణం తీసుకొంటే రూ.మూడు లక్షల వరకూ వడ్డీ రాయితీ
ఇసుక	ఉచిత ఇసుక విధానం అమలు చేస్తాం. సామాన్యులకు ఇసుక ఉండేలా సమగ్ర ఇసుక విధానం తెస్తాం	ప్రస్తావన లేదు
మద్యం	మద్యం ధరలు నియంత్రిస్తాం. విషపూరిత మద్యం బ్రాండ్లు రద్దు	ప్రస్తావన లేదు
సంక్షేమ చర్యలు	అన్న క్యాంటీన్ల ఏర్పాటు. డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదల ఆకలి తీరుస్తాం. పెట్రోలు, డీజిల్ ధరలు నియంత్రిస్తాం. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు. ఇప్పటికే పట్టాలు వచ్చిన వారికి ఇళ్ల నిర్మాణం	ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో నాడు నేడు పేరుతో అభివృద్ధి పనులు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు. మొదలుపెట్టిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం
చంద్రన్న బీమా	ఎవరికైనా సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.పది లక్షలు	డెలివరీ బాయ్స్ ప్రమాదాల్లో మరణిస్తే రూ.5 లక్షలు అందేలా బీమా
ల్యాండ్ టైట్లింగ్ చట్టం	ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేస్తాం. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తాం	ప్రస్తావన లేదు
నిరుద్యోగులు	మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్, మూడు ప్రాంతాలకు మూడు ఎంప్లాయ్‌మెంట్ జోన్లు	మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఊసే లేదు
రాజధాని	ప్రజా రాజధానిగా అమరావతి పునర్నిర్మాణం చేపడతాం. తద్వారా రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చేయూతనిస్తాం	విశాఖ పరిపాలన రాజధానిగా పాలన. మూడు రాజధానుల విధానం అమలు చేస్తాం

ఆనాటి ముచ్చట

బ్యాలెట్ పేపర్ల 'కర్నూలు'

స్థానిక ప్రభుత్వ ముద్రణాలయానికి 70 వసంతాలు

రేషన్ కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలూ ఇక్కడే

ఇప్పటికీ 'ఎన్‌ఆర్ పేట' నుంచే ఎన్నికలకు అవసరమైన కాగితాలు



కర్నూలు నగరంలో ఉన్న ప్రాంతీయ ముద్రణాలయం

మద్రాస్ రాష్ట్రం నుంచి విడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయినపుడు మన ముద్రణాలయం కర్నూలులో ఏర్పాటయింది. 1954 మే 4న నాటి విద్యాశాఖ మంత్రి ఎస్‌బీపీ పట్టాభిరామా రావు ఈ ప్రింటింగ్ ప్రెస్ భవనాన్ని ప్రారంభించారు. మరో మూడు రోజుల్లో 70 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న కర్నూలు ఎన్‌ఆర్ పేటలోని ఆ ప్రెస్‌ది ఓ ప్రత్యేక చరిత్ర. రెండేళ్లపాటు ఆంధ్ర రాష్ట్ర ప్రధాన ముద్రణాలయంగా కొనసాగిన ఆ ప్రెస్... ఆ తరువాత హైద్రాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో అక్కడికి తరలిపోయింది. తరువాత కర్నూలులోని ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రాంతీయ ముద్రణాలయంగా మార్చి, విజయవాడలోనూ మరో ప్రాంతీయ ముద్రణాలయం ఏర్పాటు చేశారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత విజయవాడలోని ప్రెస్ ప్రధాన ముద్రణాలయంగా మారింది. ప్రస్తుతం 200 మంది పనిచేస్తున్న కర్నూలు ప్రెస్‌లో అప్పట్లో 900 మంది పనిచేసేవారు. 1954లో లిథోగ్రాఫ్‌తో మొదలయిన ఈ ప్రింటింగ్ ప్రస్థానం... నేడు మారిన సాంకేతికతకు అనుగుణంగా ఆఫ్‌సెట్ మెషీన్‌తో సాగుతోంది. మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో కర్నూలు నగరంలోని సీతారామ్‌నగర్‌లో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రింటింగ్ ప్రెస్‌కు పరిపాలనా కార్యాలయం ఏర్పాటయింది. ఇక్కడి ప్రెస్‌లో బ్యాలెట్ పేపర్లు, ఎన్నికలకు అవసరమైన ఇతర పత్రాలు, రిజిస్ట్రేషన్, ట్రెజరీ, రెవెన్యూ, హాస్పిటల్, పట్టాదారు పాసుపుస్తకాలు, భూమిశిస్తు రసీదులు, ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రేషన్ కార్డులు, సమగ్ర శిక్ష సమాధాన పత్రాలు అచ్చు అయ్యేవి. 2024, మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఎన్నికల పత్రాలను, పోస్టల్ బ్యాలెట్ వంటి కీలక పేపర్లనూ ఇక్కడే ప్రింటింగ్ చేయనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయిన నేపథ్యంలో అన్ని జిల్లాల నుంచి ఫైనల్ అయిన అభ్యర్థుల పేర్లు, గుర్తుల జాబితా అందిన వెంటనే ప్రింటింగ్ ప్రక్రియ పూర్తి చేసి అన్ని జిల్లాలకూ అవసరమైన పత్రాలను పంపిణీ చేయనున్నారు.

– కర్నూలు(కలెక్టరేట్)



కర్నూలు నగరంలో ప్రాంతీయ ముద్రణాలయం 1954 మే 4న ప్రారంభమైనట్లు చూపుతున్న శిలాఫలకం

జగన్ అనే నేను..

పదవీ ప్రమాణానికి తూట్లు పొడిచేస్తా





"జగన్ అనే నేను.. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని... భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతను కాపాడతానని... నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని... భయం కానీ, పక్షపాతంకానీ, రాగద్వేషాలుకానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను!"

– ఇది 2019 మే 31వ తేదీన జగన్ చేసిన ప్రమాణం! దీనిని జగన్ కనీసం ఒక్కరోజైనా పాటించారా? పదవి నాటి ప్రమాణాలు అమలవుతున్నాయా? పక్షపాతం, రాగద్వేషాలు లేకుండా పాలన సాగించారా? రాజ్యాంగాన్ని అనుసరించారా? ప్రజలందరికీ న్యాయం చేశారా? అంటే... 'లేదు.. లేదు' అనే సమాధానమే వస్తుంది. ఇంకా చెప్పాలంటే... ప్రజాస్వామ్య చరిత్రలోనే లేని బరితెగింపు కనిపించింది.

"నేను చంద్రబాబుకు వ్యతిరేకం కాదు. రాష్ట్రానికి ధర్మకర్తను. మా ప్రభుత్వం రెవెల్యూషనరీగా ఉంటుంది. ఆరునెలల నుంచి ఏడాదిలోపే దేశంలోనే 'ది బెస్ట్' అనిపించుకుంటాం. ఎక్కడా అవినీతి లేకుండా చేస్తాం. ఈ ప్రక్షాళన మామూలుగా ఉండదు. ఎలా చేయాలో అలా చేసి చూపిస్తాం!"

– ఎన్నికల్లో గెలిచి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకముందు ఢిల్లీలో జగన్ ముద్దు ముద్దుగా చెప్పిన మాటలు! ఆరు నెలలు కాదు కదా... తొలి ఆరు రోజుల్లోనే జగన్ ఎలాంటి పాలన సాగిస్తారో జనానికి అర్థమైపోయింది.

రాజ్యాంగాన్ని, చట్టాన్నీ పాటించను

ఆశ్రిత పక్షపాతమే మా విధానం

గిట్టని వారిపట్ల ద్వేషంతో వ్యవహరిస్తాను

రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం చూపను

విలువలు పాటించను, పట్టించుకోను

భయపెట్టేలా పాలన సాగిస్తాను

ప్రజాధనంతో పండగ చేసుకుంటాను

అంతఃకరణ శుద్ధిలో పగా, ప్రతీకారమే

జగన్ ఐదేళ్ల పాలన సాగింది ఇలాగే!

● 'శాసనం'పట్ల గౌరవమిదేనా?

ప్రభుత్వం ఏదైనా శాసనాలను అనుసరించి పాలన సాగించాల్సిందే. అప్పటిదాకా ఉన్న పద్ధతులను మార్చాలనుకుంటే... ఆ మేరకు శాసనాలనూ సవరించాలి. కానీ... జగన్ సర్కారుకు ఇవేవీ పట్టలేదు. 'నేను చెప్పిందే శాసనం' అన్నట్లుగా వ్యవహరించారు. ఇలా చట్టానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలన్నింటికీ న్యాయస్థానాల్లో చుక్కెదురైంది. అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుని, వాటిని అమలు చేయలేక... విపక్షాలను, మీడియాను ఆడిపోసుకోవడం రివాజుగా మారింది. అధికారంలోకి వచ్చీ రాగానే విద్యుత్ కొనుగోలు ఒప్పందాల(పీపీఏ)ను రద్దు చేశారు. ఇది అంతర్జాతీయంగా కూడా వివాదాస్పదమైంది. దేశ ప్రతిష్ఠకూ మచ్చ తెచ్చారు. ఇక... నిమ్మగడ్డ రమేశ్ అంటే గిట్టకపోవడంతో, రాత్రికి రాత్రి ఎస్ఈసీ పదవీకాలాన్ని కుదించేశారు. దీనిపై సుప్రీంకోర్టు దాకా వెళ్లి మరీ చీవాట్లు తిన్నారు. చెప్పుకొంటూ పోతే ఇలాంటివి ఎన్నెన్నో!

● రాగ ద్వేషాలు లేవా జగన్?

'రాగద్వేషాలు చూపకుండా పాలన సాగిస్తాను' అని ప్రమాణం చేసిన జగన్... ఆ మరుక్షణమే ఆ మాట మరిచిపోయారు. అయిన వారిపట్ల 'రాగం'... విపక్షాల పట్ల 'ద్వేషం'... ఈ రెండింటి ప్రాతిపదికనే మొత్తం ఐదేళ్ల పాలన సాగింది. సోషల్ మీడియాలో సర్కారును ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టిన వారిని వెతికి వెతికి మరీ అరెస్టు చేశారు. ఒక మెసేజ్‌ను ఫార్వర్డ్ చేసిన 'నేరానికి' 60 ఏళ్లు పైబడిన వ్యక్తిని విశాఖ నుంచి కర్నూలుకు రోడ్డు మార్గంలో తీసుకెళ్లి శారీరకంగా, మానసికంగా హింసించారు. ఇలాంటి కేసులోనే గుంటూరుకు చెందిన వృద్ధురాలిని అదుపులోకి తీసుకుని విచారణ పేరుతో వేధించారు. కానీ... న్యాయమూర్తులను దూషించిన వైసీపీ కార్యకర్తలను మాత్రం స్వేచ్ఛగా వదిలేశారు. ఇవే కాదు... కేసులు, దాడులు, అరెస్టులు అన్నింటా ఇదే తీరు.

● అచ్చోసిన పక్షపాతం...

'పక్షపాతం లేకుండా పాలన సాగిస్తాను' అని జగన్ చేసిన ప్రమాణం ఒక్క క్షణం కూడా అమలు కాలేదు. కుర్చీలో కూర్చున్న క్షణం నుంచి 'మన వాడెవడు, పరాయి వాడెవడు' అనే కోణంలోనే నిర్ణయాలు తీసుకున్నారు. కలెక్టర్లు, ఎస్పీలు, సలహాదారులు, నామినేటెడ్ పోస్టులు, ఇతర కీలక నియామకాలన్నింటిలోనూ 'మనవాళ్లే' ఉండాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల్లోనూ పక్షపాతమే! అస్మదీయులకు అడ్డదారిలో డబ్బులు ఇచ్చేసి... కాని వారి బిల్లులను మురగబెట్టారు. ఈ ఐదేళ్ల పాలన మొత్తం అచ్చోసిన పక్షపాతం!

● 'భయం' లేకుండా భయపెట్టారు

'భయం లేకుండా పాలన సాగిస్తాను' అనేది పదవీ ప్రమాణం! కానీ, జగన్ పాలన మొత్తం భయపెట్టడమే లక్ష్యంగా సాగింది. విపక్ష పార్టీల వారి ఆర్థిక మూలాలు దెబ్బ తీసేందుకు విచ్చలవిడిగా దండోపాయాన్ని ప్రయోగించారు. టీడీపీ హయాంలో మంత్రిగా పని చేసిన శిద్దా రాఘవరావును దారిలోకి తెచ్చుకునేందుకు ఆయన గ్రానైట్ గనుల్లో కార్యకలాపాలను నిలిపివేయించారు. చరిత్రలో కనీవినీ ఎరుగనంత జరిమానాలు విధించారు. ఆ తర్వాత.. ఆయన వైసీపీలో చేరగానే నోటీసులు, జరిమానాలూ అన్నీ హుష్‌కాకి! ఇలా టీడీపీ నేతలకు చెందిన వ్యాపారాలు, సంస్థలే లక్ష్యంగా జరిగిన దాడులు ఎన్నెన్నో! రాష్ట్రంలో ఇలా భయంలేకుండా అరాచకాలు సాగించిన జగన్... కేంద్ర ప్రభుత్వానికి భయపడుతూనే పాలన సాగించారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నా... స్వీయరక్షణే లక్ష్యంగా ఢిల్లీ పెద్దలకు సలాములు చేస్తూ గడిపారు.

● అంతఃకరణ శుద్ధి... ఇదేనా?

'అంతఃకరణ శుద్ధితో కర్తవ్య నిర్వహణ' ఒక పెద్ద జోక్! జగన్ అంతరంగమంతా పగ, ప్రతీకారాలతోనే నిండిపోయినప్పుడు 'శుద్ధి'కి చోటెక్కడ! కుర్చీలో కూర్చున్న క్షణం నుంచే ఆయన మనసు 'పగా... పగా' అని రగిలిపోయింది. అప్పుడెప్పుడో జరిగిన కృష్ణా పుష్కరాల పనుల్లో అక్రమాలు జరిగాయంటూ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. గోదావరి పుష్కరాల పనులపైనా ఆరోపణలు చేశారు. కేవలం ఒక అజెండాతో అమరావతిని అటకెక్కించారు. రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ అన్నారు. నైపుణ్యాభివృద్ధిని 'స్కామ్' అన్నారు. మద్యం విధానంపైనా కేసు పెట్టారు. కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడుతో మొదలుకుని చంద్రబాబు దాకా అనేకమంది టీడీపీ నేతలను అరెస్టు చేయించారు. ఇదీ జగన్ అంతఃకరణ శుద్ధి!

'అంతఃకరణ శుద్ధి'తో రుషికొండకు గుండు

జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో పూర్తి చేసిన ఏకైక ప్రాజెక్టు... విశాఖలో రుషికొండకు గుండుకొట్టి, అక్కడ జనం ధనంతో విలాసవంతమైన ప్యాలెస్ కట్టించుకోవడం! అన్ని రకాల చట్టాలను ఉల్లంఘించి టూరిజం ప్రాజెక్టు ముసుగులో ప్యాలెస్‌లు నిర్మించారు. రూ.500 కోట్లు ఖర్చు పెట్టారు.

● నిజమైన విశ్వాసం, విధేయత చూపారా?

'రాజ్యాంగం పట్ల విశ్వాసం, విధేయత' చూపడమంటే... పాలనలో నైతిక విలువలూ పాటించడం అని అర్థం! ముఖ్యమంత్రిగా జగన్ అన్ని విలువలనూ వదిలేశారు. ఒకే స్కీమ్‌కు సంవత్సరానికి నాలుగుసార్లు బటన్ నొక్కి... నొక్కిన ప్రతిసారీ తన రోత పత్రికకు ప్రజాధనంతో కోట్లకొద్దీ ప్రకటనలు జారీ చేశారు. ఇలా ఐదేళ్లలో అధమ పక్షం రూ.500 కోట్లు జేబులో వేసుకున్నారు. గిట్టని మీడియాకు ప్రభుత్వ ప్రకటనలు నిలిపివేశారు. తన రోత మీడియాలో పని చేస్తున్న అనేక మందికి లక్షల్లో జీతాలిస్తూ ప్రభుత్వంలో పునరావాసం కల్పించారు.

● ప్రజలందరికీ 'న్యాయం' ఎక్కడ?


'రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తాను'.. ఇది ప్రమాణంలో మరో ముఖ్యమైన విషయం. ఈ ప్రభుత్వం నిజంగానే ప్రజలందరికీ న్యాయం చేస్తోందా? ఈ ప్రశ్నకు రాజధాని రైతులను అడిగితే సమాధానం చెబుతారు. ఎప్పుడూ, ఎన్నడూ లేనివిధంగా ఒక్క రూపాయి తీసుకోకుండా రాజధాని కోసం వీరు భూములు ఇచ్చారు. "ఇక్కడ అమరావతి పేరిట ఒక సరికొత్త నగరం నిర్మిస్తున్నాం. మీ వాటాగా వచ్చిన ప్లాట్ల ధర పెరుగుతుంది" అని గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే భూములు ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చి... అమరావతికి చరమగీతం పలికింది. మరి.. భూములిచ్చిన రైతుల పరిస్థితి ఏమిటి? వారికి న్యాయం ఎలా చేస్తాం? ఇవేవీ చెప్పలేదు. మరి... రాజధాని రైతులు ప్రజల్లో భాగం కారా? వారికి ఎలా న్యాయం చేస్తామో చెప్పకుండా మూడుముక్కలాట ఎందుకు మొదలుపెట్టినట్లు?

– అమరావతి, ఆంధ్రజ్యోతి



ఓటు వేయకూడదని నిర్ణయించుకోవడం తిరుగుబాటు కాదు.. లొంగుబాటు

- లారా కోట్స్ అమెరికా న్యాయవాది



బొత్స సత్యనారాయణ, మంత్రి

అబ్బ-ఛా!

పార్టీ మారితే అన్న-చెల్లి అనుబంధం ఉండదు

విమర్శలు చేసేటప్పుడు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల సంయమనం పాటించాలి. ఆమె మా ప్రత్యర్థి పార్టీకి నాయకురాలు. ఆ పార్టీ లైన్ ప్రకారం మాట్లాడుతున్నారు. ఇక అన్న-చెల్లి అనుబంధాలు ఎక్కడ ఉంటాయి.



కొల్లేటి కోట ఎవరిదో!

కామినేని X దూలం

కైకలూరులో ఢీ అంటే ఢీ

- కాంటూరు కుదింపు, ఆక్వా సమస్యలే కీలకం
- ఐదేళ్లుగా జాడలేని అభివృద్ధి
- దాడులు, అక్రమ కేసులు, అరెస్టులతో విసుగెత్తిన జనం
- సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కామినేని క్రియాశీలం
- ఎమ్మెల్యే దూలం తీరుపై జనంలో వ్యతిరేకత

బుర్రమీసాల(కనుమూరి) బాపిరాజు నాలుగు సార్లు, రైతు పక్షపాతి(ఎర్నేని) రాజారామచందర్ రెండు సార్లు ప్రాతినిధ్యం వహించిన కైకలూరు నియోజకవర్గంలో ఈ దఫా కీలక పోరు నెలకొంది. బీజేపీ నేత, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు టీడీపీ-జనసేన మద్దతుతో బరిలో నిలువగా.. ప్రస్తుత ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మరోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఒకప్పుడు కృష్ణా జిల్లాలో భాగమైన ఈ సీటు.. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో చేరింది. మూడొంతులు ప్రఖ్యాత కొల్లేరు సరస్సుతో ముడిపడి ఉంది. ఆక్వా రంగానికి ఆలవాలం కూడా. కొల్లేరు కాంటూరు కుదింపు, నీటి శుద్ధి, చేపల చెరువులు, ఆక్వాకు చేయూత, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ ఏనాటి నుంచో ఇక్కడ ప్రధాన సమస్యలు. అయితే గత ఐదేళ్లలో వైసీపీ దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులతో జనం విలవిలలాడారు. కైకలూరులో వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు తొలిసారి 2019లో గెలిచారు. తన సమీప టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణపై 9,357 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ జనసేన తరఫున పోటీ చేసిన బి.వెంకటేశ్వరరావుకు అప్పట్లో 10 వేలకు పైగా ఓట్లు దక్కాయి. 2014లో ఇక్కడ బీజేపీ-టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేసిన కామినేని శ్రీనివాస్ విజయం సాధించి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి కూడా అయ్యారు. 2019లో మాత్రం పోటీకి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత నియోజకవర్గంలో పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యమైనది జయమంగళ వైసీపీలో చేరిపోవడం. ఇక కొల్లేరు కాంటూరు విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని జగన్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు మిగతా నేతలు ఈ దిశగా పట్టుపట్టనూ లేదు. పైగా నిరుడు నిబంధనలకు విరుద్ధంగా కొల్లేరులో అక్రమంగా చేపల చెరువుల తవ్వకానికి స్వయంగా ఎమ్మెల్యేనే నడుం బిగించడం విమర్శలకు దారితీసింది. అభివృద్ధి కుంటుబడింది. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణమూ జరుగలేదు. అన్నిటికీ మించి తన పర భేదం లేకుండా వైసీపీ నేతలు ఎడాపెడా తప్పుడు కేసులు మోపి జనాలను తీవ్రంగా వేధించారు. మహిళలను కూడా జైలు పాల్జేయడం వంటి పరిణామాలు అధికార పక్షానికి ఇబ్బందికరంగా పరిణమించాయి. కొల్లేరు కాంటూరు కుదింపు వ్యవహారం 2014 మధ్య టీడీపీ హయాంలో ఒక నినాదంగా సాగింది. సరస్సును 5వ కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదిస్తే ఏకంగా 30 వేల ఎకరాలు మిగులు భూములపై స్పష్టత రావడమే కాకుండా ఇవన్నీ పేదప్రజలకు పంచడానికి దోహదపడుతుంది.



కైకలూరు నియోజకవర్గ స్వరూపం..

(కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి మండలాలు ఉన్నాయి)

మొత్తం ఓటర్లు 2,05,604

పురుషులు: 1,01,196, మహిళలు: 1,04,404, ట్రాన్స్‌జెండర్లు: 4

కీలక సామాజికవర్గాల ఓటర్లు..(సుమారుగా)

మాలలు-39 వేలు, కాపులు-31 వేలు, యాదవ-24 వేలు, గౌడ-17 వేలు, వడ్డి-13 వేలు, అగ్నికుల క్షత్రియ-8 వేలు, వెలమ-8వేలు, తూర్పు కాపు-7 వేలు, ముదిరాజ్‌లు-7 వేలు, కమ్మ-6 వేలు

ఆక్వా ఆగమాగం..

ఆక్వా రంగం ఎక్కువగా విస్తరించిన కైకలూరు నియోజకవర్గంలో ఈ రంగానికి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి మేలు చేయకపోగా నష్టం చేకూర్చిందని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీ హయాంలో ఆక్వాకు కరెంటు యూనిట్ రూ.1.50కి ఇచ్చేవారు. జగన్ వచ్చాక ఆక్వా, నాన్ ఆక్వా జోన్లు అంటూ విభజించి ఈ రంగాన్ని కకావికలం చేశారు. యూనిట్ విద్యుత్ ధరను రూ.3.85కి పెంచారు. 2019కి ముందు కరెంటు బిల్లు రూ.30 వేలు వచ్చేది. అది 1.25 లక్షలు దాటిపోవడం రైతుకు భారంగా పరిణమించింది. కొల్లేరు సరస్సులోకి సముద్రపు ఉప్పునీరు చొరబడకుండా రెగ్యులేటర్ నిర్మాణానికి జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసి.. గాలికి వదిలేసింది. - ఏలూరు, ఆంధ్రజ్యోతి



కామినేని శ్రీనివాసరావు

బలాలు నియోజకవర్గంలో అన్ని వర్గాలతో సాన్నిహిత్యం.. కేసులు, కొట్లాటలు, అనవసర జోక్యానికి దూరం.. 2014-19 నడుమ మంత్రిగా ఉండి దాదాపు 790 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, కొల్లేరు వ్యవహారాల్లో ప్రజలపక్షానే నిలబడడం.. కరోనా సమయంలో వైద్య సేవలు.


బలహీనతలు.. నియోజకవర్గ ప్రజలకు పూర్తి సమయం కేటాయించకపోవడం.. ఎక్కువ హైదరాబాద్‌లోనే గడపడం. గట్టిగా ఆరు నెలల ముందు నుంచే క్రియాశీలం.



దూలం నాగేశ్వరరావు

బలాలు ఆర్థికంగా బలంగా ఉండడం.. వైసీపీ శ్రేణులపై పట్టు.

బలహీనతలు.. కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువగా ఉండడం.. కొల్లేరులో అక్రమ చేపల చెరువులను ప్రోత్సహించడం.. జగనన్న కాలనీ పరిసరాల్లో ఆస్తులు కూడగట్టుకోవడం.. తాను చెప్పిందే చెల్లాలనే ధోరణి.. తప్పుడు కేసులు బనాయించడం.. స్వపక్షీయులపైనా అక్రమ కేసులు.



విజయన'గరం..గరం'!

కోలగట్ల X అదితి

- టీడీపీ-వైసీపీల మధ్య ఎన్నికల పోరు హోరాహోరీ
- దేశానికి సూపర్ సిక్స్ ప్లస్.. వీరభద్రస్వామికి ఎదురుగాలి
- ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై గల్లీగల్లీలోనూ ఓటర్ల చర్చలు
- అవినీతి మరకలేని కుటుంబం నుంచి వచ్చిన అదితి గజపతి
- టీడీపీకి మద్దతు పలికిన కోలగట్ల వ్యతిరేక వర్గాలు

అయినా.. పోరు ఉత్కంఠే

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి కంచుకోట. పార్టీ స్థాపించిన 1983 నుంచి 1999 వరకు అంటే ఐదు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు టీడీపీకే జైకొట్టారు. ఈ పార్టీ నుంచి పోటీ చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజుకే పట్టం కట్టారు. అయితే.. 2004లో తొలిసారి కోలగట్ల వీరభద్రస్వామి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపు గుర్రం ఎక్కినా.. తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో అంటే 2009, 2014లో టీడీపీ తన హవాను చాటుకుంది. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన వీరభద్రస్వామి విజయం దక్కించుకున్నారు. ఇక, ఇప్పుడు మరోసారి కోలగట్ల వీరభద్రస్వామి వైసీపీ తరఫున పోటీ చేస్తుండగా, టీడీపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు తలపడుతున్నారు. అధికార పార్టీ వైసీపీపై నెలకొన్న తీవ్ర వ్యతిరేకత కోలగట్లకు మైనస్‌గా మారగా, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన 'సూపర్ సిక్స్' అదితికి కలిసి వస్తోంది. ఆదేవిధంగా కూటమి పార్టీల మద్దతను కూడా ఆమె కూడగట్టారు.

కీలకం?



విజయనగరం నియోజకవర్గ స్వరూపం

కళలకు కాణాచిగా పేరొందిన విజయనగరం జిల్లాలోని కీలకమైన అసెంబ్లీ నియోజకర్గం విజయనగరం. ఎక్కువ శాతం మంది పట్టణ ఓటర్లు, పైగా అక్షరాస్యులు కావడంతో సమకాలీన రాజకీయాలపై వారికి అవగాహన ఉండడం గమనార్హం. దీంతో ఆచితూచి ఇక్కడ అభ్యర్థిని ఎన్నుకునే సంప్రదాయం ఉంది.

మొత్తం ఓటర్లు: 2,57,205

పురుషులు: 1,24,829, మహిళలు: 1,32,347, ట్రాన్స్‌జెండర్లు: 29

కోలగట్లపై సొంత వర్గం గుర్రు

వైసీపీ అభ్యర్థి కోలగట్లకు సొంత పార్టీ నుంచే సెగ తగులుతోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల అధికారాలన లాగేసుకున్నారని, వారిని డమ్మీలను చేసి పెత్తనం సాగిస్తున్నారని నేతలు వాపోతున్నారు. ఈ ప్రభావం ఎన్నికల్లో కోలగట్లకు తీవ్ర సంకటంగా మారనుంది. కొంత మంది మాజీ కౌన్సిలర్లు, కీలకంగా వ్యవహరించే వైసీపీ నాయకులు సైతం ఎమ్మెల్యే ఏకపక్ష తీరుపై విసుగు చెందారు. వీరిలో కొందరు టీడీపీలో చేరారు. పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ వంటి వారు కీలక ఎన్నికల సమయంలో వైసీపీకి దూరమయ్యారు. అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ కోలగట్ల ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని ప్రకటించారు. కోలగట్ల వ్యతిరేక వర్గాలన్నీ టీడీపీ గూటికి చేరడంతో ఆయన దాదాపు ఒంటరయ్యారనే వాదన వినిపిస్తోంది. దీనికితోడు ఎమ్మెల్యే కోలగట్ల అనుచరులుగా ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు దందాలకు పాల్పడుతున్నారు. భూకబ్జాలు, కార్పొరేషన్ పరిధిలోని భూముల దురాక్రమణలు, చెరువులను పూడ్చేసి ఆక్రమణలకు పాల్పడటం వంటివి చేస్తున్నారు. ఇవన్నీ వ్యతిరేకతను పెంచాయి. ఎమ్మెల్యే కోలగట్ల రియల్‌ఎస్టేట్.. చిట్టీల వ్యాపారం చేస్తుంటారు. చిట్టీల వ్యాపారాన్ని ఆయన పేరుతోనే నిర్వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలను తమ కుటుంబం, బంధువులకు చెందిన వారిద్వారా విస్తరించారు. విజయనగరంలో ఇప్పటికీ డీగ్రీ కళాశాల లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయంలోనే డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ఐదు ఎకరాల స్థలం డిగ్రీ కళాశాలకు కేటాయించే అంశంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టలేదు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అదితి గజపతిరాజు అవినీతి మరకలేని కుటుంబం నుంచి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె కావడం ఆమెకు కలిసి వస్తున్న మరో ప్రధాన అంశం. 2019 ఎన్నికల్లో కూడా ఆమె పోటీ చేసినప్పటికీ 6,417 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. దీంతో ప్రజల్లో ఆ సానుభూతి కూడా పెద్ద ఎత్తున ఉండడం విశేషం. మరోవైపు వైసీపీ వ్యతిరేక వర్గాలన్నీ టీడీపీకి మద్దతు పలుకుతున్నాయి. పైగా కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులు ఆమెకు కలిసి వస్తున్నారు. మరికొంత మంది టీడీపీలో చేరకపోయినా అదితికి మద్దతు పలికారు. వైసీపీ నేత, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ వంటి వారు కోలగట్ల ఓటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. దీంతో విజయనగరం పోరు హోరా హోరీగా సాగుతున్నా మెజారిటీ వర్గాల అభిప్రాయం ప్రకారం అదితి గెలుపు ఖాయమని తెలుస్తోంది.



కోలగట్ల వీరభద్రస్వామి

బలాలు సిటింగ్ ఎమ్మెల్యే.. ఆర్థికంగా బలమైన నాయకుడు

బలహీనతలు.. అవినీతి ఆరోపణలు ముమ్మరం.. నోటి దురుసు, తానే సర్వం అన్నట్టు వ్యవహారం.. ప్రభుత్వ వ్యతిరేకత.. భూకబ్జాలు, అక్రమాలు



అదితి గజపతిరాజు

బలాలు మచ్చలేని కుటుంబం.. గత ఎన్నికల్లో ఓటమి సానుభూతి.. కూటమి పార్టీల ఐక్యత.. అందరికీ అందుబాటులో ఉండడం.. సమస్యలపై అవగాహన

బలహీనతలు.. టీడీపీ నేత మీసాల గీత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండడం.. గీతకు గ్లాసు గుర్తు కేటాయింపు

పేర్రాజు మాట

ఒక్కో అభ్యర్థికి ఒక్కో బ్యాలెట్ బాక్సు!

బాక్సుపైనే ఎన్నికల గుర్తు.. చెల్లని ఓటే పడేదికాదు!



గెద్దం పేర్రాజు

'ఇప్పుడంటే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వచ్చాయి. అప్పట్లో పేరుకే బ్యాలెట్ పేపర్లు. బ్యాలెట్ బాక్సులతోనే ఎన్నికలు జరిగేవి. 1950వ దశకం వరకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఒక్కొక్కటి చొప్పున బ్యాలెట్ బాక్సులు ఉండేవి. ఈ తరం వారికి ఆనాటి ఎన్నికల విధానంపై అంతగా అవగాహన ఉండదు' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మాజీ ఎమ్మెల్యే గెద్దం మహాలక్ష్మి కుమారుడు గెద్దం పేర్రాజు తెలిపారు. ఆనాటి ఎన్నికల విధానంపై ఆయన పలు ఆసక్తికరమైన విషయాలను వివరించారు. '1952, 1955 సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఒక్కొక్కరికీ ఒక్కో బ్యాలెట్ బాక్సు చొప్పున పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసేవారు. బ్యాలెట్ పేపరు తీసుకుని నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే విధానంపై అప్పటి ప్రజలకు అంతగా అవగాహన ఉండేది కాదు. ఎన్నికల సంఘం సూచన మేరకు అప్పట్లో అభ్యర్థికి ఒక బ్యాలెట్ బాక్సు విధానాన్ని అమలు చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటరుకు ఎన్నికల సిబ్బంది ఓటు కాగితం ఒకటి ఇచ్చేవారు. దాన్ని మడతపెట్టి తమకు నచ్చిన అభ్యర్థికి కేటాయించిన బాక్సులో వేసేవారు. ఇదంతా బహిరంగంగానే జరిగేది. ఎవరికి ఓటు వేస్తున్నామో తెలుసుకునేందుకు మాత్రం బ్యాలెట్ బాక్సులపై పోటీలో ఉన్న అభ్యర్థి ఎన్నికల గుర్తును అతికించేవారు. అప్పట్లో ప్రధానంగా ఎన్నికల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మాత్రమే పోటీలో ఉండేవి. అమలాపురం, ముమ్మిడివరం వంటి నియోజకవర్గాల్లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పోటీ చేసేది. అప్పట్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా నామమాత్రంగానే పోటీలో పాల్గొనేవారు. అభ్యర్థికి ఒక బ్యాలెట్ బాక్సు ఉన్నంత వరకు ఎక్కడా చెల్లని ఓట్లు పడలేదు' అని తెలిపారు.

-అమలాపురం రూరల్

'కంసమామ' పాలనలో దళితులకు నరకం



- దాడులు, దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యలు
- అత్యాచారాలు, శిరోముండనాలు అన్నీ దళితులపైనే
- మరోసారి మోసపోవడానికి వారు సిద్ధంగా లేరు
- అమరావతిపై మడమ తిప్పారు
- ప్రస్తుత ఎన్నికలు అన్ని వర్గాల భవిష్యత్తును నిర్దేశించేవే
- అమరావతి బహుజన జేఏసీ నేత బాలకోటయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

"ఐదేళ్ల జగన్ పాలన.. కంసమామ పాలనే. దళితులు నరకం చవిచూశారు. దగాపడి, దిగాలు పడ్డారు" అని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రజారాజధాని అమరావతి కోసం ఎస్సీ, ఎస్టీలు 34 శాతం మంది భూములిచ్చారని.. జగన్ వారి గొంతు కోశారని అన్నారు. ఉపాధి అవకాశాలను కోల్పోగా.. దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, శిరోముండనాలు, మూత్ర విసర్జనలు వంటి దారుణాలు చవిచూశారని తెలిపారు. "ఈ ఘటనలు జరిగింది ఈ సీఎం జగన్ హయాంలోనే. ఇలాంటి రాక్షస ప్రభుత్వం, పాలన మరొకటి ఉండదు' అని బాలకోటయ్య మండిపడ్డారు.

జగన్ పాలనలో దళితులకు నష్టమెంత?

బాలకోటయ్య: తెలుగు నేలపై ఇంతకుముందు ఏ ప్రభుత్వాలు దళితులకు చేయని అన్యాయం జగన్ ప్రభుత్వం చేసింది. తన ప్రసంగాల్లో 'నా ఎస్సీ' అని చెప్పే జగన్.. నమ్మించి గొంతు కోశారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను ఆపేశారు. సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారు. ఎస్సీ, ఎస్టీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టారు.

దళితులపై దాడులకు కారణం ఏమిటి?

దళితుల్లో ప్రశ్నించే తత్వం, ప్రతిఘటనా వైఖరి ఎక్కువ. ఆకలేసిన వాడే కేకలు వేస్తాడు. న్యాయం దక్కని వాడే తెగిస్తాడు. కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్ ప్రభుత్వాన్ని మాస్కులు అడిగారు. ఆయన చేసిన నేరం అదే. ఆయనను అవమానాలకు, అరెస్టులకు గురిచేశారు. చివరకు ప్రాణాలు తీశారు. చీరాలలో కిరణ్ అనే యువకుడు మాస్క్ పెట్టుకోని కారణంగా పోలీసులతో గొడవపడి, లాఠీ దెబ్బలకు చనిపోయాడు. సీతారాంపురంలో వరప్రసాద్ ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి శిరోముండనం చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేశాడు.

దళితులు ఇంకా వైసీపీ వైపు ఉన్నారా?

దళితులు వైసీపీ వైపు మొగ్గుచూపినందుకే ఐదేళ్లుగా నష్టపోయాం. జగన్‌ను తెచ్చి నెత్తిన పెట్టుకున్నందుకు బాధితులుగా మారిపోయాం. దళితులకు మేనమామను అనే మాటలు నమ్మి మోసపోయాం. కంసమామ పాలనలో ఈ ఐదేళ్లు బతికాం. మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేము. అన్ని సామాజికవర్గాలకు ఇచ్చిన అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, పింఛన్లు తప్ప దళితులకు ఒరిగిందేమీ లేదు.

ఎన్నికల ఫలితాలు ఎలా ఉండొచ్చు?

ఈ ఎన్నికలు అన్ని సామాజికవర్గాలకు సంబంధించినవి. స్లేవ్ ఆంధ్ర నుంచి సేవ్ ఆంధ్ర కోసం జరుగుతున్న ఎన్నికలివి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం 40 ఏళ్ల వెనక్కిపోయింది. విభజన కారణంగా కుదేలైన రాష్ట్రం నష్టపోయింది. పోలవరం పూర్తికాలేదు. ప్రత్యేక హోదా రాలేదు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేవు. మద్యం, ఇసుక అమ్ముకుంటేనే సాధారణ పాలనా ఖర్చులు వస్తున్నాయి. అప్పులు తెస్తేనే నవరత్నాలకు బటన్ నొక్కుతున్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు లేవు. ఉన్న పెట్టుబడులు వెళ్లిపోతున్నాయి. ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ రాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు. అందుకే ప్రభుత్వం మారాలి. లేకపోతే ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం ఉండేదని, అక్కడ తెలుగువారు ఉండేవారని భావితరాలవారు పాఠ్యపుస్తకాల్లో చదువుకోవాల్సి వస్తుంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

అమరావతిపై వైసీపీ ఆరోపణలో వాస్తవం ఉందా?

అమరావతిపై వైసీపీ కత్తి దూయడం రాజకీయ వ్యూహంలో భాగమే. సీఎం జగన్ దృష్టిలో అమరావతి అంటే చంద్రబాబు, కమ్మ సామాజికవర్గం అని అర్థం. అమరావతిని చంపేస్తే, రాజధాని లేకుండా చేస్తే రాజకీయంగా టీడీపీని అంతం చేయవచ్చన్నది జగన్ వినాశకర విధానం. 2019 ఎన్నికలకు ముందు అమరావతి అందరిది అన్నారు. అధికారంలోకి రాగానే కొందరిది మాత్రమేనని ప్రచారం చేశారు. అమరావతిపై అబద్ధాలు కుమ్మరించారు. వాస్తవానికి అమరావతికి భూములిచ్చిన వారిలో 34 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు కాగా, కమ్మలు 18 శాతం, రెడ్లు 24 శాతం, బీసీలు 14 శాతం ఉన్నారు. ప్రతి ఏటా కౌలు తీసుకుంటున్న రైతుల్లో రెండు ఎకరాల్లోపు భూములిచ్చిన సన్న, చిన్నకారు రైతులు 25 వేల మంది ఉన్నారు. దీన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా, చంద్రబాబు బినామీలదిగా ప్రచారం చేశారు. అమరావతి చారిత్రక నగరం. శాతవాహనులు, నాగార్జునులు, శాలివాహనులు పాలించిన ప్రాంతం. దానికి కులాల తోకలు తగిలించారు. ఎడారి, శ్మశానం అని పేర్లు పెట్టారు. నిజానికి ఇది ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. భూములిచ్చిన 19 గ్రామాలు తాడికొండ ఎస్సీ నియోజకవర్గంలో ఉన్నాయి. అందుకే అది దళిత రాజధానిగా మేమంతా ఉద్యమించాం. కోర్టుకు వెళ్లాం. సీఎం విశాఖకు వెళ్లకుండా అడ్డుపడ్డాం.

మూడు ముక్కలాటతో నష్టం ఎంత?

రాష్ట్రంలో 5.50 కోట్ల మంది ప్రజలు పూర్తిగా నష్టపోయారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా మిగిలారు. ప్రభుత్వాన్ని నమ్మి భూములిచ్చిన నేరానికి రైతులు రోడ్డెక్కారు. పండుగలు, పబ్బాలు లేకుండా శిబిరాల్లో జీవితాలు గడిపారు. వేధింపులు, అణచివేతలు, కేసులు, జైళ్లు అనుభవించారు. అసెంబ్లీ తీర్మానాలు, శాసనాలు, సీఆర్డీఏ చట్టాలు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యాయి. చివరికి హైకోర్టు తీర్పు ఇచ్చినా రాజధాని అడవిలా మిగిలింది. రాజధానిలో పనిచేస్తున్న 40 వేల మంది కార్మికులను ప్రభుత్వం వెళ్లగొట్టింది. దళితులు, బహుజనులు అన్నివిధాలుగా ఉపాధి కోల్పోయారు.



ఈ సైకిల్‌తో మీకు సూపర్ సిక్స్!

చేతిలో సైకిల్. తలపై సూపర్ సిక్స్, దానిపై ఎన్టీఆర్ బొమ్మతో బాపట్ల జిల్లా చీరాలలో బుధవారం జరిగిన చంద్రబాబు ప్రజాగళం సభలో ఓ వృద్ధుడు సందడి చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన కార్యకర్తలు మేనిఫెస్టోను ప్రదర్శిస్తూ.. సందడి చేశారు. చంద్రబాబు రావాలి.. రాష్ట్రం బాగుపడాలి అని నినదించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం పరశురామపురంలో మేనిఫెస్టోతో ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రాలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన నాయకుడు కణితి కిరణ్‌కుమార్ పాలాభిషేకం చేశారు.






‘ఆడబిడ్డ’కే ఆదరణ!

- కడపలో జగన్, షర్మిల ప్రసంగాలు బేరీజు వేసుకుంటున్న జనం
- వివేకా వ్యక్తిగత జీవితంపై జగన్ బురద..
- జీర్ణించుకోలేకపోతున్న పులివెందుల ప్రజలు
- కడపలో వైఎస్ వారసురాలిగా షర్మిలకే జై

(కడప - ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల కోసం తీసిన సినిమా ‘యాత్ర’! అందులో ఒక సన్నివేశంలో... “మన గడపతొక్కి సాయం అడిగిన ఆడబిడ్డ దగ్గర రాజకీయం ఏందిరా!” అని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాత్రతో ఒక డైలాగ్ చెప్పించారు! సరిగ్గా ఇప్పుడు... 2024 ఎన్నికల సమయంలో ఈ మాటలను కడప ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. మన ముందుకొచ్చి, కొంగుచాచి న్యాయం అడుగుతున్న ఆడబిడ్డకు అండగా ఉండాలని భావిస్తున్నారు. ఆ ఆడబిడ్డ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూతురు కావడమే ఇక్కడ విశేషం! పులివెందుల గతంలో కాంగ్రెస్‌కు కంచుకోట. వైఎస్ రాజకీయాల్లోకి వచ్చాక అది వారి కుటుంబానికి కంచుకోటగా మారింది. అలాంటి చోట ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గురువారం పులివెందులలో జరిగిన సభలో వైసీపీ అధినేత జగన్ తన బాబాయ్ వివేకా హత్య గురించి, తన చెల్లెలు గురించి మాట్లాడుతూ.. ‘వైఎస్ వారసులు ఎవరు?’ అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న ఇప్పుడు అందరిలోనూ ఆలోచనలు రేకెత్తిస్తోంది.

వివేకా హత్య చుట్టూ...

పులివెందుల అంటే గుర్తుకొచ్చేది వైఎస్ రాజశేఖర్ రెడ్డి! ఇప్పుడు ఆయన పిల్లలు జగన్, షర్మిల పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. వైఎస్ ఒదిగి, ఎదిగిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిన ఆయన కుమార్తె వైఎస్ షర్మిల కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నారు. తనకు ఒక ‘కన్ను’గా వైఎస్ జగన్ పేర్కొన్న వైఎస్ అవినాశ్ రెడ్డిని ఢీ కొంటున్నారు. ఇక.. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో స్వయంగా జగన్ పోటీకి నిలబడ్డారు. దీంతో... ఈ ఎన్నిక రసవత్తరంగా మారింది. “మీ ఆడబిడ్డ.. మీ ముందుకొచ్చి కొంగుచాచి చిన్నాన్నకు న్యాయం చేయమని అడుగుతోంది. హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించండి. న్యాయం వైపు నిలబడండి” అని షర్మిల పులివెందుల గడ్డపై ప్రజలను కోరారు. ఇదే విషయంపై గురువారం పులివెందుల సభలో జగన్ స్పందించారు. షర్మిల, సునీత పేరెత్తకుండా వారిపై విమర్శలు గుప్పించారు. అయితే... చెల్లెళ్లపై జగన్ విమర్శలకు జనం నుంచి అంతాగా స్పందన కనిపించలేదు. పైగా... వివేకా వ్యక్తిగత జీవితంపై జగన్ మాట్లాడిన మాటలను జీర్ణించుకోలేకపోతున్నారు. దారుణంగా హత్యకు గురైన వ్యక్తిపై, అదీ ఐదేళ్ల తర్వాత ఆయన వ్యక్తిగత జీవితంపై బురదజల్లడం పులివెందుల ప్రజలకు నచ్చలేదు. ‘ఈ ప్రస్తావన ఇప్పుడు అవసరమా?’ అనుకుంటున్నారు. నాడు జగన్ జైలుకు వెళితే పార్టీని నిలబెట్టింది, అప్పటి ఉప ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కారణమైంది షర్మిలే కదా అనే అభిప్రాయమూ వినిపిస్తోంది. అప్పుడు షర్మిల సేవలను వాడుకుని, అధికారంలోకి వచ్చాక వదిలేశారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. పులివెందుల సభల్లో షర్మిల, జగన్ మాట్లాడిన తీరును కూడా బేరీజు వేసుకుంటున్నారు. ‘వైఎస్ వారసులు ఎవరో మీరే చెప్పండి’ అనే ప్రశ్నకు కూడా ‘జగన్, షర్మిలలే కదా.. వేరే ఇంకెవరున్నారు?’ అనే మాట వినిపించింది. వైఎస్ వారసులకే ఓటువేయాలని భావిస్తున్న వారంతా షర్మిలకే మద్దతు పలికే అవకాశమున్నట్లు చెబుతున్నారు. వివేకా దారుణ హత్యను నిరసిస్తున్న వారు కూడా ఓటు రూపంలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయాలని భావిస్తున్నారు. షర్మిలపై ప్రజల్లో అభిమానం పెరుగుతుండడంతో వైసీపీ శిబిరంలో కలవరం మొదలైంది. మే 13నాటికి షర్మిల మరింత చొచ్చుకుపోయి చిన్నాన్న హత్యకు న్యాయం కావాలని కోరితే పులివెందుల ప్రజల తీర్పు ఊహించేందుకే వైసీపీకి వణుకు తెప్పిస్తోందంటున్నారు.

నవరత్నాలు ఒట్టి హంబక్!

అమరావతి, కడప, మే 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న నవరత్నాలతో రాష్ట్రమంతా సుభిక్షమై పోయినట్లుగా చెబుతున్నారని, ఇదంతా ఒట్టి హంబక్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర(పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కొట్టిపారేశారు. ఈ నవరత్నాలపై నవ సందేహాల పేరిట తాము లేవనెత్తే ప్రశ్నలకు ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె జగన్‌కు బుధవారం బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అంశాలపై తొమ్మిది ప్రశ్నలు సంధించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడం నిజం కాదా? అని షర్మిల ప్రశ్నించారు. భూమిలేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సాగుకోసం భూమిని ఇచ్చే కార్యక్రమాన్ని ఉన్నట్టుండి వైసీపీ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందో చెప్పాలని నిలదీశారు. వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలవారికి ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కువమందికి ఎందుకు టికెట్లివ్వలేదని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీలపై రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, ఇతర దాడులు, హింస వంటి క్రైమ్ రేటు 2021లో అసాధారణంగా పెరిగిపోయినట్లు కేంద్ర ప్రభుత్వానికి గణాంకాలతో సహా నివేదిక సమర్పించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు జగన్ సరైన సమాధానాలు ఇచ్చాకే సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఓట్లడగాలని షర్మిల డిమాండ్ చేశారు. న్యాయ నవ సందేహాలు తీర్చే వరకు, సమాధానాలు చెప్పే వరకు, ప్రజల్ని ఓటు అడిగే నైతిక హక్కు కూడా సీఎం జగన్‌కు లేదన్నారు. ‘మీకు రాష్ట్ర ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. వారి తరఫున మేం లేవనెత్తుతున్న ఈ సందేహాలకు సమాధానాలు చెప్పండి. అడిగేది మేమే అయినా.. మాకు జవాబులిస్తున్నామనుకోకండి.. ప్రజలకు సమాధానమివ్వండి. ఈ సందేహాలను నివృత్తి చేశాకే ప్రజలను ఓటు అడగాలి’ అని లేఖలో పేర్కొన్నారు.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాకే ఎస్సీ,ఎస్టీలను ఓట్లడగండి

జగన్‌కు ‘నవ సందేహాల’తో షర్మిల బహిరంగ లేఖ

జగన్‌కు షర్మిల సంధించిన నవ సందేహాలు ఇవీ..

1.ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్లించడం నిజం కాదా?
2.ఎస్సీఎస్టీలకు సాగు భూమి ఇచ్చే కార్యక్రమాన్ని ఎందుకు నిలిపేశారు?
3.ఎస్సీఎస్టీల వివిధ పథకాలను ఎందుకు ఆపేశారు?
4.వెట్టి, జోగిని పునరావాస కార్యక్రమం రాష్ట్రంలో ఎందుకు ఆగింది?
5.విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరు ఎందుకు తొలగించారు?
6.సిటింగ్ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల్లో ఎక్కువమందికి ఎందుకు టికెట్లివ్వలేదు?
7.ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరగడంపై కేంద్రానికి నివేదిక ఇవ్వడం వాస్తవం కాదా?
8.దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని ఎందుకు సమర్థిస్తున్నారు?
9.ఎస్సీ, ఎస్టీ యువతకు దన్నుగా ఉన్న స్టడీ సర్కిళ్లను ఎందుకు నిర్వీర్యం చేశారు?

గ్రాబింగ్ చట్టం రద్దుపైనే..

రెండో సంతకం!



బాపట్ల జిల్లా చీరాలలో ప్రజాగళం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన చీరాల అభ్యర్థి ఎంఎం కొండయ్య

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఐదేళ్లూ బందిపోట్లను మించిన దోపిడీ జరిగిందన్నారు. మాఫియాలతో సకల వ్యవస్థలను నాశనం చేశారని.. ప్రజాస్వామ్యాన్ని తిరిగి నెలకొల్పే బాధ్యత తమ కూటమిదేనని అని స్పష్టం చేశారు. డ్రైవింగ్ తెలియని వ్యక్తికి డ్రైవర్ బాధ్యతలు అప్పగిస్తే ఇలానే ఉంటుందన్నారు. పరిపాలన చేతకాని దద్దమ్మ జగన్ అని మండిపడ్డారు. ప్రజాగళంలో భాగంగా బుధవారం బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. సాయంత్రం గుంటూరులో భారీ రోడ్‌షో నిర్వహించారు. సుమారు 5 కిలోమీటర్ల పొడవున సాగిన ఈ రోడ్‌షోలో జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం జిన్నాటవర్ సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా చీరాల-పేరాల ఉద్యమ స్ఫూర్తిగా ఈ పది రోజులూ ఈ దుర్మార్గ ప్రభుత్వంపై పోరాడాలని పిలుపిచ్చారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందన్నారు. స్కూళ్లకు రంగులేసినంత మాత్రాన పిల్లలకు చదువురాదన్నారు. ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు చాలా ఉన్నాయని గుర్తుచేశారు. ఈ సీఎం టీచర్లను బ్రాందీ షాపుల దగ్గర కాపలా పెట్టాడని ఆక్షేపించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఆలోచించి ఓటేయాలని కోరారు.

మా మేనిఫెస్టో అదుర్స్..

మేనిఫెస్టో విషయంలో జగన్ చేతులెత్తేశాడు. మా కూటమి మేనిఫెస్టో అదిరిపోయింది. 13లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడు. సంపద సృష్టి లేకపోవడంతో అప్పిచ్చేవాడు కరువై చేతులెత్తేశాడు. జగన్ అనేక చెడ్డపనులు చేసినా ఎక్కడన్నా ఒకట్రెండు మంచిపనులు చేసి ఉంటే వాటిని కొనసాగిస్తాం. సైకోకు, నాకు ఉన్నా తేడా అదే. తొలినుంచి టీడీపీకి వెన్నెముక బీసీలే.. బీసీ డిక్లరేషన్, జయహో బీసీ పెట్టాం. సంవత్సరానికి 30వేల కోట్ల బడ్జెట్ పెడతాం. 50 ఏళ్లకే పించన్ అందిస్తాం. చేనేత కార్మికులకు పవర్‌లూంలు ఉంటే 500యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తాం. ప్రతి చేనేత కుటుంబానికి రూ.24,000 ఆర్థిక సాయం అందిస్తాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవోను రద్దు చేస్తాం. ఆక్వా రైతులకు రూ.1.50కే కరెంటు ఇస్తాం. ఉచిత ఇసుక విధానం తెస్తాం. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో పాటు సంవత్సరానికి 4లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. కాపులు ఎక్కువగా ఉన్న చోట వారికి అధికంగా ఇస్తాం.

> ● జగన్ ఓ వ్యాపారి, దళారి. ప్రజలను బలహీనతలను సొమ్ము చేసుకుని నాసిరకం మద్యంతో 30,000 మంది మహిళల తాళిబొట్లు తెంచాడు. ఇసుక మాఫియాతో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల ఉసురుపోసుకున్నాడు.
> ● పెంచే రూ.4,000 పింఛన్ ఏప్రిల్ నుంచే ఇస్తాం. అంటే జూలైలో రూ.7,000 చెల్లిస్తాం.
> \- చంద్రబాబు

ప్రజల ఆస్తిపై కొత్తగా ఇచ్చే హక్కేంటి?

భూములకు సంబంధించి 10(1), అడంగల్, పట్టాదార్ పాసుపుస్తకం తరతరాలుగా వస్తున్నాయి. వాటిని గ్రాబింగ్ యాక్టుతో రద్దు చేస్తాడంట!. కొత్త చట్టంలో పట్టాలిస్తాడంట! ప్రజల ఆస్తిపై ఆయన కొత్తగా ఇచ్చే హక్కు ఏంటి? వాళ్ల పట్టాలపై, సర్వే రాళ్లపైనా ఈయన ఫొటో వేసుకున్నాడు. సైకో మనస్తత్వం కాకపోతే మరేవిుటి? వైసీపీ దొంగలు ఆన్‌లైన్‌లో మీ పేరు మీద ఉన్న ఆస్తి మార్చేస్తే ఆ తర్వాత గింజుకున్నా లాభం ఉండదు. ఆత్మహత్యలే శరణ్యమవుతాయి. జగన్ సొంత జిల్లా ఒంటిమిట్టలో ఒక చేనేత కార్మికుడి స్థలాన్ని వైసీపీ నాయకుడు తన పేరిట మార్చుకున్నాడు. ఆ బాధితుడు ఆఫీసుల చుట్టూ న్యాయం కోసం తిరిగి ఆత్మహత్య చేసుకున్నాడు. అయన భార్య కూడా చనిపోయింది. కుమార్తె ఒంటరి కావడంతో రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకున్నాను.

బీజేపీతో కొత్తగా కలవలేదు

నేను బీజేపీతో కలిశానని.. అధికారంలోకి రాగానే 4% ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తానని.. మసీదులు కూలుస్తానని నాపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీజేపీతో నేను కొత్తగా కలవలేదు. గతంలోనూ పొత్తు ఉంది. అయినా ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందించాం. హైదరాబాద్‌లో ఉర్దూ యూనివర్సిటీ, హజ్ హౌస్, ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పెద్ద పీట వేశాం. కర్నూలులో ఉర్దూ వర్సిటీ, కడప, విజయవాడలో హజ్‌హౌస్ ఏర్పాటు చేశాం. మా ప్రభుత్వం రాగానే 50ఏళ్లకే ముస్లింలకు పింఛన్ ఇచ్చే ఆలోచన చేస్తున్నాం. ఈద్గా, కబరస్థాన్‌లకు స్థలాలు, హజ్‌యాత్రకు రూ.లక్ష ఆర్థిక సాయం, నూర్‌బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు అందిస్తాం. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలిస్తాం. ఇమాం, మౌజన్‌ల గౌరవ వేతనాలను రూ.10 వేలకు పెంచుతాం. అర్హత ఉన్న ఇమాం, మౌజన్‌లను ప్రభుత్వ కాజీలుగా నియమిస్తాం. ప్రతినెలా మసీదుల నిర్వహణకు రూ.5వేల చొప్పున ఇస్తాం. ఈనెల 13.. చరిత్ర తిరగరాసే రోజన్న విషయం గుర్తించాలి. ఎండగా ఉందని ఇంట్లో కూర్చోకుండా అందరూ బయటకు వచ్చి ఓటు వేయాలి. 2019లో మీ భూమి విలువ ఇప్పుడు లేదు. అద్దెలు పెరగలేదు. కొనుగోలు శక్తి పెరగలేదు. అయినప్పటికీ సైకో అన్ని చేసేశానంటున్నాడు. మీకు అమరావతి రాజధాని కావాలంటే మీలో రోషం, కోపం రావాలి. అవి ఉంటే ఈ వైసీపీ వాళ్లు తిరగగలుగుతారా? వాళ్లు వస్తే ముందు అమరావతికి జై కొట్టి ఆ తర్వాత ఓట్లు అడగమనండి. 3 రాజధానుల పేరుతో మీ పొట్టలు కొట్టి మిమ్మల్ని ఓటు అడిగే హక్కు వారికి ఎక్కడిది?

నాడు అడ్డుపడి.. నేడు స్వాగతం

స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో నాపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేసినప్పుడు మహిళలు పెద్దఎత్తున గుంటూరులో రోడ్లపైకి వస్తే అప్పుడు పోలీసులు అడ్డుపడ్డారు. ఈ రోజున ఆ పోలీసులే స్వాగతిస్తున్నారు. ఎందుకంటే పోలీసులు ఇప్పుడు సైకో చేతిలో లేరు.

నాడు కోడికత్తి.. నేడు గులకరాయి

జగన్ అహంకారి.. విధ్వంసకారి. గత ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామా ఆడాడు. నేడు గులకరాయి నాటకం ఆడుతున్నాడు. బాబాయిని గొడ్డలితో లేపేశారు. జగన్ దోపిడిదారుడి మాదిరిగా రాష్ట్రంలో సంపద అంతా దోచేశాడు.

గుంటూరులో జనసునామీ!

గుంటూరులో చంద్రబాబు చేపట్టిన రోడ్ షో, ప్రజాగళం బహిరంగ సభ జనసునామీని తలపించాయి. భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు స్థానిక ప్రజలు, మహిళలు, యువకులు తోడవడంతో రోడ్‌షో మహాజన ప్రభంజనంలా మారింది. చంద్రబాబును చూసేందుకు తండోపతండాలుగా ప్రజలు వచ్చారు. కాన్వాయ్ నిదానంగా సాగడంతో 5కి.మీ. దూరానికి 2.20గంటల సమయం పట్టింది. అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపిస్తూ, గజమాలలతో స్వాగతంపలికారు. రోడ్డుకిరువైపులా బారులు తీరడమే గాక.. గోడలు, వాహనాలు, బస్సులపైనా నిల్చున్నారు. రాత్రి 9.30కు సభ ప్రారంభం కాగా తొలుత అభ్యర్థులతో మాట్లాడించి తర్వాత చంద్రబాబు ప్రసంగించారు. సరిగ్గా 9.58కి ప్రసంగాన్ని ముగించారు.

వివేకా హత్యకు రూ.40 కోట్ల సుపారీ

- హత్య చేసినవారికే మళ్లీ టికెట్ ఇచ్చారు
- అవినాశ్‌ను ఐదేళ్లుగా కాపాడుతున్నారు
- అన్ని వర్గాలనూ మోసగించిన జగన్... వైఎస్‌కు వారసుడెలా అవుతారు?: షర్మిల


బద్వేలు బహిరంగసభలో మాట్లాడుతున్న షర్మిల

కడప, మే 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయడానికి రూ.40కోట్లు సుపారీ ఇచ్చారని, దీనిలో భాగంగా హంతకులకు రూ.5కోట్లు చెల్లించారని పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆమె కడప పార్లమెంటు పరిధిలో రెండో విడత ఎన్నికల ప్రచారాన్ని బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలం వడ్డమాను గ్రామం నుంచి చేపట్టారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మండలాల్లో బస్సు యాత్ర సాగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, “వివేకాను హత్య చేసినవారికే జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారు. ఇంతకంటే అన్యాయం ఉంటుందా? ఈహత్య ఎంపీ అవినాశ్‌రెడ్డి చేయించాడని అన్ని ఆధారాలూ ఉన్నాయి. హత్యకు ముందు పెద్దఎత్తున డబ్బుల డీలింగ్ జరిగినట్లు సీబీఐ చెప్పింది. కర్నూలులో అరెస్టు చేయాలని చూస్తే రక్షించారు. ఐదేళ్ల నుంచి అవినాశ్‌రెడ్డిని అడుగడుగునా జగన్ కాపాడుతున్నారు” అని షర్మిల నిప్పులు చెరిగారు. “వివేకాను ఎవరు చంపారో అందరికీ తెలుసు. మళ్లీ హంతకులు గెలవాలా? హంతకులు మళ్లీ చట్ట సభలకు వెళ్లకూడదనే నేను ఎంపీగా పోటీ చేస్తున్నా. ఒకవైపు న్యాయం ఉంది, మరోవైపు అధర్మం ఉంది. ఒకవైపు వైఎస్ బిడ్డ, మరోవైపు వివేకా హత్య కేసు నిందితుడు. అవినాశ్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నా ఏఉపయోగం లేదు. కనీసం స్టీలు ఫ్యాక్టరీ కోసం ఉద్యమం చేసింది లేదు. ఏనాడు పార్లమెంట్‌లో మాట్లాడింది లేదు. మాట ఇస్తున్నా.. నేను వైఎస్ బిడ్డను, పులిబిడ్డను. దేవుడు ఎందుకు ఇలా నిర్ణయించాడో తెలియదు. వైఎస్సార్ చేసినట్లే నేనూ సేవ చేస్తా. కడప ప్రజల కోసం ఢిల్లీలో కొట్లాడుతా. నేను ఎంపీ అయితే కేంద్ర మంత్రిగా కడప జిల్లా బాగోగులు చూసుకుంటా. కడప ఎంపీగా గెలిస్తే కేంద్రంలో మంత్రినవుతా. ప్రత్యేక హోదా సాధించుకుని వస్తా” అని షర్మిల పేర్కొన్నారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం

జగన్ మేనిఫెస్టోకు విలువ లేదని, ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని షర్మిల ఆరోపించారు. ‘జగన్ కుంభకర్ణుడిలా నాలుగేళ్లు నిద్రపోయి ఇప్పుడు లేచారు. సిద్ధం అంటూ హడావుడి చేస్తున్నారు. మద్య నిషేధం అని చెప్పి కల్తీ మద్యం అమ్మడానికి సిద్ధమా? కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచడానికి సిద్ధమా? ఒక చేత్తో ఇవ్వడం... మరో చేత్తో గుంజుకోవడం.. రాష్ట్రం మొత్తం మాఫియా రాజ్యమేలుతోంది. ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతున్నందుకు సిద్ధమా? దేనికి సార్ సిద్ధం” అని ఆమె నిలదీశారు. “ముస్లింలకు వైఎస్సార్ ఇచ్చిన 4శాతం రిజర్వేషను తీసేస్తామని బీజేపీ చెబుతుంటే ఆయన వారసుడిగా జగన్ స్పందించడం లేదు. వైఎస్సార్ కొడుకు అధికారంలో ఉండి రైతులను అప్పులపాలు చేస్తారా?” అని ఆమె ప్రశ్నించారు.

కూటమికి జై కొట్టిన కడియం జనం

- పురందేశ్వరి, గోరంట్ల ప్రచారానికి బ్రహ్మరథం


కడియంలో బుచ్చయ్య, పురందేశ్వరికి జనం బ్రహ్మరథం

రాజమహేంద్రవరం, మే1(ఆంధ్రజ్యోతి)/కడియం: కాపు సామాజిక వర్గం అధికంగా ఉండే రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలంలో కూటమి అభ్యర్థులకు జనం బ్రహ్మరథం పట్టారు. ఇక్కడ జనసేన అభ్యర్థులు బరిలో లేరు. ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నేత బుచ్చయ్య చౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి బుధవారం కడియం మండలంలో రోడ్ షో నిర్వహించారు. ఉదయం నుంచి మండంలోని అన్ని గ్రామాల్లో రోడ్ షో నిర్వహించగా.. ప్రజలు నీరాజనాలు పలికారు. దారిపొడవునా పూలు జల్లుతూ, హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. ఎన్టీఆర్ కూతురు కావడంవల్ల పురందేశ్వరిని చూడడానికి ప్రజలు పోటీ పడ్డారు. కడియపులంకలోని పుంతలో మునలమ్మ గుడివద్ద పురందేశ్వరికి బెల్లంతో తులాభారం వేశారు.

అది.. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్


పెందుర్తిలో జరిగిన పవన్ కళ్యాణ్ సభకు హాజరైన జనం

- ప్రజల ఆస్తి పత్రాలన్నీ జగన్ ఇంట్లో
- ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాలు కబ్జా చేసిన సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి
- ప్రజల రక్తాన్ని జలగలా పీలుస్తున్న జగన్
- ప్రచార సభల్లో జనసేనాని పవన్ కల్యాణ్



విశాఖపట్నం/కాకినాడ, మే 1(ఆంధ్రజ్యోతి), అచ్యుతాపురం/మండపేట: “ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ప్రజల భూములను దోచుకునేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. భూమికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు జగన్ ఇంట్లో, హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో ఉంటాయి. వైసీపీకి మరోసారి ఓటేస్తే ప్రజల ఆస్తులు గాల్లో దీపాలే. ఇది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదు. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్. కూటమి అధికారంలోకి వస్తే దీన్ని రద్దు చేస్తాం” అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన విశాఖపట్నంలోని అచ్యుతాపురం, పెందుర్తి, కాకినాడలోని మండపేటలలో నిర్వహించిన ‘వారాహి విజయభేరి’ సభల్లో పాల్గొన్నారు. విశాఖ సభల్లో అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొన్నారు.

పెందుర్తిలో పవన్ ఏమన్నారంటే..

ప్రజల ఆస్తులకే రక్షణ లేకుండా పోయింది. ఒరిజినల్ పత్రాలు లేని ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉంటుంది. వైసీపీ అధికారంలోకి వస్తే కొండ, గుట్ట ఏమీ మిగలవని గత ఎన్నికల్లోనే చెప్పా. ఇప్పుడు అదే జరిగింది. ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాలను వైసీపీకి చెందిన వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి వంటి నేతలంతా కబ్జా చేశారు. కానీ, కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించడానికి మాత్రం భూములు లేవంటున్నారు. వైసీపీ ప్రభుత్వం మూడు కబ్జాలు, ఆరు సెటిల్‌మెంట్లతో సాగుతోంది. పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించడం ఇక్కడి నేతలకు చేతకాదు. కానీ, అప్పన్న ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం తెలుసు. అలాంటి వారిని చొక్కా పట్టుకుని నిలదీయకపోతే మార్పు సాధ్యం కాదు. గడిచిన ఐదేళ్లలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చేయలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పిన జగన్.. ఆ హామీని విస్మరించారు. రాష్ట్రంలో 23 లక్షల మంది యువత గంజాయికి అలవాటుపడ్డారు. విశాఖ పోర్టులో 25 వేల కిలోల డ్రగ్స్ దొరికాయి. యువత భవిష్యత్తును నాశనం చేసేలా వైసీపీ వ్యవహరిస్తోంది. వైసీపీ ప్రభుత్వాన్ని పాకిస్థాన్‌కు చెందిన ఘాజీ సబ్‌మెరైన్‌ను తొక్కినట్టు అధఃపాతాళానికి తొక్కేద్దాం. త్రిమూర్తుల మాదిరిగా వస్తున్న మమ్మల్ని(టీడీపీ-బీజేపీ-జనసేన) ఆదరించాలి.

హామీల అమలు మాకు తెలుసు!

ప్రజల రక్తాన్ని జగన్ ఐదేళ్లలో జలగలా పీల్చేశాడు. మేం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తామంటూ వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆ హామీలను ఎలా అమలు చేయాలో మాకు తెలుసు. మద్యం రేట్లు పెంచి జగన్ రూ.41 వేల కోట్లు దోచేశారు. అడ్డగోలు ఇసుక విక్రయాలతో రూ.వేల కోట్లు దండుకున్నారు. వీటన్నింటినీ సక్రమం చేసి పథకాలను అమలు చేస్తాం. పోరాడితే పోయేది ఏమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప. పోరాడకపోతే ప్రాథమిక హక్కులు కూడా ఉండవు. యువతలో దాగి ఉన్న ప్రతిభను కూటమి ప్రభుత్వం వెలికితీస్తుంది. 2047 నాటికి భారత్ సూపర్ పవర్‌గా ఎదగబోతోంది. దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇస్తాం. కిడ్నీ, తలసీమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు ఇస్తాం. పంచాయతీలకు ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రూ.8 వేల కోట్లను జగన్ దారిమళ్లించారు. ఆ నిధులను వాటికే ఇచ్చేలా బాధ్యత తీసుకుంటాం. పాలన మారాలంటే ప్రభుత్వాన్ని మార్చాలి.

టైటిలింగ్ యాక్ట్‌పై చర్చ జరిగిందా?

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టం చాలా ప్రమాదకరమైందని పవన్ అన్నారు. ఇది అమల్లోకి వస్తే పేదోడికి ఉన్న చిన్నపాటి స్థలాన్ని కూడా జగన్ లాగేసుకుంటారని తెలిపారు. మన ఆస్తిని ఆయన ఆస్తిగా ఫీలవుతారన్నారు. “ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రతిపాదన బీజేపీ తెచ్చిందని అంటున్నారు. కేంద్రం ఎప్పుడూ చట్టాలపై అభిప్రాయాలు తెలపాలని రాష్ట్రాలకు ముసాయిదా పంపుతుంది. కానీ, దీనిపై నష్టాలేంటనే విషయంపై అసెంబ్లీలో చర్చించారా? టీడీపీని జగన్ ప్రభుత్వం మాట్లాడనిచ్చిందా? మంచా చెడా అని చర్చించే అవకాశం ఇస్తే కదా! కానీ, దీన్ని ప్రశ్నిస్తే చంద్రబాబును అసెంబ్లీలోకి రానివ్వరు. కుటుంబసభ్యులను బూతులు తిడతారు. ఈ చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఆస్తులు గాల్లో దీపాలే. రేపు ఎవరైనా రుణం కోసం బ్యాంకుకు వెళ్తే అసలు ఆస్తి పత్రాలు తెమ్మని అడిగితే జగన్ దగ్గర ఉన్నాయని చెప్తే బ్యాంకు వాళ్లు తన్ని తగిలేస్తారు. అందుకే చెబుతున్నా.. మన ఆస్తిపత్రాలను జగన్ నెమ్మదిగా లాగేస్తున్నాడు. ఇది రాచరిక పోకడ. అందరూ తన కింద ఉండాలని జగన్ అనుకుంటున్నారు. కానీ, ప్రజల బతుకులు ఒకరి మోచేతి కింద అంబలి తాగేవి కావు. కొత్త చట్టంతో ప్రజల స్థలం కబ్జాకు గురైతే అప్పీలుకు రెవెన్యూశాఖ తర్వాత హైకోర్టుకు వెళ్లాలంటే.. పేదల పరిస్థితి ఏంటో ఆలోచించండి” అని పవన్ అన్నారు.



నెల్లూరు వీఆర్‌సీ మైదానంలో యువగళం కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేశ్

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- దానికోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధంగా ఉంది
- యువగళం కార్యక్రమంలో నారా లోకేశ్

నెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని, దానికోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఉద్యోగం ఇచ్చేవరకు యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేల చొప్పున అందజేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరులోని వీఆర్‌సీ మైదానంలో బుధవారం ఏర్పాటుచేసిన యువగళం కార్యక్రమంలో యువతతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. యువత సమస్యలు, సూచనలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ ఆరు లక్షల ఉద్యోగాలు సృష్టించామని గుర్తుచేశారు. ‘యువత విజనరీకి, ప్రిజనరీకి మధ్య తేడా గుర్తించాలి. విజనరీ చంద్రబాబు సీఎంగా కియా మోటార్స్, హీరో మోటార్స్, ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్ల తయారీ కంపెనీ, అపోలో టైర్స్, టీవీఎస్, లులూ వంటి అనేక పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొచ్చారు. ప్రిజనరీ జగన్ సీఎంగా పీపీఏలు రద్దుతో విద్యుత్ కంపెనీలు, అమర్‌రాజా బ్యాటరీస్, లులూ, హెచ్ఎస్‌బీసీ, రిలయన్స్ వంటి అనేక సంస్థలను తరిమేశారు’ అని విమర్శించారు. బటన్ నొక్కడం ఒక్కటే సీఎం బాధ్యత కాదని లోకేశ్ విమర్శించారు. నాయకుడంటే ముందు సంపద సృష్టించాలని, ఆ తర్వాతే పంచిపెట్టాలని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను తిరిగి తెరుస్తామని ప్రకటించారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో మరికొందరికి స్థానం


- ఏడు నియోజకవర్గాలకు సమన్వయకర్తల నియామకం

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో మరో 28మంది నాయకులకు స్థానం లభించింది. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం కొత్త నియామకాలను ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కేఈ ప్రభాకర్(పత్తికొండ), ఏరాసు ప్రతాప్‌రెడ్డి(పాణ్యం), ఆర్.జితేంద్రగౌడ్(గుంతకల్), వీఎస్ అమీర్‌బాబు(కడప), ముద్దరబోయిన వెంకటేశ్వరరావు(నూజివీడు), చీరాల గోవర్ధన్‌రెడ్డి(బాపట్ల), కార్యనిర్వాహక కార్యదర్శులుగా భూమా బ్రహ్మానందరెడ్డి(నంద్యాల), పూల నాగరాజు (రాయదుర్గం), జి.లక్ష్మీరెడ్డి(కడప), ఎం.ధనుంజయ రెడ్డి(ఆత్మకూరు), కత్తెర సురేష్(తెనాలి), తమ్మినేని నటేశ్‌చౌదరి(అనంతపురం), మల్లెల రాజేశ్‌నాయుడు(చిలకలూరిపేట), కే చిన్న వెంకటస్వామి(నందికొట్కూరు), కర్రి సాయికృష్ణ(యలమంచిలి), సీహెచ్ దివాకర్‌రెడ్డి(చంద్రగిరి), రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్ కొండారెడ్డి(ప్రొద్దుటూరు), వాసంశెట్టి సత్య(అమలాపురం), సాకె గంపన్న (అనంతపురం), ముస్తాక్ హుస్సేన్(రాయచోటి), సీహెచ్ కృష్ణచైతన్యయాదవ్, రావెళ్ల వీరేంద్రచౌదరి(కోవూరు), తూగుట్ల మధుసూదన్‌రెడ్డి (పులివెందుల), వై నూకానమ్మ(నందిగామ), కే హరిచంద్రరెడ్డి(గూడూరు), ఎల్వీపీ రమణరెడ్డి(ఉదయగిరి), జి.సూర్యసత్యనారాయణ, కంటె కేశవరావు(రాజానగరం) నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా సయ్యద్ మెహతాజ్ బేగం(రైల్వేకోడూరు), తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బత్తిని కుబేరనాథ్(ఆదోని)ను నియమించారు. అలాగే రాష్ట్రంలోని ఏడు నియోజకవర్గాలకు ఎన్నికల సమన్వయకర్తలను టీడీపీ నియమించింది. అనంతపురం, అరకు పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తలుగా కే ఈరన్న, టీ హర్షవర్ధన్, చిత్తూరు పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తలుగా సీఆర్ రాజన్, శ్రీరామినేని చంద్రప్రకాశ్‌ను నియమించారు. పాతపట్నం, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్తలుగా కోరాడ రాజబాబు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, కే విజయబాబు, ఎంవీఆర్ చౌదరి నియమితులయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నాటి చిలుకల సొగసులు నేడేవీ..?













నాడు - నేడు

నాడు - నేడు









నగర శివారు మూలపాడు గ్రామం అటవీ ప్రాంతంలో ఉంది. ఆ ఊరి చివరన కొన్ని సుందరమైన ప్రదేశాలున్నాయి. అందులో ఒక ప్రదేశంలో సీతాకోక చిలుకలు ఎక్కువగా ఉండేవి. రంగు రంగుల సీతాకోక చిలుకలు లెక్కకు మిక్కిలిగా ఉండటంతో గత తెలుగుదేశం ప్రభుత్వం వీటిని గుర్తించి మరింత సుందరీకరణ చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందనే ఉద్దేశంతో అక్కడ బటర్ ఫ్లై పార్కును నిర్మించింది. సీతాకోక చిలుకల సంచారానికి మరిన్ని సదుపాయాలు కల్పించింది. అప్పట్లో ఈ పార్కు ఎంతో మంది దృష్టిని ఆకర్షించింది. సెలవుల్లో కుటుంబ సభ్యులంతా ఇక్కడికి వచ్చేసేవారు. అనంతర కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ బటర్‌ఫ్లై పార్కును పట్టించుకునేవారు లేరు. రాను రాను మౌలిక సదుపాయల లేమితో పార్కు కునారిల్లిపోయింది. దీంతో పర్యాటకులు అటువైపు వెళ్లడం మానేశారు. అక్కడ బండరాళ్లతో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై ఆసనాలు శిథిలమై పగిలిపోయాయి. దీంతో ప్రభుత్వం ఆ పార్కును మూసి వేసింది.



యోగాలో ప్రతిభ చూపిన వారిని సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

యోగాలో జిల్లాకు మంచి పేరు తేవాలి: కలెక్టర్

వన్‌టౌన్, మే 1: యోగాలో జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఏడాది మార్చి 19 నుంచి 23 వరకు పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు నిర్వహించిన 48వ సీనియర్ నేషనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించింది, ఈ పోటీల్లో పాల్గొన్న అమరావతి యోగా ఏరోబిక్ అసోసియేషన్ తరఫున ఆర్టిస్టిక్ పెయిర్ యోగా సీనియర్ కేటగిరీలో పీ షాలెం రాజు ఎల్ కృష్ణ పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. బుధవారం వారిద్దరిని కలెక్టర్ సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి విజయాలను మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. యోగాసనాలతో పాటు, కళాత్మక యోగాలోనూ జిల్లాకు పేరు తేవాలన్నారు. పీబీ సిద్ధార్థ కాలేజీ యోగా గురువు డీ రవి కిరణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి కృష్ణా జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్ మురళీకృష్ణ, జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎల్ శాంతి, ఆర్టిస్టిక్ యోగా జాతీయ అవార్డీ జి విజయగౌరి పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు అభినందనీయం: కలెక్టర్

కృష్ణలంక: సమాచార, పౌరసంబంధాల శాఖలో ప్రచార సహాయకులు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా 33ఏళ్లపాటు సేవలందించిన ఆగం సాయిబాబా సేవలు అభినందనీయమని, విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఘనంగా సత్కరించారు. డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, పబ్లిసిటీ సహాయకుడు వీవీ ప్రసాద్, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు.



దక్షిణ భారత హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన టీం ఇదే..

దక్షిణ భారత హ్యాండ్‌బాల్ పోటీలకు కృష్ణా టీమ్

వన్‌టౌన్, మే1: కేరళ రాష్ట్రం కొట్టాయంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయం హ్యాండ్‌బాల్ (పురుషులు) పోటీలకు కృష్ణా వర్సిటీకి చెందిన బృందం వెళ్లిందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ బృందానికి తమ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావు మేనేజర్‌గా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ బృందంలో తమ కళాశాలకు చెందిన కేబీ గిరి సుబ్రహ్మణ్యం, ఎం.భార్గవ కిరణ్, బి.సంతోష్‌కుమార్, వి.మద్దిశంకర్, కే.సంగీత్‌కుమార్, పి.తేజ్, బి.గోపి, డీఏఆర్ కళాశాలకు చెందిన కే.సుకుమార్, టి.సంజయ్, ఏబీఎన్‌వీ నాగేంద్ర, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలకు చెందిన ఎన్ నాగ శ్రీనాథ్, పి.పుష్పరాజ్, బి.దుర్గారావు, వికాస్ కాలేజీకి చెందిన ఎం.మహేష్ కుమార్, డాక్టర్ ఎల్ హెచ్ఆర్ కళాశాలకు చెందిన కే.వెంకటేశ్వరరావు, కే.తన్వజయ ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ అభినందించారన్నారు.

క్రికెట్‌లో యువతకు శిక్షణ

విజయవాడ స్పోర్ట్స్, మే 1: క్రికెట్‌లో కొత్త క్రీడాకారులను తయారు చేయడానికి ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు దోహదపడతాయని కేడీసీఏ అడహక్ కమిటీ ఛైర్మన్ టి.త్రినాథ్‌రాజు అన్నారు. కేడీసీఏ ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ కోచింగ్ క్యాంపును నగరంలోని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మాజీ రంజీ కెప్టెన్ విజయ సారథి మాట్లాడుతూ తాను ఇలాంటి సమ్మర్ క్యాంపుల్లోనే జాయిన్ అయ్యి బేసిక్స్ నేర్చుకున్నట్లు వివరించారు. హెల్త్ వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి, కేడీసీఏ మాజీ సెక్రటరీ ఎల్లారావు, అడహక్ కమిటీ కన్వీనర్ ఎం. రవిశంకర్ పాల్గొన్నారు.

బంగారం దొంగిలించిన వ్యక్తి అరెస్టు

రైల్వేస్టేషన్, మే 1: రైళ్లలో ప్రయాణించే మహిళా ప్రయాణికుల మెడ నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించే తెలంగాణకు చెందిన టి రమేశ్ (29)ను బుధవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, రైలులో ప్రయాణించే ఒంటరి మహిళల బంగారు ఆభరణాలు చోరీకి గురవుతున్నాయని రైల్వే పోలీసులకు ఫిర్యాదు రావడంతో నిఘా ఏర్పాటు చేసి మహబూబ్‌నగర్ జిల్లా వడియేలుకు చెందిన రమేశ్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.7.60 లక్షల విలువైన 190 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.

కార్మికులకు అండగా ఉంటా

- పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్



మేడే సందర్భంగా సంఘీభావం తెలుపుతున్న కేశినేని చిన్ని, పట్టాభిరామ్, ఎమ్మెల్సీ అశోక్ బాబు తదితరులు

రైల్వేస్టేషన్, మే 1: ప్రపంచం ఆధునీకరణ వైపు పరుగులు పెడుతుందంటే దాని వెనుక కార్మికుల కష్టం ఎంతో ఉందని, కార్మికులే పురోగాభివృద్ధికి పునాదులని కార్మికవర్గానికి ఎప్పుడు అండగా ఉంటానని కూటమి బలపరచిన పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పశ్చిమ డీఆర్ఎం కార్యాలయం వద్ద ఉన్న సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశినేని చిన్ని రైల్వే యూనియన్ సభ్యులకు, రైల్వే కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి ప్రధానమంత్రిగా మోదీ, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తేనే అభివృద్ధి, కార్మికులకు సంక్షేమం అందుతుందన్నారు. డివిజనల్ సెక్రటరీ ఎం.లీల, డివిజన్ ప్రెసిడెంట్ ఎస్.రామగుప్తా, పెన్షన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ జి.ఎన్ శ్రీనివాసరావు, ఎడిఎస్. పాములు, డివిజన్ యూత్ కో-ఆర్డినేటర్ హారిక, టీడీపీ రాష్ట్ర నేతలు ఇత్తడి చార్లెస్, నరసింహాచౌదరి, డాక్టర్ సంకె విశ్వనాథం, కాకు మల్లిఖార్జున యాదవ్‌తో పాటు స్టేషన్ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో..

కార్మికుల కళ్లలో ఆనందం రావాలంటే చంద్రబాబు మరోసారి అధికారంలోకి రావాలని కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో కేశినేని శివనాథ్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ జెండా ఎగురవేసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక విధానం అమలులోకి తెస్తామన్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ టీడీపీ-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో కార్మికులపై వరాలు జల్లు కురిపించిందన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ కార్మిక వర్గమంతా కలసి కట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఆదిబాబు, సెక్రటరీ ఎం.మోహన్, నాయకులు సాయికుమార్, టి.ప్రసాద్, టి.మాధవ్, ఎల్.మోహనరావు, ఉమర్ ఆలీ పాల్గొన్నారు.

అవినీతి మచ్చలేని నేత యార్లగడ్డ

- మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు



ముస్తాబాదలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మే 1: అవినీతి మచ్చలేని నేత యార్లగడ్డ వెంకట్రావు అని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. అత్యధిక మెజార్టీ ఓట్లతో ఆయన్ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గ దశ, దిశ మార్చగలిగిన నేత వెంకట్రావు అని అన్నారు. మండలంలోని ముస్తాబాదలో బుధవారం రాత్రి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారం జరిగింది. తొలుత గీతామందిరంలో పూజలు చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ తనను ఫైనాన్సర్‌గా వాడుకుందని, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రూ.13లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. తనను ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడపాటి రవి, పాలడుగు మల్లిఖార్జునరావు, మేడేపల్లి కాంతారావు, షేక్ అబుల్యాజ్, కంచర్ల ఈశ్వరరావు, పలగాని కల్యాణ చక్రవర్తి, కంచర్ల ముత్యాలు, కొరివి సురేష్, మేడేపల్లి రమాదేవి, సుకన్య పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ టీడీపీలో చేరిక

ముస్తాబాద వైసీపీ సర్పంచ్ వేము రాధాకృష్ణతో పాటు 40 ఎస్సీ కుటుంబాలు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. వాళ్లకి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ యార్లగడ్డ గెలుపే తమ లక్ష్యమని గతంలో మద్దబోయిన గెలుపునకు కృషి చేశామన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ పరిశీలకులు ప్రీతీందర్ సింగ్

కృష్ణలంక, ఏప్రిల్ 1: సిటీ పరిధి, ఉభయ రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ పరిశీలకులు ప్రీతీందర్ సింగ్ అన్నారు. మంగళవారం సిటీ పరిధిలోని చెక్‌పోస్టుల వద్ద ఆయన తనిఖీలు చేశారు. ఇరువైపులా వచ్చి పోయే వారిని పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే విడిచి పెట్టాలన్నారు. అనంతరం చెక్‌పోస్టుల వద్ద రికార్డులు తనిఖీ చేశారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి బుధవారం మైలవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ పరిధిలోని గొల్లపూడి, నల్లకుంట, జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 13న పోలింగ్ జరగనున్న దృష్ట్యా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తగినంత వెలుతురు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, అవసరమైన చోట షామియానా వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం వీటీపీఎస్‌ను సందర్శించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈనెల 13న ఓటు వేసి నూరు శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని కోరారు.





పింఛను కోసం సచివాలయం వద్ద పడిగాపులు పడుతున్న వృద్ధులు

పింఛను కోసం పడిగాపులు

సచివాలయంలో కుక్కల దర్శనం, కనిపించని సిబ్బంది



సచివాలయంలో నిద్రిస్తున్న వీధి కుక్క

అజిత్‌సింగ్‌నగర్, మే 1: ప్రతి నెల ఒకటవ తారీఖున వృద్ధులకిచ్చే పింఛన్ బుధవారం సకాలంలో అందలేదు. దీంతో అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోని 153 సచివాలయం వద్ద వారు పడిగాపులు పడ్డారు. పింఛను కోసం వెళ్లిన వృద్ధులకు సచివాలయ సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సచివాలయ తాళాలు తెరిచి ఉండటంతో లోపల వీధి కుక్కలు దర్శనమిచ్చాయి. సిబ్బంది లేకపోవడం, పైగా లోపల వీధి కుక్కలుండటంతో లబ్ధిదారులు లోపలికి వెళ్లేందుకు భయాందోళనలకు గురయ్యారు. పింఛను పంపిణీ విషయంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

ఉంగుటూరు, మే 1: ఇటీవల గన్నవరం మండలం మెట్లపల్లి మామిడితోటలోని రేకులషెడ్డులో భారీగా పట్టుబడిన సుమారు 10,500 లీటర్ల రాయల్ బ్రాండ్ గోవా మద్యం బాటిళ్లను చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై పొట్టిపాడు టోల్‌గేట్ సమీపంలోని సర్వీస్‌రోడ్డులో బుధవారం సాయంత్రం అధికారులు ధ్వంసం చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్సై ఏ.ఫైడిబాబు, రెవెన్యూ, ఎస్‌ఈబీ అధికారుల సమక్షంలో 1230 కేసుల్లోని 58032 క్వార్టర్ సీసాలను రోడ్డురోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. అయితే భానుడి ఉగ్రరూపానికి రోడ్డు వేడెక్కి ఉండటం, సాయంత్రం 5గంటలైనా హీట్ తగ్గకపోవటంతో మద్యంబాటిళ్ల ధ్వంసం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. అప్రమత్తమైన అధికారులు అగ్నిమాపక పరికరం సాయంతో మంటలను ఆర్పారు. అధికారులు సరైన భద్రతాచర్యలు చేపట్టకపోవడం





నీటిని తాగుతున్న వానరం, భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది

భక్తులకు, పశుపక్ష్యాదులకు నీడ, నీరు

వన్‌టౌన్, మే 1: వేసవి భగభగమని మండిపోతుంది. 45 డిగ్రీల ఎండ మాడ్చేస్తుంది. ఆ వడగాడ్పులకు జనమే కాదు. పశువులు, పక్షులు కూడా అల్లాడుతున్న పరిస్థితి. కాసేపు ఎండలో వెళితే చాలు సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఈ నేపథ్యంలో పశువులు, పక్షులు, జనం కూడా చల్లని నీటి కోసం, కాస్తంత నీడ కోసం వెంపర్లాడుతుంటారు. ఈ సందర్భంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు దుర్గగుడిలో కొండపైకి వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు చలువ పందిళ్లు వేశారు. మరోపక్క చల్లని మంచినీరు, మజ్జిగను అందిస్తున్నారు. అలాగే అరామ క్షేత్రంగా ఉన్న ఘాట్‌రోడ్డు, మల్లేశ్వరాలయానికి వెళ్లే పరిసరాల్లో పక్షులు, జంతువులకు కూడా మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. మూగజీవులు ఎండతీక్షణతకు అవురావురమంటూ నోరార్చుకుని ఇబ్బంది పడకుండా ఉండేందుకు నీరు, ఆహారం అందుబాటులో ఉంచారు. 200కు పైగా వాటర్ స్పాట్‌లను సిద్ధం చేశారు. ఈవో రామారావు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా మరిన్ని ఏర్పాట్లు చేయనున్నారు.

వ్యాపార సంస్థలు, మందులషాపులపై విజిలెన్స్ దాడులు

వన్‌టౌన్, మే 1: వన్‌టౌన్‌లోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాలు, పంపిణీ సంస్థలపైన బుధవారం విజిలెన్స్, ఔషధ నియంత్రణాధికారుల సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. మందుల దుకాణాల్లోని అవకతవకలను గుర్తించారు. మరోవైపు గడువుతీరిన మందులు, నకిలీ మందులను గుర్తించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు తెలుస్తోంది.



దండమూడి చౌదరి నివాసం వద్ద మన్యుసూక్త పారాయణం, హోమం

బోడె ప్రసాద్ గెలవాలని, చంద్రబాబు సీఎం కావాలని

మన్యుసూక్త పారాయణ, హోమం

గండిగుంట (ఉయ్యూరు), మే 1: ఈనెల 13న జరుగునున్న సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరు నియోజకవర్గం నుంచి బోడెప్రసాద్, 175 నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు విజయం సాధించి, రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో గండిగుంటలో మూడురోజులపాటు జరిపించిన మన్యుసూక్త పారాయణం, హోమం బుధవారం ముగిసింది. జిల్లాలో 7 నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో పాటు చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థిస్తూ బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ చేతులమీదుగా మన్యుసూక్తపారాయణ చాలిసా నిర్వహించి హోమం చేసినట్టు చౌదరి తెలిపారు.

బోడె విజయంలో నేను సైతం



ఉయ్యూరు: పెనమలూరులో బోడె ప్రసాద్ విజయకోసం ఉయ్యూరుకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు జం పాన తేజ హైదరాబాద్ నుంచి ఉ య్యూరు బైక్‌పై వచ్చారు. బోడె ప్రసా ద్, బాలశౌరి తరఫున ఎన్నికల ప్రచా రం చేసేందుకు వచ్చినట్టు ఆయన తెలియజేశారు.



బద్వేలులో యానిమేటర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి సుధ

మెప్మా యానిమేటర్లతో వైసీపీ సమావేశం

» అడ్డుకున్న కూటమి నాయకులు.. వాగ్వాదం

బద్వేలు, మే 1: సార్వత్రిక ఎన్నికలలో గెలిచేందుకు వైసీపీ అడ్డదారులు తొక్కుతోంది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో బుధవారం వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కళాశాలలో మెప్మా యానిమేటర్లతో వైసీపీ నాయకులు రహస్య సమావేశం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి సుధ, కుడా చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులందరూ వైసీపీకి ఓట్లు వేసేలా కృషిచేయాలని, తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని విధాలా లబ్ధి చేకూరుస్తామని, ప్రస్తుతానికి నగదు లేదా వస్తు రూపంలో బహుమతులు అందజేస్తామని వైసీపీ నాయకులు చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశం విషయం తెలుసుకున్న టీడీపీ, బీజేపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. దీంతో కూటమి, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో యానిమేటర్లు ముఖాలకు ముసుగులు వేసుకుని పారిపోయారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్ది చెప్పారు.

మంత్రి సీదిరి గ్రామంలో టీడీపీ ప్రచారం

» అడ్డుకున్న వైసీపీ...పరిస్థితి ఉద్రిక్తం

వజ్రపుకొత్తూరు, మే 1: మంత్రి సీదిరి అప్పలరాజు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో బుధవారం టీడీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి కె.రామ్మోహన్, పలాస అసెంబ్లీ అభ్యర్థి గౌతు శిరీషా బుధవారం రాత్రి దేవునల్తాడలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. వీరి ప్రచార రథం బస్టాండ్ వద్దకు వచ్చేసరికి స్థానిక వైసీపీ కార్యకర్తలు అడ్డుకునే యత్నం చేశారు. దీనిపై రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వచ్చామని, గొడవలు చేయడానికి రాలేదని అన్నారు. అయినా వైసీపీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు వారిని నిలదీశారు. గ్రామపెద్దలు ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

బొత్స సందీప్ ఫోర్జరీ కేసు వివరాలివ్వండి

» తెలంగాణ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ కొడుకు బొత్స సందీప్‌పై ఉన్న ఫోర్జరీ కేసు వివరాలను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 422లోని 31 ఎకరాల భూములను కబ్జా చేసే ఉద్దేశంతో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను ఫోర్జరీ చేశారని పేర్కొంటూ బొత్స సందీప్ సహా పలువురిపై ఫిర్యాదు నమోదైంది. ఈ కేసులో పోలీసులు బొత్స సందీప్ సహా ఇతరులపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొంటూ షాబాద్ మండలం పెదవేడు గ్రామానికి చెందిన బొప్పి మహేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రోహిత్ పోగుల వాదనలు వినిపిస్తూ.. కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూవివాదాన్ని ఆసరాగా చేసుకుని బొత్స సందీప్ తదితరులు ఫోర్జరీ పత్రాలను సృష్టించి సదరు భూములను తమ పేరిట మార్చుకున్నారని పేర్కొన్నారు. 2018-19లో జరిగిన ఈ అక్రమ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, పోలీసులు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ధర్మాసనం.. విచారణను జూన్ 5కు వాయిదా వేసింది.

కార్మికులకు 'చంద్రన్న బీమా': చంద్రబాబు

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. బుధవారం మేడే సందర్భంగా 'ఎక్స్'వేదికగా కార్మికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రమదోపిడీని ఎదిరించి, శ్రమశక్తి గెలుపొందిన మహోజ్వల చారిత్రక దినం మేడే. తమ కష్టంతో ప్రగతి పూర్వక సమాజ నిర్మాణానికి చేయూతనిచ్చే శ్రామికుల హక్కులను కాపాడటంలో టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుంది. 2024 ఎన్నికల కూటమి మేనిఫెస్టోలో కూడా కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. డ్రైవర్లను ఓనర్లుగా చేసే లక్ష్యంతో వాహనాల కొనుగోలుకు రూ.4 లక్షల వరకు పొందే రుణాలపై 5% పైబడిన వడ్డీని సబ్సిడీగా ఇస్తాం. జీవో 21ను రద్దు చేసి, జరిమానాల భారం తగ్గిస్తాం. జగన్ సర్కార్ పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామ'ని చంద్రబాబు హామీ ఇచ్చారు. కాగా ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేశ్ కార్మికులకు 'ఎక్స్' వేదికగా మేడే శుభాకాంక్షలు తెలిపారు.

పెంపు సరే.. అసలు జీతాలే ఇవ్వట్లేదు!

» వైసీపీ సమావేశంలో పారిశుధ్య కార్మికుల కేకలు

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం మేడే రోజున వైసీపీ నాయకులకు ఎదురుదెబ్బ తగిలింది. జీవీఎంసీ వర్కర్స్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు మే డే సందర్భంగా రైల్వే న్యూకాలనీలో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో పారిశుధ్య కార్మికులకు పెద్దగా వేతనాలు ఇవ్వలేదని, వైసీపీ వచ్చాక కొద్దిగా పెంచామని, ఈసారి గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.25 వేల జీతం ఇస్తామని చెప్పారు. ఈలోగా కార్మికులంతా 'మాకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు' అంటూ కేకలు వేశారు. సూపర్‌వైజర్లకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదని మరికొందరు గోల చేశారు.

తోట త్రిమూర్తులు అప్పీలుపై విచారణ 7న

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో బాధితులను ప్రతివాదులుగా చేరుస్తూ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర దోషులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అప్పీళ్లపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే దాఖలు చేసుకోవాలని బాధితులకు సూచించింది. విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఘటనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించి విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు వారికి 18 నెలల జైలుశిక్షతో పాటు రూ.42వేలు జరిమానా విధించింది.

రాజీనామా చేసి వైసీపీ కండువాతో రండి

» వలంటీర్లకు టెక్కలి అభ్యర్థి దువ్వాడ వార్నింగ్

టెక్కలి, మే 1: వలంటీర్లు రాజీనామా చేసి పార్టీ కండువా కప్పుకున్న వారిని మాత్రమే జూన్ 5 నుంచి మళ్లీ కొనసాగిస్తామని టెక్కలి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాజీనామా చేయకుండా, వైసీపీ కండువా వేసుకోకుండా ఉన్న వలంటీరు మాటలు మేము విననవసరం లేదు. జూన్ 5 తరువాత ఆ వలంటీర్ ఉండడు. రాజీనామా చేయని వారు ఉంటే వెంటనే రాజీనామాలు చేయాల్సిందే. 3వ తేదీ నాటికి రాజీనామా చేయలేదని తెలిస్తే వారు మాకు అక్కర్లేదు. ప్రచారంలో వలంటీర్లు ఎక్కడా తగ్గకూడదు. 13వ తేదీ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యేసరికి మీ పని మీరు చేయాల్సిందే' అని హుకుం జారీ చేశారు.

నిధులు విడుదల చేయకుండా వేధింపులు

» ఏపీ పంచాయతీ పరిషత్, సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు

అమరావతి/మంగళగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల నిధులు రూ.998.84 కోట్లను కేంద్రం విడుదల చేసి నెల రోజులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేయకుండా వేధింపులకు గురిచేస్తోందని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ఆరోపించారు. బుధవారం తాడేపల్లిలోని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యాలయం వద్ద సర్పంచులు ఆందోళన నిర్వహించారు. అనంతరం అదనపు కమిషనర్ ఎం.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పాపారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయని చెప్పారు. ఏపీ పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్రం మార్చి 28న నిధులను జమ చేసిందన్నారు. ఈ విషయమై ఏప్రిల్ 12న కమిషనర్‌కు, 13న రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

లక్ష విదేశీ ఉద్యోగాలు!

» తెలుగుదేశం హామీ.. ఎన్ఆర్ఐ టీడీపీ తోడ్పాటు

» చంద్రబాబు గెలుపు కోసం ప్రచారానికి చలో ఆంధ్రప్రదేశ్

» ఏసీ గదుల నుంచి మండే ఎండల్లోకి ప్రవాసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్న ఎన్నారై టీడీపీ బృందం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కురుక్షేత్రం పట్ల విదేశాలలోని ప్రవాసులు అత్యంత ఆసక్తి కనబర్చడమే కాకుండా తమకు వీలైన విధంగా రాష్ట్రాన్ని రక్షించేందుకు ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతున్నారు. మాతృభూమిపై మమకారంతో స్వదేశానికి వచ్చి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారు కొందరైతే, విదేశాలలో ఉద్యోగాలు చేసుకుంటూనే తమ స్వస్థలాలలో నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయండంటూ ప్రచారం చేసే వారు అత్యధికులు ఉన్నారు. వీరిలో సింహభాగం తెలుగుదేశం పార్టీ అభిమానులే ఉండటం గమనార్హం. తెలుగునాట ఏ రాజకీయ పార్టీకీ లేని విధంగా పెద్ద సంఖ్యలో విదేశాలలోని అభిమానులు ఉద్యోగాలకు సెలవు పెట్టి, వ్యాపారాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మరీ టీడీపీ పక్షాన ప్రచారం చేయడానికి విమానాలెక్కుతున్నారు. ప్రపంచంలో అత్యధికంగా పెట్రోలు ఉత్పత్తి చేసే సౌదీ ఆరంకో కాంట్రాక్టింగ్ చేసే రావి రాధాకృష్ణ, ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసే బి.వెంకట రాంకిశోర్, అమెరికాలో వ్యాపారం చేసే మల్లిక్ మదేరమట్ల తరహా దాదాపు 1500 మంది మాతృదేశం బాట పట్టారు. కొందరు ఇప్పటికే స్వదేశానికి చేరుకొని వివిధ నియోజకవర్గాలలో ప్రచారం చేస్తుండగా, మరికొందరు విమాన టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకూ ఎన్నారై తెలుగుదేశం బృందాలు ఇప్పటికే చేరుకున్నాయి. విదేశాలలో ఏసీ గదుల్లో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వీరు ఆంధ్రప్రదేశ్‌లో మండే ఎండల్లో చెమటోడ్చుతూ చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడుతున్నారు. ఎన్నారైల ప్రచార తీరును తెలుగుదేశం అధినేత చంద్రబాబు, లోకేశ్ కూడా గమనిస్తున్నట్లు సమాచారం. మంగళగిరిలో పార్టీ ఏర్పాటు చేసిన వార్ రూంలో ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి కీలక పాత్ర పోషిస్తున్నారు. నిరుద్యోగ సమస్య కీలకాంశం కావడంతో విదేశాలలో తెలుగు యువతకు లక్ష ఉద్యోగాలు ఇస్తామంటూ టీడీపీ ఇచ్చిన హామీ ఆసక్తి కలిగిస్తోంది. విదేశాలలో టీడీపీకి అంకితభావంతో పని చేసే వారు భారీగా ఉండగా, అందులో కొన్ని వేల మంది వ్యాపారవేత్తలున్నారు. వీరిలో కనీసం 5 వేల మంది తమ సంస్థల్లో సంవత్సరానికి కనీసం ఐదుగురికి చొప్పున ఐదేళ్ల కాలంలో 20 మందికి ఉపాధి కల్పిస్తే సునాయాసంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు కల్పించగలుగుతామని తెలుగుదేశం నాయకులు పేర్కొంటున్నారు. విదేశాలలో ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా తెలుగుదేశం పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చాలా కాలంగా నిర్వహిస్తోందని ఆ పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ గుర్తుచేస్తూ.. లక్ష కంటే ఎక్కువ ఉద్యోగాలే ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. భారీ సంఖ్యలో తెలుగు విద్యార్థులు విదేశాలలో ఉంటున్నా, వారికి సరైన మార్గదర్శకం లేదా సహాయం అందించే వ్యవస్థ కరువైందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక సహాయక కేంద్రాలను నెలకొల్పనున్నట్లు ఆయన వెల్లడించారు.

కడప కోర్టు.. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది

» బాధితుడు కాని వ్యక్తి పిటిషన్ ఎలా వేస్తారు?

» షర్మిల, సునీతల తరఫు న్యాయవాదుల వాదన

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): "కడప కోర్టు వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది. బాధితుడు కాని వ్యక్తి వివేకా కేసు విషయంలో పిటిషన్ ఎలా వేస్తారు. దీనిని కొట్టివేయండి" అని పిటిషనర్లు వైఎస్ షర్మిల, సునీత తరఫు న్యాయవాదులు హైకోర్టును అభ్యర్థించారు. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టు ముందు ఉంచాలనుకుంటున్న లీగల్ సబ్ మిషన్స్(న్యాయపరమైన అంశాలు)ను ఒకరికి ఒకరు మార్చుకోవాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు, కడప కోర్టులో పిటిషన్ వేసిన సురేశ్‌బాబు తరఫు న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. విచారణను శుక్రవారానికివాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎన్. హరినాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించి ప్రచారంలో మాట్లాడవద్దని కడప జిల్లా కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ షర్మిల, సునీత, టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, న్యాయవాది గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు.

మేనిఫెస్టో పక్కాగా అమలు చేయగలం

» దోపిడీ, దుబారా అరికడితే చాలా డబ్బు ఆదా: యనమల



అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితులతో సహా అన్నీ బేరీజు వేసుకొనే కూటమి తన మేనిఫెస్టోను ఖరారు చేసిందని, అది అమలు చేయగలిగిన మేనిఫెస్టో అని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరహా దోపిడీని... దుబారాను అరికడితే వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఇక్కడ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని వినాశనం నుంచి అభివృద్ధి దిశగా తీసుకువెళ్లే ప్రయత్నాన్ని ఈ మేనిఫెస్టో ద్వారా చేశామని, అన్ని రంగాలు... అన్ని వర్గాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 'రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకొని జేబులు నింపుకోవడానికి జగన్ ప్రయత్నించారు తప్ప ఖజానాకు ఆదాయం పెంచాలని, ప్రజలకు ఉపయోగపడాలని కోరుకోలేదు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో లభ్యమైన ఇసుకలో తొంభై శాతాన్ని ఆయన దోచుకొని జేబులు నింపుకొన్నారు. పది శాతం మాత్రమే అధికారికంగా విక్రయించారు. మేం ఈ దోపిడీకి కళ్లెం వేసేలా సమగ్ర విధానాన్ని తెస్తాం. జగన్ ప్రభుత్వంలో దుబారాకు అంతే లేదు. వైసీపీ రంగులు వేయడానికి... తీయడానికి రూ.3వేల కోట్లు తగలేశారు. పదుల సంఖ్యలో సలహాదారులను పెట్టి వారి జీతభత్యాలకు, వైభోగాలకు వందల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ దుబారాను అరికడితే ప్రభుత్వానికి ఏటా రూ. రెండు మూడు వేల కోట్లు మిగులుతాయి. జగన్ హయాంలో పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం రెండూ పెరగలేదు. జగన్ వ్యక్తిగత ఆదాయం మాత్రం పెరిగింది. వాణిజ్య పన్నుల్లో కోర్టు స్టేల కింద రూ. పది వేల కోట్ల ఆదాయం ఇరుక్కుపోయింది' అని ఆయన వివరించారు.

పన్నులు పెంచకుండా మేనిఫెస్టో అమలు

మేనిఫెస్టో అమలు కోసం కొత్తగా ఏ పన్నులూ పెంచబోమని యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. జీఎస్టీ విధానం వచ్చిన తర్వాత పన్నులు పెంచడం రాష్ట్రాల చేతుల్లో లేదని, కేంద్రంలోని జీఎస్టీ కౌన్సిల్ ఆమోదంతోనే మొత్తం దేశమంతా పెంచాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 'మద్యం, పెట్రోలు, డీజిల్ వంటి మూడు నాలుగు అంశాలపై మాత్రమే రాష్ట్రాలకు అధికారం ఉంది. చెత్త పన్ను, ఆస్తి పన్ను వంటివి పాలనా రుసుముల కిందకు వస్తాయి. అవి రాష్ట్ర ప్రభుత్వానికి రావు. స్థానిక సంస్థలకు వెళ్తాయి. జగన్ ప్రభుత్వం వాటిని కొత్తగా వేసి తర్వాత స్థానిక సంస్థల నుంచి ఆ డబ్బును బలవంతంగా గుంజుకొంది. మేం అలా చేయం. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే పన్ను వాటా 41 శాతం నుంచి 40 శాతానికి తగ్గించారు. జగన్ ప్రభుత్వం దాని గురించి కూడా అడగలేకపోయింది. ఆ ఒక్క శాతం తిరిగి పెంచేలా చేయగలిగినా అదనంగా రూ. రెండు మూడు వేల కోట్లు వస్తాయి. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రం వృద్ధి రేటు పది శాతం ఉంది. ఇప్పుడు అది మూడు నాలుగు శాతానికి పడిపోయింది. పాలనలో మాకు అనుభవం ఉంది. మేం ప్రజలను హింస పెట్టకుండా ఆదాయాన్ని పెంచాం. అభివృద్ధిని చూపించాం. పేద ప్రజలను ఆదుకొన్నాం' అని ఆయన వివరించారు.



మంగళగిరిలోని పై కేర్ డేటా సెంటర్‌లో ఉద్యోగులతో బ్రాహ్మణి సెల్ఫీ

టీడీపీతోనే మహిళా సాధికారత

» ఈ ఎన్నికల్లో 'స్త్రీశక్తి'ని చూపించండి: బ్రాహ్మణి

హిందూపురం, మే 1: తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. ఈ ఎన్నికల్లో 'స్త్రీశక్తి' సత్తా ఏమిటో చూపించాలని కోరారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం స్త్రీశక్తి మహిళా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి, నారా బ్రాహ్మణి, తేజస్విని హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ.. మహిళల కోసం ఎన్టీఆర్ ఎన్నో విప్లవాత్మక పథకాలు తీసుకొచ్చారన్నారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు మహిళలకు స్థానికసంస్థల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. టీడీపీ హయాంలో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయన్నారు. చంద్రబాబు ప్రారంభించిన డ్వాక్రా సంఘం నేడు విస్తరించిందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు కూడా మహిళలకు అండగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి అభివృద్ధి చేసే చంద్రబాబుకు ఓటేయాలని సూచించారు.

జగన్ మళ్లీ గెలిస్తే ఎవరి భూమీ మిగలదు: శివాజీ

చిలకలూరిపేట అర్బన్, మే 1: జగన్ మరోసారి సీఎం అయితే రాష్ట్రంలో ఎవరి భూములనూ మిగలనివ్వరని సినీనటుడు శివాజీ హెచ్చరించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడిలో మంగళవారం రాత్రి కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతుగా శివాజీ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్-6 పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రంలో ఎక్కడెక్కడ భూములు ఉన్నాయి? వాటిని ఎలా కబ్జా చేయాలి? అన్న దానిపైనే దృష్టి పెట్టారని అన్నారు. భూరక్ష పేరుతో సర్వే చేసి భూముల వివరాలు తెలుసుకున్నారని, ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా వాటికి ఎసరు పెట్టే పని మొదలు పెట్టారని ఆరోపించారు. యువత కలలు సాకారం కావాలంటే చంద్రబాబు నాయకత్వంతోనే సాధ్యమన్నారు.

ఫ్యానుకు ఓటేస్తే.. ఉరి వేసుకున్నట్లే: డీఎల్

ఖాజీపేట, మే 1: వైసీపీ ఎన్నికల గుర్తు ఫ్యానుకు ఓటేస్తే ఉరి వేసుకున్నట్లేనని మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేటలో బుధవారం నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తన 45ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దరిద్రపు ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు వేస్తే కష్టాలు కోరి తెచ్చుకున్నట్లేనని అన్నారు. పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకుని పిచ్చి ఆనందం పొందుతున్నాడని, దీనిపై భారతిని రైతులు నిలదీస్తే సమాధానం లేదన్నారు. జగన్‌కు పిచ్చి పరాకాష్ఠకు చేరిందని, ఇలాంటి వ్యక్తికి ఓటు వేయకండి అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు.

క్షీణించిన దళిత మహిళ ఆరోగ్యం

» బొటనవేలు నరుక్కున్న మహిళ పరిస్థితి విషమం

» ఐదు రోజులుగా గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష

» స్పందించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



ఆమరణ దీక్షలో నీరసించిన కోపూరి లక్ష్మి

గుంటూరు, మే 1: ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అరాచకాలు, అక్రమాలపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన దళిత మహిళ, ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఐదు రోజులుగా ఆమె గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను నిరసిస్తూ ఆమె ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీలో బొటనవేలును నరుక్కొని నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాల్లో ఆమె వినతి పత్రాలు అందించారు. ఆ తర్వాత గుంటూరు చేరుకొని కృష్ణ తులసి నగర్‌లో ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆమె దీక్ష ప్రారంభించి బుధవారం నాటికి ఐదు రోజులు పూర్తయింది. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. బొటనవేలు నరుకున్న అనంతరం ఆమె ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆ తర్వాత నుంచి కనీసం ట్యాబ్లెట్లు కూడా వాడకుండా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండటంతో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బుధవారం నిరాహార దీక్ష శిబిరం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలునరుక్కున్నా, ప్రాణాలకు తెగించి ఆమరణ నిరాహారదీక్షకు దిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించే క్రమంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధమన్నారు. భూకబ్జాలు, ఫోర్జరీ సంతకాలతో భూదందాలు సాగిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు, హత్యలకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. త్వరలో రాష్ట్రానికి వస్తున్న మోదీని కలిసేందుకు అవకాశం కల్పించాలని ఆమె మీడియా ముఖంగా వేడుకున్నారు.

హోంగార్డుల వేతనంలో కోత

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఎన్నికల విధులు నిర్వర్తించి సొంత ప్రాంతాలకు వచ్చిన హోంగార్డులకు సర్కారు షాక్ ఇచ్చింది. పొరుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల విధులు నిర్వర్తించి వచ్చిన హోంగార్డులకు ఈనెల వేతనంలో రూ.3550 కోత విధించింది. ఇక్కడ కాకుండా పొరుగు రాష్ట్రంలో విధులు నిర్వర్తించారు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వంలోని పెద్దలు చెబుతున్నారు. గత నెలలో మొదటి విడత ఎన్నికలు జరిగాయి. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించిన ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా హోంగార్డులను బందోబస్తుకు పంపారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ నుంచి సుమారుగా 200 మంది హోంగార్డులు అక్కడికి వెళ్లారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 1000 మంది వరకు హోంగార్డులు ఉన్నారు. 200 మందిని మాత్రం తమిళనాడుకు పంపారు. ఎన్నికల విధులకు బందోబస్తు నిమిత్తం ఒక రాష్ట్రంలోని పోలీసులు మరో రాష్ట్రంలో జరిగే ఎన్నికలకు వెళ్లడం సర్వసాధారణం. ఇలా వెళ్లిన వారికి ఎన్నికల కమిషన్ ఖర్చులను చెల్లిస్తుంది. తమిళనాడు రాష్ట్రంలో గడచిన నెల 15వ తేదీన జరిగిన ఎన్నికలకు వెళ్లిన హోంగార్డులకు రూ.5550 ఎన్నికల ఫీజ్‌గా ఈసీ చెల్లించింది. తమిళనాడు ప్రభుత్వం ఇలా వెళ్లిన వారికి వసతి సదుపాయం మాత్రమే కల్పించింది. భోజనాలకు సంబంధించి ఈసీ డబ్బులు చెల్లించినందుకు తమకేమీ సంబంధం లేదని అక్కడి ప్రభుత్వం చేతులెత్తేసింది. బుధవారం ఒకటో తేదీ కావడంతో బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యాయి. హోంగార్డుల నెల వేతనం రూ.21 వేలు. వాస్తవానికి ఖాతాల్లో ఈ మొత్తం జమవ్వాలి. ఎన్నికల విధులకు వెళ్లిన హోంగార్డులకు తప్ప మిగిలిన వారందరికీ మొత్తం వేతనం జమయింది. తమిళనాడులో జరిగిన ఎన్నికల విధులకు వెళ్లిన వారికి వేతనంలో రూ.3550 కోత విధించారు.

జూనియర్ సివిల్ జడ్జి ఇంటిపై దాడి

» కిటికీల అద్దాలు... కారు అద్దాలు ధ్వంసం

» ఇంట్లో యాసిడ్ పోసేందుకు ప్రయత్నం

» ఆ సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్

» నిర్లక్ష్య సమాధానంతో మదనపల్లె డీఎస్పీకి ఫిర్యాదు

» మంత్రి పెద్దిరెడ్డి వేధిస్తున్నారని వెల్లడి

» ఇటీవల వైసీపీ నాయకులపై కేసుపెట్టిన రామకృష్ణ



ధ్వంసమైన జడ్జి రామకృష్ణ ఇంటి కిటికీ అద్దాలు

ఆస్తి తగాదాలతోనే దాడి

బి.కొత్తకోటలో జడ్జి రామకృష్ణ నివాసంపై దాడిచేసిన వ్యక్తి ఆయన తమ్ముడు రామచంద్ర. ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదు. అన్నదమ్ములిద్దరికీ ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీంతో మంగళవారం రాత్రి రామచంద్ర కిటికీ అద్దాలు, కారు అద్దాలు ధ్వంసం చేశాడు. జడ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. - సూర్యనారాయణ, బి.కొత్తకోట సీఐ

రాయచోటి, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణంలో నివాసం ఉంటున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ ఇంటిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇంటి వెనుక వైపు కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. కిటికీలకు అమర్చిన మెష్‌ను పీకి పక్కన పడేశారు. ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటన బుధవారం ఉదయం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై జడ్జి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వైసీపీ నాయకులపై తాను క్రిమినల్ కేసు పెట్టానని, తనను భయపెట్టి కేసులను ఉపసంహరింపజేసేందుకు వారు గూండాలను ఇంటిపై పంపించారని అన్నారు. పదేళ్లుగా తనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మధ్య అనేక సంఘటనలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మరోసారి దాడి జరిగిందన్నారు. దుండగులు కిటికీల అద్దాలు పగులగొట్టి యాసిడ్‌ను లోపలికి చల్లేందుకు ప్రయత్నించారని, తనతో పాటు, కుటుంబసభ్యులను హతమార్చేందుకు ప్రయత్నం జరిగిందని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అన్నారు. దుండగులు దాడికి యత్నిస్తున్న సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, దీంతో మదనపల్లె డీఎస్పీకి ఫోన్ చేయగా రాత్రి ఇద్దరు పోలీసులను పంపారన్నారు. బయటకు వచ్చి చూడగా తన కారు సైతం ధ్వంసం అయిందన్నారు. తమ ఇంటిపై ఎవరు దాడి చేయించారనే విషయంలో పోలీసులు స్పందించడం లేదని ఆరోపించారు. జగన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనను చాలా విధాలుగా వేధిస్తున్నారన్నారు. ఇటీవల తాను వైసీపీ నాయకులపై బి.కొత్తకోటలో ఓ క్రిమినల్ కేసు పెట్టానని, ఆ కేసును రిజిస్టర్ చేయకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. తన నివాసంపై దాడి జరిగిందని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులను ఖండించాలని అన్నారు.

అనంతలో టార్గెట్ టీడీపీ!

» వైసీపీ నేతపై దాడి.. టీడీపీ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు

అనంతపురం అర్బన్/క్రైం, మే 1: అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నేత నగేశ్‌పై జరిగిన దాడిని అదునుగా చేసుకుని పోలీసులు టీడీపీ కీలక నాయకులను టార్గెట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయరాంనాయుడును మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని రామకృష్ణ కాలనీలో ఎంపీటీసీ భర్త నగేశ్‌పై మంగళవారం దాడి జరిగింది. ఆయన కళ్లలో కారంకొట్టి కొందరు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జయరాం నాయుడు సహా 14మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి సమయంలో జయరాంనాయుడును అదుపులోకి తీసుకుని వివిధ స్టేషన్ల చుట్టూ తిప్పారు. బుధవారం ఉదయం అనంతపురం త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెలియగానే అనంతపురం అర్బన్ నియోజకవర్గం కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు స్టేషన్ ముందు నిరసన తెలిపారు. వారం రోజులుగా డీఎస్పీ, కొందరు సీఐలు టీడీపీ నాయకులు, కార్యకర్తల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని కూటమి అభ్యర్థి దగ్గుబాటి, వెంకటశివుడు యాదవ్ ఆరోపించారు. అనంతపురం అర్బన్ సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డికి తొత్తుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేత నగేశ్‌పై వ్యక్తిగత సమస్యల కారణంగా దాడి జరిగిందని, ఆ ఘటనతో టీడీపీ నేత జయరాంనాయుడుకు సంబంధం లేదన్నారు. అయినప్పటికీ.. ఎమ్మెల్యే డీఎస్పీ కలిసి ఆయనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు, ఐపీఎస్ అధికారి రవికుమార్‌ను కలిశారు. జయరాంనాయుడు అక్రమ అరెస్టు గురించి ఫిర్యాదు చేశారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డితోపాటు పలువురు సీఐలను సస్పెండ్ చేయాలని కోరారు. డీఎస్పీ కొనసాగితే సజావుగా ఎన్నికలు జరగనివ్వరని తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. కాగా, రామకృష్ణ కాలనీలో నగేశ్‌పై జరిగిన దాడి ఘటనలో సంబంధం లేనివారిని సైతం కేసులో ఇరికించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. "వైసీపీ కార్పొరేటర్ హరిత, ఆమె భర్త జయరాం, కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ పలువురు కార్యకర్తలతో కలిసి ఇటీవల టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ నాయకులు వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. దాడి జరిగినచోట జయరాం లేకపోయినా.. కేసులో ఆయన పేరు చేర్చారు. చివరికి ఆయన భార్య, కార్పొరేటర్ హరిత పేరును సైతం కేసులో చేర్చారు. నిందితులలో 80 శాతం మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరినవారే ఉన్నారు" అని టీడీపీ నేతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 2 మే 2024
diksuchi@andhrajyothy.com

75 వసంతాల నాటో కూటమి

1940ల నాటి ప్రచ్ఛన్నయుద్ధకాలంలో కొన్ని దేశాలు కలిసి ఒక బలగంగా ఏర్పడ్డాయి. తమలో ఏ ఒక్క దేశ భద్రతకు ప్రమాదం వచ్చినా, మిగతా దేశాలన్నీ కలిసి పోరాడటమే తమ కూటమి ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. అయితే కాలక్రమంలో పరిస్థితులు, లక్ష్యాల ప్రాధాన్యాలు మారాయి. బలగం మరింత పెరిగి లక్ష్యం పలుచనైన సందర్భాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ 75 వసంతాలు పూర్తిచేసుకొని, నేటికీ బలవత్తర శక్తిగా విరాజిల్లుతున్న ఆ కూటమి 'నాటో' (నార్త్ అట్లాంటిక్ ట్రీటి ఆర్గనైజేషన్).

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో రష్యా సామ్రాజ్యవాదాన్ని, విస్తరణ కాంక్షను ఎదుర్కోవడానికి కొన్ని పాశ్చాత్య దేశాలు కలిసి 'సమష్టి భద్రత' లక్ష్యంతో ఏర్పాటు చేసుకున్న బహుళపక్ష కూటమే 'నాటో'. 1949 ఏప్రిల్ 4న ఈ కూటమి ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోని 'ఆర్టికల్ 51' నిర్దేశిస్తున్న 'ప్రతి దేశానికి వైయక్తికంగా లేదా ఇతర దేశాలతో ఉమ్మడిగా భద్రతా చర్యలు తీసుకునే హక్కు ఉంది' అనే అంశం ప్రాతిపదికగా, నాటో ఏర్పాటుకు సంబంధించి ప్రారంభ సభ్య దేశాలన్నీ కలిసి 'వాషింగ్టన్ ఒప్పందం'పై సంతకాలు చేశాయి.

- ఈ వాషింగ్టన్ ఒప్పందంలోని ఆర్టికల్ 5లో నాటో ఏర్పాటుకు ప్రధాన ఉద్దేశమైన 'రష్యా సామ్రాజ్యవాదం, ఐరోపాలోని తూర్పు ప్రాంతాల నుంచి ఖండంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకోవడం' అనే అంశాన్ని చేర్చింది. దీనినే 'సమష్టి భద్రత'గా వర్ణించారు. అంటే ఈ ఒప్పందం/ కూటమిలోని ఏ సభ్యదేశానికి రష్యా మూలంగా ముప్పు ఏర్పడినా, మిగతా అన్ని దేశాలు కలిసి రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతాయన్నది దీని సారాంశం.
- ప్రారంభంలో నాటోలో 12 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. అవి- అమెరికా, బ్రిటన్(యునైటెడ్ కింగ్‌డమ్), పోర్చుగల్, నార్వే, నెదర్లాండ్స్, లక్సెంబర్గ్, ఇటలీ, ఐస్‌లాండ్, ఫ్రాన్స్, డెన్మార్క్, కెనడా బెల్జియం. తదనంతర కాలంలో సభ్యదేశాల సంఖ్య 32కి చేరింది. నాటో బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తుంది.
- అయితే 90ల్లో సోవియట్ రష్యా విచ్ఛిన్నమై, ప్రచ్ఛన్నయుద్ధ పరిస్థితులు ముగిసిన తరవాత కూడా ఈ కూటమి విస్తరించడం, కొత్తదేశాలు ఎప్పుడైనా చేరేందుకు వీలుగా ఓపెన్‌డోర్ పాలసీని నాటో అనుసరిస్తుండటం వంటి చర్యలు ఈ కూటమి ఏర్పడటానికి ఉద్దేశించిన మౌలిక లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. అయితే 'సమష్టి భద్రత' అంశాన్ని ఆధునిక రాజకీయ పరిస్థితులకు, ముఖ్యంగా చైనా దూకుడును అరికట్టేందుకు వీలుగా మలచుకొంది. అలాగే ఇతర నాటో కూటమి చర్యలపై తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. ఇరాక్‌లో ఇప్పటికీ పరిస్థితులు సద్దుమణగకపోవడం, లిబియాలో ఐఎస్ఐఎస్ బలవత్తర శక్తిగా ఎదగడం, యుగోస్లేవియా ఒక దేశంగా విచ్ఛిన్నమై అనేక చిన్న చిన్న పేద దేశాలుగా యూరప్‌లోనే బీద దేశాలుగా మారిపోయిన పరిస్థితులు, ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రజాస్వామ్య స్థాపన, శాంతియుత పరిస్థితులు, ఉగ్రమూకల ఏరివేత లక్ష్యంతో చర్యలు ప్రారంభించిన నాటో ఆ లక్ష్యాలను అర్థాంతరంగా వదిలి వెనుదిరిగిపోవడం వంటివి నాటో వైఫల్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

> నాటోలో ఉన్న అయిదు విధాన నిర్ణాయక కమిటీలైన మిలిటరీ కమిటీ, పొలిటికల్ కమిటీ, పాలసీ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ గ్రూప్, సీనియర్ రిసోర్స్‌బోర్డ్ వంటి వాటి విస్తరణ, కార్యక్రమ పరిధి పెంచాల్సిన అవసరం ఉంది.

- లక్ష్యాలైన ప్రజాస్వామ్య పరిస్థితుల సాధన, శాంతిస్థాపన, సంఘర్షణ నిరోధం, సంక్షోభ సమయాల్లో సహాయం వంటి అంశాలపరంగా ఈ కూటమి దిశానిర్దేశం చేసుకుంది.
- అయితే పాతలక్ష్యంపరంగా, కొత్త లక్షణాలపరంగా - ఎలా చూసినా ఈ కూటమి ఎప్పుడూ శాంతిస్థాపనకు, పరిస్థితుల సర్దుబాటుకు కృషి చేయలేదనే అపవాదు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. కూటమి ఏర్పాటు కాలం నుంచి ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా నాటో పాల్గొన్న రమారమి 200 ప్రత్యక్ష చర్యల్లో 20 వరకూ చాలా ప్రముఖమైన మిలిటరీ చర్యలున్నాయి. ఉదాహరణకు యుగోస్లేవియాపై బాంబు దాడులు, ఇరాక్ ఆక్రమణ, లిబియా దేశాన్ని ఒక రాజ్యంగా తన మనుగడ కోల్పోయే స్థితికి తీసుకురావడం, దాదాపు 20 ఏళ్లపాటు ఆఫ్ఘనిస్థాన్‌ను అతలాకుతలం చేసిన ఉగ్రవాదులపై దాడులు వంటి అనేక అంశాలు భావిస్తున్నారు.
- అంతేకాక ఉక్రెయిన్ నాటోలో చేరడం వల్లే రష్యా ఆ దేశంపై దాడికి దిగింది. అదే రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి దారితీసిందన్నది జగమెరిగిన సత్యం. అదేవిధంగా ప్రస్తుతం ఇజ్రాయెల్ ఇరాన్ ఉద్రిక్తతల్లోనూ నాటో పాత్ర ఉంది. ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న నాటో మరో యుద్ధానికి ఆజ్యం పోస్తుందనే సందేహాలూ ఉన్నాయి. ఈ విధంగా 'సమష్టి భద్రత' లక్ష్యంగా ఏర్పడిన నాటో, ఎప్పుడూ విధ్వంసాన్నే మిగిల్చిందన్న అపవాదు మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో మిలిటరీ మద్దతుపరంగా దేశాలు జతకట్టడం ఏ మేరకు భద్రత, శాంతియుత పరిస్థితులను ఏర్పరుస్తుందనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. అయితే మధ్యధరా సముద్ర ప్రాంతం, సొమాలియా తీరప్రాంతాల్లోనూ ఉగ్రవాదులను, సముద్ర దొంగలను కట్టడి చేయడంలో, అదేవిధంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో 'ఆపరేషన్ ఓషన్ షీల్డ్' వంటి సుదీర్ఘ రక్షణ చర్యలు చేపట్టి సరుకు రవాణా నౌకలకు భద్రతనిచ్చిన కార్యక్రమాలపరంగా, 2005లో కశ్మీర్ భూకంపం వంటి విపత్తుల సమయంలో నాటో దళాల సేవలు, ఫ్రాన్స్-జర్మనీ వంటి ఆగర్భ శత్రుదేశాల మధ్య సంయమన వేదికగా నాటో పనిచేయడం వంటి అనేక సకారాత్మక అంశాలూ కూటమి ఆవసరాన్ని తెలుపుతున్నాయి.
- ఈ కూటమిని ప్రపంచ శ్రేయస్సుకు, శాంతి సుస్థిరతల స్థాపన దిశగా పయనింపచేయాల్సిన అవసరం ప్రస్తుత కాలంలో ఎంతైనా ఉంది. అందుకు మేధావులు కొన్ని సూచనలు చేస్తూ ఉన్నారు అవి:

1. నాటో తన లక్ష్యాన్ని ప్రపంచ శాంతి, సుస్థిరతల కోణంలో పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది.
2. 'సమష్టి భద్రత' లక్ష్యం ఏదో ఒక దేశానికో, కూటమికో వ్యతిరేకంగా కాక ప్రపంచవ్యాప్తంగా నేడు అభద్రతను రేకెత్తిస్తున్న సైబర్ నేరాలు, అణ్వాయుధాలు, జీవాయుధాల విస్తరణ, ఉగ్రవాద కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, వాతావరణ మార్పుల ప్రమాదాలపరంగా పునర్ నిర్వచించుకోవాల్సి ఉంది.
3. సభ్యదేశాల మధ్య తరచూ తలెత్తుతున్న వివాదాలను, అభిప్రాయ బేధాలను పరిష్కరించడానికి ఒక అంతరంగిక వ్యవస్థ అవసరం. ప్రతీ నిర్ణయం, కొత్త దేశాల ప్రవేశానికి అనుమతి ఇవ్వడం వంటి అంశాలు సమష్టి సమ్మతితోనే నాటోలో సాధ్యం. అయితే మూడు పదులకు పైనే ఉన్న సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కష్టతర వ్యవహారం. కాలయాపనతో కూడుకున్నది, సభ్యదేశాల వ్యక్తిగత లాభనష్టాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకని నిబంధనలపరమైన మార్పు అవసరమే.
4. నాటోలో ఉన్న అయిదు విధాన నిర్ణాయక కమిటీలైన మిలిటరీ కమిటీ, పొలిటికల్ కమిటీ, పాలసీ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ గ్రూప్, సీనియర్ రిసోర్స్‌బోర్డ్ వంటి వాటి విస్తరణ, కార్యక్రమ పరిధి పెంచాల్సిన అవసరం ఉంది.
5. నాటోలో కేవలం 11 దేశాలే అత్యధికంగా నిధులు చేకూరుస్తున్నాయి. మిగతా దేశాలు నిర్దేశితస్థాయిలో నిధులు అందించడం లేదు. పైగా ఏదైనా నాటో చర్యల్లో భాగం కావడం అనేది పలు సభ్యదేశాల అభీష్టం మేరకే ఉంటుంది. కాబట్టి నాటో నిధులు అధికంగా చేకూరుస్తున్న దేశాలు, వ్యక్తిగత కారణాలున్న దేశాల అభీష్టపరంగా నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతి సభ్యదేశానికి ఒక కటాఫ్ షేర్ కనీసంగా ఉండేలా, సైనిక చర్యలపరంగా అన్ని దేశాల భాగస్వామ్యం సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
6. రష్యాకు లేదా ఏదైనా ఇతర దేశాలకు వ్యతిరేకంగా రక్షణ పొందడానికి సైనిక సమీకరణ కూటమిగా కాక, వివిధ సంఘర్షణలను పరిష్కరించుకోవడానికి చర్చా వేదికగా, సంప్రదింపుల వారధిగా నాటో ప్రాథమిక లక్ష్యంలో ప్రపంచశాంతి నిమిత్తం సంస్కరణలు రావాల్సి ఉంది.

ఈ విధంగా ప్రపంచశాంతి దృక్పథంలో నాటో తనను తాను పునర్ నిర్వచించుకున్నప్పుడు ప్రపంచ పురోభివృద్ధి సాధ్యమవుతుంది. నాటో 75 వసంతాల వేడుక సందర్భంగా 2024 ఏప్రిల్ 4న నాటో సెక్రటరీ జనరల్ సగర్వంగా చేసిన ప్రకటనలోని 'నాటో ఇప్పుడు మరింత పెద్దగా, మరింత శక్తిమంతంగా, మరింత సమైక్యంగా పరిణామం చెందింది' అన్న మాటలకు ప్రపంచం హర్షిస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఎయిర్‌పోర్ట్ సర్వీస్ లిమిటెడ్‌లో వివిధ ఖాళీలు

AI AIRPORT SERVICES

ఖాళీలు 145

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, న్యూఢిల్లీ.. తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు
1. జూనియర్ ఆఫీసర్- టెక్నికల్: 2 పోస్టులు
2. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 21 పోస్టులు
3. జూనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 21 పోస్టులు
4. ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 18 పోస్టులు
5. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: 17 పోస్టులు
6. హ్యాండీమన్: 66 పోస్టులు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ ఇంజనీరింగ్‌లో మెకానిక్, గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఇంటర్, ఐటీఐ, ఎస్ఎస్‌సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించరాదు.
ఇంటర్వ్యూ తేదీలు: 2025 మే 8, 9, 10, 11
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాలు
ప్రదేశం: మధ్యవార్డ్ ఏవియేషన్ అకాడమీ, 102 వినాయక్ ప్లాజా, డాక్టర్స్ కాలనీ బుధ్‌సింగ్ పుర, సంగనీర్, జైపూర్.
వెబ్‌సైట్: https://www.aiasl.in/Recruitment

ఎన్ఐఆర్‌టీలో ప్రాజెక్ట్ డ్రైవర్లు

ఖాళీలు 15

ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబర్‌కులోసిస్...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: ప్రాజెక్ట్ డ్రైవర్ కమ్ మెకానిక్
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత. లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 25 ఏళ్లు మించరాదు.
జీతం: నెలకు రూ.16,000
ఉద్యోగ స్థానం: తమిళనాడు, కేరళ, బిహార్, రాజస్థాన్, ఆగ్రా (ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్), గోరఖ్‌పూర్ (యూపీ), నోయిడా(ఢిల్లీ అండ్ యూపీ, పంజాబ్ అండ్ హరియాణా), ఒడిశా, తెలంగాణ, అసోం, గుజరాత్, మహారాష్ట్ర, కోల్‌కతా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **ఇంటర్వ్యూ తేదీ:** మే 9
దరఖాస్తుకు చివరి తేదీ: మే 6
వేదిక: ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబర్‌కులోసిస్ నెం.1, మేయర్ సత్యమూర్తి రోడ్, చెట్‌పేట్, చెన్నై.
వెబ్‌సైట్: https://nirt.res.in/

టీహెచ్ఎస్‌టీఐలో జూనియర్ రీసెర్చ్ పోస్టులు

ఫరీదాబాద్(హరియాణా)లోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: 1 పోస్టు
2. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటెక్, లైఫ్/మెడికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
వయోపరిమితి: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించరాదు.
జీతం: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.85,000. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.60,000.
దరఖాస్తు ఫీజు: రూ.590. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు రూ.118.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
వెబ్‌సైట్: https://thsti.res.in/



టీఎంసీలో ఎల్‌డీసీ, స్టెనోలు

ఖాళీలు 28

ముంబయిలోని టీఎంసీ-టాటా మెమోరియల్ హాస్పిటల్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఫిజియోథెరపిస్ట్: 1 పోస్టు
2. లోయర్ డివిజన్ క్లర్క్: 3 పోస్టులు
3. స్టెనోగ్రాఫర్: 1 పోస్టు
4. ఫిమేల్ నర్స్: 22 పోస్టులు
5. టెక్నీషియన్ 'సి': 1 పోస్టు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7
వెబ్‌సైట్: tmc.gov.in

రిమైండర్

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ

హరియాణాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ అందిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. ఎంపిక ప్రక్రియలో ముందుగా గేట్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ అంశాలనుంచి మొత్తం 30 ప్రశ్నలు; అభ్యర్థి ఎంచుకొన్న సెక్షన్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.

సెక్షన్లు: ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్; ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ప్రాసెస్ ఇంజనీరింగ్, బయో కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్; ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ అంత్రప్రెన్యూర్‌షిప్; ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ; అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీని స్పెషలైజేషన్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. లాజికల్ రీజనింగ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 15, క్వాంటిటేటివ్ అనాలిసిస్ నుంచి 15, వెర్బల్ ఎబిలిటీ/రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

హాయ్ బుజ్జీ




వంకాయ కూర!

శ్రీకృష్ణదేవరాయల రాజ్యంలో ఒక రోజు బ్రహ్మాండమైన విందు భోజనం తిన్నారంతా. అందులో తెనాలి రామకృష్ణ ఉన్నారు. కూరలన్నింటిలో వంకాయ కూర బావుందని చాలామంది మెచ్చుకున్నారు. రాజు పొంగిపోయారు. తెనాలి రామకృష్ణ ఇంటికి వెళ్లి తన భార్యతో ఈ విషయం చెప్పారు. ఆమెకు వంకాయ కూర తినాలనిపించింది. వెంటనే ఆ కూరగాయలు కావాలని అడిగింది. 'తెలివి తక్కువ దానా.. రాజుగారికి తెలియకుండా దొంగిలించామనుకో. దొరికామనుకో శిక్షనే' అన్నాడు. తన భార్య మొండికి వేసే సరికి చివరకు సరేనన్నాడు. తెనాలి రామకృష్ణ రాజ్యంలోకి వెళ్లి ఎవరూ లేని సమయంలో వాటిని దొంగిలించి తీసుకొచ్చాడు. ఇంట్లో తన భార్య సంతోషపడింది. కూర చేసింది. ఆ సమయంలో కొడుకు ఆరుబయట నిద్రపోతున్నాడు. 'అబ్బాయిని పిలుచుకురండి' అన్నది. బక్కెట్ నీళ్లను తన కొడుకు మీద పోశాడు. నిద్రలో ఉండే తన కొడుకు ఉలిక్కిపడి లేచాడు. 'వాన వస్తోంది లోపలికి వెళ్లు' అన్నాడు తెనాలి రామకృష్ణ. కుటుంబమంతా వంకాయ కూర తిన్నారు.



ఉదయాన్నే రాజుగారి పెరడులో వంకాయలు లేనిది చూసి భటులు ఆయనకు చెప్పారు. ఎవరో దొంగతనం చేశారని సెలవిచ్చారు. తీవ్రంగా ఆలోచించారు. 'తెనాలి రామకృష్ణగారు వేళకాని వేళలో వచ్చారు. ఇంటికి వెళ్తుంటే చూశాను' అన్నాడో భటుడు. 'దొరికాడు దొంగ' అన్నాడు రాజుగారు. తెనాలి రామకృష్ణ, తన భార్యను పిలిపించారు. తెనాలి రామకృష్ణ కొడుకును కూడా పిలిపించాడు. 'బాలుడు కాబట్టి నిజమే చెబుతాడు. నిన్న రాత్రి ఏమి తిన్నావు' అన్నాడు. 'వంకాయ కూర రాజుగారు. రుచి భలే ఉంది' అంటూనే సభలో అందరూ నవ్వారు. రామకృష్ణ ఇంత పని చేశాడా? అన్నారు. ఇంతలో రామకృష్ణ కలగజేసుకుని.. 'మహాప్రభూ.. మా వాడికి కలలు ఎక్కువ. కలలో తిన్నానని చెబుతున్నాడేమో. ఒక్కసారి అడగండి. నిన్న వానపడుతోంది కదా?' అని. ఆ కుర్రోడు 'అవును. నిన్న వాన పడింది. నిద్రలేచి వంకాయ కూర తిన్నా' అన్నాడు. అంతలో తెనాలి రామకృష్ణ ఇలా అన్నారు.. 'అయ్యా.. నిన్న వానలేదు. వాతావరణం పొడిగా ఉంది. మా వాడికి కలలు వస్తుంటాయి ఇలా' అన్నాడు. 'నిన్న వానపడింది కదా బాగా' అన్నాడు బాలుడు. 'నేను అనుకున్నది తప్పు. పొరబడ్డాను రామకృష్ణ' అన్నారు రాజుగారు.


మాన్‌స్టర్స్ ఎన్ని?



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 296

4		8					6	
			5	2			8	
					6	3		7
			7	9				1
7	8						5	4
2				4	5			
6		4	2					
	2			7	8			
	3					1		2

సుడోకు - 295 సమాధానం

3	7	8	4	2	6	1	9	5
5	2	9	7	8	1	6	3	4
6	1	4	3	5	9	7	8	2
9	8	6	2	1	3	4	5	7
7	3	2	9	4	5	8	1	6
4	5	1	8	6	7	9	2	3
1	4	5	6	9	2	3	7	8
8	9	7	5	3	4	2	6	1
2	6	3	1	7	8	5	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.